# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక ఆగష్టు, 2013 ₹ 20



అనార్కలి

# మిసిమి
మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
*- Dammapada.*


**సంపుటి 24** **ఆగష్టు 2013** **సంచిక 8**



*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*
కాండ్రేగుల నాగేశ్వరరావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి
కుర్రా జితేంద్రబాబు
నందిగం కృష్ణారావు

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi

| | | | |
|---|---|---|---|
| ప్రతి : ₹20 | | సంవత్సరానికి | : ₹240 |
| విదేశాలకు | ప్రతి : $ 2.50 | సంవత్సరానికి | : $ 25 |

(Library of Congress Control Number)
LCCN 91-903060


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు .................................................. 3

తెలుగు రచనలలో మారుతున్న తీరుతెన్నులు .................. 5
*– మధురాంతకం నరేంద్ర*

మంచు కొండల నుంచి–మహా సముద్రాల వరకు... ......... 10
*– ముకుంద రామారావు*

జాషువా ...................................................... 21
*– ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ*

మన ప్రాచీన నగరాలు – భట్టిప్రోలు .......................... 29
*– కొసరాజు వెంకటేశ్వర రావు*

తిరుమలేశుని సేవలో విజయనగర కాలపు నాట్యగత్తెలు .... 32
*– డాక్టరు దేవిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి*

తుర్రెబాజ్ ఖాన్ ............................................... 36

టప్పా ........................................................ 38
*– ఎలనాగ*

పాకిస్తాన్ చిత్రకారుడు అబ్దుల్ రహమాన్ ఛుగ్తాయి ......... 40
*– కాండ్రేగుల నాగేశ్వరరావు*

హాస్యనాటికలు ............................................... 43
*– ఎన్. తారకరామారావు*

సిల్కురూట్ యాత్ర, ఉగైర్ కీ షాన్ అమనిషాన్ ............... 47
*– పరవస్తు లోకేశ్వర్*

తంజావూరి ఆంధ్రరాజుల చరిత్ర ............................ 50
*– కొలకలూరి మధుజ్యోతి*

దాశరథి దృక్పథం–ఒక సమాలోచన ........................ 55
*– గొల్లపూడి మారుతీరావు*

తెలుగు వాని కవితా కంఠం ................................. 59
*– తిరుమల రామచంద్ర*

సల్లేఖన ...................................................... 68
*– హిందీ: రమేష్ చంద్ర శ్రీవాత్సవ, అనువాదం : జె.లక్ష్మిరెడ్డి*

చదవండి (పుస్తక పరిచయం) ................................ 76

ఊరి చివరి ఇల్లు ............................................. 78
*– ప్రమోద్*


*ముఖచిత్రం* : లైలా
*రెండవ అట్ట* : అనార్కలి
*మూడవ అట్ట* : విరహిణి
*నాల్గవ అట్ట* : సాకీ

*... పాకిస్తానీ చిత్రకారుడు :*
*అబ్దుల్ రహ్మాన్ చుగ్తాయి*


(*వివరాలు :* 40...)

తెలుగులో రచనలను ప్రభావితం చేసే అంశాలను పరిశీలించితే గత శతాబ్దకాలంలో రెండు ముఖ్యమైన విషయాలను గమనించవచ్చు. మొదటిది – మార్క్స్ సిద్ధాంత ప్రభావంతో స్టాలిన్, లెనిన్‌ల పరిపాలనలో రష్యాలోనూ, కమ్యూనిస్టు సిద్ధాంత ప్రభావిత దేశాలలోను సాహిత్యం, లలిత కళలకు ప్రాధాన్యం తగ్గిపోవటం – ప్రచార సాహిత్యానికే పెద్దపీట వేయటం; రెండవది – రెండు ప్రపంచ యుద్ధాల నేపథ్యంలో ఐరోపాలోని మారణకాండ మూలంగా, విధ్వంసంలోని జీవితాల మూలుగులే ఎక్కువ వినిపించిన యూరోప్ దేశాల సాహిత్యం – కళలు.

నిజానికి – ఈ రెండిటిలోనూ మన దేశ వాతావరణానికి, జనజీవనానికి అంతగా సంబంధం లేక పోయినా– మన సాహిత్యాన్ని, ఇతర కళలను, ఇవి ప్రభావితం చేశాయి. ఇతర భాషల సంగతి అలా వుంచితే– తెలుగులో వచ్చిన రచనలు, కవిత్వం, నవలలు, కథలు ఈ ఎరువు తెచ్చుకున్న సంఘర్షణలు ఎత్తి చూపుతూ పాఠకులను ప్రక్కదారి పట్టించాయి – స్థానిక జీవన సరళిని ప్రతిబింబించకుండా ఆధునికం (19వ శతాబ్దంలోనే ఆస్కార్‌వైల్డ్ 'ఆధునిక' కళ అని సంబోధించాడు), ఆధునికానంతర సాహిత్యం పేరుతో, ఉద్యమాల పేరుతో వచ్చిన సాహిత్యపు లోతులు ఎంతవరకు పాఠకులకు అందినాయి?

అంతేగాక ఎన్నో పశ్చిమ దేశాల రచనల నుంచి ఎరువు తెచ్చిన – మాజిక్ రియలిజమ్, రినైజాన్స్, అభివృద్ధి, అభ్యుదయం, డయస్పోరా పేర్లతో వస్తున్న రచనలను పరిశీలించితే ఈ పరాయి పదాల రంగు తెలుస్తుంది. ఇక, ప్రపంచీకరణతో అట్టుడికిపోయిన అన్ని సాహిత్య ప్రక్రియలు ఏ పరిష్కారం చూపకుండానే చల్లబడి పోయాయి.

ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో – మళ్ళీ అమెరికా లేక దక్షిణ అమెరికా, లేదా పశ్చిమ దేశాల సాహిత్యం వైపు చూస్తున్నారు. మనకు జ్ఞాన పీఠ పురస్కారం చాల గొప్పదని అర్రులు చాస్తుంటారు. యూరోప్‌లో నోబెల్ బహుమతి చిట్టచివరిది. కాని అమెరికన్ రచయితలు ఏ పురస్కారం కోసం ఎగబడ రెందుకని? వారి రచనలే వారికి నిధులు – పాఠకులే వారికి ప్రమాణం! ఇంతకీ చెప్ప వచ్చేది ఏమిటంటే – కొన్ని పదాలను – రచనా ప్రక్రియలను చర్చకు పెట్టాలని ఆలోచన – ముఖ్యంగా, ఆధునికమంటే ఏది? ఆధునికానంతర మంటే ఎప్పటి నుంచి, ఎలా మన జీవన ప్రమాణాలకు అన్వయించటం? మాజిక్ రియలిజమ్ ఎప్పటి నుంచి రూపుదిద్దుకుంది? భారతీయ ఇతిహాస, కావ్యాలలో 'మాజిక్ రియలిజమ్' లేదా? పంచతంత్రపు కథలు చెప్పేది ఏ ప్రక్రియ? సుందర కాండలో వాల్మీకి వర్ణనను ఏమనాలి? కాళిదాసు 'మేఘసందేశం'లో అనుసరించిన 'శిల్పం' ఏమిటి? ఇన్ని వుండగా మనం ఎరువు పదాలను తెచ్చి పాఠకులను 'తెలియని' స్థితిలోనికి నెట్టివేయడం న్యాయమేనా? రచయిత – తన పాండిత్యాన్ని ప్రదర్శించటమే ముఖ్యమా? నెహ్రూది డిస్కవరీనా, రీ డిస్కవరీనా? రినైజాన్స్ అంటే ఏమిటి? అభివృద్ధి – విధ్వంసం జంటపదాలా? విశ్వవిద్యాలయాల్లో సిద్ధాంత వ్యాసాల ప్రమాణం ఏమిటి – వీటికి మెర్సినరీలు వున్నారా?



ఉదాహరణకు రినైజాన్స్ అంటే మనం ఎలా అర్థం చేసుకుని లేదా అపార్థం చేసుకుని అన్వయించటానికి ప్రయత్నిస్తున్నామో తెలుసుకుందాం. ఒక నాగరకత, ఒక కాలావధిలో అప్పటివరకు ఎంతో దేదీప్యమానంగా వెలిగి కాలక్రమేణా చీకటి పొరల్లో మరుగున పడి వుండి (aetas antiqua) తరువాత ఆధునిక యుగపు కాంతిపుంజాలు ప్రసరించి (aetas nova) పునర్దర్శనం కావటం రినైజాన్స్ అంటారని ఫ్రాన్సెస్‌కో పెట్రార్క్ (1304–1374) నిర్వచించినట్టు చెప్పవచ్చు. దీనికి ఉదాహరణ ఆచంట లక్ష్మీపతి. అంతవరకూ భారతీయ జీవనంలో భాగమై తరువాత మరుగున పడిన ఆయుర్వేద వైద్య విధానాన్ని, లక్ష్మీపతి తన విజ్ఞతతో చీకటి పొరలను తొలగించి మళ్ళీ వెలుగులోకి తేవటం. దీనిని పునరుజ్జీవనం గాని, పునర్వికాసం గాని అనలేము. కేవలం అంతకు పూర్వం వైభవంగా ఉండి వున్న ఒక వైద్య విధానాన్ని ఆచంట లక్ష్మీపతి పునర్దర్శించ గలగటమే.

మన మేధావులు భారతదేశంలో రినైజాన్స్ వస్తుందా అనే భావనలో లేక రినైజాన్స్ రాదు అనే నిరాశలో ఎంతో హడావుడి చేశారు. రినైజాన్స్ అనేది వచ్చేది కాదు, తెచ్చేది కాదు. మరి ఇది చర్చనీయాంశనీయమే కదా! ఈ దిశగా రచనలను ఆహ్వానిస్తున్నాం.

**– సంపాదకులు**




# కమ్మతెమ్మెరలు

✶ "...*మిసిమి* జూన్ 2013 సంచికలో శివారెడ్డి గారి కవిత్వంపై పెన్నా శివరామకృష్ణ రాసిన విశ్లేషణాత్మక వ్యాసం చాలా బాగుంది. అదే సంచికలో నలుగురు విదేశీ చిత్రకారులు చిత్రించిన స్త్రీల వర్ణ చిత్రాలను చూసి, వారి కళానైపుణ్యాన్ని ప్రశంసించడం మాట అటుంచి, అటువంటి చిత్రాలను ప్రచురణకి ఎంచుకోవడం ఆశ్చర్యం కలిగించింది. ప్రపంచంలో ఏ దేశ సంస్కృతిలో అయినా స్త్రీ శరీరాన్ని మాత్రమే అనేక కోణాల్లో చూడటం సాధారణ అంశం అయిపోయింది. స్త్రీ మనస్సుకీ, మేధస్సుకీ, వ్యక్తిత్వానికీ ప్రాధాన్యం ఇవ్వడం ఈనాటికీ పురుషులకు అలవడలేదు. కళాకారులకూ, కవులకూ స్త్రీ ఒక ఆకర్షణీయమైన అంశం. స్త్రీలు పురుషులను ఆ విధంగా అసభ్యంగా ఎప్పుడైనా చిత్రించారా? చిత్రించినా సమాజం హర్షిస్తుందా? ఆమెని ఎంత చులకనగా చూస్తుంది! ప్రాచీన కవులు స్త్రీలను అంగాంగ వర్ణన చేస్తూ కవిత్వం రాసేవారు. దేవతలను స్తుతించినప్పుడు కూడా వారి స్తోత్రాలలో ఆ దేవతల వక్షస్థలంపై ఏదోవిధంగా తమ దృష్టిని పెట్టకుండాలేరు. పోతన సరస్వతీ దేవిని కూడా వదిలి పెట్టలేదు! స్త్రీ పురుషుల ప్రణయాన్ని కవయిత్రులు వర్ణిస్తే, వారిని చులకనగా చూసిన సందర్భాలున్నాయి మన సాహిత్య చరిత్రలో. ఉదాహరణకి, ముద్దుపళని రచించిన 'రాధికాసాంత్వనం' కావ్యాన్నీ, దాన్ని పునర్ముద్రించిన కవయిత్రి బెంగుళూరు నాగరత్నమ్మనీ వీరేశలింగం చులకనగా చూసి, ఆవిడ అటువంటి కావ్యాన్ని పునర్ముద్రించినందుకు నిరసిస్తూ, అప్పటి ప్రభుత్వం ఆ కావ్యాన్ని నిషేధించేటట్లు చేశారు! (*మిసిమి* ఫిబ్రవరి 2011) ఇప్పటికైనా స్త్రీల పట్ల పురుషుల దృష్టిలో మార్పురావాలని కోరుకుంటున్నాను..." **– అబ్బూరి ఛాయాదేవి,** హైదరాబాదు.



✶ "...*మిసిమి* ఏడురంగుల ఇంద్రధనుస్సులా వివిధ వర్ణాల కాంతితో జూన్ సంచిక మిసమిసలాడింది. నిదుర ఒడిలో, కలలజడిలో, సొగసుతడిలో చిత్రాలు కళాత్మకంగా, భావాత్మకంగా వున్నాయి... ప్రచురించిన వివిధ వ్యాసాలు వినూత్నంగానే కాక వైవిధ్య భరితంగా ఉన్నాయి... *రావూరి భరద్వాజతో* ***మిసిమి*** సమావేశం, సంభాషణం ఆసక్తికరంగా, ఆహ్లాదభరితంగా సాగింది... *ఆంధ్రవాగ్గేయకార చరిత్రము* అవసరమైన అంశాలతో, వినూత్నరీతిలో చక్కగా సాగింది. *ఆగ్నేయాసియాలో కవిత్వం* ముకుంద రామారావు సోదాహరణంగా చక్కగా వర్ణించారు...రంగు, రుచి, వాసనల కలగలుపు కలయికతో యశస్వి యస్వీ *తెలుగు పలుకుల పూదోటను* చక్కగా పూయించారు...నండూరి పార్థసారథి *హిందూస్థానీ – కర్ణాటక* సంగీత విశ్లేషణ విశిష్టంగా సాగింది...ప్రమోద్ కుమార్ *మునిమాణిక్యం* గురించి వ్రాసిన ముచ్చట్లు హాస్యాన్ని పండించాయి..." **– డాక్టరు శివభూషణం,** కర్నూలు.



✶ "...భుజంగరాయశర్మ సంపూర్ణ రచనల్ని సమీక్షించిన చెన్నరాయ వ్యాసాన్ని ప్రచురించి, తెలుగుసాహితీ ప్రస్థానంలో ముఖ్యమైన ఓ ప్రకరణని సహృదయుల కందించటం ***మిసిమి*** చేసిన ఉపకారం...

...లాలిత్యం పాటయై, ప్రౌఢిమ పద్యమై సమసించిన భావ కవితాయుగ శిల్పం శర్మలో చూడ్డం విడ్డూరం కాదుగానీ, తెలుగునాట వెలసిన సాంస్కృతిక పునరుజ్జీవనానికి శర్మని ప్రతినిధిగా నిలపడం, బుద్ధుణ్ణి రీ డిస్కవర్ చేసుకున్న యుగంలో శర్మ నృత్యరూపకం చండాలికను ఓ మణిపూసగా భావించడం రచయిత పరిశీలనాత్మతకు నిదర్శనలు... శర్మ ప్రగాఢమైన భావుకతను, సౌందర్య సౌజన్యాన్ని, వారి స్వరం చిలికించిన తేనె తెలుగుపలుకు సోనలను పాఠకులకు ప్రతిభావంతంగా రుచి చూపించగలగడం విశేషం..." **– శ్రీనివాసులు,** హైదరాబాదు.

✶ "...*మిసిమి* జూన్ 2013 సంచికలోని వివిధ రచనలన్నియు ఆణిముత్యాలయి యున్నాయి. రాశి కన్న వాసి గొప్పదై యుండాలన్నది ప్రతి సంచికలో ప్రస్ఫుటమవుతున్నది. తెలుగులో ఏ పత్రికా చేయని విషయం *రావూరితో ముఖాముఖీ.*



సంపాదకుని అక్షరాలు అక్షర లక్షలు. రావూరి తన కొడుకులకు పెట్టుకున్న పేర్ల విషయం కృతజ్ఞతకు గీటురాయి. ఆయన ఔదార్యం, ఔచిత్యం, ఔన్నత్యం, ప్రస్ఫుటం చేసే మహత్తర విషయాలు. రావినూతల సత్యనారాయణ *ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము* (రజనీకాంతరావు రచన) గురించి చాలా హృద్యంగా తనదైన మాటలతో (వాగ్గేయకారుల పాటలలో) విశదీకరించటం చాల గొప్పగా వుంది. ఇది ఒక పుస్తక సమీక్షకాదు. ఒక అరుదైన గొప్ప రచయిత అద్భుత పుస్తకము గురించి వ్రాసిన అత్యద్భుతమైన వివరణ, విశ్లేషణ విశదీకరణ.

కొన్ని సవరణలున్నాయి. త్యాగరాజు స్వామి పంచరత్నకీర్తనలలో అది *'అదికనరుచిరా'* కాదు *కనకనరుచిరా*. మరియు ఎందరో మహానుభావులు అందరికి వందనములు కాదు ఎందరో మహానుభావులందరికి వందనములు. ఇది రచన పరిపూర్ణతకై తప్ప పెద్దగా పట్టించుకోవలసిన అవసరమున్న విషయమేమి కాదు, ఈ రచనకు రచయిత శ్రమించిన తీరును పరిగణనలోకి తీసుకుంటే. కోడూరు పుల్లారెడ్డి *జ్ఞాపకాలలో ఘంటసాల* రచన బాగుంది. ప్రపంచములో భారతదేశములో, ఆంధ్రరాష్ట్రములో ఎందరెందరో మధుర గాయకులున్నారు. కాని పాడుతున్నంతకాలమే బ్రతకాలని, బ్రతుకుతూ వున్నంత కాలమూ పాడుతూ ఉండాలని కోరుకొని సాధించిన అమరగాయకుడు, మధుర గాయకుడు ఘంటసాల..."

**– ఎమ్.వి.యస్. కుమార్,** తమిళనాడు.

✶ "...***మిసిమి*** ఏప్రిల్ 20, 2013 సంచికలో రావినూతల సత్యనారాయణ రాసిన *పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా* – గోపీచంద్ పై పరిశీలన గమనించాను. అది గ్రంథ పరిశీలన, సమీక్ష, అనే ధోరణిలో కాక భిన్నమార్గంలో నడిచింది. అందువల్లనే ఈ లేఖ రాయవలసి వచ్చింది. 'ఆయన దృక్పథం హేతువాదపు గట్టు తెంచుకుని విస్తరిస్తూ అతీత మానవ చైతన్యసారంగా రూపొందింది' అన్నారు. హేతువాదానికి గట్లు ఉన్నాయా? అయితే అవి ఏమిటి? ...'భౌతిక వాదంలో అంతర్ దృష్టి లేకపోవడం, ఆధ్యాత్మిక వాదంలో బాహ్య దృష్టి లోపించడమూ పసిగట్టారు. ఆ సమన్వయ సాధనకు అశేష కృషి చేశారు.' భౌతిక వాదంలో అంతర్ దృష్టి ఉన్నదో లేదో శాస్త్రీయ పరిశోధనలో లోతుపాతులు తెలుసుకుంటే అర్థమవుతుంది. ఎందరో సైంటిస్టులు ఆలోచనా స్రవంతిలో అంతర్ దృష్టి పెట్టినందువల్లనే బాహ్య పరిశోధనలతో సమన్వయం చేయగలిగారు. ఇందుకు అనేకమందిని ఉదాహరణలుగా చూపవచ్చు. కెక్యూల్ (కెమిస్ట్), ఫ్రాయిడ్, న్యూటన్, ఐన్‌స్టీన్ అలా చేసినవారే. అయితే సైన్స్ పరిధిలో అంతర్ దృష్టి అనేది పరీక్షకు పెట్టి రుజువయితేనే స్వీకరిస్తారు. అంతేగాని భ్రమలు, పలవరింతలు, దివ్యదృష్టి పేరుతో కట్టు కథలు ఒప్పుకోరు...

...'ఆధ్యాత్మిక భౌతిక దృష్టులను రెండు పరస్పర విరుద్ధ సిద్ధాంతాలుగా పరిగణించే రోజులు గతించినాయి. ఒకే సత్యాన్ని చేరటానికి అది రెండు కొనల నుండి బయలుదేరిన రెండు మార్గాలు' అన్నారు. విజ్ఞాన శాస్త్రం ప్రకారం అటువంటి వాటికి తావులేదు. భౌతిక జీవితంలో భాగమే మానసిక జీవితం కూడా. నైతిక విలువలు మానవ విలువలు. వాటిని ఐక్యరాజ్య సమితి మొదలు విజ్ఞాన పరిశోధకులందరూ గుర్తించారు. ఆధ్యాత్మిక చింతనాపరులు చెప్పే విలువలు మానవ విలువలు కాదు. దైవ విలువలు. వాటిలో మానవులకు చోటు లేదు. మానవులు పాటించేవన్నీ మానవ శక్తికి చెందినవే, ఇందులో అతీతం అనేది ఏమీ లేదు... 'మనసు తరువాత పరిణామం ఏ రూపం ధరిస్తుందో తెలుసుకోవడానికి శాస్త్రజ్ఞులు పరిశోధన ప్రారంభించారు.' ఈ పరిశోధన ఎక్కడ సాగుతున్నది? పరిణామం నిత్యనూతనంగా జరుగుతూనే వుంది. కనీసం ఈ విషయంలో రిచర్డ్ డాకిన్స్ పరిశోధనలయినా గమనించండి... వైజ్ఞానిక రంగంలో అంతం లేదు. అది నిరంతరం సాగే అన్వేషణ. అంతేకాక, తన తప్పులు తాను దిద్దుకుంటూ, రుజువులకు నిలబడిన వాటిని మాత్రమే బయట పెడుతుంది. అది కూడా తాత్కాలికమే. కొత్త విషయాలు వచ్చినప్పుడు పాతవాటిని మార్చుకోవడానికి విజ్ఞానం వెనుకాడదు. శాశ్వత సత్యాలంటూ విజ్ఞానం చెప్పదు..."

**– నరిసెట్టి ఇన్నయ్య,** వాషింగ్‌టన్.



# తెలుగు రచనలలో
## మారుతున్న తీరుతెన్నులు

– మధురాంతకం నరేంద్ర

సంప్రదాయము, నూతనత్వము – అనే యీ రెండు పదాలను స్పష్టంగా నిర్వచించడం సులభం కాదు. సంప్రదాయము – వ్యక్తి గత ప్రతిభ (Tradition and Individual Talent) అనే తన సుప్రసిద్ధమైన వ్యాసంలో టి.ఎస్. ఇలియట్ యిలా చెబుతాడు:

"సంప్రదాయము అనేది చాలా విశాలమైన అర్థముండే పదం. సంప్రదాయాన్ని వారసత్వంగా కావాలని పొందడం సాధ్యంకాదు. కావాలని కోరుకుంటే దాన్ని చాలా కష్టపడి, సాధన చేసి సమకూర్చుకోవాలి."

మరో వ్యాసం (The sacred wood) లో అదే ఇలియట్ యిలా కూడా చెబుతాడు :

"విమర్శకుడి బాధ్యతల్లో ముఖ్యమైనది– ఒక గొప్ప సంప్రదాయమనేది వున్నప్పుడు– ఆ సంప్రదాయాన్ని పరిరక్షించడం."

పై రెండు అభిప్రాయాల్ని గమనించినప్పుడు, 'సంప్రదాయము' అనే పదాన్ని ఇలియట్ గూడా రెండు చోట్ల రెండు వేర్వేరు అర్థాల్లో వాడినట్టు స్పష్టంగా తెలిసిపోతుంది. అందువల్ల ఆ రెండు పదాలను తెలుగు సాహిత్యంలో యే అర్థాల్లో వాడుతున్నారో, ఆ అర్థంలో మాత్రమే యిప్పుడు నేను యీ వ్యాసంలో వాడబోతున్నాను. సంప్రదాయము, నూతనత్వము– అనే తెలుగు పదాలు రెండూ సంస్కృతం నుంచే వచ్చినవి. వాటిని తెలుగు సాహిత్యంలో పరస్పర విరుద్ధమైన పదాలుగా వాడుతున్నారు. అది నిజానికి సహేతుకమైన పద్ధతికాదు. సంప్రదాయంలో నూతనత్వమూ, నూతనత్వంలో సంప్రదాయమూ తరచుగా కనబడి తీరతాయి. ఆ రెండింటిలోనూ మంచీ చెడ్డలు రెండూ యేదో ఒక నిష్పత్తిలో వుండే వుంటాయి. కానీ తెలుగు సాహిత్యంలో సామాన్యంగా సంప్రదాయమన్నది పాతదనీ, వాడగా వాడగా అరిగిపోయినదనీ భావిస్తారు. అలాగే నూతనత్వమన్నదంతా మంచిదనీ, అది యెప్పుడూ ముందు చూపుతోనే వుంటుందనీ అనుకుంటారు. కొన్ని విషయాల్లో ఒకప్పుడు నూతనమని అనుకున్నదే కొద్ది కాలం తర్వాత సంప్రదాయమై పోవచ్చుననీ, సంప్రదాయమనుకున్న దానిలో మరి కొన్ని సంవత్సరాల తర్వాత నూతనమే వికసించిందని గుర్తిస్తామనీ తెలుసుకోవాలి. సంప్రదాయమూ, నూతనత్వం, పవలూరేయిలాగా, కాల్పనిక వాస్తవికత వాద ఉద్యమాల్లాగా కొన్ని సార్లు ఒకదాని తర్వాత ఒకటి వస్తూ వుంటాయి కూడా!

ఈ అనేక రకాల అర్థాలను గమనిస్తూనే, తెలుగు సాహిత్యంలో అవి గత పన్నెండేళ్ళుగా (2001–2012) తీసుకొచ్చిన మార్పుల్ని గమనిద్దాం. అసలు యీ విషయాన్ని చర్చించడానికి పన్నెండేళ్ల కాలాన్ని తీసుకోవడమే సంప్రదాయమైన పద్ధతి అనవచ్చు. పన్నెండేళ్ళ కాలాన్ని నిర్దుష్టంగా ఒక 'పుష్కరం'గా లెక్కించడం అసలు సరైన సంప్రదాయ ధోరణే! అయితే యీ పనికి యిలా పన్నెండేళ్ళ పుష్కర కాలాన్ని భూమికగా తీసుకోవడం యిది వరకెప్పుడూ జరగలేదు. అందువల్ల యిదే పద్ధతిని నూతనమని కూడా వాదించవచ్చు.

సాహిత్యంలో సంప్రదాయమూ, నూతనత్వమూ, వస్తురూపాలు రెండింటిలోనూ ఆవిష్కృతమవుతాయి. అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ చోటు చేసుకుంటాయి. ముందుగా ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రధానమైన ప్రక్రియగా నిరూపించబడిన కథానికను యివి యెలా తీర్చి దిద్దాయో పరిశీలిద్దాం.

ప్రతికాలంలోనూ మేధావులు తామొక సంధికాలంలో బతుకుతున్నామనే అనుకుంటారు. కానీ ఇప్పుడు మనం జీవిస్తున్న కాలం అనేక రకాలుగా సంధియుగమే! ఇప్పుడు మార్పులెంత వేగంగా వస్తున్నాయంటే, వాటిని సాహిత్యీకరించేలోగానే కొత్త మార్పులు చొచ్చుకొచ్చేస్తున్నాయి. 1992లో రష్యాలో కమ్యూనిస్టు ప్రభుత్వం పతనమవుతూనే పెనుమార్పులు వచ్చాయి. కొందరు దీన్ని కమ్యూనిస్టు వైఫల్యంగా చిత్రించారు. అయితే కమ్యూనిజమనే గొప్ప ఆదర్శానికనుగుణంగా యెదగలేకపోయిన మానవ జాతి వైఫల్యంగా గ్రహించాల్సిన అవసరముంది. అదివరకూ వున్న అగ్రరాజ్యాల సమతౌల్యం పాడవడంతోనే, ప్రపంచమంతా ప్రపంచ బ్యాంకు అనబడే అమెరికా సంయుక్త రాష్ట్రాల అధీనంలోకి చేరిపోక తప్పలేదు. దీన్నే మనం ప్రపంచీకరణ

అని కూడా పిలుస్తున్నాం. ఈ చారిత్రక పరిణామ ప్రభావం భారతదేశంలోనూ పెద్ద మార్పుల్ని తీసుకొచ్చింది. అంతవరకూ సామ్యవాద దిశలో ప్రయాణం చేస్తున్న దేశం, క్రమంగా పెట్టుబడిదారీ విధానంలోకి వచ్చేసింది. అదివరకూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు చివరకు ఎన్నికల్లో గెలవడం కోసం రాజకీయపక్షాలు అనుసరిస్తున్న గారడీలుగా మిగిలిపోయాయి.

ప్రపంచీకరణలో కూడా మంచీ, చెడూ రెండూ వుంటాయి. అయితే మంచి కంటే చెడే ఎక్కువ. ప్రపంచీకరణ వల్ల ప్రపంచమంతా ఒకే గ్రామంగా మారిపోయిందంటారు. అయితే గ్రామం ప్రపంచంగాక పోవడమే ఘోరం. అది మనుష్యుల్ని చరిత్రహీనులుగా మార్చి, వాళ్ళ స్వగ్రామాల నుంచీ తరమగొట్టేసింది. తెలుగు కథకుడు యీ ప్రపంచీకరణను రైతులను పీడించి, పంటలను నాశనం చేసి, గ్రామంలోని వృత్తి పనులవాళ్ళ పనిముట్లు కాజేసే తెల్ల దెయ్యం (స్వామి) గా గుర్తించాడు. చిత్రమేమిటంటే సరిగ్గా అప్పుడు ప్రభుత్వం 'జన్మభూమి' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. అప్పుడే సామాన్యులు వృత్తులు కోల్పోయి వలసలు మొదలు పెట్టారు. సంప్రదాయంగా వస్తున్న కమ్మరులు, వడ్రంగులు, చాకలివాళ్ళు మొదలైన వాళ్ళంతా ఊళ్ళూ, వృత్తులూ పోగా దేశదిమ్మరులైపోయారు. ప్రతి పట్టణంలోనూ యిలా వలస వచ్చిన వాళ్ళతో మురికి కూపాలు *హరే రామ హరేకృష్ణ రోడ్డు*– (మధురాంతకం నరేంద్ర) *బలిసాయి*. బతుకు తెరువు కోసం యితర రాష్ట్రాల నుంచీ గూడా మనుషులు వలస వచ్చి, కేవలం శరీరమే పెట్టుబడిగా జీవించసాగారు. *మేరే గావ్ కో జానా, న్యాయం దొంగతనం*– (మ. నరేంద్ర), వీళ్ళ జీవితాల్ని చిత్రించ దలచుకునే రచయిత వాస్తవికత కోసం వాళ్ళు మాట్లాడుకునే వాళ్ళ మాతృభాషల్ని కూడా వాడవలసి వచ్చింది. అలా తెలుగు కథలోకి యితర భాషలు గూడా వలస వచ్చాయి.

ప్రపంచీకరణ ప్రభావాన్ని చిత్రించేందుకు తెలుగు కథా రచయితలు రకరకాల రూపాల్ని ఎన్నుకున్నారు. వాటిలో వ్యంగ్యం ముఖ్యమైనది. కార్పోరేట్ వ్యాపార వ్యాప్తిని చెప్పడం కోసం ఒక కథకుడు అప్పడాల ఫ్యాక్టరీలను ఆక్రమించుకున్న *కప్పడాలు* (తోలేటి జగన్మోహనరావు) ఫ్యాక్టరీని తీసుకొస్తాడు. ఇటీవలే పట్టుకొచ్చిన ఐటీ ఉద్యోగులు సృష్టించుకున్న ప్రత్యేక లోకమే *బానిసల స్వర్గం* (అజయ్ ప్రసాద్). విద్యనూ, వైద్యాన్నీ, మెట్లుగా వాడుకుంటూ క్రమంగా రాజకీయాల కెగబాకి అవినీతికి పడగలు విప్పే ఆధునిక గిరీశాల్ని తెలుగు కథకుడు విడిచిపెట్టలేదు. *చివరి మజిలీ* (టి.యస్.యే. కృష్ణమూర్తి) ఐటీ వుద్యోగులు నగరాల్లో కృత్రిమగృహాల్లో సృష్టించుకున్న *గేటెడ్ కమ్యూనిటీ* (అక్కిరాజు భట్టిప్రోలు)ల డొల్లతనాల్ని అతను ప్రదర్శనకు పెట్టాడు.

గతాన్నీ, వర్తమానాన్నీ పక్కపక్కనే చూపెట్టడం ద్వారా తెలుగు కథకుడు వాటి మధ్య వుండే వైరుధ్యాల్ని స్పష్టంగా చూపిస్తున్నాడు. కోలా వంటి కంపెనీల రాకతో తుడిచిపెట్టుకు పోయిన *పెండెం సోడా సెంటర్లను* (ఖదీర్ బాబు) గుర్తిస్తున్నాడు. విద్యారంగంలో యీ మార్పులు మరింత స్పష్టంగా కనబడుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ధనవంతులు చాలామంది భూముల్నీ, ధనాన్నీ వెచ్చించి కళాశాలలు నెలకొల్పారు. పెద్ద పెద్ద భవంతులతో, విశాలమైన ఆటస్థలాలతో, దేశానికి తలమానికంగా వెలిగిన విద్యాలయాలకు క్రమంగా ప్రభుత్వపు గుర్తింపూ, ఆర్థిక వనరులూ దొరికాయి. కానీ అదే వ్యక్తుల వారసులు ఖాళీస్థలాల్ని అంగళ్ళకూ, హోటళ్ళకూ అమ్మి డబ్బు చేసుకోవడం కోసం తప్పుడు మార్గాలన్నీ చేపట్టారు. ఆయా కళాశాలలకుండే వనరుల్ని దోచుకున్నారు. అవి శిథిలాలయాలయ్యేలా చేశారు. *రేపటి చరిత్ర* (మ.నరేంద్ర).

ప్రపంచీకరణ ప్రభావం వల్ల అన్నింటి కంటే ఎక్కువగా నాశనం చేయబడినది వ్యవసాయరంగమే! ప్రస్తుతకాలంలో అందరికంటే ఎక్కువగా నిర్లక్ష్యం చేయబడిన వ్యక్తి రైతే! అయితే యీ సందర్భంలో రైతుపక్షం వహించి, వ్యవయసాయరంగ పునరుజ్జీవనం కోసం పోరాటం సాగించిన వాళ్ళలో తెలుగు కథకుడు ముందు వరసలో వున్నాడు. ఒకానొక సందర్భంలో ఒక మేధావి, రైతు గూడా ఓ రకమైన వ్యాపారస్థుడేననీ, కేవలం ప్రతిఫలాపేక్షతోనే వ్యవసాయం చేస్తున్నాడనీ ప్రకటించాడు. వెంటనే తెలుగు కథకుడు రైతు యెలా అన్నదాతగా జీవిస్తున్నాడో నిరూపించి చూపెట్టాడు. తన పైన ఆధారపడిన అనేక కులవృత్తుల వాళ్ల కడుపు నింపడం కోసం రైతు తానెలా పస్తులుంటున్నాడో వివరించాడు *అన్నదాత* (సుంకోజి దేవేంద్రాచారి). మరోకథకుడు గ్రామాల్లో ప్రాచుర్యంలో వుండే జానపద కథల్ని తవ్వితీశాడు. ముందుగా దేవుడు రైతును సృష్టించాడనీ, అతడికి సహాయపడడంకోసం వడ్రంగులు, కుమ్మరులు,

చాకలివాళ్ళు మొదలైన వాళ్ళను తయారు చేశాడనీ, చివరగా ఆ సమాజాన్ని పద్ధతి ప్రకారం నడపడం కోసం రాజును పంపాడనీ, కాలక్రమంగా రాజులై బలవంతులై రైతును అణగతొక్కుతున్నాడనీ, అటువంటి రాజ్యం నాశనమవక తప్పదని వృత్తిత శాపం పెట్టాడనీ తెలుగు కథకుడు సహేతుకంగా హెచ్చరించాడు. *వృత్తిత పాట* (గోపిని కరుణాకర్). 1970 ప్రాంతాల్లో వచ్చిన ప్రసిద్ధ కథ *యజ్ఞం* ను భూమికగా తీసుకుని, ఆ తరువాత వచ్చిన సాంఘిక పరిణామాల్ని మరోకథకుడు వివరించాడు. *యజ్ఞం తర్వాత* (అట్టాడ అప్పలనాయుడు) వ్యవసాయం జూదంగా మారిందనీ, రైతుజీవితాన్ని అడుసుగా మార్చివేసిందనీ మరో కథకుడు నిట్టూర్చాడు. *జూదం, అడుసు* (సింగమనేని నారాయణ) యింకో కథకుడు వ్యవసాయం లాటరీగానూ, వ్యసనంగానూ మారిందని ఆక్రోశించాడు *వ్యసనం* (యెంబీ ప్రసాద్). నాలుగు భిన్న దృశ్యాల్ని పక్కపక్కనే చూపెట్టడం ద్వారా రైతుజీవిత దుర్భరతను ఒక కథకుడు పోస్ట్‌మాడర్న్ పద్ధతిలో ఆవిష్కరించాడు; *నాలుగు దశ్యాలు–ఒక ఆవిష్కరణ* (సుంకోజి దేవేంద్రాచారి).

వామపక్ష ఉద్యమాన్ని స్త్రీవాద, దళితవాద, మైనారిటీ వాద ఉద్యమాలుగా విడగొట్టడం పోస్ట్‌మాడరన్ పద్ధతేననీ, అలా అది ప్రగతిశీల ఉద్యమాన్ని పలచబార్చిందనీ విమర్శకులు చెబుతారు. అధునాతనమైన పోస్ట్‌మాడర్న్ శిల్పధోరణులన్నీ స్త్రీ వాద రచయితలకు ఆయుధాలుగా రూపొందాయి. అలెగరీలు, మాజిక్ రియలిజమ్‌లూ పితృస్వామ్య ధోరణులను తూర్పార బట్టడానికి తోడ్పడ్డాయి సూపర్‌మామ్ సిండ్రోమ్, నేనొస్తున్నాను (పి.సత్యవతి). జర్నలిజానికి చెందిన తటస్థ ధోరణిలోనే కొందరు సమకాలీన స్త్రీల జీవితాన్ని చిత్రించారు; *కొలీగ్స్, ఆవర్జా* (చంద్రలత), *ఇలా ఉన్నాం* (వాడ్రేవు వీరలక్ష్మీదేవి), *సాలభంజిక* (కుప్పిల పద్మ). స్త్రీల సమస్యల్ని చిత్రించడంలో తెలుగు కథకులు యెప్పుడూ ముందడుగేస్తూనే వున్నారు. *మాయముంత* (పెద్దింటి అశోక్ కుమార్), *అంటుకొమ్మ* (అక్కిరాజు భట్టిప్రోలు), *సంకోచం* (పలమనేరు బాలాజీ).

ఆధునిక శిల్పధోరణులు దళితవాద రచయితలకు గూడ సరిగ్గా సరిపోయాయి. మాజిక్ రియలిజమ్ పద్ధతిని (వి. చంద్రశేఖరరావు కథలు) జర్నలిస్టిక్ ధోరణినీ (సతీష్ చందర్ కథలు) వాళ్ళు వుపయోగించుకున్నారు. సూటిగా కథను చెప్పే సంప్రదాయ కథనంలోనూ, కొత్త వస్తువుల్ని, ఇంతవరకు సాహిత్యీకరించని చీకటి కోణాల్ని ఆవిష్కరించారు *విఘ్నవినాయకుడు* (కొలకలూరి ఇనాక్), *మంత్రసాని* (కె. వరలక్ష్మి), *ఆకలేమయ్యిందమ్మా వెన్నెలా* (ఇంజేటి శ్యాంబాబు). దళితేతర రచయితలు గూడా దళితుల వైపు నిలబడ్డారు. *దాది* (కేతు విశ్వనాథరెడ్డి), *నమ్మకం* (మ.నరేంద్ర) క్రమంగా బహుజన వాదమన్నది గూడా యిప్పుడు రూపుదిద్దుకుంటోంది. *స్వామి,* (శాంతనారాయణ) మొదలైన వారి కథలు కూడా వస్తున్నాయి. *ఇప్పపూలు కథలు, ఈ లోగా గిరిజన కథలు* (బోయి జంగయ్య), మల్లిపురం జగదీష్ మొదలైనవాళ్ళు.

పురాణగాథల్ని పునర్మూల్యాంకనం చేయడం బాగా ప్రాచుర్యంలో వున్న పద్ధతి. ఇలా పురాణగాథల్ని మార్చడం, తమ వాదాలకు అనుగుణంగా తయారు చేసుకోవడం ఇస్లాంలోనూ, క్రైస్తవ మతంలోనూ సాధ్యంకాదు. అలా చేయడం పాపకార్యంగా వాళ్ళు భావించడం మాత్రమేగాదు, ఆ పనులు చేసిన రచయితలను శిక్షిస్తారుగూడా! అయితే అటువంటి ఛాందసత్వం చాలా తక్కువగా వున్న హిందూ పురాణాలకు ఇప్పుడు అనేక రకాల వ్యాఖ్యానాలు తయారయ్యాయి. హిందూమతంలో అనుచానంగా వున్న నాస్తిక ధోరణులు యీ కొత్త వ్యాఖ్యానాలకు దోహదం చేశాయి. ఈ పద్ధతిలో ఎక్కువగా విమర్శకు పెట్టబడిన పురాణం *రామాయణమే*! సీతకూ, శూర్పణకకూ, అహల్యకూ, కైకకూ మధ్య భేటీలను కల్పించడం ద్వారా స్త్రీ వాద రచయితలు సంప్రదాయ స్త్రీ, పురుష సంబంధాలపైన నిరసనను స్పష్టంగా నినదించారు *మృణ్మయనాదం* (ఓల్గా). *రావణ జోస్యం* (బి.ఆర్.ఇంద్ర) రాసిన కథ పెద్ద అలజడి రేపింది. అయితే యీ పద్ధతి శృతిమించడం వల్ల చాలా కథలు బలహీనపడ్డాయి. దళిత వాద భూమికతో రాసిన *బర్బరీకుడు* (సొదా) వంటి కథలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. పాత పురాణాలనూ, కావ్యాలనూ వచనంలోకి మార్చడం యిప్పుడు తరచుగా జరుగుతున్న పనే ! వీటిలో కొన్ని కేవలం మూల విధేయంగా వుండకుండా, ఆధునిక వ్యాఖ్యానాలుగా గూడా తయారయ్యాయి.

భాషను ప్రాతిపదికగా చేసుకున్న రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు మిగిలిన భాషల్ని నిర్లక్ష్యం చేయడంతో చాలా మంది మాతృభాషల్ని పోగొట్టుకునే ప్రమాదం వాటిల్లింది. అయితే

తెలంగాణా సమస్యను రాజకీయం చేయడం వల్ల, ఆంధ్రప్రదేశ్ మొత్తంగా అలజడిలో తలమునకలవుతోంది. నీటివనరులు, గనులు, పెట్రోలియం వంటి విషయాలన్నీ కేంద్ర ప్రభుత్వపు అజమాయిషీలోనే వుండవలసిన అవసరాన్ని యీ సమస్య స్పష్టంగా స్ఫురింపజేస్తోంది. ఈ పరిస్థితిని తెలుగు కథకులు తమదైన ధోరణుల్లో చిత్రించారు. తెలంగాణాలో విభజనను సమర్థిస్తూ, జరుగుతున్న ఆలస్యానికి మండిపడుతూ చాలా కథలు వచ్చాయి. *రణన్నినాదం* అనే 7 ఎపిసోడ్ల సీరియల్ కథ (పెద్దింటి అశోక్ కుమార్). కొందరు యిరు ప్రాంతాల రచయితలూ, ప్రాచుర్యంలో వున్న కథన పద్ధతిలోనే యీ సున్నితమైన సమస్యను చర్చించారు *అలఫతాహోటల్* (హెచ్చార్కే), *మూడు తొవ్వలు* (బెజ్జారపు రవీందర్). ఒక వ్యక్తి ఆత్మహత్య అనే భూమికపైన ఓ రచయిత హైదరాబాదుకూ ఆ ప్రాంతంలో నివసించిన వేరే ప్రాంతపు వ్యక్తికీ మధ్య నడచిన ప్రేమను చిత్రించాడు హెచ్. *నరసింహం ఆత్మహత్య* (డా.వి. చంద్రశేఖరరావు). మరో రచయిత వేరే ప్రాంతపు స్త్రీ తెలంగాణా యువకుడికి రాసిన ప్రేమలేఖను కథగా మలిచారు *కొత్తగూడెం పోరగాడికో ప్రేమలేఖ* (సామాన్య).

సార్వజనీనమైన మానవతా విలువల విధ్వంసాన్ని తెలుగు కథకులు విస్పష్టంగా విప్పిచూపారు. విజయవాడ నగరంలో ఒకప్పుడు *అమ్మ* (గోర్కీ) వంటి గొప్ప సాహిత్యాన్ని ప్రచురించడానికి విప్లవ పోరాటస్థాయిలో జరిగిన ఉద్యమాన్ని నేడు పుస్తకాన్నే మరచిపోతున్న ఆధునికుల్నీ పోల్చి చూపెడుతూ తెలుగు కథకుడు “దీనికి ఈ పాత సాఫ్ట్‌వేర్ పనికొస్తుంది” అని (జాన్‌సన్ చోరగుడి) నిరూపించాడు. క్రమంగా కాంక్రీటు అరణ్యాల్లో పడి మగ్గిపోతున్న మానవాళిని చూసి జాలిపడుతూ మరో కథకుడు *కింద నేల వుందని* (ఖదీర్ బాబు) జ్ఞాపకం చేశాడు. ఈ విషయాలను చెప్పడానికి నీతికథల (fable) శిల్పాన్నీ, *చివరి మనిషి* (రమణజీవి), *చివరి పిచ్చుక, సముద్రం* (పాపినేని శివశంకర్) వ్యాసశిల్పాన్నీ కూడా రచయితలు ఎన్నుకున్నారు.

**మునిపల్లె రాజు లాంటి ప్రసిద్ధ కథకులు కొందరు మాజిక్ రియలిజమన్నది మనకు కొత్త శిల్పమేమీగాదనీ, అది మహాభారత రామాయణాల్లో విరివిగా కనబడుతుందనీ వాదిస్తున్నారు.** రానురానూ సంక్లిష్టమైపోతున్న జీవితానికుండే అన్ని పార్శ్వాలనూ చిత్రించడానికి సంప్రదాయ సిద్ధమైన శిల్ప ధోరణులు సరిపోవడం లేదు. అందువల్ల పరస్పర భిన్నమైన ధోరణులను కలిపి ముడిపెట్టడం ద్వారా కొత్త పద్ధతిని తయారు చేసుకుంటూ తెలుగు కథకుడు సాగిపోతున్నాడు. సంప్రదాయానుసారంగా ఒకే ఖచ్చితమైన ముగింపును యివ్వడం యిప్పుడు కుదరదని అతడికి అర్థమయ్యింది. ముగింపును కూడా ఓ ప్రారంభంగా మార్చడంతో బాటూ, కవిత్వపు సామగ్రులైన ఉపమానాలను, ప్రతీకలనూ వాడుకుంటూ, పెక్కు అర్థాలు స్ఫురించే కథనాన్నీ, ముగింపులనూ అతను సృజిస్తున్నారు.

ఇదే కాలంలో వెలువడిన తెనుగు నవలకు కథలాగా రకరకాల ప్రయోగాల్ని చేసే అవకాశం దొరకలేదు. పత్రికలన్నీ చాలా వరకూ మూస ధోరణిలోని వ్యాపార నవలలనే ప్రోత్సహించడం చేత నవలా రచనకు అనుకూల పరిస్థితులు దొరకలేదు. అయితే యింత నిరుత్సాహకరమైన పరిస్థితులలోనూ, కొన్ని పోటీల వల్లా (తానా, నవ్య, ఆంధ్రభూమి మొదలైన వాళ్ళు నిర్వహించినవి) కొన్ని మంచి నవలలు వెలువడ్డాయి.

చాలా కాలంగా వున్న సాధారణమైన కథన పద్ధతిలోనే అంపశయ్య నవీన్ తెలంగాణా జీవితాన్ని మూడునవలలలో చిత్రించారు. యిలా ఇంగ్లీషు భాషలో వున్న triology పద్ధతి తెలుగుకు కొత్తదే (కాలరేఖలు, చెదిరిన స్వప్నాలు, బాంధవ్యాలు). కళ్యాణరావు రాసిన *అంటరాని వసంతం* దాదాపుగా అలెక్స్ హెయిలీ ‘రూట్స్’ పద్ధతిని అనుకరించింది. స్వామి తన *గద్దలాడ తాండాయి, మీ రాజ్యంమేరేలండి,* నవలలు మాండలిక భాషలో రాశాడు. దేవపుత్ర *పంచమం*, పెద్దింటి అశోక్ కుమార్ *జిగిరీ* వస్తువులో వున్న కొత్తదనాన్ని, శిల్పంలో చూపెట్ట లేకపోయాయి. కాశీభట్ల వేణుగోపాల్ తొలినుంచీ చైతన్యస్రవంతి కథనాన్ని తనదైన రీతిలో వుపయోగిస్తూ నవలలు రాస్తున్నారు. (*తపస్సు, నికషం* మొదలైనవి). వి. చంద్రశేఖరరావు *ఐదు హంసలు* అయిదు భిన్న కథనాల్ని వాడుకున్న *పోస్ట్‌మాడర్న్* నవల. కరణం బాలసుబ్రహ్మణ్య పిళ్లెపురాణాల్లోని చిన్న కథను *చండాలుడు* అనే దళిత నవలగా రూపొందించారు. డాక్టరు కేశవరెడ్డి *మునెమ్మ* నవల చాలా వరకూ మార్క్వెజ్ మాజిక్ రియలిజమ్‌ను అనుసరించింది. మధురాంతకం నరేంద్ర *భూచక్రం* నవలలో రమారమిగా డైరీ విధానాన్ని, *కొంతకొండ కొత్తూరులో* అలెగరీనీ

ఆధునికరీతిలో వాడుకున్నాడు. నందిగం కృష్ణారావు *చీకట్లో నల్లపిల్లి* (అట్టాడ అప్పలనాయుడు). *ప్రత్యామ్నాయం*, (సన్నపరెడ్డి వెంకట్రామ రెడ్డి) *కాడి* (సుంకోజి దేవేంద్రాచారి) *నేల, నీరు, మనిషి* (పలమనేరు బాలాజీ) మొదలైన నవలలు వస్తువులోనే సమకాలీనతను చూపాయి. చంద్రలత, *రేగడివిత్తులు* నవల సమాజంలో రచయిత తీసుకోవలసిన పక్షాన్ని చర్చకు నిలిపింది.

ఈ కాలంలో వచ్చిన ఆత్మకథలు కొన్ని మైలురాళ్ళు లాగా నిలచాయి. తిరుమల రామచంద్ర వృత్తాంతాల్ని మాలగా చేర్చి రాసిన *హంపీ నుంచీ హరప్పాదాకా* గొప్ప చారిత్రక, సామాజిక, సాంస్కృతిక రచనగానూ, గడియారం రామకృష్ణ శర్మగారి *శతపత్రము* ఒక మానవతామూర్తి చేసిన సత్యశోధనగానూ పేరెన్నికగన్నాయి. సామల సదాశివగారి *యాది* సమకాలీన అంశాలనే వస్తువుగా స్వీకరించినా, సంప్రదాయ భూమికను వీడలేదు. ప్రాచీన బూర్జువా వ్యవస్థకు చెందిన అవధానాలు యిప్పుడు గూడా సాహిత్య ప్రక్రియలనే అపోహలోనే కొనసాగుతున్నాయి.

పద్య కవితనుంచీ వచన కవితలోనికి వచ్చాక రాశి పెరిగి, వాసి తగ్గడం సహజమే! ఇప్పటి కాలంలో వస్తున్న కవితల్లో కవిత్వం చాలా తక్కువగానూ, వచనం చాలా ఎక్కువగానూ వుంటోంది. కవిత్వమనే రసవిద్యను (ఆల్కెమి) కొంతమంది కవులు మాత్రమే నేర్చుకోగలరు. గత శతాబ్ది చివరికే లబ్ధప్రతిష్టులైన కవులు, యీ కాలంలో తమను తామే అనుసరించుకోసాగారు. కల్పనాసాహిత్యంలో తీసుకురాగలిగినంత ఆధునికత, ప్రయోగాలు కవితల్లో తీసుకురావడం కష్టమే! కానీ యెప్పటి కప్పుడు తమను ఆధునీకరించుకునే శక్తి కొందరు కవులకు మాత్రమే వుంటుంది. దళిత, స్త్రీవాద ఉద్యమాలకు చెందిన కవులు కొత్త అభివ్యక్తితోనూ, కొత్త కవితాసామాగ్రితోనూ కొత్తదనాన్ని తీసుకొచ్చారు. సంప్రదాయ సిద్ధమైన అలంకారాలనూ, పితృస్వామ్య భావజాలాన్నీ, బ్రాహ్మణ్య ఆధిపత్యాన్ని నిరసించే కొత్త భాషతో వాళ్ళు రాసిన కవితలు బలంగా రూపొందాయి (ఎండ్లూరి సుధాకర్, శిఖామణి, కొండేపూడి నిర్మల, పాటిబండ్ల రజని, ఖాదర్ మొహిద్దీన్ మొదలైన వాళ్ళు).

కొత్త ప్రయోగాలను ప్రారంభించిన వాళ్ళు విరివిగా, సాధికారంగా ఆ పని కొనసాగించివుంటే మరింత బావుండేది (ఇతర -కె.శ్రీకాంత్, షాయరీ హైదరాబాదీ- ఆశారాజు మొదలైనవి). అలాగే యింటర్నెట్‌లోనూ, ఫేస్‌బుక్ లోనూ రోజూ వెలువడే రచనలు అసంపూర్ణంగా, నెలలు నిండని బిడ్డలాగే తయారవుతున్నాయి.

ముకుంద రామారావు అనువాదం చేసిన నోబుల్ బహుమతి కవుల కవితల్లో వాళ్ళకున్న వేర్వేరు కంఠస్వరాలు స్ఫురింప చేయడం గమనించ వలసిన అంశం.

తెలుగు నాటకం తెలుగు కవిత అంతగా రాశిలోనూ, తెలుగు కథానికంతగా వాసిలోనూ తన ప్రత్యేకతను నిలుపుకోలేక పోయింది. కోస్తా ప్రాంతంలో ప్రాచుర్యంలో వున్న పరిషత్తుపోటీ నాటకాలలో బాగా అరిగిపోయిన మూస నాటకాలే వచ్చాయి. అజోవిభో ఫౌండేషను వంటి వాళ్ళు ప్రోత్సహించిన కొన్ని ప్రయోగాలు – కథానాటికలు, పౌరాణిక గాథల నాధారం చేసుకున్న సాంఘిక నాటికలు మొదలైనవి – అంత ఫలవంతగా లేవు. వున్నంతలో కొత్త సమస్యల్ని చిత్రించిన కొన్ని నాటకాలు మాత్రం (వల్లూరి శివప్రసాద్, ఆకెళ్ళ వంటివారు రాసినవి) అడపాదడపా వస్తున్నాయి. దెంచనాల శ్రీనివాస్ (పి. కేశవరెడ్డి నవల *మూగవాని పిల్లన గ్రోవికి* నాటకీకరణ) *సౌదా* (బర్బరీకుడు) వంటి వాళ్ళు ఆధునిక నాటక ప్రయోగాల్ని తెలుగువాళ్ళకు పరిచయం చేశారు. పాటిబండ్ల మాధవరావు, *పడమటిగాలి* అనేక ప్రదర్శనలకు నోచుకుంది.

ఇలా ఈ పన్నెండేళ్ళ కాలంలో తెలుగు రచయితలు అనేక ప్రక్రియల్లో ప్రయోగాలు చేయగలిగారు. సాహిత్య పత్రికలు లేకపోవడం చేత, సరైన పారితోషకాలు లేకపోవడం చేత, పాఠకుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం చేత, తెలుగు రచయితకు యింకా కొత్త ప్రయోగాలు చేసే అవకాశం దొరకలేదు. అయితే యింత నిరుత్సాహకరమైన పరిస్థితుల్లో గూడా, అనేక మంది కవులూ, రచయితలూ, తమ సాహిత్య సాధనను సరైన మార్గంలో కొనసాగిస్తూ, తెలుగు సాహిత్యాన్ని మరేయితర భాషా సాహిత్యానికీ తీసిపోకుండా రూపొందించడం హర్షించ వలసిన విషయం.

మి

**మధురాంతకం నరేంద్ర**
**కథా రచయిత, ఆంగ్లోపన్యాసకులు,**
**తిరుపతి. ఫోన్ : 0877-2241588**
**మొ : 9866243659**

# మంచు కొండల నుంచి - మహా సముద్రాల వరకు...

(టిబెట్, భూటాన్, నేపాల్, శ్రీలంక, మాల్దీవులు)

*- ముకుంద రామారావు*

**టిబెట్ :** ప్రపంచంలో అత్యంత ఎత్తైన, హిమాలయాలకు ఈశాన్యాన, దాదాపు పదహారు వేల అడుగుల పీఠభూమి. ప్రపంచానికి పైకప్పు టిబెట్ అని అంటారు. హిమాలయాలు కాక, చైనా, బర్మా, భూటాన్, భారతదేశం, నేపాల్, కాశ్మీర్ సరిహద్దులుగా ఉన్న దేశం. టిబెట్ అన్న పేరు మంగోలియన్ల థుబెట్, చైనీయుల టుఫాన్, థాయిల థిబెట్, అరబ్బుల టుబ్బెట్ నుండి వచ్చిందని చరిత్రకారుల నమ్మకం. క్రీ.పూ. రెండవ శతాబ్దం నుండీ టిబెట్ లో పాటరూపంలో కవిత్వం ఉంది. ఆ పాటకు, భాషకు రాతపూర్వక మాధ్యమం కొన్ని శతాబ్దాలవరకూ లేదు. సోంగ్ట్సెన్ గంపో (క్రీ.శ.617) రాజుదగ్గర మంత్రిగా పనిచేసిన థున్ మి సంభోట ఆ భాషకు రాతలిపిని ఎన్నోవ్యయప్రయాసలకోర్చి విజయవంతంగా నెరవేర్చారు. థున్ మి సంభోట ను టిబెట్ భాషకు తండ్రిగా భావిస్తారు. టిబెట్ భాష టిబెటో బర్మన్ భాషా వర్గానికి చెందిన సినో టిబెటన్ భాషా కుటుంబానికి చెందినది. ఈ భాష భూటాన్, సిక్కిం, నేపాల్ లో కూడా మాట్లాడతారు. అనేకులు టిబెట్ భాషనే మాట్లాడుతున్నా, వ్యాపార నిమిత్తం మాండరిన్ భాషను వాడతారు. టిబెట్ వాసులు హిందీ, భూటనీస్, నేపాలీ కూడా మాటాడతారు.

7వ శతాబ్దంలో, సంభోట తన రాజుని కీర్తిస్తూ రాసిన కవితే టిబెట్ రాతరూపంలో రాసిన మొదటి కవిత. ఆ తరువాత 10వ శతాబ్దంలో పాటల రూపంలో టిబెట్ యోగి మిలరెప కవిత్వం వచ్చింది. అయితే అవి కవిత్వ నియమాలను పాటించని కారణంగా అప్పట్లో అవి అంత ప్రాచుర్యం పొందలేదు. అయితే వాటిలోని మార్మికత,



ఆధ్యాత్మిక, బౌద్ధిక లోతుల మూలాన ఆ తరువాత విశేష గుర్తింపుకు నోచుకున్నాయి. కవిత్వ పరంగా టిబెట్ లిపిని ముందుగా వాడింది 13వ శతాబ్దంలో శాక్య పండిత కుంగ గ్యల్ట్సెన్. అదీ, 7వ శతాబ్దపు ఆచార్య దండి రాసిన భారతీయ కవిత్వానువాదంతో. అది భారతీయ కవిత్వం, బౌద్ధం కాదు కాబట్టి, ఆ పనిని చేయనివ్వకుండా సమకాలీన మేధావులు అడ్డు తగలడంతో ఆ పని పూర్తి కాలేదు. అయితే ఆ తరువాత షోన్టన్ డోర్జీ గ్యల్ట్సెన్, భారతీయ పండితుడు లక్ష్మీ కారా సహకారంతో, ఆ పనిని 'కవిత్వ అద్దం' పేరుమీద పూర్తిచేసారు. మరో టిబెట్ పండితుడు ఆ కవితలకు వ్యాఖ్యానం జోడించడంతో, మూలం భారతీయమైనా, అదే రానురాను టిబెట్ కవిత్వ సంప్రదాయానికి, రాబోయే కవులకు కరదీపికయింది. అంతవరకూ భారతీయ సంస్కృత కవిత్వమే వారి కవిత్వంగా ఉంటూ వచ్చింది. టిబెట్ లో అప్పటినుంచి కవిత్వం అభివృద్ధిచెందుతూ వచ్చింది. అది మొదలు టిబెట్ కవిత్వాన్ని కొనసాగించిన వారిలో ముఖ్యులు - గొంగ్గర్ గ్యెంచైన్, ఝులు ఛొక్యొంగ్ జంగ్పో, చంగ్యంగ్ గ్యచొ, జొడ్ ప్హప మిఫం గెలెగ్ నంగ్యల్, అయిదవ దలైలామా, డొకర్ ఝుబ్రుంగ్ ట్సెరింగ్ వాంగ్యల్, సితు ఛొక్యి జుంగ్నే, ఖంట్రుల్ టెంజింగ్ ఛొక్యే న్యిమా, మిఫం రింపోచె, సిక్కిమెసె కమ ఉగ్యెన్ టెంజింగ్, దుడ్జొం రింపోచె, రబ్ గై భసంగ్ మొదలయిన వారు.

1578 నుండి టిబెట్ దలైలామాలతో పరిపాలించ బడుతున్న బౌద్ధమతవ్యవస్థిత దేశం. అనేక శతాబ్దాలు విదేశీయులకు నిషిద్ధ ప్రదేశం. చైనాను పాలించిన మంగోలు మంచూ చక్రవర్తులు టిబెట్ని ఆక్రమించారు. అయినా వారు టిబెట్ పాలకులకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించారు. మావో పరిపాలనలో వాటిని తోసిరాజని టిబెట్ని, 1950లో తమ అధీనంలోకి తీసుకున్నారు. దాన్ని టిబెట్ వాసులు సమ్మతించలేదు. చైనా అణచివేతను భరించలేక 1959లో దలైలామా టిబెట్ని వదిలి భారతదేశంలో తలదాచు కోవాల్సి వచ్చింది. అటు చైనా, ఇటు భారతదేశం ఈ రెండు బలీయమైన నాగరికతల మధ్య నలిగిన దేశం టిబెట్. అనేకవేలమంది టిబెట్ వాసులు దేశం నుండి పారిపోయి ప్రపంచంలో అనేకచోట్ల ప్రవాసంలో గడుపుతున్నారు. 1966-76 మధ్య సాగిన సాంస్కృతిక విప్లవం టిబెట్ను



చంగ్యంగ్ గ్యచొ

అన్ని విధాలా దెబ్బతీసింది. గ్రంథాలయాలు అనేకం ధ్వంసం చేయబడటంతో టిబెట్ సాహిత్య సాంస్కృతిక సంపద ఎంతగానో కోల్పోయింది. 1976 నుండి టిబెట్ ఒక యాత్రా స్థలంగా కూడా మార్చబడింది. 1960 లో కంపా తిరుగుబాటు మొదలుకుని ఇప్పటి వరకూ ఆత్మాహుతుల్లాంటి అనేక ప్రక్రియల ద్వారా తమ మాతృదేశాన్ని విడిపించుకోవాలన్న ఆశయం టిబెట్ వాసులు చేస్తూనే ఉన్నారు. టిబెట్ వాసులంటే ఇక్కడ టిబెట్‌లో ఉన్నవారే కాక, అక్కడే పుట్టి ప్రవాసంలో గడుపుతున్నవారు, ప్రవాసంలో పుట్టి ప్రవాసంలో పెరుగుతున్నవారు కూడా. అలా మూడు తరాలవారున్నారు. ఈ మూడు తరాలనుండీ మాతృదేశ విముక్తికోసం అనేక విధాల కవిత్వం వస్తూనే ఉంది. తమ మతం సంస్కృతి పట్ల లోతైన బాంధవ్యం, మాతృదేశాన్ని విడిపించుకొని తమ దేశానికి తిరిగిరావాలన్న బలీయమైన ఆకాంక్ష వారి కవితల్లో అడుగడుగునా కనిపిస్తుంది. ప్రవాసంలో ఉంటూ ప్రతిఘటనే ఇప్పుడు స్థూలంగా వారి కవిత్వం.

1959 లో చైనా చర్యల మూలంగా అక్కడి సాహిత్యానికి విపత్తులాంటిది సంభవించింది. ఒక విధంగా అది టిబెట్ సాహిత్యం శ్వాస కోల్పోయినట్టే. చైనా నుండి అనువాదాలకు తప్ప వేటికీ అనుమతిలేకుండా పోయింది. 1980 నాటికి ఆ పరిస్థితిలో మార్పు రావడంతో వసంతంలో పూవుల్లా మళ్లీ టిబెట్ సాహిత్యం విచ్చుకోవడం మొదలయింది. ఆధునిక టిబెట్ రచయితలు థొండుప్ గ్యల్, జంగ్బు, ట్సెరింగ్ థొండుప్, గెండున్ ఛొపెల్ లాంటివారు సరికొత్త పద్ధతుల్లో రాయడం మొదలెట్టారు. కానీ 1994 నుండీ రచయితలమీద కర్కశమైన నియంత్రణ మొదలై, 1980 లో పొందిన స్వేచ్ఛ హరించుకుపోయింది.



జెట్సన్ మిలరెప

**జెట్సన్ మిలరెప (1052-1135):** టిబెట్ ప్రముఖ బౌద్ధ యోగి, కవి. అసలు పేరు మిలాథోపగ అంటే శ్రవణానందం. వారి స్వరం మధురం..

మిలేరప తండ్రి మరణానంతరం అనేక కష్టాలు అనుభవించారు. అవే వారిని తాంత్రిక విద్య వైపు, బౌద్ధం వైపు తీసుకుపోయాయి. మహాముద్ర బోధనల నైపుణ్యం సంపాదించారు. ఎందరో శిష్యుల్నీ పొందగలిగారు. ఆ క్రమంలో అనేక కవితలూ వెలువడ్డాయి. ఒక యోగిలాంటి ఆత్మకథ, ఆత్మ సమర్పణకు మార్గదర్శి, బౌద్ధ యోగ కరదీపిక, కొన్ని వేల పాటల కవితల టిబెట్ జానపదాల సంగ్రహం మిలేరప.

**నీకు నీవు తృప్తిచెందక**
**సంపదను పోగేస్తూపోతే ఇతరులే సంపన్నులవుతారు**

**నీ లోపలి కాంతిని నువు కనుగొనకపోతే**
**బాహ్య సుఖ సంతోషాలు కేవలం వేదనకు కారణాలవుతాయి**
**నీ పైశాచిక తృష్ణ అణుచుకోకపోతే**
**కీర్తి కాంక్ష దావాలకు నాశనానికి దారితీస్తుంది**

* * *

**నది, తరంగాలు, అలలు ఈ మూడూ బయటపడ్డపుడు**
**సముద్రం నుండే పుడతాయి**
**అదృశ్యమైనపుడు సముద్రంలోనే అదృశ్యమవుతాయి**

**అలవాటుగా ఆలోచించడం, ప్రేమించడం,**
**అన్నీ తనకే ఉండాలనుకోవడం, ఈ మూడూ బయటపడ్డపుడు**
**స్వీయ చైతన్యం నుండే బయటపడతాయి**
**అదృశ్యమైనపుడు స్వీయ చైతన్యంలోనే అదృశ్యమవుతాయి**

**జన్మించని, ఎడతెగని, చెప్పబడని ఈ మూడూ వెలువడ్డపుడు**
**స్వీయ స్వభావం నుండే బయటపడతాయి**
**అదృశ్యమైనపుడు స్వీయ స్వభావంలోనే అదృశ్యమవుతాయి**

**గొంగ్గర్ గ్యైంచైన్ (1182-1251) :** టిబెట్ బౌద్ధం లోని సాగ్య శాఖలోని నాలుగవ తరానికి చెందిన బౌద్ధ పండితుడు, కవి. బౌద్ధాన్ని ఎంతగా మదించారంటే, వైద్యం, బౌద్ధం, సాహిత్య మీమాంస, పరిభాష, ఛందస్సు, నాటకీయత, పంచాంగం మొదలైన అన్నింటిమీదా సాధికారత సాధించారు. తన విలువైన అనుభవాల సారాంశం ఈ కింది కవిత.

**జ్ఞాన నిధులు పండితులు / అమూల్యమైన సూక్తుల్ని వాళ్లు పోగుచేస్తారు**
**నదుల నిధులు సముద్రాలు / ఆవైపే అసంఖ్యాక నదులు పరుగులు తీస్తాయి**

**పండితుడైనా కాకున్నా / ఉత్తమమైనవి నిర్ణయించగలిగేవారే సమర్థులు**
**ఇనుప రజను మట్టిలో కలిసినా / అయస్కాంతం ప్రత్యేకతను చూపిస్తుంది**

**ఒక్కటైనా పట్టు సాధించి / వివేకుడు సాధ్యమైనవన్నీ నేర్చుకుంటాడు**
**మూర్ఖులు పండితులనిపించినా**
**బలహీనంగా మిణుకుమిణుకుమనే నక్షత్రాలు వారు**

**జయాపజయాల వ్యత్యాసాన్ని అందరూ నిర్ధారించగలరు**
**ఆ వ్యత్యాసం కష్టసాధ్యమైనపుడు పండితులొకరే గుర్తించగలరు**

ఆవుపాలు అందరూ పిండగలరు
కానీ హంస ఒకటే నీటి నుండి పాలను వేరుచేయగలదు

ఎంత దారిద్ర్యంలో ఉన్నా / నీతిమంతులు నైతిక ప్రవర్తనతోనే ఉంటారు
కాగడా తలకిందులైనా / దాని నాలుక పైకేలేస్తుంది

పండితులు పండితులుగానటించరు/వారి ఖ్యాతి ప్రపంచంలో ఎన్నడూ తరగదు
తుడిచిన సీసాలో సుగంధాన్ని ఒంపినపుడు
సువాసన దూరదూరానికి వ్యాపిస్తుంది

పామరులు గడుసైనవారు / విజ్ఞానవంతులు అణకువగలవారు
చిరు ధారలు కొండ లోయల్లో గర్జిస్తుంటాయి
విశాల సముద్రాలు అరుదుగా శబ్దం చేస్తాయి

**ట్సంగ్యంగ్ గ్యత్సొ (1682–?) :** 15 ఏళ్ల వయస్సులో అయిదవ దలైలామా నే పునర్జన్మించినట్టుగా అందరూ స్వీకరించారు. అందుకని వారిని 1697లో ఆరవ దలైలామాగా ప్రకటించారు. ట్సంగ్యంగ్ కవితలు ఆంతరిక భావాల్ని ప్రకటిస్తూ జానపద కమ్మదనంతో నిండి ఉంటాయి. టిబెట్ వాసులకు అత్యంత ఇష్టమైన కవితలు వీరివి. అనేక కవితలు పాటల రూపంలో ప్రజల నాలుకలమీదుంటాయి. మద్యం మగువల ప్రేమికుడుగా ప్రత్యేకుడు. ప్రేమ పాటల మాధుర్య గాయకుడు. 1706లో ఒక మిత్రురాలుకు రాసిన లేఖ ద్వారా ఏదో తెలియని ప్రదేశానికి ట్సంగ్యంగ్ ని, చైనా తీసుకుపోయినట్టు మాత్రమే తెలుసు. ఆ తరువాత ట్సంగ్యంగ్ చంపబడ్డారని, చనిపోయారని అన్నీ ఊహాగానాలే తప్ప, నిర్ధారణగా తెలిసినది ఏదీ లేదు.

తూర్పు కొండల పైన నవ్వుతూ/చంద్రుని మోము పైకి లేస్తున్నపుడు
నవ్వుతున్న మోముతో ఆ కన్యపడుచు ఆకారమే/నా మనస్సులో

ముందుగా చూడకపోవడమే మంచిది
ప్రేమలో పడే అవకాశం లేదు
రెండవది సన్నిహితం కాకపోవడం ఇంకా మంచిది
ఆమె లేకపోయినా అపుడు ఒంటరివి కావు

చెట్టు పక్షితో ప్రేమలో పడింది / పక్షి చెట్టు ప్రేమలో పడింది
వాళ్లిద్దరూ సామరస్యంతో ఒకరినొకరు ప్రేమించుకుంటే
గద్దకు అవకాశమే లేదు

నిన్న లేతగా ఉన్న మొలకలు / ఎండిన గడ్డిపుడు
దక్షిణపు విల్లు కంటే ఎక్కువగా వంగిపోయి
ముసలిదవుతున్న యువకుని శరీరం ఇపుడు

నేను ప్రేమించిన యువతిని పరిణయమాడుంటే
సముద్రం అట్టడుగునుండి
కావల్సిన రత్నాన్ని పొందిన ఆనందం
నాదే అయేది

**రబ్ గై భసంగ్ (1935 – ) :** మాతృదేశం పట్ల గౌరవం ప్రేమ వీరి కవితల్లో ఎక్కువగా కనిపిస్తాయి. చైనా సైన్యంలో దుబాసిగా, అధ్యాపకుడిగా పనిచేసారు. కవిత్వంతో అనేక ప్రయోగాలు చేయడం వీరికి ఇష్టం.

**అమ్మ**
పాలుతాగే పసివాడిగా ఉన్నపుడు
మట్టిబొమ్మలు చేస్తానని గాని, దొంగాట ఆడతానని గాని,
భూమ్యాకాశాలగురించి గాని, నేనెప్పుడూ అనుకోలేదు
కానీ నాకు ఒక అస్పష్ట అభిప్రాయం ఉండేది:
మాతృభూమి కౌగిలంత తీయదనం / ప్రపంచంలో ఏదీ లేదని

సుదూర సరిహద్దు ప్రాంతం నుండి / యాగ్జేపచ్చ నదుల్ని దాటొచ్చాను
చాంగ్బై కొండల దగ్గరకు పోకపోయినా
నా గుండెల్లో నాకు నేనే గుసగుసలాడతాను

మాతృభూమి కౌగిలింత తీయదనం / ప్రపంచంలో ఏదీ లేదని

**ధొండుప్ గ్యల్ (1953–1985) :** మొదటి ఆధునిక కవిగా గుర్తింపు పొందాడు. 1980 నుండే కవిత్వం ప్రచురించడం మొదలెట్టినా 1985 లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆంగ్లంలో ప్రచురించబడ్డ దీర్ఘ కవిత *యువ జలపాతం* అనేక ప్రశంసలు పొందింది. అందులో కొంతభాగం–



ధొండుప్ గ్యల్

నిర్మలమైన నీలాకాశం, సూర్యుని వేడి,
పూల సుగంధం, / గంభీరమైన కొండలు – –

**ఆహా**
వీటన్నింటికంటే అందంగా / ఏటవాలు శిఖరంనుండి
సెలయేరు జలపాతం

**చూడు**
స్వచ్ఛమైన తెల్లని కాంతి కిరణాలు, / జరీపట్టు మీద
చిలుక రెక్కల నమూనాలా / నెమలి పింఛంలా విచ్చుకుని

**విను**
దేవతల సంగీతం, / పారే నీటి శబ్దం, స్పష్టంగా రమ్యంగా,
మూలంలో స్వచ్ఛంగా / దేవుళ్ల సంగీతం
నిష్కల్మషమైన స్వరమాధుర్యము,

**అబ్బో**
ఇది సాధారణ జలపాతం కాదు – / తీవ్రైన స్వభావం,
భయంలేని హృదయం / అసమానమైన అహంకారం,
ధీటైన శరీరం / ఉత్తమమైన నగలతో అలంకరించబడ్డట్టు
అత్యంత మాధుర్య సంగీతం

**ఇది**
కుండపోత జలపాతం, / మంచు ప్రదేశపు యువజనుల ప్రఖ్యాతి
1980 సంత్సరంలో / బో యువకుల హృదయపూర్వక శక్తి సృజన
గౌరవ పోరాటం / పసితనపు సంగీతం
అవునవును! / యువ జలపాతం / యువకుల జలపాతం


ట్సెరింగ్

**టిబెట్ లో స్త్రీల కవిత్వం :** ఎనిమిదవ శతాబ్దపు ఎషా ట్సోగ్యల్ పాటలు (బుద్ధుడి కాలంనుండి వచ్చిన తెరిఘతి సంప్రదాయపు భిక్షుణిల పాటల లాంటివి) తప్ప దాదాపు స్త్రీల కవిత్వం లేదనే చెప్పాలి. కానీ ఇటీవల కాలంలో ట్సెరింగ్ వోసెర్ (1886) మొదటి ఆధునిక కవయిత్రిగా ప్రవాసంలో ఉంటూ టిబెట్ విమోచన కోసం రాజకీయ కవితలు రాసి అందర్నీ ఆకట్టుకోగలిగారు.

టిబెట్‌లోని బౌద్ధ నాగరికత ప్రాచీనమైనది. ఒకప్పటి భారత దేశ సంస్కృత గ్రంథాలు, వాటి టిబెట్ అనువాదాలు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. భారతదేశంలో లభ్యం కాని సంస్కృత మూలాల టిబెట్ అనువాదాలు అక్కడ దొరుకుతాయి. అవి మూలానికి అతి దగ్గరగా ఉండటంతో వాటిని మూలభాషగా భావించి వాటినుంచి అనువాదాలు జరిగినవీ ఉన్నాయి.

**భూటాన్ :** చారిత్రకంగా భూటాన్ రాజ్యం గానే అందరికీ తెలుసు. డ్రుక్పా కర్గ్యపా తెగకు చెందిన ప్రాంతం. హిమాలయాలకు దక్షిణాన, ఉత్తరాన టిబెట్, దక్షిణాన భారతదేశం సరిహద్దులుగా ఉన్న దేశం. ఔషధ మొక్కలకు అనువైన ప్రాంతం, కాబట్టి భూటాన్‌ని మెంజొంగ్ అంటే ఔషధాల దేశం అని పిలుస్తారు. భూటాన్‌కి భూటానీ అని, డ్రుక్ యుల్, అంటే గర్జించే మహాసర్పపు ప్రదేశం అని కూడా పిలుస్తారు. జనాభా, విస్తీర్ణం తక్కువగా ఉన్నా, వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉంది. కొండలు కోనలు మూలాన అక్కడికి చేరుకోవడం దాదాపు దుర్భేద్యం కావడంతో, ఇప్పటివరకూ దాని స్వతంత్రతను, అసమాన సాంస్కృతిక సంప్రదాయాన్ని నిలుపుకుంది. కొండలమీద రహదారి ఏర్పర్చిన తరువాతే 1970 లో బయటి ప్రపంచానికి భూటాన్ ద్వారాలు తెరిచారు. ప్రపంచంలో టిబెట్ నుండి వచ్చిన తాంత్రిక బౌద్ధాన్ని హిమాలయ రాజ్యాల్లో ఇప్పటికీ అవలంబిస్తున్న ఒకే ఒక్క దేశం భూటాన్. 8 వ శతాబ్దంలో గురు పద్మసంభవ, బుద్ధుడి తరువాత అంత ప్రాముఖ్యత పొందిన టిబెట్ బౌద్ధ గురువు రింపోచే మూలాన భూటాన్ లో తాంత్రిక బౌద్ధం మొదలైంది. టిబెట్ తయారు చేసిన కంజూర్ (108 సంపుటాల బుద్ధుని బోధనలు), తెంజూర్ (200 సంపుటాల పండితుల వ్యాఖ్యానాలు) అక్కడి బౌద్ధమత ఆచరణకి, బోధనలకు ఇప్పటికీ పనికొస్తున్నాయి.

1907 నుండి వాంగ్చుక్ వంశపారంపర్య రాచరిక పాలన కొనసాగుతోంది. 2008 మార్చి తరువాత రెండు పార్టీల ప్రతినిధిసభ ప్రజాస్వామ్యం మొదలైంది. అయినా రాచరిక పాలకులకే అందులో ఎక్కువ ఆదరణ. ఇప్పటి రాచరిక వ్యవస్థకి తండ్రిలాంటివాడు, (1952–1972) మధ్య పరిపాలించిన జిగ్మే సింగ్యే వాగ్చుక్. అక్కడ ఆధిక్యతలో ఉన్న డ్రుక్ప వాసుల , టిబెట్ తతిమా హిమాలయ వాసుల సంప్రదాయాలకు దగ్గరైన వారి హక్కుల్ని కాపాడటానికి అన్ని విధాలా కృషిచేసారు. భూటియా జాతి అక్కడి అల్పసంఖ్యాక జనాభాలో 50 శాతం. తతిమా జనాభాలో నేపాలీస్, షర్చోప్ లు ఉన్నారు. భూటియాలు 9వ శతాబ్దం నుండీ అక్కడ ఉన్నవారు. వివిధ మాండలికాల్లో టిబెటో బర్మన్ భాష మాట్లాడతారు. నేపాల్నుండి నేపాలీల వలస ఎక్కువ కావడంతో 1959 నుండి ఆ వలసల్ని అనుమతించలేదు. అక్కడి అల్ప సంఖ్యాకులైన నేపాలీలతో సఖ్యత అంత లేక, వారితో ఇబ్బందులున్నా, ఆసియాలో సంతోషంగా ఉన్న దేశాల్లో అది మొదటిది.

గ్లూ పేరుమీద జానపద గేయాలు (పద్మ కథంగ్, మని కబుం దీనికి ఆద్యులు), న్యాం గూర్ పేరు మీద ఆధ్యాత్మిక కవిత్వం (మిలరెప (1040–1123), డ్రుక్ప కూఎన్లే (1455–1529) ఈ పద్ధతికి ఆద్యులు. బౌద్ధమత వ్యాప్తికి బాగా పనికొచ్చిన కవిత్వం ఇది), న్యాన్ గేగ్ పేరుమీద ఆలంకారిక కవిత్వం 13వ శతాబ్దం నుండీ చెవుల కింపైన పరిశుద్ధ సాహిత్యం, పండితులకు పరిమితమైన బౌద్ధ సాహిత్యం) అక్కడి కవిత్వంగా చెప్పుకోవచ్చు.

ఆధునిక సాహిత్యపరంగా భూటాన్ కి దాదాపు 30 ఏళ్ల చరిత్ర ఉంది. ఆంగ్లంలో చదువులు మొదలైనాక 1980 నుండి ఆంగ్లంలోనే కాకుండా వారి జాతీయ భాష డ్జొంగ్ఖా లో కూడా సాహిత్యం విరివిగా వస్తోంది. సంప్రదాయ సాహిత్యం రానురాను వెనకబడుతోంది. ఒక అనామక కవయిత్రి రాసిన కవిత చూడండి.

**నా పదేళ్ల ప్రాయంలో / సూర్యుడితో నాన్న రోజు మొదలయింది**
**అమ్మ ఎప్పుడో శ్వాస కోల్పోయింది**
**చుట్టూ ఉన్న ఖాళీలు నన్ను శూన్యంలోకి నెట్టాయి**

**ఆ దాడి కేవలం బాధాకరమే కాదు**
**ప్రతీ బాధలా, అది కూడా ఒక ఏకాంత అనుభవం**

**వేదనతోను ఏకాంత యాతనతోను**
**మా అమ్మానాన్నల జ్ఞాపకాలు నన్ను నింపాయి**
**అయినా కనుగొన్న బాధ కూడా మాయమైంది**

**అటువంటి సందర్భంలో నేను / నది ఒడ్డుకి షికారుకెళ్ళాను**

**అందులో కలిసిపోదామనుకున్నాను, కానీ ప్రతీదీ బాధించింది**
**అందులో నా మూగ ప్రతిబింబం సైతం.**

**ఇంటికి తిరిగొస్తే సారాయి  గాలి/బాధతో కలగలిసిన సారాయి**
**వాటి మోతిగే ఔన్నత్యం ముందు విశ్రాంతిని పొందాయి**
**లేమితో గట్టి దాడి తరువాత ఒక ఆడపిల్ల**
**ఒక మానవ చింపిరిగుడ్డ**
**కానీ పదేళ్ల ప్రాయంలో బాధని మోసంచేసే మార్గాన్ని తెలుసుకున్నాను**
**పద్దెనిమిదేళ్లపుడు ఇపుడు / అవే సాధనాలు నన్ను మోసం చేస్తున్నాయి**
**ప్రతీరోజూ నేను శిథిలమవుతున్నాను**
**లుగార్ థియేటర్ దగ్గర సులభంగా డబ్బుచేసుకుంటున్నాను**
**స్వాధీనంలో ఉండే కలలతో నా రాత్రులు గడుపుతున్నాను**

**ఇటీవల నా ఆస్తి మారింది / నా తల తిరిగిపోతోంది**
**నా కాలేయం ఇంకా సారాయితోనే నిండి ఉంది**
**ఏదో వింతగా ఉంది నాకు / కనుసైగ చేస్తున్న నక్షత్రాలకు**
**దూరంలో ఇంద్రధనుస్సు స్థిరపడుతోంది / రంగులమయంతో పూర్తిగా**

**నేపాల్ :** బుద్ధుడు పుట్టిన దేశం. 18వ శతాబ్దం వరకూ కాట్మాండు లోయగానే ఉన్నది, గూర్ఖాల ఆక్రమణ తరువాత 1743 లో ప్రిథ్వి నారాయన్ షా మొట్టమొదటి రాజుగా నేపాల్ వెలుగులోకొచ్చింది. ప్రపంచంలో హిందూ రాజ్యంగా ఉన్న ఏకైక దేశం నేపాల్. చైనా, భారత దేశం లాంటి అతి పెద్ద దేశాల మధ్య, సముద్రం లేని దేశం. హిమాలయ పర్వత శ్రేణుల దక్షిణాన, పశ్చిమాన టిబెట్, ఉత్తరాన చైనా, తూర్పు దక్షిణాన భారతదేశం సరిహద్దులుగా ఉన్న దేశం నేపాల్. అనేక అంతర్యుద్ధంలాంటి ప్రజా ఆందోళనల తరువాత 2008 లో రాచరికం పోయి ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యమయింది.

నేపాల్‌ని గూర్ఖాలు ఆక్రమించకపూర్వం సంస్కృతం లోను, నెవారీ లోను రాతకోతలుండేవి. ఆక్రమణ తరువాత నేపాలీ వాడుకలోకొచ్చింది. ఈ రాతలు ఎక్కువగా ధార్మికం, ఇతిహాసం, దానపు దస్తావేజులు మొదలైనవాటికి ఉపయోగ పడ్డాయి. సాహిత్య పరంగా నేపాల్ చరిత్ర 19వ శతాబ్దం మధ్యప్రాంతం నుండే మొదలైంది. అది కూడా సంస్కృత రామాయణం నేపాలీలో భానుభక్త ఆచార్య (1718-1865) అనువాదం తో. అందుకని భానుభక్త నేపాలీలో ఆదికవి. ఎవరి శైలి వారిదే అయినా, 20వ శతాబ్దపు నేపాలీ కవిత్వానికి పునాదులు వేసినవారిగా లేఖ్నాథ్ పౌడ్యల్ (1885-1966), బాలక్రిష్న శామ (1903-1981), లక్ష్మీ ప్రసాద్ దేవ్కోట (1909-1959), సిద్ధిచరన్ శ్రేష్ఠ (1912-1992), కేదార్ మాన్ వ్యథిత్ (1914-1998) లని భావిస్తారు. ఆధునిక సాహిత్యం 1920-1930 బాలక్రిష్ణ శామ రాసిన భావకవిత్వంతో మొదలైంది. కానీ అవి సంస్కృత ఆధారితాలే. కానీ అతని సమకాలికులు లక్ష్మీ ప్రసాద్ దేవ్కోట, సిద్ధిచరన్ శ్రేష్ఠ, కేదార్ మాన్ వ్యథిత్ మొదలైనవారు, సంస్కృతాన్ని వాటి ఛాయల్ని వదిలి, తమదైన శైలిలో నేపాలీలో కవిత్వ సృజన చేసారు. అందులో లక్ష్మీ ప్రసాద్ దేవ్కోటది ప్రముఖ పాత్ర..


భానుభక్త

**లేఖ్నాథ్ పౌడ్యల్ (1885-1966) :** సంస్కృత కావ్య పద్ధతినే నేపాలీ కవిత్వంలో వాడినా, నేపాలీ భాషలోని సొగసులు ప్రథమంగా చూపించిన కవి. చదువు, ఉద్యోగం కోసం భారతదేశంలో గడిపినా, 1909 లో తిరిగొచ్చాక అప్పటి రాజ కుటుంబం లోని ముఖ్యుడైన భీం శంషేర్ రాణా దగ్గర ఇరవైదేళ్లపాటు పురోహితుడిగా, ఉపాధ్యాయుడుగా పనిచేసారు. కవిగా పేరు తెచ్చిపెట్టిన మొదటి కావ్యం- *రుతువులమీద ఆలోచనలు.* అయిదవ శతాబ్దపు కాళిదాసు సంస్కృత కావ్యం *రుతుసంహారం* దానికి ఆధారం. ప్రకృతి వర్ణనల్లో రెండు కావ్యాల్లో అనేక పోలికలు కనిపిస్తాయి. రాణా కుటుంబంలోని తన పరిస్థితిని తెలియజేసేలా 1914 లో రాసిన *పంజరంలో చిలుక* నేపాలులో అందరినీ ఆకట్టుకుంది. *అమరజ్యోతి సత్య స్మృతి* పేరుమీద మహాత్మా గాంధీని ఉద్దేశించి ఒక దీర్ఘ కవితకూడా రాసారు. ఎక్కువ భాగం కవితలు నీతిబోధలు, తాత్వికం, ఆధ్యాత్మిక పరమైనవే. రాజు త్రిభువన్, 'కవి శిరోమణి' బిరుదుతో సత్కరించిన ఏకైక నేపాలీ కవి. వారి సర్వోత్తమ కృతిగా పేరుపొందిన మహాకావ్యం 1953 లో వచ్చిన *యువ తపస్వి.* యుక్త వయస్సులో భార్య చనిపోయాక వారి స్వీయ అనుభవాలతో కూడిన కావ్యం అది. వారి డెబ్బైయవ పుట్టినరోజు వారిని రథంలో కూర్చోబెట్టి, అక్కడి కవులందరూ, ముఖ్యమంత్రితో బాటు, కాథమండు పురవీధుల్లో ఆ రథాన్ని లాగుతూ వారిని ఊరేగించారు.


లేఖ్నాథ్ పౌడ్యల్

**పంజరంలో చిలుక**

చిలుక పేరుతో దీనమైన రెండవ జన్మగా
ఈ పంజరంలో నేను. / నా కలలో శివుడు కనిపించినా
నాకు అణువంతైనా శాంతి విశ్రాంతి లేదు

నా సోదరులు, తల్లిదండ్రులు / ఎక్కడో దూరంగా అడవుల్లో ఉన్నారు
ఈ పంజరంలో కుములుతూ / ఎవరితో చెప్పుకోవాలి నా క్షోభ

అడవి ఆనందాన్ని గుర్తుచేసుకుంటూ
ఒక్కోమారు ఏడుస్తూ కన్నీరు కారుస్తాను
ఒక్కోమారు జీవచ్ఛవంలా పడుంటాను
ఒక్కోమారు పిచ్చిగా గెంతుతాను

రోజూ ఆనందంగా అడవి పండ్లు తింటూ
అడవుల్లో డొంకలన్నీ తిరిగాను / విధి నన్ను పంజరంలోకి తోసింది
ప్రారబ్ధం దేవుని చోద్యం

నాకు అంతా శత్రువులే కనిపిస్తున్నారు
ఒక్క మిత్రుడూ కనపడడు – ఎలా తప్పించుకోవాలి
ఎవరితో నా గుండెబరువు దించుకోవాలి

ఒక్కోమారు చలి, ఒక్కోమారు వేడి
ఒక్కోమారు ముచ్చట్లు, ఒక్కోమారు నిశ్శబ్దమైపోతాను
పిల్లల ఇష్టానుసారం నన్ను ఆటాడిస్తారు
నా దశ ఎప్పటికప్పుడూ మారుతూనే ఉంటుంది

పనికిమాలిన అన్నం నా తిండి / నా సగం కడుపు కూడా అది నింపదు
నీటిగిన్నె వైపు చూస్తే/ఎండిపోయుంటుంది, అవీ నా సౌకర్యాలు

బొంగురుపోయిన గొంతు, అలసటగా ఈ బంధనాలు
వాటిగురించి మాటాడటం మరీ యాతన
ఒక్క మాటా మాటాడకపోతే / కొట్టడానికి సిద్ధమై కర్ర ఝళిపిస్తారు

ఒకడు నేను తెలివిలేని గాడిదనంటాడు
మరొకడు మాటాడేందుకు ఒప్పుకోడంలేదని అరుస్తాడు
మూడోవాడు దేవుడి పేరు చెప్పమంటాడు
ఆత్మారాం , చెప్పు చెప్పు, పేరు చెప్పు అంటాడు

విధీ! నువ్వు ఈ నిర్బంధానికి నా జీవితాన్నిచ్చావు
నాకు గొంతునిచ్చావు బలవంతాన వాడడానికి
కానీ నా సగం అవసరాలే తీర్చావు / విధీ! నీదంతా పరితాపం

నాకు రెండు శక్తులు నువు ఇచ్చావు
మధురమైన స్వరం, తెలివైన రుచి
అవి నాకు తెచ్చిపెడుతున్న / ఈ ఖైదు, దుర్భాష, బెదిరింపులనుండి రక్షించు

నన్ను బంధించి, సంకటపర్చి / ఉత్సాహంగా ఆటలాడతాడు మనిషి
ఎంత క్రూరమైన అపరాధాలివి/కరుణామయుడా నాకు విముక్తికల్గించు

మానవజాతి అంతా ధర్మానికి శత్రువులు
వాళ్ల గుండెలు ఎండేవరకూ మంచిని వినియోగించుకుంటారు
రెక్కలున్న శ్వాస లాక్కుపోయేవరకూ
మనిషికి సంతృప్తి ఎప్పుడూ ఉండదెందుకు

ఈ భూమిమీద ఒక్క మనిషైనా ఉన్నంతవరకూ
మనుషులందరూ కనబడనంతవరకూ
దీనమైన చిలుకల్ని పుట్టించొద్దు / ఓ దేవుడా, దయచేసి నా ప్రార్థన విను

**బాలక్రిష్ణ శామ (1903–1981) :** అసలుపేరు బాలక్రిష్ణ శంషేర్ ఝంగ్ బహాదుర్ రాణా. రాజ వంశీకుడు. సహజంగానే అన్ని భోగ భాగ్యాలు అనుభవించారు. 1933 నుండి సాహిత్య వ్యాసంగంలో పడ్డారు. అందరితో తానూ సమానమేనన్న భావాన్ని కలగజేయటానికి అప్పుడే తన పేరును బాలక్రిష్ణ శామగా మార్చుకున్నారు. మొదట్లో నాటకాలే ఎక్కువగా రాసినా, కవిత్వాన్నీ అంతగానే ప్రేమించారు. చాలా కవితలు కవిత్వం మీదే రాసారు. అగ్నీ నీరు మీద రాసిన 17 పేజీల దీర్ఘ వచన కవిత వీరికి ఎక్కువ పేరు తెచ్చిపెట్టింది. అందులో కొంత భాగం.

**బంగారపు జ్వాల, వెండి నీరు/కెంపు తళుకు, వజ్రపుమంచు**
**వాటి ప్రతిఘటన కొత్త కాదు**
**వాటి ఐక్యమత్య లోపం, నిరంతర సంఘర్షణ**
**పోరాటం, తగాదా, యుద్ధం, చిత్తుగా**
**సంహారం, వధ ఇవన్నీ అనాదిగా సాగుతూనే ఉన్నాయి**

**లక్ష్మీ ప్రసాద్ దేవ్కోట (12 నవంబర్ 1909 – 14 సెప్టెంబర్ 1959) :** మహాకవిగా పేరుపొందిన లక్ష్మీ ప్రసాద్ దేవ్కోట తన 25 ఏళ్ల సాహిత్య జీవితంలో 40కి పైగా సాహిత్య గ్రంథాలొచ్చాయి. సాహిత్యంలో నాటకాలు, కథలు, నవలలు, అనువాదాలు, కవిత్వం, వ్యాసాలు, అలా అన్ని పార్శ్వాల్నీ వారు స్పృశించారు. 19 ఏళ్లకే పెళ్లి కావడంతో బాధ్యతలూ పెరిగాయి. వాటిని మోసే క్రమంలో అనేక కష్టనష్టాల్ని అనుభవించాల్సొచ్చింది. అప్పటి రాణా సామ్రాజ్యులతో పడక వారణాసిలో తలదాచుకోవాల్సొచ్చింది. తిరిగి నేపాల్కి వచ్చేలోగా కావల్సినవెన్నో కోల్పోయారు.


**లక్ష్మీ ప్రసాద్ దేవ్కోట**

రాణా, సామ్రాజ్యులకు వ్యతిరేకంగా ఏమీ చేయనన్న వాగ్దానంతోనే నేపాల్లో అడుగుపెట్ట గలిగారు. లఘు కవితల నుండి మొదలుకొని బృహత్ కావ్యాల వరకూ రాసారు. అత్యంత ప్రజాదరణ పొందిన కావ్యం మూనా మదన్. అత్యంత విషాదభరిత కాల్పనిక కావ్యం. ఇప్పటికే కొన్ని వేల ప్రతులు అమ్ముడుపోయాయి. ఇప్పటికీ అమ్ముడుపోతూనే ఉన్నాయి. మదన్ వ్యాపారంచేసి ముసలి తల్లి కోరికలు తీర్చేందుకు టిబెట్ పయనమవుతాడు. తిరిగిరాలేడన్న భయంతో, భార్య మూనా వెళ్లొద్దని వారిస్తుంది. టిబెట్లో అనుకున్న దానికంటే ఎక్కువ కాలం గడిపి, తిరుగు

ప్రయాణంలో కలరా బారిన పడతాడు. ఎవరో టిబెట్ వాసుడు రక్షిస్తాడు. ఈ మధ్యలో మదన్ మార్గ మధ్యలో మరణించాడన్న వార్త ఇంటికి ఎవరో చేరవేస్తారు. అది విని తల్లి, భార్య ఇద్దరూ తట్టుకోలేక మరణిస్తారు. తిరిగొచ్చిన మదన్, తల్లి భార్యను కోల్పోయిన దుస్థితితో చివరికి మరణిస్తాడు. స్థూలంగా ఆ కావ్యంలోని కథ యిది. మనిషిని గుర్తించాల్సింది/ కులాన్ని బట్టికాదు/ హృదయాన్ని బట్టి అన్న ఆ కావ్యంలోని పంక్తుల్ని వాడని నేపాలీలు ఉండరంటే అతిశయోక్తికాదు. నిజానికి ఆధునిక నేపాల్ కవిత్వానికి ఒక దశ దిశ నిర్దేశం చేసిన వానిగా లక్ష్మీ ప్రసాద్ దేవ్కోటని పేర్కొంటారు.

**కవిత్వం చిత్రలేఖనం :**

**కలల ఆకృతి కావల్సినపుడు నేను కవిత్వం రాస్తాను**
**కలలాంటి ఆకారం కావల్సినపుడు నేను చిత్రిస్తాను**
**నువ్వు నాతో మాటాడాలనుకున్నపుడు నేను కవిత్వం రాస్తాను**
**నాతోబాటు నువు నవ్వాలనుకున్నపుడు నేను చిత్రిస్తాను**
**నీకోసం దుఃఖిస్తున్నపుడు నేను కవిత్వం రాస్తాను**
**నువ్వు నాకోసం దుఃఖించాలనుకున్నపుడు నేను చిత్రిస్తాను**
**నీ హృదయాన్ని తాకాలనుకున్నపుడు నేను కవిత్వం రాస్తాను**
**నీ దృష్టిని ఆకర్షించాలనుకున్నపుడు నేను చిత్రిస్తాను**
**జీవించడం కోసం మరణిస్తున్నపుడు నేను కవిత్వం రాస్తాను**
**నిర్జీవానికి జీవం పోయాలనుకున్నపుడు నేను చిత్రిస్తాను**
**చంద్రుడు చంద్రకాంతిలాగ - అంచాత**
**కవిత్వం చిత్రలేఖనం, ఒకదానివెంట ఒకటి నడుస్తాయి**
**కవిత్వంలో ఆత్మ చిత్రలేఖనం / చిత్రలేఖనంలో ఆత్మ కవిత్వం**
**కావున నా ప్రియా - / నా కన్ను నీ చిత్రలేఖనం**
**నీ కవిత నా హృదయం**



సిద్ధిచరన్ ప్రేష్ఠ

**సిద్ధిచరన్ ప్రేష్ఠ (1912-1992) :** విప్లవ భావాలున్న కవి. 1934 లో కాఠమండూ లో వచ్చిన భూకంపం మీద రాసిన కవితతో కవిత్వం మొదలైంది. జైలులో ఉండగా రాసిన *విశ్వ వ్యథ* వీరికి పేరు తెచ్చిన కవిత. 1940 లోని రాజకీయ సంఘర్షణని చిత్రిస్తూ రాసిన కవిత, *ఏ పొగా పొయ్యిల్నుండి రావడం లేదు* అత్యంత ప్రజాదరణ పొందింది.

**నా దగ్గర సమయం లేదు / మరణమా నన్ను పిలవొద్దు**
**పగిలిన తలనుండి / రక్తాన్ని తుడిచేందుకూ సమయం లేదు**

**స్త్రీ! ముందుకు సాగుతున్న నా అడుగుల్ని ఆపొద్దు**
**నీ తీయనిమాటలకు నా దగ్గర సమయం లేదు**
**చూడు, నా దేశ ప్రజలు / తిండి మాని పోరాడుతున్నారు**
**వారి పొయ్యిల్నుండి ఏ పొగా రావడం లేదు**

**కేదార్ మాన్ వ్యథిత్ (1914-1998) :** నేపాలీ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నందుకు వీరిని 1940 నుండి 1945 వరకూ నిర్బంధించారు. జైలులో ఉన్నప్పుడే వీరి కవిత్వ యాత్ర మొదలైంది. చాన్నాళ్లు ప్రవాస జీవితం కూడా గడపాల్సొచ్చింది. 1950-51 విప్లవం తరువాత వీరి రాజకీయ జీవితం ఊపందుకుంది. 1962 లో రవాణా సమాచార శాఖ మంత్రిగా, మంత్రి పదవిని కూడా పొందారు. 23 కవిత్వ సంకలనాల్లో 16 నేపాలీలోను, 4 నేవారీలోను, 3 హిందీలోను వచ్చాయి. కాల్పనికుడు, నీతి బోధకుడు, మార్మికుడు, సమాజవాది, అరాజకవాది కూడా. ప్రసిద్ధ హిందీ కవి దినకర్‌తో వీరిని ఎక్కువగా పోలుస్తారు. వీరి కవిత్వంలో సంస్కృత పదాలు ఎక్కువగా ఉంటాయని వీరిని విమర్శిస్తుంటారు. వీరికి పేరు తెచ్చిన రెండు కవితలు చీమలు, *శిల్ప సాధన* లో ఒక కవిత -

**శిల్ప సాధన :**

**ఠక్ ఠక్ ఠక్ శబ్దంతో / నెమ్మదిగా ఉలితో చెక్కుతూ**
**అడపాదడపా ఆగి, శిల్పి శిల్పాన్ని చూసుకుంటాడు**
**అప్పుడప్పుడు అలుకతోను, ఆనందంతోను, గంభీరంగాను**
**చైత్రం పదిహేనున / పశుపతి ఆలయం ముందు**
**ఒక గొప్ప ఊరేగింపు వెడుతుంది / హక్కులకోసం ఘోషిస్తూ**
**అన్ని దిక్కులా పాండవుల గర్జనతో / గీతా గానం వినిపిస్తుంది**
**ఒంటిగంటన్నరకు ధర్మోపదేశాలతో**
**ఆనందకుటి దగ్గర బుద్ధజయంతి కార్యక్రమాన్ని**
**రేడియో ప్రకటిస్తుంది / అయినా శిల్పి**
**ఠక్ ఠక్ ఠక్ శబ్దాలు ఆగిపోవు**
**రోమునుండి పోపు క్రిస్టమస్ సందేశాన్ని పంపినా**
**కొన్ని ఆసియా దేశాలు రక్తంతో తడుస్తున్నా / కాగితం పేజీల్లోనే**
**విదేశాలకు బైబిల్ వెడుతుంది / కానీ బుద్ధుడు , క్రీస్తు, క్రిష్ణుడు**
**ఠక్ ఠక్ ఠక్ శబ్దాలకు ఆశీస్సులందజేస్తుంటారు**
**గాంధీ విగ్రహం / నవ్వుకుంటూ 'ఆమెన్' అంటూ ఉంటుంది**

ఇంకా గోపాల్‌ప్రసాద్ రిమల్ (1918-1973), మోహన్ కొయిరాల (1926-2007), బైరాగి కైన్ల (1939), పారిజాత్ (1937-1993) (ఈ కవయిత్రి అసలు పేరు బిష్ణు కుమరి వైబా), భూపి షేర్చన్ (1936-1989), కవయిత్రి బానిరా గిరి (1946-) మొదలైన వారెందరో నేపాలీ కవిత్వాన్ని సుసంపన్నం చేసారు. వీరుకాక-భైరవ ఆర్యల్ (1936-1976), హరిభక్త కతువల్ (1935-1980), ఈశ్వర్ బల్లభ్ (1937), హెం హమల్ (1941), కిష్ణభుషన్ బల్



బానిరా గిరి

(1947–), బిమల్ నిభ (1952–), ఆషేష్ మల్ల (1954), మింబహాదూర్ బిష్ఠ (1954–), అవినాష్ శ్రేష్ఠ (1955–), బిష్ణుబిమోహన్ శ్రేష్ఠ 1956–), మస్తిష్కం పక్షవాతం మూలాన కాళ్లతో కవిత్వం రాస్తున్న ఏకైక కవయిత్రి ఝుమక్ కుమారి ఘిమిరె (1980–) మొదలైనవారు నేపాలీ కవిత్వంలో కొత్త ధోరణులకు శ్రీకారం చుడుతున్నారు.

ఆశ్చర్యంగా నేపాలు రాయల్ గ్రంథాలయంలో, మహామహోపాధ్యాయ్ హరిప్రసాద శాస్త్రి గారికి లభించిన, పదవ శతాబ్దానికి చెందిన, చార్యగీతి మార్మిక కవిత్వమే బెంగాలీలో మొదటి కావ్యం కావడం విశేషం.

**శ్రీలంక :** పేరుకు తగ్గట్టుగా దక్షిణ హిందూమహా సముద్రంలో కీలకమైన ప్రాంతంలో మట్టితో కట్టిన కట్టులా ఆ దేశం ఒక లంక, ఒక ద్వీపం. ప్రాచీన గ్రీకు భూగోళశాస్త్రవేత్తలు ఆ ద్వీపాన్ని తాప్రబానె అని పిలిచేవారు. అరబ్బులు సెరెండిబ్ అని, యూరోపియన్లు సిలోన్ అని పిలిచేవారు. సిలోన్ ఇప్పటికీ వాడుకలో ఉన్నా 1972 నుండి అధికారికంగా శ్రీలంక గా ప్రకటించబడింది. సింహళ సంస్కృత పదమే యూరోపియన్ల రాక తరువాత సిలోన్ గా మారింది. ఉత్తర భారతదేశం నుండి మొదటిసారిగా వలసవచ్చిన ఆర్య యువరాజు విజయ సింహ సంతతికి చెందినవాడు కావడం మూలాన ఆ ప్రాంతానికి సింహళ అన్న పేరొచ్చిందని చెప్పుకుంటారు. క్రీ.పూ. ఆరవ శతాబ్దం నుండీ అక్కడ నాగరికత అవశేషాలున్నాయి. భారతదేశం నుండి అక్కడికి బౌద్ధం, హైందవం రెండూ అంతే బలంగా ప్రవేశించాయి. సనాతన బౌద్ధాన్ని ఇప్పటికీ అక్కడ చూడొచ్చు. ఆ దేశం వివిధ ప్రాంతాలనుండి, అడపాదడపా దక్షిణ భారత దేశంనుండి దండయాత్రలతో, భూస్వామ్య రాజరికంలో మగ్గిన శ్రీలంకను యూరప్ నుండి వలసవాదులు మూడుసార్లు ఆక్రమించారు. పదహారవ శతాబ్దంలో పోర్చుగీసులు, 1656 లో పోర్చుగీసుల్ని తరిమి డచ్ వాసులు, 1756 ప్రాంతాన్ని ఆంగ్లేయులు ఆక్రమించారు. అంతకుముందు రెండువేల సంవత్సరాల క్రితం రాజుల పరిపాలనలో ఉన్నవి చాలా వరకు అంతరించిపోయాయి. 150 ఏళ్ల ఆంగ్లేయుల పాలన తరువాత 1948లో స్వతంత్ర దేశంగా శ్రీలంక అవతరించింది.

శ్రీలంక సాహిత్యం ఎక్కువ భాగం సింహళంలోనే ఉన్నా, పాళీ, తమిళం, ఆంగ్లంలో కూడా ఉంది. బ్రాహ్మీలిపి, పాళీ, సంస్కృతం ఈ భాషకు ఆధారాలు. సింహళ భాషకు మరోపేరు హెలభాష. శ్రీలంకలో క్రీ.పూ. 29 లో జరిగిన నాలుగవ బౌద్ధ సభల్లోనే, శతాబ్దాలుగా పాళీ భాషలో భద్రపరచబడ్డ, తిపిటక మొదటిసారిగా రాయబడింది. ఆసియాలో అన్ని దేశాలకంటే ఎక్కువగా 92శాతం అక్షరాస్యత ఉన్న దేశం శ్రీలంక. బౌద్ధ కథలు ముఖ్యంగా జాథక కథల ప్రభావం వారి సాహిత్యంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఫలితంగా కవిత్వం కంటే వచనం ఎక్కువ ప్రాచుర్యంలోకి వచ్చింది. 10వ శతాబ్దం తరువాత సంస్కృత కావ్య ప్రభావానికి లోనైనా అక్కడ సింహళ పండితులకు అదంత అంగీకారం కాలేదు. సంస్కృత సాహిత్యంలో ఆ ప్రాంతాన్ని సింహళం అని, అక్కడివారిని సింహళీయులని చూస్తాం. పాలీ సింహళ భాషలు కూడా వాడుకలో ఉన్నా, దక్షిణ తూర్పు ప్రాంతాల్లో తమిళం ఎక్కువగానే ఉన్నా, అక్కడివారు వారిని, వారి భాషని సింహలీస్ గానే చెప్పుకుంటారు. క్రీ.పూ. 250లో శ్రీలంకలో ప్రవేశించిన బౌద్ధం వేళ్లూనుకుని అక్కడి జాతీయ మతమయింది.



మహిందా థేర

గంజమస్ నోనా (10 మార్చ్ 1746 – 15 డిసంబర్ 1814) అసలుపేరు డోనా ఇసబెల్ల కోరనెలియ–శ్రీలంక ప్రథమ కవయిత్రి. మొదటి భర్త చనిపోయాక, రెండవ భర్తకూడా చనిపోయాక, ముగ్గురు పిల్లలతో అనేక ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక మొదలైన కవిత్వయాత్ర, ఆమెకు అప్పటి ప్రభుత్వంనుండి భూమిని, సహాయ సహకారాల్ని తెచ్చిపెట్టాయి. ఎనిమిదేళ్లప్పుడే ఆమె ఆసువుగా చెప్పిన కవిత –

**నీటితో నింపి నూతి ఒడ్డున పెట్టిన / నా చిన్న బంగారు నీటి తొట్టెని బుద్ధుని అయిదవ, ఎనిమిదవ సూత్రాలైనా / తెలియని తుంటరి దాచాడు దయచేసి నా నీటి తొట్టెనివ్వరా, నేను ఇంటికి వెళ్లాలి**

**అరిసెన్ అహుబుదు (18 మార్చి 1920–26 మే 2011) :** అసలు పేరు అరియసేన ఆసుబోద. సామర్థ్యం గల రచయిత, వక్త, పండితుడు, జ్యోతిష్కుడు,నాటకకర్త, అధ్యాపకుడు, భాషాశాస్త్రవేత్త, ప్రముఖ కవి అలా బహుముఖ ప్రజ్ఞాశాలి. సంస్కృత భాషా ప్రభావం సింహళ భాషలో లేకుండా విశేష కృషి చేసారు. పిల్లల పాటలతో బాటు, జాతీయభావాల్ని ఇనుమడించే అనేక పాటల్ని రాసారు. 'లంక లంక' పేరుమీద రాసిన పాట శ్రీలంకకు అనధికార

జాతీయగీతంగా అందరూ భావిస్తారు. చైనాకు శాంతి సందేశాన్ని తీసుకుపోయిన పావురం ఇతివృత్తంతో సందేశాత్మక దీర్ఘ కవిత అహుబుదుకు మంచిపేరు తీసుకొచ్చింది. సింహళ వంశ కథ పేరు మీద వృత్తాంత కవిత్వానికి కూడా అంతే పేరొచ్చింది. శ్రీలంక ప్రభుత్వం వీరిని కళాసూరి బిరుదుతో సత్కరించింది.

మరికొందరు ముఖ్య కవుల్లో–విమలరత్నె కుమరగమ (18 జనవరి 1919–30 డిసెంబర్ 1962), గుణదాస ఆమరశేకర (1929–) 50 ఏళ్లకు పైగా రాస్తున్న ప్రముఖ మొదటితరం కవి, కథా నవలా రచయిత. మహాగామ శేకర (7 ఏప్రిల్ 1929–14 జనవరి 1976) బౌద్ధ ప్రభావంతో ఆధునిక కవిత్వం రాసిన కవి. ఫ్రెంచ్, ఆంగ్లం, జపాన్ హైకూల ప్రభావం కూడా వీరి కవిత్వంలో కనిపిస్తుంది. వీరు కూడా కథలు, నవలలు రాసారు. కుమారతుంగ మునిదాస (25 జూలై 1887–2 మార్చి 1944) సింహళం, ఆంగ్లం, సంస్కృతం, పాళీ, తమిళం, గ్రీక్, మలయాళం, లాటిన్ లాంటి అనేక భాషల్లో ప్రావీణ్యం ఉన్న కవి. హేల హవుల కూటమి (శుద్ధ సింహళ కూటమి) ని స్థాపించి సింహళ భాషా వ్యాప్తికి శ్రమించిన కవి. టిబెట్ జాతిక ఎస్. మహిందా హిమి లేదా ఎస్. మహిందా థేరోగా పిలవబడే సెర్కీ మహిందా (1901–16 మే 1951) టిబెట్లో జన్మించి బౌద్ధ బిక్షువుగా 14 ఏళ్ల ప్రాయం నుండి శ్రీలంకలో స్థిరపడి, సింహళంలో రాసి పేరుపొందిన ప్రముఖ కవి. అతని అసలు పేరు పెంపా టెండుపి సెర్కీ చెరిన్. ఆంగ్లేయులనుండి శ్రీలంకను విముక్తి చేయించడంలో కూడా తనదైన పాత్ర పోషించారు. ఈ కవిత ఒక ఉదాహరణ.


ఆరియవన్స రణవీర

**స్వాతంత్ర్యం సముద్రం లాంటిది**
**నా ప్రియమైన బిడ్డా, నువ్వు దాని ఊటవి / అది గుర్తుంచుకో**
**వివిధ విపత్తులనుండి మాతృదేశాన్ని కాపాడే బాధ్యత**
**నెరవేర్చేందుకు ప్రయత్నించు**

**ఆరియవన్స రణవీర (1944–) :** వెయ్యికి పైగా కవితలు రాసారు. చైనా జపాన్ కవితల ప్రభావం వీరి కవిత్వంలో కనిపిస్తుంది. కవిత్వం రాయడం 40వ ఏట మొదలయింది. జీవిత సత్యాల్ని సహజంగా, సున్నితంగా చెప్పడాన్ని, సామాన్య పాఠకుడికి సైతం వీరి కవిత్వం చేరుతుంది.

**విన్నపం:**
**లేదు లేదు ఫరవాలేదు / నాకు తెలుసు**
**నీకున్నపనులతో నీకు తీరికుండదు / ఎపుడన్నా, నీకు వీలుంటే**
**ఎక్కడ పడున్నా వాటిని తీసుకుని / ఒక్కొక్కటిగా దుమ్ముదులిపి**
**నీకోసం రాసిన నా కవితల్ని చదువు / తొందరలో చదవొద్దు**
**ప్రతి శబ్దం నిశ్శబ్దమైనాక / నీ గదిలో దీపం వెలిగించి**
**ఆ మెత్తని వెలుగులో ఏకాంతంగా నా కవిత్వం చదువు**

**పొరుగింటివారు:**
**ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పక్షులన్నింటిదీ**
**ఒకే స్వరమై / ఎన్నడూ లేని శ్రావ్యతతో**
**మీ ఇంటిచుట్టూ పోగై పాడనీ / ఎరిగిన అన్ని పూల సుగంధాల వ్యాప్తిలో**
**మీరలా కొట్టుకుపోయేట్టు**

**కాలవిముక్తి:**
**భయంతో భుజాలమీంచి చూడకుండా**
**ఎదురులేకుండా నదులు ప్రవహిస్తూనే ఉంటాయి**
**పక్షుల బృంద సంగీతాన్ని వింటూ**
**ఆగుతూ కదులుతూ బద్ధకంగా గాలి వీస్తూనే ఉంటుంది**

1970 దశకంలో ప్రజా కవిత్వం వచ్చింది. దానికి ఆద్యులు–మోనిక రువంపథిరన, పరాక్రమ కొడితువక్కు బుద్ధదాస గలప్పట్టి.

**భిక్షాటనలో భిక్షువు:**
**పొర్లుతున్న కొండలమీద సూర్యుడు నవ్వుతుంటే**
**దిగువ లోయలో గ్రామం / జీవంతో నిద్రలేస్తుంది**

**కొండమీంచి గమనిస్తుంటే/చలిలో వణుకుతూ తేయాకు తోటల్లో**
**తేయాకు తెంపుతున్న స్త్రీ కనిపిస్తుంది**
**రివాజుగా వేకువ ధ్యానం పూర్తయాక**
**భిక్షాటన కోసం నెమ్మదిగా / ఇంటింటికీ పయనమవుతాను**

**చిన్నారులు పాకుతూ వచ్చి తొంగి చూస్తారు**
**వారి మొహాలమీది రాతల్ని వారెప్పుడూ చెప్పరు**
**కుటీరానికి తిరిగొచ్చాక**
**దొరికిన రొట్టెతో నా ఉదయపు భోజనం పూర్తవుతుంది**

**మర్నాడు భిక్షాటనలో/ఏడుస్తున్న చిన్నారుల గుడిసెముందు ఆగి**
**ఏడుస్తూ బయటకొస్తూ లోనికిపోతున్న ఒక చిన్నారిని**
**ఆపి పిలిచి దాచి తెచ్చిన బిస్కట్ ఇచ్చాను**

**నా పాత్రలో తినదానికి ఏమీ లేకున్నా**
**నా కుటీరానికి తిరిగి చేరుకున్నాను/ఆ రోజు తేలికైన హృదయంతో**
**నాకు ఆకలే వేయలేదు**
– *బుద్ధదాస గలప్పట్టి*

**శ్రీలంకలో తమిళ కవిత్వం :** మాండలికాల్లో కొన్ని మార్పులున్నా శ్రీలంకలో తమిళం మాట్లాడేవారిలో తమిళులు, ముస్లిములు, మలయాహ కొండజాతి వారు ఉన్నారు. దగ్గర్లో ఉన్న తమిళ ప్రాంతంనుండి వలసవచ్చి శతాబ్దాలుగా శ్రీలంకలో స్థిరపడ్డా, 13 వ శతాబ్దం నుండే అక్కడ తమిళ

సాహిత్య చరిత్ర కనిపిస్తుంది. ఏలత్తు పూథంథెవనర్, శ్రీలంక తమిళ కవి పేరు, ప్రాచీన తమిళ సంగం కవిత్వంలో కనిపిస్తుంది. దాని మూలాన సంగం కవిత్వం నుండి శ్రీలంక తమిళ కవిత్వం ఉందని కొందరు వాదిస్తారు. కాని దానికి చారిత్రక ఆధారాలు లేవు. 1940 తరువాతే నిష్కర్షగా తమిళ కవిత్వం శ్రీలంకలో కనిపిస్తుంది. సింహళం జాతీయ భాష కావటం, బౌద్ధం జాతీయ మతంగా గుర్తించటం, అక్కడ అల్పసంఖ్యాక వర్గాల్లో ముఖ్యంగా అక్కడి తమిళ భాషీయులకు, ఇతర మతాలవారికి ఏ కోశానా ఇష్టం లేదు. ఫలితంగా దాడులు, ప్రతి దాడులు, హింసలు ప్రతి హింసలతో ఒక భయానక వాతావరణం నెలకొంది. పీడన ఉన్నచోట మార్క్సు ప్రభావితులూ అయారు. ఏదైతేనేమి అల్పసంఖ్యాక వర్గాలే అక్కడకూడా అన్ని విధాలా హింసింపబడ్డది, నష్టపోయిందీనూ. కొందరు అక్కడే ఉండి వాటిల్లో భాగమై కవిత్వం రాసారు, కొందరు వలసలుపోయి రాసారు. అలా రాసినవారిని ఆరు తరాలుగా విభజించి చూడొచ్చు.

1940 నుండి రాస్తున్న మహాకవి కందస్వామి, వరదార్, పురద్చిక్ కమల్ తరం; 1950 నుండి మహాకవి మురుగైయన్, నీలవనన్; 1960 నుండి ము. పొన్నంబలం, ఎం.ఎ. నుహ్మాన్, షన్ముగం శివలింగం, థా. రామలింగం 1970 నుండి మార్క్సిష్టు భావజాలంతో రాసిన శివసెగరం, జెసురజహ్, పుష్పరజహ్ ముఖ్యులు; జయపాలన్, చేరన్, ఎస్. విల్వరత్నం, ఎలవల్, విజయేంద్రన్, సబేసన్ అయిదవ తరానికి, సోలైక్కిలి, వాసుథేవన్, జబార్, నిలంథన్, అస్వగొష్, జెయసంకర్, ఆత్మ, రష్మీ, ఏలైయ అబ్దుల్ల, వినోథిని, సొలైక్కిలి , అహిలన్ ఆరవతరానికి చెందిన యువ కవులు. నత్చుథిరన్ సెవ్వింథియన్, కే.పి. ఆరవింథన్, బాలగనెష్, ఎస్.పి. కనేషన్, సిద్ధివినాయగం, గొవర్ధనన్, ఏ. కందసామ్యి, చక్రవర్తి మొదలైన కవులు ఇతర దేశాల్లో తలదాచుకుని రాస్తున్న వారు. అప్పటి అక్కడి స్థితిగతుల ననుసరించే ఎప్పటికప్పుడు అక్కడి కవిత్వం వచ్చింది. మచ్చుకి కొన్ని –

**అమ్మా ఏడ్వొద్దు**

**నీ దుఃఖాన్ని మోయడానికి కొండలూ లేవు**
**నీ కన్నీటిని కలుపుకోటానికి నదులూ లేవు**
**నీ చేతుల్లో అతను బిడ్డని పెట్టిన వెంటనే తుపాకీ పేలింది**
**నీ గిన్నెలో మట్టిలో రక్తం చిమ్మింది**
**పేలిన ఆ బాంబు వేడికి ఆశించిన నీ కలలన్నీ మాడిపోయాయి**
**విరిగిన నీ అందెనుండి చెదిరినవి / ముత్యాలూ కావు, కెంపులూ కావు**
**రక్తం తప్పు తెలుసుకుందుకు / పాండ్యన్ రాజూ ఇంక లేదు**

**నిద్రలేని రాత్రుల్లో**

**అప్పా అని అవిశ్రాంతంగా బిడ్డ అరుస్తుంటే ఏమి చెబుతావు**
**నీ రొమ్ములకత్తుకుని చంద్రుడిని చూపిస్తూ**
**మీ అప్పా దేవుడి దగ్గరున్నాడని మాత్రం చెప్పొద్దు**
**ఈ దుఃఖానికి అంతం లేదని చెప్పు / వరదలై పారుతున్న రక్తం కథలు చెప్పు**
**అన్ని భయాల్ని పోగొట్టాలంటే యుద్ధం చేయాలనీ చెప్పు** – *చేరన్*

**కాందిశీకుడు**

**నా కొడుకు జాఫ్నాలో / నా భార్య కొలంబోలో / మా నాన్న వన్నీలో**
**ఈ ముసలి వయస్సులో / మా అమ్మ తమిళనాడులో**
**బంధువులు ఫ్రాంక్ ఫర్ట్‌లో / ఒక సోదరి ఫ్రాన్స్ లో ఉన్నారు**
**కానీ నేను ఓస్లోలో / అలాస్కాకి దారితప్పిన ఒంటెలా**
**మా కుటుంబం? / గాలికి చింపి విసిరిన దూది దిండా?**
**ప్రారబ్ధంకొద్దీ కోతి?** – *జయపాలన్*

**రేపొక మనిషొస్తాడు**

**భూగోళపు దిశల్ని అలంకరించడానికి / రేపొక మనిషొస్తాడు**
**ప్రపంచాన్ని పాలించే విజ్ఞాని / ఒకే కులం, ఒకే రంగు**
**ఒకే మతం, ఒకే భాష / ఒకే న్యాయం, ఒకే హోదాతో ..**

**ఆకాశం కప్పుకింద / ప్రపంచపు పెద్దింట్లో / తన బిడ్డలానే**
**మానవజాతి బిడ్డల్ని హత్తుకుందుకు / రేపొక మనిషొస్తాడు**
– *పురద్చిక్ కమల్*

**బుద్ధుని హత్య**

**గతరాత్రి కలగన్నాను / న్యాయ పాలక పోలీసులు**
**బుద్ధుణ్ని హత్య చేసారని / జాఫ్నా గ్రంథాలయం మెట్లమీద**
**రక్తమోడుతూ అతని శరీరం / చీకటి ముసుగులో మంత్రులొచ్చారు**
**మన జాబితాలో అతను లేడు కదా / అతన్నెందుకు చంపారు**
**కోపంగా అడిగారు / లేదు సార్, తప్పు చేయలేదు**
**అతన్ని చంపకుండా ఈగనైనా చంపలేము**
**అందుకని – నసిగారు పోలీసులు**

**సరే ఆ శవాన్ని దాచేయండి / మంత్రులు చెప్పిపోయారు**
**సాధారణ దుస్తుల్లో వారు / గ్రంథాలయంలోకి శవాన్ని ఈడ్చి**
**తొంభయి వేల పుస్తకాలతో కప్పి నిప్పంటించారు**
**ధమ్మపదంతో బాటు కరుణామయుడూ బూడిదయాడు**

(1981 హింసల్లో దక్షిణాసియాలోనే అతి పెద్ద జాఫ్నా పౌర గ్రంథాలయంలోని 90 వేల పుస్తకాలు, అరుదైన పత్రాలు, బౌద్ధ గ్రంథాలు అగ్నిలో ఆహుతయినపుడు) – *ఎం.ఎ. నుహ్మాన్*

**క్రిషాంథి**

**పక్షుల పాటలతో / సూర్యుడు సముద్రంలో పడిపోయాక**
**ఆమె మరణించింది / ఖాళీగా ఉన్న తెల్లటి ఇసుకమీద**
**దాని గురించి ఎవరికీ తెలియదు**
**ఆడ పుట్టుక పుట్టినపుడు**

అటువంటి అంతాన్ని ఆమె ఊహించి ఉండదు / ఆమె తల్లైనా
మొదట వాళ్ల చూపులు ముళ్లులా గుచ్చుకున్నాయి
తరువాత వారి భయంకర చేతులు ఆమెను లాక్కున్నాయి
ఏ శబ్దమూ రాలేదు / ఆమె మూర్ఛపోయింది
తెలివి తప్పిన ఆ శరీరాన్ని వారు చెరిచారు
అది జరిగింది / ఖాళీగా ఉన్న తెల్లటి ఇసుకమీద
ఆమెని దహనం చేసింది ఉప్పటి దహనవాటిక అంచున
ఆమె పుట్టినపుడు / ఆ అంతాన్ని ఆమె ఊహించిందా?

(బడికిపోతున్న చిన్నారి క్రిషాంథిని సైన్యం చెరిచి చంపినపుడు) – *వినోథిని*

**నాజాతి కలంతో ఏడుస్తూ**

చంద్రుడికి కంచె వేయు / సూర్యుడిని విభజించి పంచు
నక్షత్రాల్ని లెక్కించు / వాటిని జాతుల దామాషాలో పంచు
మనం నాగరికకాలంలో మనుషులం / సముద్రాన్ని కొలిచి తీసుకో
ఆకాశాన్ని ముక్కలు చేయు / అనుకూలిస్తే గాలిని అపహరించు, లేదా
సోదరజాతిని తుఫానుతో నాశనం చేయు
మనలో ఒకరు బహుశా బృహస్పతికి చేరొచ్చు
చీమలకు కూడా జాతుల ముద్రవేయు / చెట్లకు కులం మతం నేర్పు
పావురం మరో జాతిని చూసి నవ్వనీ / బల్లి, నత్త, కప్ప, పురుగుల శబ్దాలు
ద్వేషాన్ని ప్రతిఫలించనీ / సీతాకోక చిలుకా రా!
నీ జాతి పుష్పం ఇది, అనుభవించు
మానవజాతి విడిపోతున్న విధానానికి జాలిపడాలి
ఈ కవిత రాస్తున్నపుడు / నేను నీ జాతికి చెందనని
నాకలం నిరాకరిస్తోంది
అవునూ! అది మరో జాతికి చెందిందా? – *సొలైక్కిలి*

శ్రీలంక జనాభాలో 8 శాతమే ముస్లిములున్నా, వారిలో కొందరు తమిళం, కొందరు అరబ్బీ మాట్లాడే వారున్నారు. బౌద్ధం ప్రబలంగా ఉన్నా, అక్కణ్ణించి పేరొందిన సూఫీ కవి బావా ముహైయుద్దీన్ (1900?-1986) కూడా ఉండటం విశేషం.

**మాల్దీవులు :** ఉత్తర మధ్య హిందూ మహాసముద్రంలో, సముద్రయానానికి కీలకమైన ప్రాంతంలో, శ్రీలంకకి పశ్చిమ తీరాన, భారతీయ ద్వీపఖండానికి దక్షిణాన ఉన్న దాదాపు 1200ల పగడాల దీవుల ద్వీపకల్పం. మాల్దీవుల అసలు పేరు మహిలద్వీపిక లేదా మాలాద్వీపం. క్రీ.పూ. 300 సంగం కాలం నుండి, మత్స్యకారులు ముందుగా మలయాళీలు, తరువాత, తమిళులు, సింహళీయులు అక్కడ నివాసాలు ఏర్పర్చుకున్నారు. 12వ శతాబ్దానికి నావికులుగా తూర్పు ఆఫ్రికా నుండి, అరబ్ దేశాలనుండి మరి కొంతమంది చేరారు. అశోక చక్రవర్తి కాలం నుండి 1400 ఏళ్లుగా బౌద్ధంతో మొదలైన దేశం, 1153 నాటికి ఇస్లాం మతానికి మార్చబడింది. 1153 నుండి 1968 వరకూ సుల్తాన్ల రాజ్యమైంది. 1558-73 నుండి పోర్చుగీస్, 17వ శతాబ్దం మధ్య నుండి 1796 వరకూ డచ్, 1887 నుండి 1965 వరకూ ఆంగ్లేయుల పాలన అక్కడ సాగింది. మరో మూడేళ్లు ఆంగ్లేయులున్నా 11 నవంబరు 1968 నుండి ఇప్పటి మాల్దీవుల గణతంత్ర ప్రభుత్వమే కొనసాగుతోంది. సింహళ భాషకు దగ్గరగా ఉన్నా కుడినుంచి ఎడమకు రాసే ధివేహి వారి జాతీయ భాష. తరువాత ఎక్కువగా వాడేది ఆంగ్లం. హిందీ అరబ్బీ కూడా మాట్లాడతారు.


ఆమినాథ్ ఫైజ

అక్కడి భాష ధివేహిలో కవిత్వం రాస్తున్న వారు కొందరైతే, ఆంగ్లం చదువుకుని లేదా ఇతర దేశాల్లో చదువుకుని ఆంగ్లంలో రాస్తున్న వారు మరికొందరు. అలా రాస్తున్న వారిలో-ఆమినాథ్ ఫైజ (29 సెప్టెంబరు 1924-25 ఫిబ్రవరి 2011) ధివేహి లో రాస్తున్న ప్రముఖ కవయిత్రి. కవిత్వంలో చేసిన కృషి కి ప్రభుత్వం ఎన్నోమార్లు సత్కరించింది. ఆ దేశానికి మొదటి అధ్యక్షుడు మొహమ్మద్ ఆమీన్ ప్రజాస్వామ్యవాది అంతాన్ని గుర్తుచేసుకుంటూ రాసిన ఆమె కవితలో కొంత భాగం -

ఇక్కడ, నేను సంబరాల దృశ్యాల్ని చూడలేను
నొప్పి బాధతో నా గుండె అసంఖ్యాక గాయాల్ని భరిస్తూనే ఉన్నాను
నా హృదయంలో తెలివితక్కువ శోకమేమీ లేదు
ఆ మహానుభావుడిమీద క్రూరమైన గాయాలు

రెహెంధి (25 డిసెంబర్ 1983-) ప్రముఖ యువ కవయిత్రి కవితలో ఒక భాగం -

**కొత్త రోజు**

సూర్యుడు వెలిగిపోతున్నాడు / అందమైన ప్రకృతికి తెరదించి
నేనిక్కడ కంప్యూటర్ ముందున్నాను / బయట ఉంటే ఎంత బాగుండును

మాల్దీవుల్లో మరికొందరు ప్రముఖ కవులు - హుసైన్ సలాహుద్దీన్ (14 ఏప్రిల్ 1881 - 20 సెప్టెంబర్ 1948), అబ్దుల్ రషీద్ హుసైన్, ఫరహ్ దీదీ, ఇబ్రహీం షిహబ్, జాదుల్లా జమీల్, మహమ్మద్ జమీల్ దీదీ (1 మే 1915 - 15 మార్చి 1989), హుసైన్ సలాహుద్దీన్ (14 ఏప్రిల్ 1881 - 20 సెప్టెంబర్ 1948) - వీరి ఏడుగురు పిల్లలూ కవులు కావడం విశేషం. బహుశా ప్రపంచ సాహిత్యంలోనే అరుదు.

ముకుంద రామారావు,
హైదరాబాదు. ఫోన్ : 9908347273

# జాషువా



*– రావినూతల సత్యనారాయణ*

**భూమిక:**

ఆంధ్రమాత 1894–1896 మధ్య కాలంలో అత్యంత ప్రతిభా సంపన్నులైన పుత్రులను, పుత్రికలను కన్నది. ఆ కాలంలో జన్మించిన ప్రతిభామూర్తులు తెలుగు సాహిత్య రంగాన్ని పరిపుష్టి చేయుటయే గాక, తెలుగు తల్లిని విలువైన ఆభరణాలతో ముంచెత్తారు. ఆలాంటి సాహితీవేత్తలలో కీర్తి శేషులు గుర్రం జాషువా గణనీయులు. నిరుపేద కుటుంబములో జన్మించి, సంఘర్షణాత్మక జీవితపు ఒడుదుడుకులకు లోనై, కుమిలిపోక ధైర్య సాహసాలతో, నిర్విరామ కృషితో సాహిత్య సామ్రాట్టై తెలుగు తల్లికి యెన లేని సేవలర్పించారు. తెలుగు సాహిత్యములో మణి మాణిక్యాలతో సరితూగే అనేక ఖండ కావ్యాలు – కావ్యాలు రచించి నవయుగ కవి చక్రవర్తిగా ఖ్యాతి గడించారు.

జాషువా రచనలు పరిశీలిస్తే, ఆయన కవితతో పాటు, కవితా వస్తువుతో పాటు ఆయన మనసు ఏవిధంగా మారుతూ వచ్చిందో, ఆయన లోకావృత్త పరిశీలన ఎలా వాడి తేరుతూ వచ్చిందో, విశ్వమానవ సౌభ్రాతృత్వంగా ఎలా పరిణతి పొందిందో విశద మౌతుంది. ఆయన అనుభవించిన కష్టాలు ఆయన హృదయాన్ని గట్టి పరిచాయేగాని – ద్వేష పూరితం కావించలేకపోయాయి! మీదు మిక్కిలి ఆయన హృదయంలో వేదనాగ్నిని సృజించి కరుణా మూర్తిగా రూపొందించాయి. జాషువా మనః ప్రవృత్తిని కరుణా రసంతో నింపి వైచాయి. పతితల హృదయాలను దోచే కవితా శిల్పానికి ఆయనను స్రష్టగా మార్చాయి. అందుకే నేమో ఆయనను "జాషువా, భేషువా, నవహృదయ మనోవేషువా'' అన్నారు పండితవర్యులు తిరుమల రామచంద్ర!

జాషువా తమ జీవిత కాలంలో పద్య కావ్యాలు, ఖండ కావ్యాలు, లఘు కావ్యాలు, స్వీయచరిత్ర వచన రచనలు, నాటకాలు – దాదాపు నలభై (40) దాకా రచించారు. అఖండ కీర్తిని ఆర్జించారు. లెక్క లేనన్ని బిరుదులు, సత్కారాలు పొందారు. తెలుగు సాహిత్య చరిత్రలో ధృవతారగా – చెరగని స్థానాన్ని సృష్టించు కొన్నారు.

**వారి ఖండ కావ్యాలు:**

*ఫిరదౌసి, ముంతాజ్ మహలు, నేతాజీ, గబ్బిలము* మొదలైనవి – వారి కీర్తి పతాకాన్ని అన్ని దిక్కులకూ ఎగిరించాయి! అవి, ఏరచన కారచన రసికులను అమితంగా ఆకర్షించాయి! వారు 1964 లో రచించిన *క్రీస్తు చరిత్ర* అనే కావ్యాన్ని – విశిష్ట రచనగా నిర్ణయించి కేంద్ర సాహిత్య అకాడమీ (ఢిల్లీ) వారు జాతీయ పురస్కారాన్ని అందజేసారు.

*క్రీస్తు చరిత్ర* కావ్యం యొక్క వైశిష్ట్యాన్ని వివరిస్తూ – ఆ పుస్తకములోని ముఖ్య విశేషాలు పాఠకుల ముందుంచడమే ఈ వ్యాసం ప్రధానోద్దేశం. జాషువాని గూర్చి పాఠకులకు ఒక అవగాహన కలగడానికి వీలుగా జాషువా సాహితీ ప్రస్థానం సంక్షిప్తరూపంలో విశ్లేషించడమైనది. దీనిని కేవలం పృష్ఠ భూమిగా గుర్తించి విజ్ఞులైన పాఠకులు హర్షిస్తారని ఆశిస్తాను.

**జాషువా సాహితీ ప్రస్థానం:**

జాషువా సాహితీ ప్రస్థానం ప్రారంభించే ముందు ఆయన జీవిత దృక్పథాన్ని గూర్చి, వారి ధ్యేయాన్ని గూర్చి కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుసు కొనుట ఆవశ్యకం. జాషువా తమ సాహిత్య వ్యాసాంగాన్ని 1920–1970 సంవత్సరాల మధ్య కాలంలో సాగించారు. చారిత్రకంగా

పరిశీలిస్తే, ఆంధ్ర దేశం లోని సామాజిక ఉద్యమాలు – జాతీయోద్యమమూ, ఆంధ్రోద్యమమూ, నాస్తికోద్యమమూ, బ్రహ్మసమాజ ఉద్యమమూ, హేతువాద ఉద్యమమూ, సామ్యవాద ఉద్యమమూ మొదలగు ఉద్యమాలన్నీ ఆ కాలంలోనే జరిగినై. ఈ ఉద్యమాలన్నిటిలోని ప్రగతిశీలకమైన అంశాలన్నీ, జాషువా దృష్టినాకర్షించాయి. వాటి ప్రభావం అంతర్లీనమై ఆయన సాహిత్య వ్యాసంగం లోనికి చొచ్చుకుని పోయింది. ప్రగతి శీలతను జాషువా విశ్వసించినట్లుగా మనకు గోచరిస్తుంది. నిరుపేద కటుంబంలో పుట్టిన జాషువాకి అసమత్వ వికృత రూపం స్వానుభవంగా ప్రత్యక్ష మయింది. తన నిజజీవితంలో అనుభవించిన రెండు వేదనలూ–ఒకటి కులానికి సంబంధించిన అణచివేత, మరొకటి పేదరికానికి సంబంధించిన అణచివేత విశేషంగా ఆయన హృదయాన్ని కుదిపి వేసినవి. ఈ విషయం జాషువా స్వయంగా పేర్కొన్నారు. "జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నాకు గురువులు ఇద్దరు. పేదరికం, కులమత భేదం. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచిందే గాని బానిసగా మార్చ లేదు. దారిద్ర్యాన్ని, కుల భేదాన్ని కూడా చీల్చినేను మనిషిగా నిరూపించుకోదలచాను. వాటిపై కత్తి కట్టాను.

అయితే నా కత్తి కవిత" అంటారాయన! అంతే కాక, తను కవిగా రూపొందిన విధానాన్ని చర్చిస్తూ– "ప్రసిద్ధ ఆంధ్ర కవులు మ్రోయించిన కవితా వీణలు నా పసితనంలో నన్నాకర్షించినయి, ఊగించినయి, ఊరించినయి నేను ఒక వీణ మ్రోయించాలని అనుకొన్నాను. ప్రయత్నం మీద నాకు లభించింది వీణ కాదు, సితార. అది నా కవిత! దాన్ని మ్రోయించాను... అట్లు నా సాగించిన కవితా ప్రవాసంలో కొన్ని తీగలు తెగినయి. ముడులు పడ్డాయి. బెట్టు తప్పి మూగపోయినయి. కాని నేను నిరుత్సాహిని మట్టుకు కాలేదు. పైపెచ్చు పూర్ణోత్సాహ వంతుణ్ణయి మ్రోయిస్తూనే వున్నాను. లోకం నావంక కోరగా, వారగా చూచింది, అనాదరించింది, ఆదరించింది, అసత్కరించింది, సత్కరించింది, దూరపరచింది, చేరదీసింది".

**"ఒకడు ప్రోత్సహింప, నొకడు నిరసింప,**
**నొకడు చేర బిలువ, నొకడు తరుమ,**
**మిట్ట పల్లములను మెట్టుచు నెట్టులో,**
**పలుకులమ్మ సేవ సలిపినాడ".**

అని చెప్పుకొన్నారు. అంతే కాక, ఆయన జీవిత దృక్పథాన్ని స్పష్టమైన పదజాలంలో "విశ్వమానవ సౌభ్రాత్రం, నిర్మల, నిర్జాతి సంఘం నా ఆదర్శం. ఒక జాతికి ఒక మతానికి చెందిన కవిత్వాలు మంచివి కావు... నా భావం సామాన్యులకు అందివ్వడానికే ప్రయత్నించాను. గగన సంచారము లేని కవిత్వం నా లక్ష్యం" అంటూ ఆయన సాహిత్య తత్త్వాన్ని వివరిస్తారు. జాషువా భావనలో కవిత్వం ఒక వ్యక్తికి సంబంధించిన ప్రతిభయే గాని, మిగిలిన దేనితో కూడ సంబంధించింది కాదు. ముఖ్యంగా కవిత్వానికి – కులీనతకీ యెట్టి సంబంధమూ లేదు.

**"కళలు మోహించుటొక కులీనులనె కాదు**
**కులము లేదన్న వానిని కూడ వలచు"**

అంటారు ఆ 'నవయుగ చక్రవర్తి'. గ్రంథ పఠన పాండిత్యానికి దారి తీయ వచ్చును కాని కవిగా మార్చ జాలదు. కవితా శక్తి పుట్టుకతోనే ఒక ప్రజ్ఞగా అవతరిస్తుంది, అభ్యాసంతో వికసిస్తుంది. అంతే... కవి భావాలను సృష్టించడు. భావాలే కవిని వరిస్తై... "ప్రజల కోసం వ్రాసే కవిత్వం ప్రజలకు బరువు కారాదు. చదువగానే వారి హృదయాల్లో నాటుకునేటట్లు వుండాలి" అంటారాయన.

జాషువా రచనలు సూక్ష్మంగా పరిశీలిస్తే ఒక ముఖ్య విశేషాన్ని మనం పసిగట్ట వచ్చు. అదేమిటంటే, పద్య సాంప్రదాయాన్ని 'ప్రజాపరం' చెయ్యడం జాషువా సాధించిన ఘన విజయం. 'ప్రజాపరం చెయ్యడం' అనే అంశంలో ముఖ్యమైన విషయాలు: హృదయ స్పందనకు ప్రాధాన్య మివ్వడం, ప్రతి స్పందనకు అవసరమైన అన్ని పద్ధతులను అనుసరించడం, కవిత్వంలో ఒకవిధమైన 'అలవోక తనాన్ని' (spontaneity) అంతస్స్రవంతిగా సృజించడం – ఇత్యాదులు. ఈ విషయంలో జాషువా ప్రధాన శక్తి 'భావుకత' (Imagination). ఈ లక్షణాన్ని *ఫిరదౌసి* అనే కావ్యంలో హెచ్చుగా గమనించ వచ్చును. మచ్చుకు –

**"ఆగడపు మబ్బు శయ్యల నపర శిఖరి**
**బుడుత చంద్రుడు నిద్దుర పోవుచుండె**
**ఈ చెరువు నీట నతని కుయ్యేలలు కట్టి**
**జోల పాడుచు నా వంక చూడవేమి?"**

వ్యథా భరితమైన హృదయం నుండి పొంగి పొరలిన భావావేశం, ప్రతి వస్తువులోను ఉదాత్తతను చూడ గల్గిన రస హృదయం జాషువా రచనలకు వైశిష్ట్యాన్ని ఆపాదించాయి.

సార్వజనీనమైన భావాలకు సరళభాషతో కూడిన నుడికారాలతో నింపి రచనల్లో ప్రత్యేకత కనబరచిన జాషువా ఆయన ఖండ కావ్యాలు అపార ఖ్యాతిని గడించాయి. ఆయనను ఖండ కావ్య నిర్మాతగా నిలిపి – ఎనలేని కీర్తిని – గణనీయమైన స్థానాన్ని సంపాదించి పెట్టాయి. *"ఆధునికాంధ్ర కవిత్వంలో* ఖండ కావ్య ప్రక్రియ రాయప్రోలుతో పొటమరించినా పుష్పించింది జాషువా కవితలోనే!" అని పేర్కొన్నారు ఆచార్య సినారె. జాషువా కవితా వైశిష్ట్యానికి మచ్చు తునకలుగా చిత్రితమైన రచనలు *ఫిరదౌసి, గబ్బిలం, ముంతాజ్ మహలు.* వీనిని గురించిన సంక్షిప్త వివరణ ఈ భాగంలో పొందు పరచడ మైనది. రసికులైన పాఠకులు ఆస్వాదిస్తారని ఆశిద్దాం.

"*ఫిరదౌసి* కవి విషాద గాథ, అటు కవులకూ, ఇటు రాజులకు ఒక రకమైన సవాలు లాంటిది. గజనీ మహమ్మదు ఫిరదౌసిని ఆహ్వానించి *షానామా* అనే గ్రంథాన్ని రచించి తనకి అంకితం చేయ"మని అభ్యర్థిస్తాడు. అలాచేస్తే పద్యానికి ఒక దీనారం (బంగారు నాణెం) ఇస్తానని వాగ్దానం చేస్తాడు. ఫిరదౌసి కవి అరవైవేల పద్యాలతో కూడిన రసవత్తర కావ్యాన్ని రచించి, దానిని గజనీ మహమ్మదుకు అంకితంగా అందజేస్తాడు. గ్రంథరాజాన్ని అందుకొన్న గజనీ మహమ్మదు తన వాగ్దానాన్ని మట్టి గలిపి – చెప్పుడు మాటలువిని బంగారు నాణేలకు బదులుగా వెండి నాణేలిస్తాడు. అట్టి స్థితిలో ఫిరదౌసి కవికి కలిగిన అఘాతం ఎలాంటిదో ప్రతి రచయిత ఊహించుకోవచ్చు!

ఫిరదౌసి వెండినాణేలు నిరాకరించి, ఆశోపహతుడై గజనీ మహమ్మదును విమర్శిస్తూ నిందా గర్భితంగా కొన్ని పద్యాలు వ్రాసి పంపుతాడు. దానికి ఆగ్రహించిన సుల్తాను ఫిరదౌసిని పట్టి చంపమని ఆజ్ఞాపిస్తాడు. ప్రాణ భయంతో ఫిరదౌసి గజనీని విడచి తూసు పట్టణానికి ప్రయాణ మౌతాడు. ఈ లోపల గజనీ మహమ్మదు సామంతుల ఉపదేశం వల్ల శాంతించి కవి ఋణాన్ని తీర్చుకోడానికి బంగారు నాణేలు పంపుతాడు. ఆశ్చర్య మేమిటంటే పసిడి సంచులు తూసు పట్టణం జేరే సమయానికి, ఫిరదౌసి మరణిస్తాడు. పడమటి దిశ నుండి ఫిరదౌసి శవం ప్రేత భూమికి కొనిపోబడుతుంది, తూర్పు దిశగా బంగారు నాణేలు తూసు నగరం చేరు కొంటాయి. ఫిరదౌసి పుత్రిక బంగారు నాణేలు తిరస్కరిస్తుంది.

ఆ ద్రవ్యంతో గజనీ మహమ్మదు తూసు నగరంలో ఫిరదౌసి పేర ఒక సత్రాన్ని నిర్మిస్తాడు. అటు గజనీ మహమ్మదూ, ఇటు ఫిరదౌసి కాల గర్భంలో కలసి పోతారు. కాని విశ్వసాహిత్య జగత్తులో ఒకరు అపకీర్తిని మరొకరు శాశ్వత మైన కీర్తినీ దక్కించు కొంటారు. జాషువా *ఫిరదౌసి* కావ్యంలో 'కవయా క్రాంత దర్శినః' అన్న నానుడికి ఒక అర్థాన్ని కల్పించాడు. ఫిరదౌసి వృత్తాంతాన్ని ప్రాతి పదికగా చేసుకొని దేశ కాలావధులకు అతీతుడూ, ఋషికల్పుడూ అయిన కవి వైశిష్ట్యాన్ని స్థిరీకరించాడు *ఫిరదౌసి* కావ్యం చివర మసీదు గోడ మీద ఫిరదౌసి వ్రాసిన పద్యం లోని 'ధ్వని' వెంటనే స్ఫురించి, ప్రతి పదం లోనూ ఎంతో విషాదాన్ని విశద పరుస్తుంది. గమనించండి!

**"ముత్తెముల కిక్కయైన సముద్ర మందు**
**పెక్కు మారులు మున్కలు వేసినాడ**
**భాగ్య హీనుడ ముత్యంబు వడయ నైతి**
**వనధి నను మ్రింగ నోరు విచ్చినది తుదకు"**

పై పద్యం వ్యంగ ప్రధాన మైనప్పటికీ, ఎంత సులువుగా హృదయం లోనికి చొచ్చుకొని పోతుంది! అక్కడే దాగి వుంది జాషువా గొప్పదనం.

**గబ్బిలం:**

జాషువా రచనల్లో మరో ముఖ్య కవితా కళా ఖండం *గబ్బిలం.* గబ్బిలాన్ని ఒక అపశకునపు పక్షిగా పరిగణిస్తారు. వెలివేయబడిన ఒక ప్రాణిగా దాన్ని ఇతర జాతులు కూడా పరిగణిస్తాయి. పంచమ జాతి ప్రతీకగా జాషువా గబ్బిలాన్ని గ్రహించారు. హరిజనుల చీకటి బ్రతుకులకు గబ్బిలం ఒక సంకేతం. సమకాలీన సామాజిక పరిస్థితులకు ప్రతిబింబంగా రచించబడింది *గబ్బిల*మనే ఖండ కావ్యం. అది జాషువా హృదయ వేదనకు అక్షర రూపం. అస్పృశ్యతా నిరసన, దేశారాధన అనే రెండు లక్ష్యాలు మనసులో ఉంచుకొని జాషువా ఈ కావ్యాన్ని రచించినట్లుగా మనకు తెలుస్తుంది. తను చేసికొన్న పాప కారణమేమిటో తనకే తెలియని అభాగ్యుని అశ్రువుల గాథ *గబ్బిలం.* ఆ కావ్యంలో అభాగ్యుని భాష్ప సందేశం ప్రధానం. దేశ వర్ణన గౌణం కేవలం అను షంగికం. పరమ నికృష్టాంధకారం నుంచి హిమా ధవళ కైలాసోన్నతులలో నివసించే పరమ శివుని వరకు ప్రాకిన గాథ అది.

మహాకవి కాళిదాసు వ్రాసిన మేఘసందేశం మనస్సులో పెట్టుకొని జాషువా కవి గబ్బిలం రచించారు. ఇక్కడ, ఒక

విషయం మనం గమనించాలి. కాళిదాసు కథానాయకుడు ప్రణయ సందేశాన్ని ప్రియతమకు పంపించాడు. *గబ్బిలం*లోని సందేశం తుక తుక నుడుకు అశ్రు సందేశం. కాళిదాసు నాయకుని శిక్షా పరిమితి ఒక సంవత్సరం మాత్రమే, గబ్బిలంలోని కథా నాయకుని శిక్ష ఆజన్మాంతము, తరతరములు. దీనికి ఏలాంటి కాల పరిమితి లేదు! మరో విశేష మేమిటంటే, కాళిదాసు కథా నాయకుడు మన్మథాగ్ని తప్తుడు! జాషువా నాయకుడు క్షుదాగ్ని పీడితుడు. అచ్చట సందేశ హారుడు మేఘుడు – జాషువా సందేశ హారుడు గబ్బిలం! తొలిసారి ఒక కావ్యంలో హరిజనుడు నాయకుడిగా వుండటం కేవలం *గబ్బిలం* లోనే జరిగింది. *గబ్బిలం* కావ్యంలో జాషువా మనకు హేతువాదిగా కనిపిస్తాడు. కావ్యమంతా ద్వేష పూరితంగా కాకుండా కరుణా రసార్ద్రంగా సాగుతుంది. "గబ్బిలం శాశ్వతముగా వుంటుందని నా నమ్మకం" అంటారు జాషువా. అందులో అతిశయోక్తి ఏమాత్రం లేదు. సామాజిక దురాచారాల్ని ప్రతిఘటించడంలో తాను అనుసరించిన మార్గాన్ని, నిర్మలమైన వేడి కంటి నీటి కుండే నైతిక శక్తిని నెత్తుటి సిరాతో రచించిన ఈ కావ్యంలో విశదం చేశాడు:

**ఓటమి లేదు నా యతన మూరక పోదు తుపాను వోలె నా**
**మాటలుమా మహేశ్వరుల మానసముంగదలించి తీరు,**
**కన్నీట మునింగి పై కుబుకు నిర్మల సూక్తి ఫలింప కున్నచో**
**రాటములో స్వరాజ్యము విరాజిలుటల్ కృతక ప్రచారముల్.**

**ముంతాజ్ మహల్:**

అవి భావ కవిత్వం జాలువారుతున్న రోజులు. ప్రణయ కవిత్వం మితి మీరిన స్థాయిలో వింత వింత పంథాలు అనుసరిస్తున్న కాలమది. ఆ వాతావరణంలో ప్రణయ కవిత్వాన్ని నిరసిస్తూ ప్రశ్నించే జాషువా కవి *తాజ్ మహల్* కావ్యం వ్రాయుట తటస్థించినది.

భారతీయ గృహస్థాశ్రమ ధర్మ నిబద్ధమైన దాంపత్యము పట్ల జాషువా విశ్వాసం వారిని ఈ కావ్య రచనకు ప్రేరేపించింది. కాలానికి, కులానికి, మతానికి అతీతంగా గార్హస్థ్య ధర్మాన్ని దృష్టిలో ఉంచుకొనే జాషువా ఈ కావ్యంలో ముంతాజ్ మరణానంతరం, అవివాహితుడై శేష జీవితాన్ని గడిపిన షాజహాను చక్రవర్తిని చిత్రించారు. వారి ఆదర్శ దాంపత్య జీవితం అద్భుతంగా వర్ణించారు.

ఈ కావ్యంలో మొదట షాజహాన్ ముంతాజ్‌ల ఆదర్శ ప్రణయం చిత్రితమైంది. ఆ తరువాత అర్ధాంగిని కోల్పోయిన పాదుషా హృదయ వేదన చక్కగా వర్ణించ బడింది. ఈ రెండు ఘట్టాలకు కావ్యరూపం సృజించడంలో జాషువా అనుసరించిన మార్గం ప్రశంసనీయం. కవితలో అంతర్లీనంగా తాత్విక ధోరణి మనకు వ్యక్త మవుతుంది. ఉదాహరణకు తన అంతిమ ఘడియల్ని ముందుగానే పసిగట్టిన ముంతాజ్ భర్తను సమాశ్వాసపరుస్తూ చెప్పే వాక్యాలలో చావు పుట్టుకలకు సంబంధించిన నగ్నసత్యాన్ని జాషువా కవి తాత్వికతతో మేళవించి వివరిస్తాడు. పరికించండి:

**ఆవిరి యోడలో జలధియాన మొనర్చెడు బాటసారులో**
**భూవర! రేవులందు దిగిపోయె దరించుక వెన్క ముందుగా**
**నీ వసుధా పణంబు పని యెల్ల ముగించి స్వదేశ కాములై**
**పోవుచు వచ్చు చుంద్రు సతమున్ ప్రజలీ నరజన్మ వర్తకుల్**

అదేవిధంగా రాణి మరణాంతరం విషాద సముద్రంలో మునిగిన పాదుషా హృదయాన్ని వ్యక్త పరిచే ఘట్టంలో జాషువా రచించిన పద్యాలు విషాద పూరితాలు. మచ్చుకో పద్యం–

**జీవన తారవై యమర సీమల నీవు సముజ్వలింప మా**
**యావృతమైన విశ్వ వలయంబున శాశ్వత శోక మూర్తినై**
**జీవితమూని ఈ చరమ జీవిత నాటకరంగ మెక్కి వా**
**పోవుచు నుంటి నీ విధుర భూమిక తోడ కిరీట ధారినై.**

ఈ ఘట్టంలో జాషువా ఆశించినది పాదుషా హృదయంలో విషాదాన్ని పెంచడం కాదు. తాజ్ మహల్ నిర్మాణానికి సంబంధించిన ఒక సంకల్పం, ఒక కార్య దీక్ష పాదుషా మనస్సులో నాటు కొనేటట్లు చేయుట మాత్రమే! తాజ్‌మహల్ నిర్మాణం వెనుక ఉజ్వల కళా నిర్మాణానికి సంబంధించిన ఒక తపన! తాజ్ మహల్ నిర్మాణం షాజహాన్ ముంతాజ్‌ల ఆదర్శ దాంపత్యాన్ని మాత్రమే తనలో పదిల పరుచుకొన్న పాలరాతి చట్రంకాదు. అది కుల మత భేద కాలావధులకు అతీతంగా ఆలుమగల చెలిమికి నిదర్శనంగా నిలిచేదిగా కవితా రూపంలో జాషువా తీర్చి దిద్దిన ఒక సజీవ సుందర శిల్పం! "అది యమానుష భావ నవ్యతల తోడ ప్రజ్వలించెడు అజ్ఞాత వాఙ్మయంబు". మరొక ముఖ్య విశేష మేమిటంటే తాజ్‌మహల్ శిల్పంపై జాషువా అభిమానం ఎంత ఎక్కువయో, తెలుగు భాషపై అంత హెచ్చు మక్కువ. ఆ కారణంగా జాషువా అంటారు –"తాజ్ సౌందర్య వర్ణన చేయడానికి తెలుగు భాష తప్ప మరో భాష చాలదన్నది నా నమ్మకం".

**"ఏబదాక్షరంబుల నెసక మెసగు / కలికి భాషకు తెలుగున కలది గాక అలివియే తాజి లావణ్య మభి నుతింప / తదితరంబైన భాషా వితానమునకు?"**

*ముంతాజ్ మహల్* కావ్యం లోని చివరి పద్యం జాషువా శైలికి తార్కాణంగా నిలుస్తుంది. పద్యం పోకడ గమనించండి.

**"రాణి విడిచి పోయె రాజు నొంటరి జేసి / రాజు విడిచి పోయె రాజ్య రమను రాజ్య రమయు విడచె రాజుల బెక్కెంద్ర / తాజి విడువ లేదు రాజసంబు".**

పైన పేర్కొన్న సాహితీ ప్రస్థానం "జాషువ మనో మోషావా"కి నేడు చెల్లుబడిలో ఉన్న తెలుగు నుడికారం పైగల అధికారం పాఠకులకు తెలియ పరచుటకు ఉపయోగిస్తుందని భావిద్దాం!

**క్రీస్తు చరిత్ర:**

క్రైస్తవ గాథలన్ని పద్య కావ్యాలుగా రచించాలనే కోరిక జాషువా మనసులో చాలా కాలంగా (అంటే దాదాపు 1921 నుండి) చోటు చేసుకొంది. కాని ఆ గాథలను తెలుగు పద్య కావ్యంగా రచించడం 'నల్లేరుపై బండి నడక' కాదు. చాలా శ్రమతో కూడిన పని. కత్తి మీద సాము లాంటిది. బైబిలు గ్రంథాన్ని చదివి, సవ్యంగా అర్థం చేసుకొని, అందులోని పదజాలాన్ని పద్య రచనలో ఇమడ్చటం క్లిష్టతరమే కాక, అత్యంత సాహసోపేతమైన యత్నం. బైబిలులోని అంశాలకు తెలుగు నుడికారాలని జోడించి కావ్యంగా రూపొందించుట అశేషశేముషీ దురంధరులైన జాషువా వంటి వారికే సాధ్యం. జాషువా చింతనా ప్రవృత్తి ఎన్నో మలుపులు తిరిగింది, సాంఘికాచారాలు, మత విశ్వాసాలు మొదలగు వాటిపై ఆయన ఆలోచనా సరళి కాలానుగుణంగా మారుతూ వచ్చింది. ఒకప్పుడు

**"మత పిచ్చి గాని వర్గో / న్నతి గానీ, స్వార్థ చింతనల్ గాని నా కృతులందుండదు, శబ్దా / కృతి బ్రహ్మానంద లక్ష్మి నృత్య మొనర్చున్"**

అని నొక్కి వక్కాణించారు. అటువంటి తత్వానికి నిబద్ధుడైన జాషువాని క్రీస్తు చరిత్రను కావ్యంగా రచించుటకు ప్రేరేపించిన కారణాలు: సత్యం, అహింస, సహనం, ప్రేమ మొదలైన మహనీయ భావాలు. ఆ భావాలను ప్రబోధించిన మహాపురుషుల వ్యక్తిత్వాలు ఆయనని ప్రభావితం చేశాయి. ఉదాత్త భావాలను బోధించిన ఏసుప్రభువు చరిత్ర వ్రాయుటకు సకల్పించారు.

జాషువా కవి తమ రచనల్లో ఏమతాన్ని, ఏప్రవక్తను నిరసించలేదు. సమదృష్టితో ఆయన బుద్ధుని బోధల్నీ, క్రీస్తు తత్వాన్నీ, బాపూజీ ఆలోచనల్నీ సమీక్షించారు. మతము పేరిట వెర్రితలలు వేసిన ధోరణులను మాత్రం జాషువా తీవ్రంగా విమర్శించారు. క్రీస్తు చరిత్ర రచనలో కూడా ఈ పద్ధతినే అనుసరించారు.

సనాతన ధర్మశాస్త్రాలకు వక్ర భాష్యం చెప్పే శాస్త్రులను, పరిసయ్యులను అనేక సందర్భాలలో గర్హించారు. మూలంలో లేకున్నా, ఆయా సన్నివేశాలలో వక్రభాష్యకారులైన వారిని పరుషాలైన విశేషణాలను ఉపయోగించి తీవ్రంగా నిరసించారు.

క్రీస్తు చరిత్ర రచనా పద్ధతి గూర్చి ముచ్చటిస్తూ – "మత గ్రంథాలు అందులో బైబిల్ను ఛందో బద్ధం చేయడం కత్తిమీద సాములాంటిది. 'నిరంకుశాః కవయహః' అన్న ఆర్యోక్తి ఇక్కడ పొసగదు! తీగమీద నడక, ప్రత్యక్షర ప్రాధాన్యాన్ని పాటించే క్రైస్తవ మిత్రులు, కథకు తప్ప కవనానికి చోటీయరు. ఇది ఫలానా కవి కలమేనా యని పాఠకు లనుమానించే ఘట్టాలు ఇందులో చాలా యున్నవి. పై కారణాలు పాటించి పాఠకులు నన్ను మన్నింతురు గాక. రచనా సౌలభ్యం కోసం అద్భుతాలు, ఉపమానాలు, కొన్ని మాత్ర మభివర్ణించ గలిగాను. తెలుగు బైబిలు భాష నీసడించు హైందవ మిత్రులకు, కళాభిరుచి గల ఆధునిక యువ క్రైస్తవ లోకానికీ కావ్యం రుచిస్తుందనే ధైర్యం నాకున్నది". అంటారు నవయుగ చక్రవర్తి.

క్రీస్తు చరిత్ర మహాకావ్యం లోని విశేషాలను విశ్లేషణాత్మకంగా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం. క్రీస్తు ప్రభువు ప్రాశస్త్యంతో కావ్యం మొదలవుతుంది. ప్రభువు ప్రాశస్త్యాన్ని పంచ కందాలలో (పంచ రత్నా లంటే బాగుంటుందేమో!) సరళ సుందర భాషలో వర్ణిస్తారు. మచ్చుకు –

**కం॥ నిస్తుల శుభదాయకము, ప్ర**
**శస్తము, కలుష ప్రపంచ చంద్రోదయమున్**
**ఆస్తిక కర్ణా భరణము**
**క్రీస్తు చరిత విబుధ మణి కిరీటంబు జుడీ!**

**కం॥ మహిమోపేత ముదాత్తము**
**సహన సుధాలయము, ఆత్మ సామ్రాజ్య సుఖా**
**వహము, యెహోవా దేవుని**
**సహవాసాత్మకము, క్రీస్తు చరితంబు జుడీ! ...**

**కం॥ అక్షయ పరమార్థ కథా**
**నిక్షేపము, సర్వ దుఃఖ నిష్ఠుర గజ హ**
**ర్యక్షము, సద్భక్తులకున్**
**సాక్షా న్మోక్షంబు, క్రీస్తు చరితంబు జుడీ!**

పాతకుల హృదయాల లోనికి సూటిగా చొచ్చుకొని పోయే విధంగా క్రీస్తుప్రభువు మహితను వివరించారు. భక్తులకు క్రీస్తు రూపం కవితా రూపంలో కనిపిస్తుంది. తర్వాత సీస పద్యంలో క్రీస్తుకు జన్మ నిచ్చిన ఆసియా ఖండం ధన్య మాతగా చిత్రితమైనది...

**గీ॥ ఏమి నోము నోచితో యేసు ప్రభువు**
**డాబు దర్పాలు గల్గు ఖండాంతరముల**
**జన్మ మెత్తక నీ గడ్డ జన్మ మెత్తె**
**ఆసియా ఖండమా! ధన్య వమ్మ నీవు!**

క్రీస్తు అతి సామాన్యవతియగు మరియమ్మ గర్భాన దైవాంశ సంభూతుడై డాబు దర్పాలు లేని ఆసియా ఖండంలో జన్మించుట ఒక విధంగా దైవ నిర్ణయమే. అంతటి పుణ్యానికి గురి అయింది ఆసియా. ఇది పేర్కొన దగిన విషయం.

సృష్టి అనే మరొక భాగంలో – సృష్టి రహస్యాలు, జరిగిన విధానాలను మనోరంజంకగా వివరిస్తారు జాషువా.

**ఆ॥వె॥ మన్ను ముద్దజేసి మనుజుని సృష్టించి**
**వాని కంఠ మందు ప్రాణ మూది**
**వాని ప్రక్క టెమ్ములో నారి గల్పించి**
**నిలెపె వాని తోడు నీడ గాగ.**

**కం॥ ఆదిదంపతులగు న**
**య్యాదామవ్వలను, రమ్యమగు భూముల యం**
**దేదోను తోట యందిడి,**
**ఆదరమున సర్వ దుఃఖములం దమరించెన్.**

ఆ విధంగా Adam and Eve అను ఆది దంపతుల సృష్టించి, వారి ఆనంద కరమైన జీవితానికి అవసరమైన అన్ని ఒనరులను నిర్మించి, స్వర్గమును మించిన, సౌందర్యమైన దేదోను తోటను సృజించి, ఆ దంపతులు చేయదగినవి, చేయగూడనివి అయినటువంటి కొన్ని విధులను యెహోవా వారికి సూచించెను. కాని వారు యెహోవా ఆజ్ఞను ధిక్కరించారు. ఆ విషయాన్ని జాషువా చిత్రించిన విధానం గమనార్హము.

**మ॥ జగదారాధ్యుని ఆజ్ఞమీరి పెను లజ్జా కుంచిత గ్రీవులై**
**దిగులున్ జెందుచు నాకు జొంపముల భీతిన్ దాగి యున్నట్టి య**
**య్యుగళిం బ్రాక్తన దంపతిన్ దెగడి పొందుద్యానమం దుండగా**
**తగరంచున్ బహుదా శపించి తరిమెన్ దైవంబు క్రోధోద్ధతిన్.**

. . .

**ఉ॥ నాడెడమైన దేవుని సనాతన సఖ్యము నుద్ధరించి, యీ**
**రేడు జగాల శాంతి వెలయించి విముక్తి ఘటింప, కిల్బిషం**
**బూడ, నరవతారుడై ఉర్వి జనించె యెహోవ నంద నుం**
**డీడిత ప్రేమ రూపి, ప్రభు యేసు, ప్రవక్తలు పల్కినట్లుగన్.**

అలాగే యోహాను జన్మ వృత్తాంతాన్ని చక్కని పద్యాలలో సులభ శైలిలో రచించారు. క్రీస్తు జనన వృత్తాంతాన్ని ఆహ్లాద కరమైన వృత్తాలలో (చంపకమాల, ఉత్పలమాల, శార్దూల, మత్తేభ, సీసములతో పాటు చక్కని కంద పద్యాలను, ఆటవెలది, తేటగీతికలతో జోడించి, చక్కని పదజాల ప్రయోగంతో అలవోకగా సాగే శైలిలో రచించారు.

దాదాపు నలభై(40) పద్యాలలో చెప్ప బడిన ప్రభువు జన్మ కథనం పఠితల హృదయాల నుయ్యాల లూగించి – ఏక బిగిని చదివిస్తుంది.

ఉత్సుకతను ఇనుమడింప జేస్తుంది. మచ్చుకు కొన్ని పద్యాలు ఆస్వాదించండి:

**చ॥ గొనములకున్ విలాసములకున్ భగవంతుడు ప్రాణ మూది చే**
**సిన నవ పుష్ప రాశియన జెల్లు విముగ్ధను మేరి కన్యకన్**
**దనకు ద్వితీయగా గొన ప్రధానము జేసి కొనెన్ యథా విధిన్**
**జన నుతుడై యోసెపను సజ్జను డొక్కడు నీతి మంతుడై.**

**కం॥ మరియమ కొకనా డింటన్**
**పరిశుద్ధ ప్రభువు దూత ప్రత్యక్షంబై**
**కరమెత్తి శుభము దేవుని**
**కరుణకు గురి యైతి వెల్ల కన్యక లందున్.**

**కం॥ అని కట్టెదుట న్నిల్చిన**
**ఘన దూతన్ గాబ్రియేలు గని మరిమ య**
**ల్లన గుండె ఝల్లు మనగా**
**తనువు గదల నోటిమాట తడబడు చుండన్.**

**శా॥ దావీదెక్కిన పీఠమెక్కి ఘన యూదావంశ సామ్రాజ్యమున్**
**దైవోదాత్త శుభోదయంబు గదురన్ కల్పాంతముల్**
**సేవింపం బడి యేల్బడిన్ సలుపు యుజ్జీ లేని సర్వేశ్వరుం**
**దావిర్భావము నందు నీకు పరిశుద్ధాత్మ ప్రభావంబునన్.**

**చ॥ పురుష నెరుంగ నట్టి, కదు ముగ్ధను, కన్నియ నైన నాకు నె**
**త్తెరగున సంభవించు నిది తెల్పుమనన్ విని గాబ్రియేలు సుం**
**దరి, భగవత్కృపం గలుగు దానవు దేవుని పావనాత్మ నీ**
**శిరమున నిల్చెడిన్ భయము జెందకు మాదరణీయ వన్నిటన్. . .**

పై పద్యాలలోని భావము సులభంగా అర్థం చేసుకోవచ్చు. పద్య నడక 'నల్లేరు పైన బండి నడక' వలెనే సాగింది! ...

**కం॥ అనిన విని, మరియ మురియుచు,**
**నను నిజముగ కనికరించె, నా ప్రభువిదె నా**
**మనమా నంద పయోనిధి**
**మునిగెం గడు ధన్యురాల భూతల మందున్.**

అనుకొంటూ మురిసిపోయిందా చిట్టితల్లి!

క్రీస్తు పుట్టక పూర్వం పాలెస్టయిని రాష్ట్రం రోమను

సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. అప్పటి రోమన్ చక్రవర్తి అగస్తస్ తన రాజ్యంలోని జనాభా సంఖ్య తెలుసుకొనే నిమిత్తం జనభా లెక్కలు చేయవలసిందిగా ఉత్తరువు జారీచేశారు. దాని ప్రకారం నాజెరత్ లోని జనాభా నమోదుకై బేథెలెం నగరానికి వెళ్ళవలసి వచ్చినది. ఆ సమయంలో గర్భిణి యగు మరియమ్మను వెంట బెట్టుకొని జోసెఫ్ బెత్లెహేం నగరానికి చేరుకొన్నాడు. ప్రజా సందోహంతో నిండిన బెత్లెహేం నగరంలో ధనవంతులందరూ మంచి మంచి ఇండ్లను అద్దెకు పుచ్చు కొన్నారు. అతిసామాన్యులైన జోసెఫ్ – మరియమ్మ దంపతులకు అతి కష్టంతో వూరిబయట ఒక పశువుల శాలలో (కోష్ఠంలో) మకాము దొరికినది. ఆ స్థలంలోనే గర్భిణి అయిన మరియమ్మ ప్రసవించినది! ఆ పరిసరాల్లో జన్మించాడు పరిశుద్ధ ప్రభువు ఏసుక్రీస్తు! ఆ పరిసరాలను వర్ణించిన పద్ధతిని గమనించండి.

**గీ॥ కైసరౌ గూస్తుడను రాజశాసనమున**
**ప్రథమ జన సంఖ్యలో వ్రాయ బడుట కొఱకు**
**ఇంతితో యోసెపల బెత్లె హేము పురికి**
**బోయె, దావీదు రాజన్య పుణ్య పురికి.**

**కం॥ ప్రసవించె నందు మరియమ,**
**నిసుగున్ సత్రమున జననము నిండిన కతనన్**
**పసరముల తొట్టి నుంచెన్**
**అసమాన చరిత్రు, నేసునాథు మహాత్మున్.**

**మ॥ ఘన నక్షత్ర మహా మణిన్ దలను శృంగారించె నాకాశ గే**
**హిని, బంగారపు మెట్ల కిన్నరులు మ్రోయించె న్నిలిం పొంగ నా**
**జన మానంద పయోధి దేలె సకలాశల్, మేరి గర్భంబునన్**
**జననం బంది ప్రభుండు దీనుడయి, కోష్ఠం బందు పన్నుండగన్.**

క్రీస్తు పుట్టినంతనే ఆకాశ మెలా తీర్చిన గృహంలా అలంకృత మైనదో, కిన్నెరలు మ్రోయించిన దుందుభులు అందరిని ఆనందంలో వోలలాడించినవి. ఆశలన్నీ మరియమ్మ గర్భాన ఫలించాయనే భ్రమ కోష్ఠంలో పడుకొన్న శిశువు ప్రకటిస్తున్న ట్లనిపించింది అందరికి! అంతేకాక

**కం॥ పొలములో కొందరు గొ**
**ల్లల కాపరులుండ, నాటి రేవెల్గె మహో**
**జ్వల కాంతి వారి నికట**
**స్థలి, దేవుని దూత వారి సన్నిధి నిలిచెన్**

**చ॥ వలదు భయంబు మీకు; శుభ వార్తను దెచ్చితి, లోక రక్షకుం**
**దలఘుదు బేతలేము పురియం దుదయించె నతండె కీస్తు; ము**
**ద్దులు గురియించుచున్ బసుల తొట్టి నొకానొక పాప పొత్తి గు**
**డ్డల శయనించి పొల్గుడు చుటం గనుగో గల రానవా లిదే.**

ఆ రీతిని గొల్లలకు దేవదూత తెలియజేయుటయే గాక, ప్రకృతి అంతా శోభా మయమై యేసుప్రభువు రాకను రకరకాలుగా ఉత్సవ పూరితం గావించాయి. ఈక్రింద సూచించిన చక్కని పద్యాలు అందుకు తార్కాణం.

**సీ॥ అంధకారము గుండెలమీద కాలూని**
**పకపక నవ్వె అంబర తలంబు**
**వలపుల తల్లి తెక్కల ముసుం గెదలించి,**
**కిలకిల నవ్వె రాచిలుక కూన**
**అరవిచ్చు రేకుల చిరునవ్వు లొలికించి,**
**పూదోట లాసన పూజ సల్పె**
**మలయ జంబలది దిగ్వల యాంగనల తోడ,**
**కొదమ తుమ్మెద గుసగుసలు వోయె**

**గీ॥ ఇహము పరమ రూప మెత్తిన ఆనంద**
**పుంజమయ్యె ప్రకృతి పులకరించె**
**సిరులు దొరగి మోక్ష సింహాసనము వీడి**
**ప్రభువు భూమి మీద పాదమూన.**

మోక్ష సింహాసనాధిష్టితుడై ఉండే ప్రభువు (ఏసుక్రీస్తు) పశువుల కోష్ఠంలో పవ్వళించాడు ఆసమయంలో. పశువుల ఉత్సాహాన్ని సూచించే వర్ణన తెలుగుదనాన్ని పుణికి పుచ్చు కొన్నది! పద్యాన్ని ఆలకించండి.

**గీ॥ వాలముల కుచ్చు లూచి యబ్బాలకునకు**
**స్వాగతం బిచ్చి పశువులుత్సాహ పడియె**
**కోడె దూడలు గజ్జె లల్లాడ పొదుగు**
**పాలు ద్రావక నొగి చంగనాలు దీసె.**

క్రీస్తు జననాన్ని గురించి తెలుసు కొనిన జ్ఞానివరులు దేవతా తనయుని చూచి భక్తి ప్రపత్తులుతెలియపరచే నిమిత్తమై హేరోదు రాజును కలుసు కొని క్రీస్తు జననాన్ని వివరించి ఆ బాలుడెచ్చట వున్నాడో తెలియజేయమని అభ్యర్థిస్తారు. అసూయాపరుడైన హేరోదు జ్ఞానివరులతో మీకు ఆయన జన్మ స్థలాన్ని గురించిన వివరములు తెలియ వచ్చి నంతనే నాకు తెలియజేస్తే నేను కూడా ఆ బాలుని దర్శిస్తానని చెప్పి పంపుతాడు. జ్ఞానులు క్రీస్తు జన్మించిన చోటును తెలుసుకొని ఆబాలుని చూచి ఆశీస్సులు అందజేస్తారు. ఆ వర్ణన గమనించండి:

**ఆ॥వె॥ చుక్కముందు నడచి, చక్కగా శిశువున్న**
**ఇంటి వరకు సాగి మింట నిలిచె,**
**జ్ఞానివరులు బిట్టు టానందమున దేలి**
**ఇల్లు సొచ్చి చూచి రేసు సామి.**

సీ॥ ఆనాడు పసుల శాలాంతరంబున వెల్గు
చిరు దీప కళిక నాశీర్వదించి
ఆనాడు కోష్ఠంబు నందు బంధితమైన
అలమందల గంగడోలు నిమిరి
ఆనాడు మేఘ మార్గాన కారాడిన
జలద ఖండాల కంజలి ఘటించి
ఆనాడు మేరికన్యా కుమారుని గన్న
గొల్లల శిరములక్కున గదించి

గీ॥ పూత బంగారు సాంబ్రాణి బోళములను
ప్రభువు పాదాల కడ సమర్పణ మొనర్చి
మోద ముప్పొంగి దేహముల్ పులకరింప
ధ్యాన మొనరించి రీరీతి జ్ఞానివరులు.

జ్ఞానులు తాము క్రీస్తును చూచిన విషయాన్ని హేరోదు రాజుకు తెలియజేయకుండానే తిరిగి వెళ్ళిపోతారు. ఈవిషయం హేరోదును చింతాక్రాంతుని జేస్తుంది. అసూయ ద్వేష పూరితుడైన రాజు క్రీస్తువున్న ప్రదేశాన్ని కనుగొని ఆ బాలుడ్ని చంపవలసినదిగా ఆజ్ఞాపిస్తాడు. ఆ విషయంలో విఫలుడైన హేరోదు ఆ సమయములో బెత్లేహేము పుర ప్రాంతములో పుట్టిన శిశువు లందరినీ చంపిస్తాడు. ఈ ఆపదను గురించి దేవదూత స్వప్న మూలంగా జోసెఫ్ దంపతులకు తెలియజేసి, వారిని కొంత కాలం పాటు ఆ ప్రాంతాన్ని వదలి మరోచోట గుప్త జీవనం గడుప వలసిందిగా ఆదేశిస్తుంది.

ఉ॥ పాపను సంహరింప నరపాలకుడుద్యుతుడయ్యె, భార్యతో
పాపను గొంచు పొమ్ము పురివాసి తటాలున, వాసముండు మీ
యాపద దాటుదాక, నిలుమా అయిగుప్తున నంచు భక్త యో
సెపుకు దూత స్వప్నమున జెప్పె నతండును సంభ్రమంబునన్.

కం॥అతడా రాతిరి శిశువున్,
సతీమణిని గొంచు వేగ చని కొన్నేడుల్
ధృతినయి గుప్తున ప్రభువా
నతి చేసిన దాక నుండె నవ్యాశయుడై.

అట్లు కొంతకాలం పరదేశంలో జీవితం గడిపిన పిదప హేరోదు రాజు మరణానంతరము కుటుంబ సహితంగా జోసెఫ్ తన స్వంత నగరానికి చేరుకొన్నాడు. క్రీస్తు బాల్య జీవితం నజరేతులో గడచింది. బాల్యదశలో క్రీస్తు తన తండ్రి వద్ద వడ్రంగం నేర్చుకొని తండ్రికి సహాయ కారిగా కాలం గడిపాడు. అంతే కాక –

మ॥ కనులన్ మోడ్చి, జగన్నియంతకు సుతుల్ గావించు వడ్రంగ పుం
బనులన్ దండ్రికి తోడ్పడున్, జనని ఆజ్ఞలు మౌళిగీలించు నె
మ్మనమందున్ నెనరూని పేదల పరామర్శించు, మెస్సీయ రా
కను చాటించు గురు ప్రబుద్ధుల సభల్ గాంచున్ విచారించుచున్.

శా॥ దైవం బెవ్వడొ! దయ్య మెవ్వడొ! వినిర్ధారింపగా లేక, నా
నా వేదాంత విచిత్ర వాఙ్మయ మనంతంబై, జగం బెన్నియో
ద్రోవల్ ద్రొక్క, గురుబ్రువుల్ ప్రజ లందున్ బిచ్చి సిద్ధాంత వీ
రావేశంబు సృజింప సాగిరి, స్వలాభా యత్త చేతస్కులై.

ఏసుక్రీస్తు 12 సంవత్సరాల వయసు లోనే జెరూసలేం పట్నానికి పోయి, అచ్చట గుడిలో ఆ కాలంలో గొప్ప ధార్మికులు గాను, శాస్త్రాధ్యాపకులు గాను పేరు పొందిన పండితులతో మత సంబంధమైన విషయాలపై వాదోప వాదములలో పాల్గొని, శాస్త్రులు పరిశుద్ధమగు ధర్మ శాస్త్రాలకు చెప్పే వక్ర భాష్యాలను ఖండించారు. అంతేకాక, చక్కని వ్యాఖ్యానాలతో వారిని చిత్తు గావించారు. ఈ విషయం దిగువ నుదహరించిన పద్యం విశదీకరిస్తుంది. పరిశీలించండి.

మ॥ పదురెండ్లేండ్ల వయస్సునం దెరుషలేం పట్నానకుం బోయి, య
య్యదన్ దేవుని గేహమందు గల శాస్త్రాధ్యాపకుల్, దార్మికుల్
ముది మిందూలు కళా సమగ్రులు శిరంబుల్ వంచ వాదంబునం
దెదురై తప్పుడు ధర్మ సూత్రముల సాహిత్యంబు ఖండించి, యొ
ప్పిదముల్ సూపి వినిర్ధరించె భగవ ద్వేదాంత భాష్యాంతముల్.

మ॥ పరిశుద్ధంబగు ధర్మ శాస్త్రమునకుంభాష్యాలు వల్లించి, న
ల్వురిలో నున్నత పీఠముల్ గొనెడు బాబుల్ దొడ్డగడ్డాల వా
ర్వరిసయ్యుల్, శత వృద్ధులా యుగములో ప్రత్యర్థి లేడన్న దు
స్తర గర్వ గ్రసితుల్, మదం బుడిగి లజ్జామగ్నులై రెంతయున్.

ఈ బొడ్డూడని వాడు ఉద్దండులమైన మనలను ఎదురించేటంతటి వాడా? అని ఈసడించుకొన్నారు అసూయతో క్రీస్తును! అయినప్పటికి కొంతమంది మనసులలో

గీ॥ ప్రేమయను సద్భుతాక్షర ద్వితయమునకు
ప్రాణములు వోసి పంపెనో పరమగురుడు
దైవ తనయుని వదన సందర్శనమున
ఖలుల గుండెల ననురాగ జలము లూరె.

“అయ్యో ఒంటి వాడవై ఎందుకు పోరాడుతావు నాయనా ఇంటికి పద” అని పిలిచే తల్లిదండ్రిని చూచి మనస్సులో నవ్వుకొని “అమాయకులారా! మంటికిన్ మింటికిన్ కర్త నాదు పిత, నేను తదాజ్ఞ తలన్ ధరించి, యిప్పంట వలంతికిన్ దిగినవాడ మనుష్య కుమార భూమికన్” అంటాడు ప్రభువు క్రీస్తు.

ఇంకావుంది....

# మన ప్రాచీన నగరాలు – భట్టిప్రోలు

– *కొసరాజు వెంకటేశ్వర రావు*

భట్టిప్రోలు ($16^0$ఉ.అక్షాంశము $80^0$ తూర్పు రేఖాంశములు) గుంటూరు జిల్లాలో తెనాలి నుండి, 18 కి.మీ రేపల్లెకు 10 కి.మీ. దూరంలో గుంటూరు రేపల్లే రైలు మార్గంలో వున్నది. మెగస్తనీస్ తన గ్రంథం *ఇండికా*లో ఆంధ్రదేశంలో 30 ప్రాచీన దుర్గాలు వున్నట్లుగా తెలియజేశాడు. ఆయన పేర్కొన్న నగరాలలో భట్టిప్రోలు కూడా ఒకటి అయివుంటుందని పిల్లి రాంబాబు తన గ్రంథం *ఆంధ్రదేశంలో బౌద్ధ వైభవం*లో తెలిపారు. అమరావతి (ధాన్య కటకం) లాగే భట్టిప్రోలు కూడా ఆంధ్రుల చరిత్ర, సంస్కృతులకు పుట్టినిల్లుగా భాసించింది. జైనకవి నయసేనాని (క్రీ.శ. 8వ శతాబ్దం) తన గ్రంథం *ధర్మామృత కావ్యం*లో ఈ నగరాన్ని "ప్రతిపాలపురం"గా పేర్కొన్నాడు.

ఖారవేలుడు తన *హతిగుంఫ* శాసనంలో దీనిని "పిదుడ నగరం" అని, గ్రీకు ఖగోళ శాస్త్రవేత్త టాలమీ (Ptolemy) మైసోలియా (మచిలీపట్నం) ప్రాంతంలోని "పిరింద్ర నగరం" అని పేర్కొన్నాడు. శ్రీలంక *బౌద్ధ జాతక కథల*లో దీనిని "ఆంధ్రనగరి"గా పేర్కొన బడింది. భట్టిప్రోలులో వస్త్ర పరిశ్రమ ముఖ్య పరిశ్రమగా వున్నదని టాలమీ పేర్కొన్నాడు. నేటికి ఈ వూరిలో అనేక కుటుంబాలు వస్త్ర పరిశ్రమ పైనే ఆధారపడి జీవిస్తున్నాయి. ఇక్కడి బౌద్ధస్తూపంలో చేసిన త్రవ్వకాలలో లభించిన వస్తు సామగ్రిని బట్టి చూస్తే – ఇక్కడి ప్రజలు చేతివృత్తులలో అత్యంత నైపుణ్యం సాధించారు అని ఊహించవచ్చును. ఈ ప్రదేశం చేతి వృత్తులకు, పాడిపంటలకు ప్రసిద్ధిగాంచింది. ఈ చుట్టుప్రక్కల వరి, ప్రత్తి, పప్పు దినుసులు, అపరాలు విరివిగా పండేవి. భట్టిప్రోలు, సమీపంలో వున్న పోతర్లంక నుండి కృష్ణా నది ద్వారా సముద్ర మార్గాన నౌకాయానం జరిగేదని, ఇక్కడి నుండి వివిధ వస్తువులు వరిధాన్యాలు, పాడి, ప్రత్తి, దినుసులు, అపరాలు, చేనేత వస్త్రాలు, వేరే దేశాలకు ఎగుమతి అయ్యేవని చరిత్రకారుల అభిప్రాయం.

ఆంధ్రప్రాంతంలో ప్రాచీన కాలం నుండి నాగజాతి ప్రజలతో సహజీవనం చేసిన యక్షజాతి గణనాయకుడు, కుబీరకుడు 'ప్రతిపాలపురం' రాజధానిగా చేసుకుని, శాతవాహనుల కంటే ముందుగా పాలించినట్లుగా భట్టిప్రోలు స్తూపంలో లభించిన క్రీ.పూ. 3వ శతాబ్దానికి చెందిన ప్రాకృత శాసనాన్ని బట్టి తెలుస్తున్నది. ఈ శాసనం ఆంధ్రదేశంలో దొరికిన శాసనాలలోకెల్లా అతి ప్రాచీన శాసనంగా చరిత్రకారులు నిర్ధారించారు. యక్షరాజు, కుబీరకుడు ప్రథమ శాతవాహనుని తండ్రి దీపకర్ణి మహారాజుకు సమకాలీనుడు అయివుండాలని చరిత్రకారుల అభిప్రాయము. కుబేరకుడు, కుబేరుడు, ధనదుడు ఈ మూడు పర్యాయ పదాలుగా భావిస్తే గణపేశ్వర శాసనంలో పేర్కొన్న ధనదుడు కుబేరకుడు ఒక్కరే అయివుండాలి.

**మహాస్థూపం :** ఇక్కడి మహాస్థూపం 200 అడుగుల వైశాల్యంతో 140.అ. వ్యాసం 18.అ ఎత్తు వుండి, నాలుగు వైపులా ఆయక వేదికలపై ఐదు పాలరాతి స్థంభాలు (బుద్ధుని జీవితంలో జరిగిన ఐదు ముఖ్య ఘట్టాలను సూచించేవి) ప్రతిష్టింపబడినాయి. అండాకారంలో వున్న స్థూపం పైన హర్మికను పద్మాలంకారముగా నిర్మించి, దాని మధ్యలో ఛత్రాన్ని వుంచారు. అండానికి, మేధికి బౌద్ధ చిహ్నాలతో కూడిన చలువ రాతి ఫలకాలను తాపడం (covering) చేశారు. మేధి పైన అండము చుట్టూ ప్రాకారం (Railing) వుండేది. ఆయకవేదికలకు ఎదురుగా చలువ రాతితో నిర్మించిన ముఖ ద్వారాలు వుండేవి.

ఈ ద్వారాలను కలుపుకుని మహాస్థూపం చుట్టూ 152.అ. చుట్టుకొలత కలిగిన శిల్పాలంకార స్థంభాలు, ఫలకాలతో ప్రాకారం వుండేది. దక్షిణ ముఖ ద్వారం కలిగిన స్థూపం నిత్య దీపాలంకరణతో, ఉపాసకులు, భిక్షువులతో, సందర్శకులతో కిటకిటలాడుతూ వుండేది. ఈ మహాస్థూపం సామాజి కాభివృద్ధికి కేంద్రంగా, విజ్ఞాన విపంచికి ఆయువుగా, ప్రజల మనోభావాలకు అనుకూలంగా దశ, దిశానిర్దేశం చేసింది. భట్టిప్రోలు స్థూపాన్ని ఘంటశాల ఘటికా నివాసి, స్థూప నిర్మాణ శిల్పి, స్థపతి అయిన కూనా చారి రాజా కుబీరకుని అధ్వర్యంలో నిర్మించినట్లుగా శాసనం ద్వారా తెలుస్తున్నది. ఈ స్థూపాన్ని స్థానికులు 'పెద్దలంజ దిబ్బ' మరియు 'విక్రమార్క కోట దిబ్బ' అనే పేర్లతో పిలుస్తారు. మహాస్థూపం రెండుసార్లు నిర్మాణం చెందినట్లుగా తెలుస్తున్నది. భట్టిప్రోలు చరిత్రను తెలుసుకోవడానికి మొదటి నుంచీ పాశ్చాత్యులు ఆసక్తి చూపించారు. క్రీ.శ. 1870లో బాస్వెల్ చేసిన త్రవ్వకాలలో, మూడు మట్టి దిబ్బలను

గుర్తించాడు. ఆ దిబ్బలను 'పెద్దలంజ దిబ్బ' (మహాస్థూపం), 'చిన లంజ దిబ్బ' (ఉద్దేశిక స్థూపం) 'విక్రమార్కుని కోట దిబ్బ' (విహారము) అని నేటికి స్థానికులు పిలుస్తారు. 1871లో ఇలియట్, 1882లో రాబర్ట్ సివెల్‌లు ఈ స్థూపాన్ని సందర్శించారు. తరువాత ఈ స్థూప నిర్మాణ విశేషాలను కనుగొనటానికి మరియు 1892లో అలెగ్జాండర్ రీ జరిపిన త్రవ్వకాలలో రాతితో చేయబడిన ధాతు కరండం (Relic casket) దొరకగా, 1969-70 లో డాక్టరు రాయప్రోలు సుబ్రహ్మణ్యం త్రవ్వకాలు జరిపి, అక్కడ వున్న విహారపు పునాదులతో పాటు బుద్ధుని ప్రతిమను కనుగొన్నాడు. క్రీ.పూ. 3వ శతాబ్ది నుంచి క్రీ.శ 4వ శతాబ్ది వరకు సుమారు 700 సంవత్సరాలు ఈ స్థూపం విలసిల్లినదని చెప్ప వచ్చును. ఇక్కడ బౌద్ధ సంఘపు సమావేశం (గోష్ఠి) జరిగినట్లు శాసనం ద్వారా తెలిసింది.

ఈ సమావేశంలో (హిరణ వఘున, పుగలక, కలహ, విశాన్, తౌరసిసి, శమహో, ఒడల, అసక, షలోది, అనగహకుర, సతుఘు, పాతక, పోతక, అలినకకి, వరుణ, పికలక, కోషక, సుత, పపొ, గలేక, కుబేరకో, శమనదన, భరత, ఓదల, తౌర, తిస, గిలన, జంబుపదన, బుబజనక) ఉపోత్పతకుని కొడుకు కుర, కురహకుని కొడుకు ఉత్తరుడు మొదలగు వారు పాల్గొన్నారని డాక్టరు అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (బుద్ధఘోషుడు) తన *మహా బౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు* అనే గ్రంథంలో పేర్కొన్నాడు. ఇక్కడి ధాతు కరండాలకు ఎంతో మంది దానాలిచ్చారు. రాజా కుబీరకుడే కాక, పట్టణ వణిక్ర్పముఖులు, వారి కుమారులు ధాతు కరండాలను బహూకరించారు. భట్టిప్రోలును బుద్ధుడు సందర్శించాడని పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి తన గ్రంథంలో వ్రాశారు. కాని దీనికి చారిత్రిక ఆధారాలేమీ లభించలేదు. బుద్ధుడు, అశోకుడు ఆంధ్రదేశాన్ని సందర్శించినట్లుగా ఏవిధమైన ఆధారాలు దొరకలేదు.

థేరవాద శాఖకు చెందిన ఈ స్థూపంపై కాలక్రమంలో మహాయాన ప్రభావము పడింది. వజ్రయాన శాఖలో స్త్రీలను బౌద్ధ సంఘంలోకి అనుమతించారు. దీనితో సంఘంలో అనైతికత ఎక్కువై ఆంధ్రదేశంలో బౌద్ధస్థూపాలను 'లంజ దిబ్బలు'గా స్థానికులు వ్యవహరించటం మొదలైనట్లుగా తెలుస్తున్నది. శైవమతం విజృంభణతో బౌద్ధానికి రాజాదరణ లేకపోవటంతో బౌద్ధమతం క్షీణింప సాగింది. జైన మతావలంబకుడైన ఖారవేలుడు భట్టిప్రోలు స్థూపాన్ని బాగుచేయలేనంతగా నష్టపరచాడని చరిత్ర తెలియచేస్తున్నది. వీరశైవుల ఆగ్రహాన్ని కూడా ఈ మహాస్థూపం తప్పించుకోలేక పోయింది. దీనితో బౌద్ధ సంస్కృతి మట్టిపాలైంది. ఈ ప్రాంత చరిత్ర కనుమరుగైంది.

**పురావస్తు పరిశోధనలు :** మహా స్థూపం వద్ద జరిపిన పురావస్తు పరిశోధనలో ఒక మహాస్థూపము విహారము - చైత్యము, అనేక ఉద్దేశిక స్థూపాలు, ధాతు కరండాలు, బయటపడినాయి. స్థూప ఆవరణంలో ఛత్రము, ఛత్రపు కాడ యష్టి తథాగతుని శిరః ప్రతిమ, చలువ రాతితో మలచిన శిల్పాలు, స్థంభాలు, తదితర సామగ్రి లభించింది. స్థూపానికి దక్షిణ ముఖ ద్వారం వద్ద నిలిపిన రెండు చలువ రాతి స్థంభాలు ఇప్పటికీ చూపరులకు కనువిందు చేస్తాయి. ఆ స్థంభాలపై చెక్కిన సూక్ష్మ శిల్పకళ, జాతకకథలు శాసనాలను గమనించవచ్చును. శైవ మతానికి చెందిన కొన్ని శిల్పాలు కూడా ఈ ఆవరణలోనే వున్నాయి. అలెగ్జాండర్ రీ 1892లో త్రవ్వకాలు జరిపేనాటికే స్థానికులు ఈ మహాస్థూపాన్ని పాడుచేసి, దాని రూపురేఖలు మార్చేశారు. ఇటుకలను గృహ అవసరాలకు, రోడ్లు వేయటానికి స్థంభాలు, స్థూప ఫలకాలను కాలువలపై వేయటానికి తరలించుకు పోయారు. ఈ అనాగరిక చర్య మూలంగా ఎన్నో చారిత్రక అంశాలు నేలలో కలసిపోయినాయి. బౌద్ధ చరిత్ర కనుమరుగై పోయింది.

**ధాతు కరండాలు :** స్థూపంలోను, చుట్టుప్రక్కల జరిపిన త్రవ్వకాలలో ఎన్నో ధాతు కరండాలు లభించాయి. 1870లో బాస్వెల్ జరిపిన పరిశోధనల్లో స్థూపానికి, తూర్పు వైపున స్పటికంతో చేసిన భరిణలో ముత్యాలతో కూడిన ధాతువు లభించింది. అలాగే స్థూపంపైన నాలుగు రాళ్ళతో కట్టిన చిన్న ధాతు గర్భంలో ధాతు కరండాన్ని మట్టి పాత్రలో వుంచి నిక్షిప్తం చేసిన సామాగ్రి లభించింది. ఈ కరండంలో స్ఫటిక భరిణ, అందులో ముత్యాలు, బంగారు ఆకులు, బూడిద వున్నాయి. వీటిని ఇంగ్లాండుకు తరలిస్తుండగా రాతి కరండం పగిలి మిగిలిన స్ఫటిక భరిణమాత్రమే లండను చేరింది.

1892లో అలెగ్జాండర్ రీ జరిపిన త్రవ్వకాలలో మూడు ధాతు కరండాలు లభించాయి. మహా స్థూపపు అగ్రభాగంలో 14×6 సెం.మీ సైజులో నిర్మించిన గదిలో రాతి కరండం, నగిషీ పెట్టిన కరండం లోపలి వైపు మరో కరండాన్ని వుంచటానికి గుంట వున్నది. దీని చుట్టూ బ్రాహ్మి లిపితో వున్న రెండు శాసనాలున్నాయి. ఆ శాసనాలు ఈ విధంగా వున్నాయి.

1. కురపితునో చ కుర మ(త) లు చ కురస శివ(ష) మజుసం
పనతి ఫలిగ షుముగాం అచ బుద్ధ శరీరానాం నికేతు
(బుద్ధుని శరీర ధాతువులు నిక్షిప్తం చేయడానికి కుర అనే అతడు తన తల్లి దండ్రుల ఆజ్ఞ మేరకు ధాతు కరండాన్ని స్ఫటికపు పేటికను తయారు చేయించాడు).

2. బసవపుతస షా పితుకస మజుస
ఉతరో పిగ హపుతో కనితో పిహు (విగ్రహ)
(తండ్రి బసవునితో కలసి కుర అనే ఆసామి ఈ కరండాన్ని దానం చేశాడు. ఇతడు కనిష్టపుత్రుడైన ఉత్తరుడు).

ధాతు పేటికలో ఒక పట్టకం, బంగారు పూలు, రాగి ముక్కలు, రాగి ఉంగరం, పూస, రెండు ముత్యాలు, రెండు లోహపు కప్పులు, బంగారు పూసలు, బుద్ధ పాదాలు చెక్కిన రెండు బంగారు రేకులు, త్రికోణాకారపు బంగారు రేకులు, షట్భుజాకార పూస వున్నాయి. ఈ పూసపై ఈ క్రింద చూపించిన బ్రాహ్మీ శాసనం వున్నది.

॥ మాతు గామస (నాయ యి) ద పురాహి
సువను మహా / సమను దేశానాం చ / (స) ధియా
గొౌహి అగ దానమ్
(నందపురానికి చెందిన స్త్రీలు, శ్రీమనదేశానికి చెందిన స్వర్ణకారులు, గిల నగరానికి చెందిన ఆయసకసతి గోష్ఠి చేసిన దానము) ఈ శాసనంలో పేర్కొన్న నందపురము గిల నగరము, ఎక్కడ వున్నవో పరిశీలించ వలసి వున్నది.

మరొక కరండంలో ఒకటిన్నర సెం.మీ పొడవున్న ఎముక, 8 చిన్న పూసలు, 9 బంగారు పూసలు, 6 చిన్న బంగారు పూసలు, 4 రాగి పూలు, నీలి రాతి పూస, 19 ముత్యాల పూసలు, 24 నొక్కుగల నాణెములు (Punch marked coins) స్వస్తిక్ ఆకారంలో అమర్చబడి వున్నాయి. ఆ నాణేలపై శ్రీవత్స, త్రిశూల, పూలు చెక్కబడ్డాయి.

మహాస్థూపాన్ని త్రవ్వుచుండగా 17 అ॥ లోతులో స్థూపం మధ్యలో ఛత్ర యష్టికి తూర్పున రాతి కరండం లభించింది. దీనిలో 18 లైన్ల బ్రాహ్మీ శాసనం వున్నది. దీని అర్థం యక్షుల రాజైన కుబీరకుడు బౌద్ధ మహాసభ (గోష్ఠి)ను ఏర్పాటు చేసి వారి సూచనల ప్రకారమే మహాస్థూపాన్ని నిర్మించడం జరిగిందట. ఆ నాటి సభలో పాల్గొన్న వారి పేర్లతో వేయించిన శాసనం ఇది. ఇదే కరండంలో మరొక స్థూపాకార స్ఫటిక భరిణ వున్నది. ఇందులో తెల్లని బూడిద, 164 బంగారు పూలు, 9 రేకులు, 2 గుండ్రటి పూలు, 6 బంగారు పూసలు, ముత్యపు పూస, బంగారు ఉంగరం, గార్నెట్, స్ఫటికం, ముత్యాలతో చేసిన పూసలు, బెరిల్ పోగులు, బ్రాహ్మీ శాసనం గల రాగి రేకులు, వెండి ఆకు, చిన్న గొడుగు వున్నాయి.

మహాస్థూపం యొక్క పై భాగము నుండి 18 అడుగుల క్రిందికి యష్టికి తూర్పు వైపున ఒక రాతి పేటిక లభించింది. ఇది మెరుగు పెట్టబడి మూతి వైపున 8 పంక్తుల బ్రాహ్మీ శాసనం వున్నది. పేటికలో మరొక స్ఫటిక భరిణ, దాని అంచున మరొక శాసనము వున్నది. స్ఫటిక భరిణ పైన వున్న శాసనంలో రాజా కుబీరకుని పర్యవేక్షణలో చేయించిన ఈ మంజూషికను, పేటికను గోష్ఠికి చెందిన అరహదత్తుడు బహూకరించాడు అని వున్నది. రాతి పేటికలో వున్న మరొక స్ఫటిక భరిణ దానిలో బెరిల్ రాతితో చేసిన మరొక చిన్న భరిణ వున్నాయి. దీని అడుగున గల మూడు రంధ్రాలలో చిన్న చిన్న అస్తికలుంచి మూతను బిగించారు. మూత పై భాగంలోను, క్రింది భాగంలోను, 2 బంగారు రేకులు, 2 గోమేధికపు పూసలు, 1 స్ఫటికం, మరో తెల్ల స్ఫటికం, 6 ముత్యాలు, షట్ కోణాకృతి స్ఫటికపు పోగులు. బంగారు బొమ్మ, బంగారు తీగ చుట్ట, 30 బంగారు పూలు, కొద్దిపాటి ఖనిజ లవణం, రాగి ముక్కలు వున్నాయి. ఇవి నేడు బ్రిటీషు మ్యూజియం (లండను), చెన్నై గవర్నమెంటు మ్యూజియం లోను భద్రపరచబడినాయి.

భట్టిప్రోలు మహాస్థూపంలో దొరికిన బుద్ధుని శారీరక ధాతు పేటికలను కలకత్తా విశ్వవిద్యాలయానికి ఎదురుగా నిర్మించిన శ్రీధర్మ రాజిత విహారంలో నవంబరు 1920లో బర్మా, శ్రీలంక, చైనా, జపాన్ థాయిలాండ్, ఇండియాలకు చెందిన భిక్షువులు అప్పటి బ్రిటీషు గవర్నరు లాండే రోనాల్డ్ చేతుల మీదుగా నూతన స్థూపంలో నిక్షిప్తం చేశారు. నేడు ఈ ధాతువులు దేశ, విదేశాల బౌద్ధులచే పూజలందు కుంటున్నాయి.

భట్టిప్రోలు స్థూపం కేంద్ర పురావస్తు శాఖ వారి ఆధీనంలో వున్నది. 11 ఎకరాల 2 సెంట్ల వైశాల్యం వున్న ఈ బౌద్ధ క్షేత్రం, ఆక్రమణలకు గురై ప్రస్తుతానికి ఇది రెండెకరాలు మాత్రమే మిగిలి వున్నది. స్థూపానికి ఎదురుగా వున్న చెరువు అపరిశుభ్రంగా మారిపోయింది. వి.ఆర్. బౌద్ధాచార్యులు, వి.డి. నరసింహారావు అనే స్థానికులు బౌద్ధ సేవా సమితిని స్థాపించి మహా స్థూపం యొక్క రక్షణకు, అభివృద్ధికి విశేషమైన కృషి జరుపుతున్నారు. మి

---

కొసరాజు వెంకటేశ్వరరావు,
పురాతత్త్వవేత్త, ఫోన్ : 9490636659


పద్మభూషణ్ స్వప్నసుందరి.

## తిరుమలేశుని సేవలో విజయనగర కాలపు

# నాట్యగత్తెలు

*- దేవిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి*

**2012**వ సంవత్సరం, డిశబర్ 27, 28, 29 తేదీలలో తిరుపతి శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. అందులో భాగంగా, ఇదే ప్రాంగణంలో 27వ తేదీ సాయంత్రం ఏడుగంటలకు, మరుగున పడిపోయిన ప్రాచీన ఆలయ నృత్య ప్రదర్శన 'విలాసినీ' నాట్యం పేరుతో జరిగింది. దీని రూపకర్త పద్మభూషణ్ స్వప్నసుందరి. ఈమె, తన నలుగురు శిష్యురాండ్రతో కలసి దీనిని ప్రదర్శించారు. తొలుత, 'బలిహరణం' అనే కీర్తనతో ఆలయంలోకి అష్టదిక్పాలకుల్ని ఆహ్వానిస్తున్నట్లు నాట్యంద్వారా పూజిస్తూ ఆలయ నృత్య సాంప్రదాయాన్ని కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించారు. తరువాత, భగవంతుని వాహన ఊరేగింపు సేవ ముగిశాక భగవంతుని వాహనాన్ని ఆలయంలోకి తీసుకొని వెళ్ళేమునుపు ఆలయం ఎదుట భగవంతునికి ఇచ్చే 'కుంభహారతి' సందర్భంగా ఆలయం ముందు దైవమూర్తులను స్తోత్రం చేసే నాట్యం 'కుంభావిని'ని ప్రదర్శించారు. ఆ తరువాత, వల్లభాచార్యుని మధురాష్టకంలోని 'కళ్యాణోత్సవం' నాట్యం చేశారు. ఈ విలాసినీ నాట్య సాంప్రదాయం శ్రీరంగనాథుని ఆలయంలో ప్రతి ఏటా జరుగుతోందని దీని రూపకర్త తెలుపడం కూడా జరిగింది. ఐతే, ఇది తిరుమల వేంకటేశుని ఆలయంలో కూడా విజయనగర పాలకుల కాలాన జరిగేది. మరుగున పడిన ఈ విషయం తెలుపడం కోసమే ఈ చారిత్రక వ్యాసం.

ప్రకృతిలోని నీరు, గాలి, అగ్ని, సూర్యుడు, చంద్రుడు, భూమి, అంతరిక్షం వంటి (ఎలిమెంట్స్) వాటిలోని సుగుణాల్ని మానవుడు తొలుత గౌరవించాడు. చరాచర పదార్థాలు, మానవ మానవేతర ప్రాణుల్లోని సుగుణాల్నీ గౌరవించాడు. ఇదంతా మానవుడు ఆలోచనాపరుడుగా, నాగరికుడుగా మారుతోన్న తొలినాళ్ళలో జరిగింది. క్రమంగా వాటికి ఉన్నత గౌరవస్థానమైన భగవత్ స్థానాన్ని ఇచ్చాడు. ఆ తరువాత వాటికి దైవనామం (ఉన్నత గౌరవప్రదమైన పేరు), అనగా బ్రాండ్ నేమ్ ఇవ్వడం జరిగింది. అందుకే భగవంతుడు అనేవాడు మానవులకు మాత్రమే ఉన్నాడు, ఇతర ప్రాణులకు లేడు. అంటే భగవంతుడు అనేది ఒక భావన. అది మనిషి మెదడు (ఆలోచన)లోంచి పుట్టింది. క్రమంగా అది ప్రకృతిలోని కంటికి కనిపించే ప్రకృతి వనరుల రూపం నుండి రూపాంతరం చెంది చిహ్నాలు, ప్రతిమల రూపాన్ని సంతరించుకొంది. ఈ రూపాలగురించి ప్రచారం చేసినవారు, వీటికి ఏదో ఒక రూపంలో సేవ చేసినవారూ ఆరూపాల అంశాలుగా, ఆధ్యాత్మిక వారసులుగా, కడకు వారూ 'దైవాలు'గా గౌరవించబడసాగారు. అనగా, భగవంతుడు అనే భావన, రూపం ఒక మానవ విజువల్ సాహితీ ప్రక్రియ. మరోమాటలో చెప్పాలంటే, ప్రకృతిలోని ఒక ఎలిమెంట్ మానవుని సృజనాత్మక మెదడులో ఒక రూపాన్ని సంతరించుకోవడం, క్రమంగా మహిమాన్విత శక్తిగా ఆ రూపం పరిణామం చెందడం అని చెప్పవచ్చు - అదే భగవంతుడు.

ప్రకృతిలోని రూపాల సుగుణాలకు దైవ స్థానం కల్పించిన కొంతకాలానికి నీరు, సూర్యుడు, ఔషధ వృక్షాలువంటి ప్రకృతి రూపాల్ని యథాతథంగా మానవుడు ఆరాధించడం ఆరంభించాడు. ఆ తరువాత, ఇదే ప్రకృతి స్వరూపాల్ని చిహ్నాల రూపంలో (శివలింగంవలె) అర్ధమానవ-అర్ధప్రకృతి (విఘ్నేశ్వరుని రూపంవలె) రూపాల్లో, మానవ రూపాల్లో (శివుని రూపంవలె) ఆరాధించడం జరిగింది (మానవ పునరోత్పత్తికి కారణమైన లింగ, యోనిలను తొలినాళ్ళలో ఆరాధించి క్రమంగా లింగరూపుడుగా, మానవ రూపుడుగా శివుడు ఆరాధింపబడినట్లు). మరికొంత కాలానికి ఈ రూపాలన్నింటికీ మానవాతీత శక్తుల్ని ఆపాదించడం ఆరంభమైంది (చరాచర పదార్థాలన్నింటి లోనూ శక్తి, అనగా ఎనర్జీ, ఉందిగానీ మహిమలు లేవని నాటి మానవుడికి తెలియక నేటి మానవుడికీ తెలియదు). ఇంకొంతకాలానికి ఈ మానవాతీత శక్తిగల రూపాలుగా భావింపబడు వాటిగురించి (మానవ రూపాల్లోని వాటితోబాటు) భక్తి, భజన పాటలతో నయనార్లు, ఆళ్వార్లు, ఆచార్యులువంటి వారు (బ్రాండ్ అంబాసిడర్లు); నాట్యం, నాటకం, శిల్పకళ, చిత్రలేఖనం, ఆలయ నిర్మాణాలువంటి పలు విధ కళారూపాలతో ఔత్సాహికులు ప్రచారం చేయడం కూడా జరిగింది. అలా, ప్రకృతి ధర్మాల, అనగా ప్రకృతి రూపాల సుగుణాల స్థానంలో

భక్తి తత్వాల ప్రాధాన్యం పెరిగేట్లు చేయడం జరిగింది; మనిషి సృజనాత్మక శక్తికి (శాస్త్రీయ ఆలోచనలకు) సంకెళ్ళు వేయడం జరిగింది. ఈ భక్తితత్వం క్రమంగా ఉన్మాద రూపాన్ని సంతరించుకొని హింసావాసనల్నికూడా దగ్గర చేర్చుకోసాగింది (వీటి ఫలితమే శైవవైష్ణవ తగవులు, ఘర్షణలు, నరుక్కోవడాలు, కడకు యుద్ధాలు జరగడం.) అందులో భాగంగానే భక్తులు ఆలయ రథచక్రాల క్రింద పడి ప్రాణాలు అర్పించడం, కొక్కేనికి శరీరాన్ని వ్రేలాడదీసుకొని ప్రాణాలర్పించడం, తమ శరీర భాగాల్ని కత్తితో నరుక్కొని భగవంతునికి సమర్పించడం, తమను తామే నరుక్కొని ప్రాణాలు అర్పించడంవంటి పోకడలు కూడా ఏర్పడ్డాయి (తిరుమలవంటి ప్రాంతాల్లో కూడా.)

ప్రకృతిలోని చరాచర పదార్థాలు, ప్రాణుల సుగుణాలకు ప్రతిరూపమైన భగవంతుని ఎడల భక్తి, అంకిత భావాల్ని ప్రదర్శించడంకై మానవుడు ఎన్నుకొన్న కళల్లో సంగీత, నాట్యాలు ప్రధానమైనవి. ఇలాంటి కళారూపంలో భగవంతునికి సేవచేసే సాంప్రదాయం శ్రీరంగంలోని రంగనాథుని ఆలయంలోవలె తిరుమలలోకూడా ఉండడం క్రీ.శ. 13వ శతాబ్దినుండి అగుపడుతుంది. తిరుమలలో ఈ కళా సాంప్రదాయాన్ని ఆచరిస్తుండిన కన్యలైన నాట్యగత్తెల్ని ఎంపెరుమానదీయర్ అని పిలిచేవారు (విజయనగర కాలాన.) తరువాతి కాలాల్లో రాజకీయ అనిశ్చితి వలన, రాజ్య ఆర్థిక పరిస్థితి దిగజారడం వలన, సమాజంలో విలువలు పడిపోవడంవలన, ముఖ్యంగా విజయనగర పాలన మధ్యకాలం నుండి వీరి సాంప్రదాయ కళను పోషించే పాలకులు, ఆలయాలు, సమాజం లేకపోవడం వలన వీరు పేదరికానికి బలై వీరి దైవసేవా (దేవదాసీ) సాంప్రదాయం దిగజారడంతో 'తిరువీధిసానులు'గా పిలువ బడ సాగారు. దైవసేవకులైన వీరిని సమాజం హీనంగా చూడసాగింది. ఎదుటివారి అవసరా లకు మనిషి ఉపయోగ పడినంత కాలమే మనిషి గౌరవింప బడతాడు, అలా ఉపయోగపడనినాడు గౌరవాన్ని కోల్పోతాడు అనడానికి వీరి జీవితమే నిదర్శనం.

విజయనగర కాలపు నాట్యగత్తెల్లో అనేకులు అత్యంత గౌరవప్రదమైనవారు. సాళువ, నరసింహ రాయల కాలంనుండి వీరు అమితమైన ప్రాముఖ్యాన్ని కూడా పొందసాగారు. ఇక ఎంపెరుమానర్ జీయర్, ఆలయ ప్రసాదాల్లో దాతల భాగాన్ని ఈ ఎంపెరు మానదీయర్ నాట్యగత్తెలకు క్రీ.శ. 1446లోనే కేటాయించాడు. మరోవైపు, సాళువ నరసింహునికాలంలో తిరుమల ఆలయ నగల రక్షకుడుగా, అన్నదాన సత్రాలైన రామానుజ కూటాల అధిపతిగా పనిచేసిన కందాడై రామానుజ అయ్యంగారైతే తిరువేంగడం ఉదయ్యాన్ అని నాడు పిలువబడుచుండిన వేంకటేశుని ఎదుటనే తనను (కందాడైని) పొగుడుతూ పాడే 'ఊల' పాటల్ని ఈ నాట్యగత్తెలతో పాడించుకొన్నాడు. రంజకం కుప్పాయిని అనే నాట్యగత్తె తిరుమలకు శ్రీ కృష్ణదేవరాయల వెన్నంటి వెళ్ళింది. అంతేగాక, క్రీ.శ. 1512, 1515లలో కూడా తిరుమలను సందర్శించింది. అచ్యుతరాయల కాలంలో ప్రముఖ నాట్యగత్తెలు అనేకులు క్రీ.శ. 1531 నుండి తిరుమలకు రాసాగారు. వీరిలో అనేకమంది తిరుమల ఆలయానికి పలువిధ దానాలుకూడా చేశారు. కానీ, క్రీ.శ. 1548 తరువాత దాతలుగాగాని, లబ్ధిదారులుగాని తిరుమల శాసనాల్లో ఎక్కడా వీరి ప్రస్థావన లేదు. బహుశా నాటి రాజకీయ అనిశ్చితి ఒక కారణం కావచ్చు. మరొక కారణం అన్నమయ్య (క్రీ.శ. 1408-1503) కుటుంబ ప్రాధాన్యం తిరుమలలో పెరిగి, వీరి ప్రాధాన్యం వెనక్కు వెళ్ళివుండవచ్చు. అనగా, కొన్ని కుటుంబాల ప్రాబల్యంలోకి తిరుమల ఆలయం వెళ్ళిపోయి, ఇతర కుటుంబాలు, ముఖ్యంగా దూరప్రాంతాల నుండి వచ్చిన కుటుంబాలు మరుగున పడిపోయి ఉండవచ్చు. ఇక, సంగీత, నాట్యాల ప్రస్థావనకు వస్తే, ఈ సాంప్రదాయం శ్రీరంగం నుండి దిగుమతి అయినట్లు, అది రామానుజానంతర, యాదవ రాయుళ్ళ అనంతర కాలాల్లో ఆవిర్భవించిన నూతన దైవారాధనా విధానాలనుండి ఉద్భవించిందని చెప్పవచ్చు.

అసలు, ఆలయంలో పూజ జరిగేప్పుడు ఒకదశలో కుంభహారతి జరిపే సమయంలో సంగీత, నాట్య కార్యక్రమాలు నిర్వహింప బడాలని ఆగమాలే తెలుపు తున్నాయి. అలాగే, దేవతా వాహన ఊరేగింపు జరిపే సమయాల్లో అక్కడక్కడా వీధుల్లోను, వీధి తిరుగుడుల్లోను సంగీత, నాట్య కార్యక్రమాలు నిర్వహింపబడాలి. ఊరేగింపు పూర్తయ్యాక, దైవ వాహనాన్ని ఆలయంలోనికి తీసుకొని వెళ్ళే సమయంలో కుంభహారతి ఇవ్వబడాలి. దేవతా వాహనం వెంట కుంభహారతిని మోసుకొస్తోన్న నాట్యగత్తెల బృందం మొత్తం దేవతా వాహనాన్ని, దైవాన్ని ప్రదక్షణచేసి ఎంపెరు మానదీయర్‌లు మారతిని అర్చకునికి అందించాలి. క్రీ.శ. 1515కు పూర్వం ఈ నాట్యగత్తెలు దేవతా వాహన ఊరేగింపులో పాల్గొనడం, ఆ సేవకు బత్తెం



నాట్య సుందరి

పొందడం జరుగుచుండేది. కాని, ఆ తరువాత పాల్గొనడమూ, బత్తెం పొందడమూ రెండూ అదృశ్యమైనట్లు తెలుస్తోంది. వారి సేవలు ఆలయం లోపలి ప్రాంగణానికి మాత్రమే పరిమితం కాబడినట్లు తెలుస్తోంది. అనగా, వారి స్థాయి(స్టేటస్) లో ముఖ్యంగా కృష్ణదేవరాయల కాలంనుండి మార్పు చేయబడినట్లు తెలుస్తోంది.

అసలు తిరుమల ఆలయంలో సంగీత, నాట్య సేవ చేయాలనుకొనే ప్రతి ఎంపెరుమానదీయార్ కొన్ని కఠిన ఆచారాలను పాటించాల్సి ఉండేది. వాటిలో ఒకటి, ప్రతి నాట్యగత్తె ఆలయ ఆచార్య పురుషుని చేతులమీదుగా 'చక్రాంగితం' స్వీకరించాలి. అనగా, భగభగ మండే లోహపు శంఖు, చక్రముల ముద్రను శరీరంపై వేయించుకోవాలి. అలాంటి ప్రతి స్త్రీ ఒక ఆచార్యపురుషుని శిష్యురాలిగా ఉండాలి. వారు నీతి నియమాన్ని పాటించాలి. మంచి ప్రవర్తనను కలిగిఉండాలి. నిజంగానే, వారు ఆ రీతిగనే జీవించేవారు. వీరంతా భరతనాట్యంలో అత్యంత నిష్ణాతులుగానూ ఉండేవారు.

అంతేగాక, వీరంతా వెంకటేశుని వీరభక్తురాండ్రు. ఆయనకు ఎన్నోరకాల దానాలు కూడా చేశారు. తిరుమలలో మండపాలు కట్టించారు. తాము నిర్మించిన మండపాల్లో జరిగేట్లు శ్రద్ధ తీసుకొనేవారు. తిరుమల ఆలయంలో తాము చేసిన సేవకు ప్రతిఫలంగా పొందే దాతల ప్రసాదభాగంను ఆలయ సేవకులైన శ్రీ వైష్ణవులకు తమ ఆచార్య పురుషులకు వీరు దానం చేసేవారు.



విలాసినీ నాట్యం

ఇక, తిరుపతిలోని వీరనరసింహ స్వామి ఆలయంలో సేవచేసే వెంకటవల్లి (సవరి పెరుమాళ్ కుమార్తె) క్రీ.శ. 1457లో వెయ్యి ఫణాల్ని దానంగా ఇచ్చింది. జక్కుల కన్నాయి (తమ్ము నాయకర్ కుమార్తె) అన్నప్రసాదంకై (ఫుడ్ ఆఫరింగ్) క్రీ.శ. 1481లో వెయ్యిన్నీ నాలుగువందల ఫణాల్ని దానంగా ఇచ్చింది. అలాగే, ఆనైమాదిమగళ్వలంది (తిరువీధిసాని అనైమేడై కుమార్తె) క్రీ.శ. 1486 లో 300 ఫణాల్ని దానంచేసింది. కృష్ణదేవరాయల వెంట తిరుమల వచ్చిన కుప్పాయిని క్రీ.శ. 1512, 1515లలో కూడా తిరుమల సందర్శించడంతో బాటు క్రీ.శ. 1512 జూన్ నెలలో ఒక సంధిసేవకై వెయ్యి ఫణాల్ని దానంగా ఇచ్చింది. ఆమె తండ్రి రంజకం శ్రీరంగరాయలు క్రీ.శ. 1514 డిశంబర్ నెలలో ఒక నిత్యతిరుప్పోణకంకై ఎరలుపూండిని (మాడల నెల్లూరు సీమలోనిది) దానంగా ఇచ్చాడు.

అచ్యుతరాయల కాలంలో ప్రసాదసేవ (ఫుడ్ ఆఫరింగ్)కై కొందరు ప్రసిద్ధిగాంచిన నాట్యగత్తెలు కూడా దానాలు చేశారు. గోవిందసాని అనే నాట్యగత్తె క్రీ.శ. 1530లో 300 ఫణాల్ని తిరుమల ఆలయానికి దానం చేసింది. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో నిత్యప్రసాద సేవకై క్రీ.శ. 1534లో 1620 ఫణాల దానం చేసింది. మరోసారి ఇదే ఆలయానికి క్రీ.శ. 1535లో 1750 ఫణాల దానం చేసింది ఈమె సజ్జపోలు నాయకుడను వాని కుమార్తె. మరొక నాట్యగత్తె పెరుచ్చి (సెవ్వి అనువాని కుమార్తె) 230 ఫణాల దానం చేసింది. ఇంకొక నాట్యగత్తె బెజ్జి లేదా బెజ్జెమ్మ (సెల్వి అనువాని కుమార్తె) 200 ఫణాల దానం చేసింది. తిరుమలకు అచ్యుతరాయలు ప్రత్యేకంగా పంపిన హనుమసాని (ఊదిగం తిమ్మయ్య కూతరు) క్రీ.శ. 1540లో 820 ఫణాల దానం చేసింది. అలాగే సెల్లి (కైకాల కులపు రాలు) అను మరో నాట్యగత్తె తిరుమలలో ఉత్సవర్‌కు తిరుమంజసం జరపడంకై రోహిణిలో, తైమాసంలో, పంటవూర్పిడికాలంలో జరిగే ఉత్సవ సమయంలో, అనగా 21-11-1543లో 1120 ఫణాల దానం చేసింది. ఇక, కుమార తాతయ్యంగార్ శిష్యురాలు, తుంగచ్చెల్వి తిమ్మి కుమార్తెయైన సెన్‌బాక వెంగు (శెంణ్యక వెంగు) ప్రసాదసేవకై 600 ఫణాల దానం చేసింది. అచ్యుతరాయలు తిరుమలకు పంపిన నాగసాని 20-07-1547న ఒక దానం చేసింది. ఐతే ఎన్ని ఫణాల దానమో తెలియడంలేదు. క్రీ.శ. 1548 నుండి శాసనాలలో నాట్యగత్తెల ప్రస్తావన లేకున్నప్పటికీ వీరంతా తిరుపతిలోని ఇతర ఆలయాల్లో నియమింపబడ్డారని తెలుస్తోంది. సెవ్వసాని అను నాట్యగత్తె తిరుపతిలో ఎంపెరు మానదీయర్‌గా ఉండేదని 30-01-1536 నాటి శాసనం ద్వారా తెలుస్తోంది. శేష్పసాని, ఎక్కు, ఆమె కుమార్తె నాచ్చి వంటి అనేకులు కూడా సేవ చేశారు.

తిరుమల-తిరుపతిలకు ఈ నాట్యగత్తెలు పెద్దసంఖ్యలో రావడం అచ్యుతరాయల కాలంలో ఆరంభమై, క్రీ.శ. 1548 తరువాత వారి ఉనికే తిరుమలలో లేకుండా పోవడం జరిగింది. నాటి ప్రసిద్ధిగాంచిన నాట్యగత్తెలలో ముద్దు కప్పాయి, రంజకం కుప్పాయిని, (కుప్పసాని), తిరువేంకట మాణిక్యం, ఆమె సోదరి లింగసాని ముఖ్యులు. వీరు సదాశివరాయల కాలంలోకూడా తిరుమల ఆలయంలో సేవలు చేశారు. భరతనాట్యంలో వీరికిగల ప్రావీణ్యమే వీరికి తిరుమల ఆలయంలో ప్రాధాన్యత పెరిగేట్లు చేసింది. తిరువేంకట మాణిక్యం, లింగసాని (లింగి)లు తిప్పసాని కుమార్తెలు. వీరూ గుడికి దానాలు చేశారు.

ఇక, ముద్దు కుప్పాయిని విషయానికివస్తే, ఈవిడ నాటి భరతనాట్య ప్రదర్శకులలో అత్యున్నత స్థానంలో ఉండేదని తెలుస్తోంది. తిరుమలవంటి ప్రసిద్ధిగాంచిన ఆలయానికి ఇలాంటి ప్రసిద్ధిగాంచిన నాట్యగత్తె ఉండాలని భావించి కాబోలు అచ్యుత దేవరాయలు ఈమెను తిరుమల ఆలయంలో సంగీత, నాట్య సేవలకై పంపించాడు. ఈ సంఘటన మంగళవారం, 6వ తేదీ, జూన్‌నెల, 1531న జరిగింది (బహుళ షష్ఠి, తమిళనెల మిథునం, ఖార సంవత్సరం, శక 1453న). ఇందుకై తిరుమల ఆలయ స్థానత్తర్ (నిర్వాహకుడు)కు ఒక రాయసం అనబడు రాజ ఆజ్ఞను కూడా అచ్యుతరాయలు జారీ చేయడం జరిగింది. అందులో తిరువేంగడం ఉదయన్ (వేంకటేశుని) ఆలయంలో 'ఊడిగం' (సేవలు/విధులు) చేయడంకై ముద్దు కుప్పాయిని నియమింప బడిందని పై తేదీనుండి సూర్యచంద్రాదు లున్నంత కాలం విధులు/సేవలు నిర్వర్తిస్తుందని తెలపడం జరిగింది. అంతేగాక, ఈమె సేవలకు ప్రతిఫలంగా ఈమెకు, ఆమె వారసులకు తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంనుండి ప్రతినిత్యం ఒక తళిగ ప్రసాదం ఇవ్వాలనికూడా ఇందులో ఆజ్ఞాపించడం జరిగింది (రామానుజా చార్యుల కోరికమేరకు ఆరోజుల్లో తిరుమల ఆలయంలో సేవలు చేసేవారుగాని, ఇతరులుగాని తిరుమలలో నివాసం ఉండేవారు కాదు, తిరుపతిలోనే నివాసాలు కల్గి ఉండేవారు. అందుకే స్థానికంగా ఉన్న గోవిందరాజ స్వామి ఆలయంనుండి తాజా ప్రసాదాలు కుప్పాయినికి పంపబడేట్లు రాజాజ్ఞ చేయబడింది.) ఒక తళిగ ప్రసాదం నాడు అర్ధఫణం లేక మూడు అణాలకు సమానంగా ఉండేది. కుప్పాయినికి ఇవ్వబడిన ప్రసాదం ఆమె సేవలకు ఇవ్వబడిన సంతృప్తికర చెల్లింపులుగా భావించరాదు. ఇది ఒక ఉన్నతస్థాయి వారికి ఇవ్వబడిన గౌరవమర్యాదలుగా గుర్తించాలి. కుప్పాయిని తల్లి విద్వత్ సభారాయ రంజకం కుప్పసాని (కుప్పాయిని). ఈమె (విద్వత్ కుప్పసాని) విద్వత్ సభారాయ రంజకం శ్రీరంగరాయని కుమార్తె; భరతనాట్య ప్రవీణులు తిరుమలైనాథుని మనుమరాలు. వీరంతా ప్రసిద్ధిగాంచిన భరతనాట్య ప్రదర్శకులు, తిరువెంగళ(డ)నాథుని వీరభక్తులు. రంజకం కుప్పసాని, రంజకం శ్రీరంగరాయలు ఇద్దరూ కృష్ణదేవరాయల ఆస్థానంలో సభారంజకులుగా ఉండేవారు. ఇక, వీరి కుమార్తె అచ్చుత రాయల ఆస్థానంలో ఉండేది. నిత్యం ఒక తళిగ ప్రసాదం ఇవ్వడంతో గౌరవించడం వేంకటేశునికి విడిగా సేవలందించే అవకాశం రంజకం కుప్పాయినికి మాత్రమే కల్పించినట్లు తెలుస్తోంది, ఆమె ఉన్నతస్థానం అలాంటిది.


భామనే...

అచ్యుతరాయ కాలపు ప్రసిద్ధిగాంచిన నాట్యగత్తెల్లో తిరువేంకట మాణిక్యం (మాణిక్కం), ఆమె సోదరి లింగసాని కూడా ఉండేవారు. వీరు తిప్పసాని అని పిలువబడినతిరు వేంకటదాసి కుమార్తెలు; తాతయ్యంగార్ శిష్యురాండ్రు. వీరికి తిరుమలలో ఒక తోట, ఒక మండపం ఉండేవి. వీరు తిరుమల ఆలయానికి పలు పర్యాయాలు దానాలు చేశారు. వేసవి కాల ఉత్సవ సమయాల్లో శిలారథ మండపంలో ప్రసాదసేవలకై (ఫుడ్ ఆఫరింగ్) క్రీ.శ. 1533–1545ల మధ్య 330 ఫణాలు, 230 ఫణాలు, 1650 ఫణాలు, 1600 ఫణాలు దానంగా ఇచ్చారు. సదాశివరాయల కాలంలోనైతే తిరువేంకట మాణిక్యం ప్రత్యేక గౌరవాల్ని పొందింది. కుమార తాతతయ్యం గార్ శష్యుడైనట్టి, మహాప్రధాని అళియ రామరాయలకు పెదతండ్రి అయినట్టి, స్థానిక నాయకుడై నట్టి పొట్లపాటి తిమ్మరాజు (ఇతని కుమారుడు ఆరవీటి విఠేలేశ్వర రాజు) కారణంగా 'దండిగై' అని పిలువబడిన వేంకటేశుని పల్లకిని తిరుమల ఆలయ 'స్థానత్తరు' స్వయంగా తిరువేంకట మాణిక్యానికి బహూకరించాడు. దేవుణ్ణి కూర్చున బెట్టు అందలంపై ఈమె కోర్చోసాగింది. (అనగా అన్నమయ్య కన్నా ఎక్కువ గౌరవం పొదింది. భక్తురాలుగా) అంతేగాక, ఈమెకు తిరుమలలో నిత్యం ఒక తళిగ (తట్టు) ప్రసాదం కేటాయింపబడింది. ఈ ప్రసాదం నుండి ఆలయ అర్చకులు, వంటవారు పొందే 'అల్లు' అనబడు 'అలివు' వసూలు కూడా మినహాయించ బడింది. మరోవైపు తిరుపతి ఆలయంలోనూ శాశ్వతంగా, ఈమెకు, ఈమె వారసులకు ఒక తళిగ (తళియ) ప్రసాద బహుమానం ఇవ్వబడింది. తిరుమలలో ఈ ప్రసాదం మొదటిగంట (బెల్) తరువాత ఇవ్వబడాలని, తిరుపతిలో మాత్రం ఈ ప్రసాదం తిరువేంకట మాణిక్యం ఇంటికి చేర్చబడాలని రాజ ఆజ్ఞ ఉండేది. ఈ విషయం సదాశివరాయలు సింహాసన అధిష్ఠానం జరిగిన మూడు సంవత్సరాల తరువాత జరిగింది. ఇది 23–07–1546 నాటి శిలాశాసనంలో ఉంది.

డా॥ దేవిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్,
చరిత్రశాఖ, ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి
మొబైల్: 9849584324

# తుర్రేబాజ్ ఖాన్



**నేటి** 'కోటి' మహిళా కళాశాల ప్రాంగణంలో ఉండిన బ్రిటిష్ 'రెసిడెన్సీ'పై జూలై 17, 1857న ఐదువేల మందితో ముట్టడి చేసి వలస పాలకుల్ని వణికించిన మగధీరుడు....

మనం మరచిపోయిన తుర్రేబాజ్ ఖాన్. బ్రిటిష్‌వారి పెత్తనాన్ని, దోపిడీని తీవ్రాతి తీవ్రంగా ద్వేషించిన భారతీయుల్లో తుర్రేబాజ్ ఖాన్ ఒకడు. జూలై 17, 1857వ తేదీన హైదరాబాద్‌లోని బ్రిటిష్ రెసిడెన్సీపై ముట్టడి చేసి, నాటి నిజాం రాజ్యంలో ఆంగ్లేయుల పరోక్ష పాలనకు ప్రకంపనలు సృష్టించిన వాడూ, బీటలు కొట్టినవాడూ ఇతడే. ఐతే, బ్రిటిష్ పాలన అంతం కావాలని కన్న కల నిజం కాకముునుపే హైద్రాబాద్ సమీపానగల తూప్రాన్ వద్ద నిజాం-బ్రిటిష్ బలగాలతో జరిగిన పోరాటంలో జనవరి 23, 1859న ప్రాణాలర్పించాడు. కడకు, హైదరాబాద్‌లోని బేగంబజార్‌లో తన నివాస సమీపంలోనే ఒక చెట్టుకు, శవంగా వ్రేలాడదీయబడినాడు.

1857 నాటికి నిజాం రాజ్యంలో, దేశం మొత్తంలో సంభవిస్తుండిన రాజకీయ పరిణామాలకు ప్రభావితుడైన, తుర్రేబాజ్ ఖాన్ ఆంగ్లేయులంటేనే కోపంతో రగిలిపోయేవాడు. తొలుత, పలు బ్రిటిష్ వ్యతిరేక కార్యకలాపాల్ని ఫైస్కల్, మాన్ కడప, గుల్బర్గా, వంటి ప్రాంతాల్లో చేపట్టాడు; అందుకు కఠిన శిక్షలూ అనుభవించాడు. ఐతే, హైదరాబాద్‌లోని మక్కా మసీదుకు వెళ్ళిన తుర్రేబాజ్ అక్కడ సమావేశమైన ముస్లిం జన సమూహాన్ని చూసి, వారి ఆవేదనను గుర్తించి, మౌల్వీలు, ఇతర పెద్దలు బ్రిటిష్ రెసిడెన్సీని ముట్టడించాలని తీసుకొన్న నిర్ణయాన్ని విని, ఆవేశంతో జూలై 17, 1857న మత జెండాను చేతబుచ్చుకొని, పసుపు రంగుపై ముదురు రంగు మచ్చలు గల పులి వంటి రంగు గల గుర్రంపై శరవేగంగా పయనిస్తూ, బేగంబజారుకు వెళ్ళి, దాదాపు ఐదువేల మంది రోహిల్లాల్ని, అరబ్బుల్ని, విద్యార్థుల్ని, బ్రాహ్మణుల్ని, బ్యాంకర్లను, వ్యాపారుల్ని, ఇతరుల్ని సమకూర్చుకొని బ్రిటిష్ రెసిడెన్సీని ముట్టడించడంకై మెరుపువేగంతో, కాల యముడు వలె ముందుకురికాడు. ఇదే తరుణంలో, అప్పటికే రహస్యమంతనాలతో తనకు అనుకూలంగా, మార్చుకోగలిగిన ఇస్లాం మత బోధకుడు, నగరంలో అత్యంత గౌరవనీయుడుగా పేరుగాంచిన మౌల్వీ సయ్యద్ అల్లా ఉద్దీన్ కూడా తన అనుచర గణంతో పుత్లీబౌలి మీదుగా పయనించి రెసిడెన్సీ నైరుతి కొసప్రాంతానికి చేరుకొన్నాడు.

ఆ వెంటనే, ఉద్యమకారులు రెసిడెన్సీ పక్కన గల అబ్బన్ సాహెబ్, జైగోపాల్ దాస్ అను సాహుకార్‌లకు చెందిన భవనాలపైకి చేరి దాడి కొనసాగించారు. ఇది సాయంత్రం గం॥ 6.30ని॥ ప్రాంతంలో జూలై 17, 1857న జరిగింది. ఆ తరువాత, తుర్రేబాజ్ నాయకత్వంలోని ఉద్యమకారులు ఒక రెసిడెన్సీ గేటును ధ్వంసం చేయగా, మరొక గేటును అల్లా ఉద్దీన్ నాయకత్వంలోని ఉద్యమకారులు విరగ్గొట్టారు. దీనితో రెసిడెన్సీలోని బ్రిటిష్ సైన్యానికి, తుర్రేబాజ్, అల్లాఉద్దీన్ల నాయకత్వాల్లోని ఉద్యమకారులకు మధ్య పోరాటం జరిగింది. ఈ పోరాటం జూలై 18, 1857 నాటి తెల్లవారు జామున నాల్గు గంటల వరకు కొనసాగింది. పోరాటం కొనసాగించడం కష్టమని భావించిన తుర్రేబాజ్, అల్లా ఉద్దీన్‌లు, అదనపు బలగాల్ని సేకరించాలని తలంచి అక్కడి నుండి నిష్క్రమించారు. ఈ సంఘటనలో కొందరు చనిపోయారు, కొందరు బందీలయ్యారు. కొద్ది రోజుల్లోనే తుర్రేబాజ్ కూడా షాద్‌నగర్ దగ్గర మొగలిగిద్ద గ్రామంలో పట్టుబడ్డాడు. చివరకు, అండమాన్ దీవుల్లో జీవిత ఖైదీగా శిక్షపడింది. ఐతే, ఇతడు జనవరి 18, 1857న జైలు నుండి అండమాన్‌కు వెళ్లకముందే తప్పించుకొన్నాడు. కడకు, కుర్బాన్ ఆలీ ఆధీనంలోని ఆయుధ బలగాల చేతిలో తూప్రాన్ వద్ద చంపబడ్డాడు. ఇది జనవరి 23, 1859న జరిగినట్లు తెలుస్తోంది. (ఈ విషయాన్ని కుర్బాన్ ఆలీ జనవరి 24,

1859న సాలార్‌జంగ్‌కు తెలియజేశాడు). తుర్రెబాజ్ శవం గులాం హైదర్, బాబూలాల్, మరికొందరి రక్షణలో హైదరాబాద్‌కు, తీసుకురావడం జరిగింది. ఆ తరువాత, బేగంబజార్‌లో ఇతని ఇంటి సమీపంలోని చెట్టుకు వ్రేలాడ తీయబడింది. ఇక, జూలై 18, 1857న తప్పించుకు వెళ్ళిన అల్లాఉద్దీన్ చివరకు నాటి ఇబ్రహీంపట్నం తాలూకాలోని మంగల్‌పల్లి లో బందీయై, దేశబహిష్కరణ శిక్షకు గురై జూన్ 28, 1859న అండమాన్ దీవులకు పంపబడినాడు. కడకు అక్కడే 1884లో మరణించాడు. నిజామాంధ్ర నుండి అండమాన్‌కు పంపబడిన ఖైదీ ఇతడే. ⓜ

---

**ప్రథమ భారత స్వతంత్ర సంగ్రామానికి (1857) ముందు నిజాం రాజ్యంలో సంఘటనలు....**

**1800**వ సం॥నిజాంతో బ్రిటీష్‌వారికి జరిగిన ఒప్పందం ప్రకారం నిజాం బ్రిటీష్‌వారికి సైన్య సహకారాన్ని అందించాలి. కాని, ఈ ఒప్పందం నిజాం సర్దార్లకు యిష్టంలేదు. అందుకని నిజాం సేనలు బ్రిటీష్‌వారికి సహాయం చేయకపోగా అనేక అడ్డంకులను కలిగించారు. 1803లో మహారాష్ట్రులతో బ్రిటీష్ వారికి యుద్ధం సంభవించింది. దౌలతాబాద్ ఖిల్లాదార్‌ను బ్రిటీష్ మేజర్ జనరల్ వెలస్లీ ఎంత ప్రార్థించినా గాయపడ్డ బ్రిటీష్ సైనికులకు ఆశ్రయమివ్వలేదు. బదనాపూర్ ఖిల్లాదార్ బ్రిటిష్ సైనికులపై కాల్పులు జరిపాడు. రాజా సుక్రుదాస్ బ్రిటీష్ సైనికులకు ధాన్యాన్ని అమ్మనివ్వకుండా చేసి ఆకలితో అలమటించేటట్లు చేశాడు. దారూర్ ఖిల్లాలో తలదాచుకోవడానికి ఆశ్రయమివ్వమని బ్రిటీష్ సైనికులను కోరినప్పటికీ ఆ దరిదాపులలో బ్రిటీష్ సైనికులు కనిపిస్తే కాల్చివేస్తామని ఖిల్లాదార్ హెచ్చరిక జారీచేశారు. బ్రిటీష్ ఆధిపత్యాన్ని వ్యతిరేకించే సైనికులకు రాజా రంభారావు నింబాల్కర్, నురుల్ ఉమ్రా అనే ఇద్దరు అమీర్లు ఆశ్రయమిచ్చారు. బీరార్ గవర్నరుగా రాజా మహీపతిరామ్ నియమించబడక ముందు ఫ్రెంచి జనరల్ రేమండ్ శిక్షణ ఇచ్చిన సైనిక పటాలానికి నాయకత్వం వహించాడు. మహీపతిరామ్ బ్రిటీష్‌వారికి సైనిక సహకారం నిరాకరించి గోర్డాన్ మరియు పామర్‌ల నాయకత్వంలో వచ్చిన నిజాం సైన్యాన్ని ఎదిరించాడు.

1812లో రెసిడెన్సీ బజార్‌లోని సైనికులు బ్రిటీష్ కమాండర్ మేజర్ ఎడ్వర్డ్ గోర్డన్‌కు ఎదురు తిరిగి అతనిని ఫిరంగి మూతికి కట్టారు. నిజామాబాద్‌లోనూ నిజాం సైన్యం బ్రిటీష్‌వారికి ఎదురు తిరిగింది. 1817లో బ్రిటీష్‌వారికి, బాజీరావ్ పేష్వాతో యుద్ధం జరుగుతున్నప్పుడు నిజాం సైన్యం లోని జమేదారు తన పటాలంతో సహా బాజీరావుతో చేరి పోయినాడు. సికిందరాబాద్‌లోని బొలారం సైనిక స్థావరంలోనూ, రాయచూర్ మొమ్మినాబాద్, జాల్నా, హింగోలి మొదలైన చోట్ల కూడా బ్రిటీష్ సైనిక అధికార్లకు వ్యతిరేకంగా నిజాం సైనికులు తిరగబడ్డారు.

బీడులో ధర్మాజి ప్రతాపరావు లంబాడీలను కూడగట్టి బ్రిటీష్‌వారిపై తిరగబడి వారికి నష్టం కలిగించాడు. నాందేడు జిల్లాలోని నవసా గ్రామంలో పాతగడి ఉండేది. నవసాజీ, హన్సాజీ సోదరులు ధైర్యం చేసి దానిలో వున్న ధనం పాతరను తవ్వితీసి ఆ డబ్బుతో సైన్యాన్ని కూడగట్టుకొని బ్రిటీష్‌వారికి ఎదురు తిరిగారు. ఔరంగబాద్ జిల్లాలోని కన్నడ్, విజాపూర్, అజంతా తాలూకాల్లోని భిల్లులు 1819లో ఔరంగాబాద్ బ్రిటీష్ కంటోన్మెంట్‌పై గెరిల్లా దాడులు జరిపాడు.

1815లో నిజాం కుమారుడు ముబారిజ్ ఉద్దౌలా సేవకుడు 'షీరీన్' అను అతనితో బ్రిటీష్ రెసిడెన్సీలోని ఒక దర్జీ (కుట్టుపని వాడు) గొడవ పెట్టుకున్నాడు. ఈ విషయం తెలిసి ముబారిజ్ ఉద్దౌలా ఆ దర్జీని పట్టి తెప్పించాడు. ఈ విషయం తెలిసి బ్రిటీష్ ప్రాంతంలోని రెసిడెన్సీ లోని ఒక పౌరుణ్ణి తన అనుమతి లేకుండా ఎలా పట్టుకుంటాడు అని? బ్రిటీష్ రెసిడెంట్ కోపోద్రిక్తుడై ముబారిజ్ ఉద్దౌలా దేవిడీపై సైన్య దాడి జరపగ అక్కడ ఘర్షణ జరిగింది. ఈ విషయం తెలిసి నిజాం జోక్యం చేసుకొని బ్రిటీష్ వారి కోపం తగ్గించడానికి తన కుమారుణ్ణి గోల్కొండ కోటలో బంధించాడు. కొంతకాలం తరువాత విడుదలైన ముబారిజ్ ఉద్దౌలా బ్రిటీష్ వ్యతిరేకంగా అరబ్బులను, ఆఫ్ఘన్లను కూడగడుతుండగా ఈ విషయం తెలిసి బ్రిటీష్ రెసిడెంట్ కల్నల్ స్టీవార్టు నాయకత్వంలో కొంత సైన్యంతో ముబారిజ్ దేవిడీ పై దాడి జరిపి, అతనిని తిరిగి 1829లో గోల్కొండ కోటలో నిర్బంధించాడు.

- కుర్రా జితేంద్రబాబు

# టప్పా

– ఎలనాగ

హిందూస్థానీ సంగీతంలోని ఉపశాస్త్రీయ శైలుల్లో అన్నిటికన్న ఎక్కువ విలక్షణమైంది టప్పా. ఇది మనం సాధారణంగా వినే ఉపశాస్త్రీయ సంగీతం కన్న ఎంతో భిన్నమైన స్వభావాన్ని కలిగి వుంటుంది. హిందుస్థానీ సంగీతంలో శాస్త్రీయ, ఉపశాస్త్రీయ అని రెండు ప్రధాన విభాగాలున్నాయి. శాస్త్రీయ విభాగంలో మళ్లీ ధ్రుపద్, ధమార్, ఖయాల్ అని మూడు రకాలు. ఉపశాస్త్రీయ విభాగంలో ఠుమ్రీ, దాద్రా, టప్పా, కజ్‌రీ, చైతీ, హోరీ, సావనీ, ఝూలా, బారామాసా మొదలైన పలురకాలు వున్నాయి. ధ్రుపద్, ఖయాల్‌లలో శాస్త్రీయత ఎక్కువ. అంటే అవి శుద్ధ శాస్త్రీయ అంగాలన్న మాట. ఖయాల్‌లో కన్న ధ్రుపద్‌లో శాస్త్రీయత అధికంగా ఉంటుంది. హిందుస్థానీ శాస్త్రీయ సంగీతానికి ధ్రుపద్ పునాది వంటిది. ఇక ఉపశాస్త్రీయ అంగాల్లో కూడా పైన ఇచ్చిన జాబితా లోని శైలుల్లో ఠుమ్రీ, టప్పాల్లో ఉన్నంత శాస్త్రీయత మిగిలిన వాటిలో ఉండదని స్థూలంగా చెప్పుకోవచ్చు. గజల్‌లో కూడా శాస్త్రీయత చాలా తక్కువ. ఐతే ఈ ఉపశాస్త్రీయ అంగాలు చాలా వరకు శాస్త్రీయ సంగీతంలోని రాగాల మీద ఆధారితమై (Raga based అయి) ఉంటాయి. దాద్రాల్లో ఆధారితమైన శాస్త్రీయ సంగీత రాగాల స్వభావం లీలామాత్రంగా, అస్పష్టంగా ఉండటం మూలాన రేడియోలో, టీవీలో అనౌన్స్ చేసేటప్పుడు కేవలం పాడిన వారి పేరే చెబుతారు తప్ప ఆ దాద్రా ఏ రాగం మీద ఆధారితమైందో చాలా సందర్భాల్లో చెప్పరు. గజల్లలో అయితే రాగం ఆధారితమై ఉన్నా ఆ రాగం పేరును అసలే పేర్కొనరు. ఎన్నో సినిమా పాటలు (తెలుగువి, హిందీవి) కూడా, శాస్త్రీయ సంగీత రాగాల మీద ఆధారితమై ఉంటాయి. అయితే వాటిలో ఆ రాగాల స్వల్పమైన ఛాయలు మాత్రమే ఉంటాయి కనుక ఒక పాటను అనౌన్స్ చేసేటప్పుడు అందులో ఏ రాగచ్ఛాయలను పొందుపరిచారు అనే విషయం చెప్పరు. టప్పాశైలి జన్మకు సంబంధించిన వృత్తాంతం ఆసక్తికర మైనది. 18వ శతాబ్దంలో సదారంగ్, అదారంగ్‌లు ఖయాల్ శైలిని ప్రతిష్ఠితం చేశారు. అయితే ఆ రోజుల్లో దాన్ని లోకప్రియం చేసిన వారిలో గులామ్ రసూల్ ఖాన్ కూడా ఉన్నాడు. అతని కుమారుడైన గులామ్ నబీశోరి ఈ టప్పా శైలిని రూపొందించినట్టు సంగీత చరిత్ర చెబుతుంది. ఇతడు శోరీ మీయా అనే పేరుతో ప్రసిద్ధి చెందాడు. అది అతని ఉపనామం.


గిరిజా దేవి


ఎల్.కె. పండిత్

అవధ్ నవాబైన ఆసఫుద్దౌలా (1776-1797) ఆస్థానంలో గులామ్ నబీ శోరీ గాయకుడుగా ఉండే వాడు. మొదట్లో ఈయన ఖయాల్‌లు పాడే వాడు. కాని రసికులు, సంగీతాభిమానులు అతణ్ణి అంతగా పట్టించుకోలేదు. తన ప్రతిభకు సరిపడే శైలి ఖయాల్ కాదని అతడు అసంతృప్తిగా ఉండే వాడు. పంజాబ్, సింధ్ ప్రాంతాల్లో వర్తకులు ఒంటెల మీద సంచరిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో బస చేసినపుడు వారి వినోదం కోసం అక్కడి ప్రజలు పాడే జానపద సంగీతాన్ని (లోక్ సంగీత్‌ను) గులామ్ నబీ శోరీ విన్నాడు. ఆ పాటలకు శృంగారం, విరహం వస్తువులు. ఆ విచిత్రమైన శైలికి ముగ్ధుడై దాని నుంచి టప్పా శైలిని అభివృద్ధి చేశాడు.

ఆయన రచించి స్వరపరచిన కొన్ని టప్పాల్లో చివరన శోరీ మియా పేరు వస్తుంది. ఆ విధంగా శోరీ మియా టప్పా శైలికి ఆద్యుడైనాడు. అయితే టప్పాకూ, అతనికీ మొదట్లో ఆదరణ దొరక లేదు. తర్వాత్తర్వాత సంగీతపరులు టప్పా విశిష్టతను గుర్తించి ఆదరించారు. బెంగాల్‌లో రామ్‌నిధిగుప్త తను సంగీతం కూర్చిన రచనలతో టప్పాను ప్రచలితం చేశాడు. వాటిని నిధుబాబు టప్పాలు అంటారు.

టప్పా అనే పదానికి ఫార్సీ భాషలో ఎగురుట లేక దుముకుట అని అర్థం వుంది. టప్పాలోని విశిష్టత పలు రకాలుగా వర్ణించబడింది. Spiraling Tanns అనేది వాటిలో ఒకటి. వేగపూరితమైన గతిని కూర్చుతూ అల్లిన స్వరాల వివిధ రూపాలను తాన్‌లుగా పేర్కొనవచ్చు. స్పైరలింగ్ అంటే వలయాకారంలో (ఇంకా కచ్చితంగా

చెప్పాలంటే (స్ప్రింగు ఆకారంలో) చక్కర్లు కొట్టు అని అర్థం. సుళ్లు తిరిగే, వేగవంతమైన, సంక్లిష్టమైన, ముడులుపడ్డ స్వరాల నిర్మాణం అన్నారు మరి కొందరు. టప్పా లోని స్వరాల గతి 'ఎగిరే గంతులు వేసే' రీతిని తలపిస్తుంది. ఈ గాన విధానాలన్నింటిని సరళీ స్వరాలకు (స రి గ మ ప ద ని లకు) వర్తింపజేయటమే కాక 'ఆ' అనే అక్షరాన్ని సాగదీసినట్టు కూడా పాడుతారు. దీన్ని 'ఆ' కార ఆలాపన అంటారు. ఠుమ్రీ, ఖయాల్‌ల గాయన విధానానికి భిన్నంగా టప్పాలో గాయకుడు ఏ ఒక్క స్వరం మీదా ఎక్కువ సేపు నిలువక త్వరత్వరగా ఇతర స్వరాల మీదికి పాకుతూ కదులుతుంటాడు. పీడనంలో ఉన్న స్వరాలను హఠాత్తుగా జారవిడవటం కూడా టప్పా గాయన విశేష రీతిగా చెప్పవచ్చు. ఇన్ని విధాలైన విలక్షణతల మూలంగా టప్పా ఒక ప్రత్యేకతను సంతరించుకోవటంలో ఆశ్చర్యం లేదు. టప్పాను పాడటం సులభమైన పని కాకపోవటానికి కూడా ఇదొక కారణం. హిందుస్థానీ సంగీతాన్ని అద్భుతంగా గానం చేయగలిగే వాళ్లు ఎందరో ఉన్నా అందరూ టప్పాను పాడలేరు. టప్పాను సరిగ్గా గానం చెయ్యాలంటే అందుకోసం ప్రత్యేకమైన శిక్షణ, సాధన అవసరం. ఆ గాయన రీతికి సరిపడే గళం ఉంటే టప్పా పాడటం కొంత సులువౌతుంది. ఒక రకంగా చూస్తే ఆధునిక వచన కవిత్వంలో అస్పష్ట కవిత, టెక్నిక్ కవిత ఎట్లాంటివో సంగీతంలో టప్పా అట్లాంటిదని చెప్పవచ్చునేమో. దాని ప్రత్యేక గాయన రీతి మూలంగా అస్పష్ట కవితలోలాగ టప్పాలో ఒక విధమైన విచిత్ర సౌందర్యం చోటు చేసుకుంటుంది. టప్పాను వింటుంటే ఒక్కో సారి ఆకాశంలో పక్షి గిరికీలు కొడుతూ కింద పడిపోతున్నట్టు స్ఫురిస్తుంది. టప్పాను


బడే గులామ్ అలీ ఖాన్


మంజిరీ అస్నారె

ఎక్కువగా పాడింది గ్వాలియర్, బనారస్ ఘరానా ల్లోనే. జైపూర్ అత్రోలీ, పటియాలా, రాంపూర్ సెహస్వాన్ వంటి ఇతర ఘరానాల్లో కూడా టప్పా తన ఉనికిని నిలుపుకుంది. ఎల్.కె. పండిత్ (లక్ష్మణ్ కృష్ణారావు పండిత్), షన్నో ఖురానా, పండిత్ మన్వాల్కర్, విదుషి మాలినీ రాజూర్కర్, విదుషి శాశ్వతీ మండల్ పాల్, విదుషి మీతా పండిత్ (ఎల్. కె. పండిత్ కూతురు) మొదలైన వాళ్లంతా టప్పా గాయనంలో ప్రవీణులైన గ్వాలియర్ ఘరానా గాయకులు. బనారస్ ఘరానాకు చెందిన విదుషి గిరిజా దేవి టప్పాలను బాగా పాడుతుంది. జైపూర్ అత్రోలి ఘరానాకు చెందిన విదుషి మంజిరీ అస్నారె కూడా టప్పాలు పాడుతుంది. ఉస్తాద్ బడే గులామ్ అలీ ఖాన్, పండిత్ కుమార్ గంధర్వలు టప్పాను ప్రచలితంచేసిన వారిలో ఉన్నారు. తెలుగు సినిమా పాటల గాయని సునీత కూడా టప్పా గాయనంలో శిక్షణ పొందినట్టు ఒక టీవీ కార్యక్రమం ద్వారా తెలిసింది. టప్పాను ఎక్కువగా ఖమాజ్, కాఫీ, భైరవి, దేశ్, ఝింఝోటి, బృందావనీ సారంగ్ రాగాల్లో పాడుతారు. పంజాబీ, పష్తో, సితార్ ఖానీ తాళాలను ఎక్కువగా టప్పా గానానికి ఉపయోగిస్తారు. ఖయాల్, ఠుమ్రీ వంటి ఇతర శైలులతో మేళవించి టప్ ఖ్యాల్, టప్ తరానా, టప్ ఠుమ్రీ మొదలైన గాయన రీతులను కూడా రూపొందించారు మన సంగీతపరులు.


మాలినీ రాజూర్కర్,

హిందుస్థానీ ఉపశాస్త్రీయ సంగీతానికి విశిష్టతను, విలక్షణతను చేకూర్చి, దాన్ని వైవిధ్యభరితం చేయటంలో ముఖ్యపాత్రను నిర్వహించిన టప్పా, సంగీతపరులను, సంగీతాభిమానులను ఎప్పటికీ రంజింపజేస్తూనే వుంటుంది.

ఎలనాగ (డా॥ ఎన్. సురేంద్ర) హైదరాబాదు.
ఫోన్ : 9866945424

పాకిస్తాన్ చిత్రకారుడు

# అబ్దుల్ రహమాన్ ఛుగ్తాయి



అబ్దుల్ రహమాన్ ఛుగ్తాయి

మనకు స్వతంత్రం రాక పూర్వము భారతీయ చిత్రకళా వినీలాకాశంలో తారలుగా ప్రకాశించి, ప్రజాదరణ పొందినవారు ముగ్గురు. ఒకరు రవివర్మ అయితే, రెండవవారు ఎస్.ఎమ్. పండిట్, వీరిద్దరూ భారతీయ ధర్మానికి, తత్వానికి పట్టుగొమ్మలుగా నిలచిన భారత, రామాయణ, హిందూ పురాణాలలో పేర్కొన్న గొప్ప ఘట్టాలను దృశ్యమానం చేశారు. ఒకరిది యూరోపియన్ ఆర్ట్‌కు సంబంధించిన వాస్తవ చిత్రణయితే, మరొకరిది వాస్తవికతతో కల్పనను జోడించిన కళాత్మక శైలి. ఇక మూడవ వారు అబ్దుల్ రహమాన్ ఛుగ్తాయి. ఈయనది పర్షియన్, మొఘల్, రాజస్థానీ లఘుచిత్రాల శైలితో రంగరించబడ్డ బెంగాలీ శైలి. వీటన్నిటినీ ఆర్టోనోవో విధానంతో సమన్వయ పరచి రేఖలతో కూడిన జలవర్ణ చిత్రాలు వేయడంలో ప్రసిద్ధిగాంచారు. ఈ ముగ్గురు ఒకానొక కాలంలో తమ చిత్రాల ద్వారా ప్రజలను ఉర్రూత లూగించారు.

అబ్దుల్ రహమాన్ ఛుగ్తాయి. 1897వ (ఇది ఇప్పటికి సందేహాస్పదమే) సంవత్సరంలో అప్పటి పంజాబు లోని లాహోరు పట్టణానికి దగ్గరలో నున్న మొహల్లా చబుల్ సవరన్ అనే చోట జన్మించారు. అతని వంశంలో ప్రసిద్ధిగాంచిన ఎందరో వాస్తునిపుణులు ఉన్నారని ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను, ఢిల్లీలోని లాల్‌ఖిలా నిర్మాణంలో వాళ్ళు పాలుపంచుకున్నారని చెప్తారు. పుట్టింది మధ్యతరగతి కుటుంబంలో. కుటుంబ సభ్యులంతా విద్యాధికులే, ఉన్నతమైన అభిరుచి గలవారే. 1911వ సం॥ రైల్వే టెక్నికల్ స్కూలులో చదువు పూర్తి చేసుకున్నారు. చిన్నతనంలోనే తన మామయిన బాబా మిరన్ షా నుండి నకాషీ చిత్రకళలో ప్రాథమిక పాఠాలు నేర్చుకున్నారు. చిత్రకళ పట్ల నున్న ఆసక్తితో మాయో స్కూలులో చిత్రకళా విభాగంలో ప్రవేశార్హత పొందారు. ఛుగ్తాయికు ముందునుంచి ఐరోపాచిత్రకళ పట్ల విముఖత ఉండేది. భారతీయమైన మొఘల్, రాజస్థానీ చిత్రకళల పట్ల ఆయనకు ఆసక్తి, ఆరాధనా ఉండేది. అది హావెల్ ప్రభావంతో భారతీయ చిత్రకళ తన అస్తిత్వ మూలాలను అన్వేషిస్తున్న రోజులు. మరీ ముఖ్యంగా బెంగాలులో ఈ ప్రభావం అవనీంద్ర నాథ ఠాగూరు ఆధ్వర్యంలో ప్రభంజనరూపం దాల్చింది. శాంతినికేతన్‌లో చిత్రకళా విధానం దానికి అనుగుణంగా మలచబడ్డది. దానికి తగినట్లుగానే మాయో స్కూల్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సమరేంద్రనాథ్ గుప్తా అవనీంద్రనాథ్ ఠాగూరు శిష్యుడు. ఆయన ఛుగ్తాయ్‌కు భారతీయ శైలిలో చిత్రాలు వేయమని ప్రోత్సహించాడు. చదువులో తరగతిలో మొదటి వానిగా ఛుగ్తాయి ఉత్తీర్ణుడు కావడం చాలా సహజంగానే జరిగింది.



*ముఖచిత్రం* : లైలా

చిత్రకళలో డిప్లమో తీసుకుని బయటకు వచ్చి బ్రతుకు తెరువు కోసం ఒక స్కూలులో డ్రాయింగ్ మాష్టారుగా నియమితులైనారు. వేడినీళ్ళకు చన్నీళ్ళు సాయమన్నట్టుగా స్వంతంగా ఒక ఫోటో స్టూడియోను నడిపేవారు. ప్రిన్సిపాల్ ప్రోద్బలంతో శాంతినికేతన్ వెళ్ళి అవనీంద్ర నాథ ఠాగూరు ప్రారంభించిన భారతీయ చిత్రకళా పునర్వికాసంలో పాలుపంచుకున్నారు. అక్కడ విద్యార్థిగా, ఒక పక్క ఉంటూ మరొక పక్క విద్యార్థులకు చిత్రకళను నేర్పించేవారు.

అవనీంద్రనాథ్ ఠాగూరు వేసిన మొఘల్ పాదుషా షాజహాన్ చివరి ఘడియలు అన్న చిత్రంలో అనేక చారిత్రక దోషాలున్నాయని ఆ చిత్రాన్ని నిర్ద్వంద్వంగా విమర్శించాడు. కలకత్తాను వదలి ఆగ్రా చేరుకున్నాడు. షాజహాన్ ఖైదుకాబడ్డ ప్రదేశాన్ని చూశాడు. అప్పటి దుస్తులను, వాడుకలోనున్న వస్తువులను పరిశీలించాడు. షాజహాన్ మరణం అనే చారిత్రక ఘట్టాన్ని


*రెండవ అట్ట* : **అనార్కలి**

వాస్తవానికి దగ్గరగా ఉండేలా చిత్రించాడు. ముస్సోరి నగర వాసైన చంద్ర షంషేర్ జంగ్ బహదూర్ నేపాల్ రాజు వద్ద ప్రధాన మంత్రిగా పనిచేశారు. ఆయనప్పుడు భార్యావియోగంతో మునిగి ఉండి మనఃశాంతి కోసం భారత దేశం వచ్చాడు. తనలానే భార్యావియోగంతో దుఃఖితుడైన షాజహాన్ చివరి ఘడియల చిత్రాన్ని చూశాడు. ఛుగ్తాయికి పెద్ద మొత్తమే ఇచ్చి ఆ చిత్రాన్ని తీసుకున్నాడు. దీనితో అందరికీ కనువిప్పయింది. జంగ్ ఉత్తమ కళాభిరుచి కలవాడని అందరికీ తెలుసు. అతను ఛుగ్తాయి చిత్రాన్ని కొనుగోలు చేశాడని తెలియడంతో అంతా అతని వెంట పడ్డారు. షంషేర్ జంగ్ బహదూర్ 1922వ సంవత్సరంలో అప్పటి వరకూ ఛుగ్తాయి వేసిన చిత్రాలను సేకరించి వాటిని ఒక పుస్తకంగా రంగులలో ముద్రించాడు. ఆ పుస్తకం ద్వారా ఛుగ్తాయి ప్రతిభ ఖండాంతరాలకు వ్యాపించింది.

ఛుగ్తాయి ఓరియంటల్ శైలిపై మక్కువ గలవారు. మీర్జా గాలిబ్ గజళ్ళకు ఆయన వేసిన చిత్రాలు ఆ తరువాత మురఖ్ఖయే... యే...ఛుగ్తాయి పేరుతో 1928వ సం॥లో పుస్తక రూపంలో వచ్చింది. ఇందులో రాజస్థానీ, మొగల్ చిత్రకళా శైలికంటే అవనీంద్ర నాథ఼ ఠాగూరు శైలీ ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. గజల్‌లో నున్న సుకుమార భావనలకు రాజస్థానీ మొఘల్ శైలిలోని సన్నటి గీతలు సందర్భోచితంగా సరిగ్గా సరిపోయాయి. లలిత సుకుమారమైన ఆ శైలిలో తప్ప గజల్స్‌ను మరే విధంగా చిత్రించినా ప్రజలు అంగీకరించ రన్నంతగా ఆయన చిత్రాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. (1963లో దాశరథి వ్రాసిన గాలిబ్ గీతాలకు బాపు ఆ శైలిలోని బొమ్మలు వేసి అందరినీ అలరించారు.)


***నాలుగవ అట్ట* : సాకీ**

హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లోనున్న పురాతన వస్తుప్రదర్శనశాలలో ఛుగుతాయ్ చిత్రాలను చూడవచ్చు. ఛుగ్తాయి తన చిత్రాలకు భూమికగా పంజాబు, పర్షియా, ఇండో ఇస్లామిక్ చరిత్రలోని ఘట్టాలను కథా వస్తువులుగా తీసుకున్నాడు. రామాయణ, మహా భారతంలోని ఘట్టాలను కొన్ని చిత్రించినా అందులో పర్షియన్ (ఇన్‌ఫి.) ధోరణి ఎక్కువ కనబడుతుంది.

లక్నోవాసి కావడంతో భారతదేశపు విభజనానంతరం లాహోరులో స్థిరపడ నిశ్చయించుకోవడంతో పాకిస్తానీ పౌరుడైనాడు. అప్పటి పాకిస్తానీ అధ్యక్షుడైన జిన్నా– ఛుగ్తాయిను మనః పూర్వకంగా ఆహ్వానించాడు. అంతకు ముందు ఎన్నడూ లేని విధంగా పాకిస్తానీ పెయింటర్ లారియట్‌గా నియమించాడు. (లారెల్ అన్నది మెడిటేరియన్ ప్రాంతంలో పెరిగే ఒక మొక్క దీని ఆకు సువాసనలు వెదజల్లడమే కాక దాని నుంచి చేసిన నూనె మందులలో ఉపయోగిస్తారు. ఈ ఆకులను ఒక వృత్తా కారపు దండగా చుట్టి విజేతల తలపై నుంచడం గ్రీకు, రోమన్‌ల సంప్రదాయం. లారియట్ అన్న పదం మకుటాభిమాని అనే అర్థంలో వాడబడేది.) ఇక్కడ పెయింటర్ లారియట్ అంటే జాతీయ చిత్రకారుడనే అర్థం చేసుకోవాలి. He is the father of Art in Pakistan అని ప్రకటించాడు. పాకిస్తాన్‌కు విచ్చేసిన గౌరవ అతిథులకు పాకిస్తాన్ ప్రభుత్వం తరపున ఛుగ్తాయి వేసిన ఒక చిత్రాన్ని బహూకరించే ఆనవాయితీని ప్రవేశపెట్టాడు. అలా ఛుగ్తాయి చిత్రాలను పొందిన వారిలో పికాసో, రెండవ ఎలిజబెత్ మహారాణి ఉన్నారు.


***మూడవ అట్ట* : విరహిణి**

లియాఖత్ అలీఖాన్ 1980లో అమెరికా వెళ్ళినపుడు అప్పటి అమెరికా అధ్యక్షుడైన ట్రూమన్‌కు తమ దేశ సాంప్రదాయాన్ని ప్రతిఫలించే ఛుగ్తాయి చిత్రాన్నొక దానిని బహుమతిగా ఇచ్చారు. ఆ సమయంలో అక్కడున్న వారంతా ఛుగ్తాయి చిత్రాన్ని చూశారు, మెచ్చుకున్నారు. ఈ విషయం (చిత్రపటంతో సహా.) పత్రికలలో వచ్చింది. ఛుగ్తాయి చిత్రం అమెరికన్లను ఆకర్షించింది. తరువాత కాలంలో ఛుగ్తాయి చిత్రాలలో ఎక్కువ భాగం అమెరికాలో అమ్ముడైనాయి.

ఛుగ్తాయి చిత్రాలను కొన్న వారిలో అప్పటి సంస్థానాధీశులు, నవాబులేకాదు, ఉత్తమాభిరుచి గలిగిన అనేక మంది ఉద్యోగస్థులు, కులీనులుండేవారు.

అయితే ఈ గౌరవాభిమానాలు ఎంతో కాలం నిలువ లేదు. లౌకిక వ్యవస్థలో తప్ప మత ప్రధానమయిన దేశాలలో ప్రజాస్వామ్యం అంతగా వేళ్ళూనుకొనదు అని చెప్పకనే చెప్పాయి పాకిస్తాన్ రాజకీయాలు. అస్తవ్యస్థ పాకిస్తానీ రాజకీయాల్లో ఎవరు ఎంతకాలం ఉండాలో 'అల్లా' కూడా చెప్పలేని పరిస్థితి వచ్చింది. అక్కడ కొన్నాళ్ళు ప్రజాస్వామ్యం, కొన్నాళ్ళు సైనిక పాలన పేరుతో నియంతృత్వం. అధికారం లోనికి వచ్చిన వారంతా తమ కుర్చీలను కాపాడుకోవడంలోనే తలమున్కలయ్యారు. ఇక పెయింటర్ లారియట్ అయితేనేమి? పోయట్ లారియెట్ ఐతే ఏమిటి, ఎవరికి పట్టింది? ఛుగ్తాయి యోగక్షేమాలు ఎవరూ పట్టించుకోలేదు. ఛుగ్తాయి కూతురు భారతదేశంలోని తన స్నేహితురాలుకు వ్రాసిన ఉత్తరంలో ఈ విషయాలను పేర్కొంది.



**అర్జునుడు**

ఛుగ్తాయి వేసిన జలవర్ణ చిత్రాలు, పెన్సిల్‌తో వేసుకున్న స్కెచ్‌లు, డ్రాయింగ్‌లు, ఎచ్చింగులు, బ్లాకు ప్రింట్లు, నకాషీ, కలిగ్రఫీ, స్టాంపుడిజైన్‌లు, నాణేల డిజైనులు ఇందులో (చెల్లాచెదురై పోవలసినవి పోగా) ఇప్పటికింకా మిగిలినవి పదివేల వరకూ లాహోరు మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి.

1975లో ఛుగ్తాయి ఈ ప్రపంచం నుంచి నిష్క్రమించాడు. అతని కొడుకు లాహోరులో చిత్రకళా ప్రదర్శన శాల నొకటి నడుపుతున్నాడు.

పాకిస్తాన్ రేడియో, టెలివిజన్‌ల లోగోల రూపకర్త అతనే. పాకిస్తాన్ ప్రభుత్వం విడుదల చేసిన పోస్టేజి స్టాంపులు, నాణాలు, ఆయన ఆమోద ముద్ర పొందకుండా బయటకు రావు. 1960లో 'హిల్-ఈ-ఇంతియాజ్' అనే గౌరవం పొందాడు. 1975లో పశ్చిమ జర్మనీ అతనికి బంగారు పతకాన్నిచ్చి గౌరవించింది.






**1951వ సంవత్సరంలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాన ఆయనచే డిజైన్ చేయబడ్డ తొమ్మిది పోస్టల్ స్టాంపులను పాకిస్తాన్ ప్రభుత్వం విడుదల చేసింది.**

చుగ్తాయి వేసిన చిత్రాలు ఇంగ్లండులోని బ్రిటీష్ మ్యూజియం, అల్బర్టా హాలులో, ఐక్యరాజ్యసమితి ముఖ్యప్రాంగణంలో బోస్టన్‌లోని, కెనడి మెమోరియల్ లో, థాయిలాండ్ మహారాజు అంత:పురంలో పాకిస్తాన్ అధ్యక్షుని గృహంలో సందర్శకులను పలకరిస్తాయి. చుగ్తాయి వేసిన ద్రౌపది స్వయంవర సందర్భంలో అర్జునుడు అన్న మకుటం గల చిత్రం ఒక కోటి నలభై లక్షలకు అమ్ముడయింది. ఆయన వేసిన రాధాకృష్ణ అన్న జలవర్ణ చిత్రం సౌద్‌బీ నిర్వహించిన వేలం పాటలో నలభైఎనిమిది లక్షలకు అమ్ముడుపోయింది. హిందూ, బౌద్ధానికి చెందిన చిత్రాలు సుమారు 200 వరకు వేశారు.

# హాస్యనాటికలు

## చదివినా, ప్రదర్శించినా అలరించాలి

– ఎన్. తారకరామారావు

తెలుగు వాళ్ళకి హాస్యం తక్కువనీ తెలుగు వాళ్ళు హాస్యాన్ని అంతగా ఆస్వాదించరనీ 'తెలుగు'లో హాస్య నాటకాలు తక్కువనీ అంటారు. తెలుగు నాటకాల్లో హాస్య రస పోషణ గురించి ప్రత్యేకంగా కృషి చేసిన ఎన్. తారకరామారావు ఏమంటారో చూద్దాం –

ప్ర: నిజంగా తెలుగు సాహిత్యంలో హాస్యానికి గౌరవం ఇవ్వలేదా?

జ: హాస్యం మన ప్రాచీన గ్రంథాల్లో అక్కడక్కడా వుంది. కావ్యాల్లో ఉంది. నన్నయ భారతంలో కూడా హాస్యం ఉంది. అయితే ఆ రోజుల్లో వాళ్ళ రచనా లక్ష్యం వేరు. హాస్యమనేది అసలు లేదు మన సాహిత్యంలో అని అనటానికి లేదు. కాకపోతే పాశ్చాత్య సంస్కృతి దృష్ట్యా నిర్వచించిన హాస్యం వేరు. మన వాళ్ళు నిర్వచించిన హాస్యం వేరు. మనకి జానపద కథల్లో కాని మనం పిల్లలకి చెప్పే కథల్లో కాని పంచతంత్రంలో కాని రామకృష్ణుడి కథల్లో జానపద సాహిత్యంలో అన్ని చోట్ల హాస్యం వుంది. కాకపోతే హాస్యాన్ని ఒక ప్రత్యేకమైనటువంటి విభాగంగా మన వాళ్ళు చూసారనటానికి వీలులేదు.

ప్ర: సంస్కృత సాహిత్యంలో వున్న ప్రహసనాలు కానీ సంస్కృత సాహిత్యంలో ఉన్న రూపక ప్రక్రియలు కానీ తెలుగులో రాలేదేమో కదా ?

జ: రాని మాట నిజమే. దశరూపకాల్లో భాణమని ఒక ప్రత్యేక విభాగం వుంది. భాణంలో మనకి వ్యంగ్యం, హాస్యం కలిపిన చాలా రచనలు వచ్చినాయి. అయితే మనవాళ్ళు భారత భాగవత రామాయణ కథలు తీసుకుని నాటకీకరణ చేసినా కావ్యాలు వ్రాసినా హాస్యాన్ని పెద్దగా పట్టించుకోలేదేమో అనిపిస్తుంది. అయితే అసలు హాస్యం లేదు అనటానికి వీల్లేదు.

ప్ర: తెలుగు హాస్యంలో కన్యాశుల్కంలో ఉన్నది హాస్యంగా మనం అంగీకరిచాలా నాటకంగానే లెక్కవేసుకోవాలా?

జ: కన్యాశుల్కంలో ఉన్న హాస్యం దాదాపు రెండు మూడు రకాలుగా మనం విభజించుకోవచ్చు. పాత్రల పరంగా వచ్చే అంటే పాత్రల స్వభావం, మాట తీరు, వాళ్ళు వ్యవహరించే తీరును బట్టి కన్యాశుల్కంలో ఉన్న మాండలికమైనటువంటి హాస్యం కొంత. గురజాడ అప్పారావు ఉద్దేశ్యం కేవలం హాస్య నాటకం అనికాదు, ఒక సంఘాన్ని, ఒక సమాజాన్ని సంస్కరించే రూపంలో పాత్రలు గాని, సంఘటనలు గాని సజీవంగా ఉండి ఆ సజీవ పాత్రల్లో నుంచి సన్నివేశాల్లో నుంచి హాస్యం వ్యక్తీకరించేలాగా చేశాడాయన.

పాఠకులు గాని ప్రదర్శకులు, నటులు, దర్శకులు గాని ఆ నాటకంలో ఎక్కువ హాస్యాన్ని ఆస్వాదిస్తున్నారు తప్ప ఆయన ప్రతిపాదించిన బాల్య వివాహాలు, మూఢాచారాలు క్షుద్రపూజలు ఇట్టాంటి వాటి గురించి పట్టించుకోలేదు. కన్యాశుల్కం నాటకం ఈ రోజు కూడా హాస్యనాటకం అని అంటారు కాని హాస్యనాటకం కాదు. హాస్యాన్ని నాటకంలో చక్కగా మిళితం చేసి సజీవ పాత్రల్ని ఆ రోజుల్లో ఉన్న పాత్రలు, వాళ్ళ స్వభావాలు, వాళ్ళ మాటతీరుల్లో ఆయన చాలా గొప్పగా వ్యక్తీకరించారు. ఆయన ప్రతిపాదించిన పాత్రలు గాని, సంభాషణలు గాని, సన్నివేశాలు గాని ఈ నాటికీ మనకి ఆదర్శంగా నిలుస్తున్నాయి. కాకపోతే ఆ సమాజం ఇప్పుడు లేదు. అలాంటి హాస్యాన్ని కూడా ఇప్పుడు మనం ఆస్వాదించే స్థితిలో లేము. అది పూర్తిగా హాస్యనాటకం పూర్తిగా మామూలు నాటకం అనటానికి లేదు. కాని తెలుగు నాటక రంగానికి మార్గదర్శి అయినటువంటిది. మనకి ఈ రోజుకీ ప్రామాణిక గ్రంథంగానే వుంది. అలాంటి ఆలోచన, అలాంటి సాహిత్యకృషి ఇంకా జరగాలి.

ప్ర: హాస్యరసాన్ని పోషిస్తూ వ్రాసిన తరువాతి తెలుగు నాటకాలు, కన్యాశుల్కం ఏర్పరచిన బాటని అనుసరించలేదేమో!

జ: వీరేశలింగం గారు ప్రహసనాల్ని కేవలం సంఘ సంస్కరణ కోసమే వ్రాశారు. ఆయనకు భాష గురించి కాని పాత్రలు గురించి గాని పట్టింపు లేదు. ఆయన చేయాలనుకుంటున్న సంఘ సంస్కరణకి ఈ ప్రహసనాలను ఒక ప్రాతిపదికగా తీసుకొని రచన చేశారు. తరువాత చిలకమర్తి లక్ష్మీనరసింహం అదే బాటలో కొన్ని ప్రహసనాలు వ్రాశారు. అయితే గురజాడ అడుగు జాడలలో నడిచినటు



హాస్య నటుడు
తనికెళ్ల భరణి



కన్యాశుల్కంలో
మధురవాణిగా ఝాన్సీ

వంటి పానుగంటి లక్ష్మీ నరసింహం *కంఠాభరణం* తొలి సజీవ నాటకం. అంటే ఈ నాటికి కూడా ఆ పాత్రలు గాని, ఆ సన్నివేశాలు గాని చూస్తే *కన్యాశుల్కానికి* మించి రాశాడా లేక పోతే కన్యాశుల్కానికి సమంగా వ్రాశాడా? కంఠాభరణం అనటానికి మనకిదాఖలాలు ఉన్నాయి. కన్యాశుల్కంలో వున్నటు వంటి పాత్రలు లేకపోయినా పానుగంటి కూడా ప్రత్యేకమైన తూర్పు, పశ్చిమ గోదావరి మాండలికాల్లో రాసి చాలా అద్భుతమైన నాటకాన్ని వ్రాశారు. ఆ కొనసాగింపు విశ్వనాథ కవిరాజు ములుగుళ్ళ రామకృష్ణయ్య చేశారు. ఇలా డి.వి. నరసరాజు చేశారు. చాలా మంది చేశారు. అంత సమగ్రంగా చేశారా లేదా అనేది మనం పరిశోధించాలి.

ప్ర: తరువాత్తరువాత వచ్చినటువంటి సాంఘిక నాటకాల్లో ప్రత్యేకంగా హాస్య రసాన్ని మిళితం చేస్తూ హాస్యాన్ని ప్రధాన రసంగా తీసుకు వచ్చిన నాటకాల సంఖ్య తక్కువా ఎక్కువా?

జ: 1944లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు వారు తెలుగు నాటకాల కోసం కొన్ని ప్రతిపాదనలు చేశారు. నాటక ఉద్ధరణ కోసం అంటే అంతకు ముందున్న భారత, భాగవత రామాయణ కాలంలో నుంచి తీసుకున్న కథలు కాకుండా స్వతంత్ర నాటకాలు, సాంఘిక నాటకాలు రాయాలని ఒక తీర్మానం చేసి 3 సంవత్సరాల కాల పరిమితి విధించి ఆ కాల పరిమితిలో వచ్చిన నాటకాలు, నాటికలు కావాలన్నారు. వాళ్ళు చేసిన ముఖ్య సూచన ఏమిటంటే హాస్య పాత్ర ప్రతి నాటకంలో ఉండి తీరాలి అన్నట్టుగా ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన వలన ప్రతి నాటకంలో ఒక హాస్యపాత్ర కొంత హాస్య సన్నివేశాలుండటం హాస్య పాత్రలకి బహుమతులు ఇవ్వటం మొదలయింది. ఉత్తమ నటుడు, ఉత్తమ హాస్యనటుడు, ఉత్తమ దర్శకుడని ఇలా విభజించి నటుల్ని, నాటక రచయితల్ని ప్రోత్సహించటం వల్ల మనకి భాషా సాహిత్యాల మీద పెద్ద పట్టు లేకపోయినా ఆంగ్ల సాహిత్యం చదివిన చాలామంది నాటక రచన చేశారు. పాకాల వెంకట రాజమన్నార్ సంఘ సంస్కరణ లక్ష్యం పెట్టుకున్నా కూడా కొంచెం హాస్యం వ్రాశాడు. భమిడిపాటి కామేశ్వరరావు ముఖ్యంగా మోలియర్ రచనల నుండి స్ఫూర్తి పొంది రాశారు. మోలియర్ రచనల ప్రభావం లేకుండా చాలా గొప్ప గొప్ప పాత్రలు సృష్టించాడు. దానయ్య, శీనయ్య ఇలా... స్థానికంగా ఉన్న ప్రజల్లో తెలిసిన పాత్రలు తీసుకుని చాలా వ్యంగ్యంగా చాలా గొప్పగా రచనలు భమిడిపాటి కామేశ్వరరావు చేశారు. పానుగంటి లక్ష్మీనరసింహం విశ్వనాథ కవిరాజు, కాళ్ళకూరి నారాయణరావు వీళ్ళంతా తొలి తరంలో చక్కటి హాస్యనాటకాలు, వచన నాటకాలు రాశారు. వర విక్రయంలో శింగరాజు లింగరాజు పాత్ర ఈ రోజుకి కూడా సజీవంగా ఉంది. ఎన్నో రకాలుగా రూపాంతరం చెందింది. పెళ్ళిళ్ళలో పదహారోజుల పండుగలు జరిగేటటువంటి తంతు చెప్పి సామాజికంగా కనువిప్పు కలుగజేశాడు. అలాగే మధుసేవలో గాని, చింతామణిలో సుబ్బిశెట్టి గాని, తరువాత సక్కుబాయి నాటకంలో కాని సోమరాజు రామానుజరావుగారు, అచ్యుత రామశాస్త్రి గారు – చాలా మంది ప్రతి నాటకంలో కూడా హాస్య పాత్రలు ప్రవేశ పెట్టారు.

తెలుగు నాటకంలో విశేషం ఏమిటంటే హాస్యనాటకంలో జంట హాస్య పాత్రలు చాలా మంది ప్రవేశపెట్టారు. అది బహుశా ఈ జానపద కళారూపంతో వచ్చిన ప్రభావం. నాకు తెలిసినంత వరకు భారతదేశ నాటక సాహిత్యంలో హాస్య జంట పాత్రలు ఎక్కడా లేవు. ఇవి తెలుగు సాహిత్యానికే పరిమితం. సంస్కృత నాటక సాహిత్యం తీసుకుంటే విదూషకుడు పాత్రకి హాస్యం ఉపయోగించారు. అయితే విదూషక పాత్రను కేవలం తిండిపోతూ, భయస్తుడూ ఇలాంటివి చేసినా కాళిదాసు విదూషకుడు ఈ రోజుకూ ఆదర్శప్రాయంగా నిలిచాడు మనకి.

*వసంతసేన*లో కూడా విదూషకుడు చాలా ప్రధానపాత్ర. ప్రపంచంలో ఏ నాటక సాహిత్యంలో కూడా మన *ముద్రా రాక్షసం, మృచ్ఛకటికం* వంటి అంటే ఇతిహాసాలతో సంబంధం లేని కథలు తీసుకుని చాలా గొప్ప పాత్రలు సృష్టించిన నాటక సాహిత్యం లేదు. ఆ విషయంలో మనం చాలా గర్వపడాలి. ఎందుకంటే గ్రీకు నాటక సాహిత్యం గురించి, షేక్స్పియర్ నాటకాల గురించి వివరిస్తారు కాని వాటికి మించిన నాటకాలు మనకి *మృచ్ఛకటికం* తరువాత భాసుడు చేసినటువంటి భాస నాటక చక్రం. ఇది ఎంత గొప్ప ప్రక్రియ అంటే స్వతంత్రించి నాటకంలో విశిష్టమైన పాత్రలను సృష్టించి సన్నివేశాలు కల్పించిన భాస నాటక చక్రం భారతీయ సాహిత్యంలో మకుటాయమానమైన గ్రంథంగా నిలిచింది.

ప్ర: పద్యనాటకాల్లో చిలకమర్తి వాళ్ళూ హాస్యాన్ని బాగా మేళవించి సృజించి నటువంటి పాత్రలు గాని ఆ రచనా సంవిధానంగాని తరువాత వచ్చిన సాంఘిక రచయితల్లో తొలితరం వాళ్ళు తప్ప మిగిలిన రచయితలు అందుకోలేదేమో?

జ: ఎందుకంటే తొలితరం నాటక రచయితలకి సాహిత్యం మీద పట్టుంది. ఆంగ్ల సాహిత్యం చదివారు. సంస్కృత సాహిత్యం చదివారు. తెలుగు సాహిత్యం చదివారు.

రాను రాను సంస్కృత భాష వెనుకపడటం తెలుగు భాషకు తగినంత ప్రాచుర్యం లేకపోవడం వల్ల డిగ్రీలు చదివిన వారు మాత్రమే నాటకాలు వ్రాశారు. అంటే భాష మీద సంస్కృతి మీద ప్రజల జీవనం మీద ఆచార వ్యవహారాల మీద, సరైనటువంటి అవగాహన లేకుండా వచ్చిన రచయితల వల్ల ఏదో ఒక సమస్య తీసుకుని ఆ సమస్యకి ప్రారంభం, క్లైమాక్స్ పాత్రలు సృష్టిస్తున్నారు. దీనికి ఒకరకంగా నటులు కారణమే. రచయితలూ కారణమే. తరువాత కొంతవరకూ ప్రేక్షకులు కారణమే.

ఆర్థిక సామాజిక పరిస్థితుల వల్ల ఎక్కువ కాలం ఈ కళల మీద వారి దృష్టి సారించలేకపోవడం వల్ల ఏమౌతుందంటే మనకి నాటకాల నుంచి నాటికలు వచ్చాయి. 5,6 గంటల సేపు ఆడిన నాటకాల నుంచి 2 గం॥ల పద్య నాటకానికి వచ్చాం. ఆ పద్యనాటకాలను చూడలేక ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల నాటికలు ఒక గంటసేపు, విశ్వవిద్యాలయాలు కాలేజీలు వచ్చిన తరువాత వార్షికోత్సవాల్లో ఒక భాగంగా ఒక నాటిక ప్రదర్శించటంతో ఈ నాటికల ప్రాబల్యం ఎక్కువయింది. తద్వారా ఈ ఔత్సాహిక నటీనటులు పుట్టుకు వచ్చారు. చదువుకున్న వాళ్ళు కొంతమంది అంతకు ముందు సంస్కృతీ సాహిత్య సంప్రదాయాల ప్రకారం నడిచిన నటుల్ని వెనక్కినెట్టారు. వారు నాటకరంగంలోకి వచ్చి రచన, దర్శకత్వం చేసి ప్రదర్శనలు ఇచ్చే సరికి కొంచెం గౌరవం పెరిగింది. అవగాహన కూడా పెరిగింది. ఆ ప్రాచీన సంప్రదాయానికి లేదా ఆ సాహిత్య సంప్రదాయానికి కొనసాగింపు అంతగా జరగలేదు.

ప్ర: విశ్వనాథ కవిరాజు లాగా మంచి ఇతివృత్తంలో సమాజానికి సంబంధించినటువంటి అంశాలను చొప్పిస్తూ ప్రతిఫలిస్తూ ఈనాటి రచయితలు రాయలేకపోవటానికి కారణం వాళ్ళకు విషయ సేకరణ గాని ఆ దృష్టిగాని లోపించటమంటారా?

జ: దాదాపు చాలా మంది రచయితలకు సాహిత్యం మీద గాని, సంస్కృతిమీద గాని అధ్యయనం, అవగాహన కూడా లేదు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ మధ్య తరగతి అనేది క్రొత్తగా ఒక వర్గం ఏర్పడింది. ఈ మధ్య తరగతి ఆశయాలను, వాళ్ళ జీవన విధానాన్ని ప్రతిబింబిస్తూనే రచయితలు వచ్చారు. చాలామంది రచయితలను చూస్తే మధ్య తరగతి నుంచి వచ్చిన వాళ్ళే. ఆత్రేయ, కొర్రపాటి గంగాధరరావు తరువాతి వారూ, ఇలాంటి వాళ్ళు. వాళ్ళెంతసేపు మధ్య తరగతి జీవనాన్నే ప్రతిబింబిస్తూ నాటకాలు వ్రాసారు తప్ప ఈ పాత్రలకు సంఘటనలకు సాహిత్య విలువలుండే పద్ధతుల్లో వాళ్ళు రచనలు చేయలేదు.

ప్ర: రచయితల దృష్టి ఎంతసేపూ స్త్రీ పురుష సంబంధాలకు, కుటుంబ విషయాలకు పరిమితం కావటం మనం గమనిస్తున్నాం. కాని సమాజానికి వాళ్ల హాస్యం తోటి వాళ్ళల్లో రాగల మార్పుని ప్రదర్శించటానికి రచయితలు కృషి చేయాల్సిన అవసరం ఉందేమో?

జ: ఇప్పుడు సాహిత్యమంటే కేవలం విజ్ఞానదాయకమే కాదు. ప్రేక్షకులు ఆనందించడమే కాదు. వాళ్ళల్లో ఒక మార్పుని అలాగే తన ధోరణిలో కూడా కొంచెం మార్పు తీసుకురావాలి. అయితే మనం పూర్తిగా ఆ దృష్టితో నాటకాలు నాటికలు రాలేదని అనలేము.

భమిడిపాటి కామేశ్వరరావు గాని, రాధాకృష్ణ గాని, వేదాంతం ఇలాంటి వాటిల్లో సమాజం పట్ల కొంచెం బాధ్యత గానే వ్యవహరించారు. గణేష్ పాత్రో రాసిన నాటకాలలో కూడా విశాఖ ప్రాంతంలో ఉన్నటువంటి మత్స్యకారుల జీవితాల్ని గురించి కొంచెం వ్రాశారు. కొర్రపాటి గంగాధరరావు నా బాబు మిగతా వాటిల్లో కూడా మధ్య తరగతి జీవితాల్ని ప్రతిబింబింప చేశారు. ఆత్రేయ కప్పల్లో కూడా ఈ సమాజంపట్ల అంటే ఇప్పుడు చెరువు నిండా నీళ్ళొస్తే కప్పలొస్తాయన్న ఒక సూక్తిని తీసుకుని కప్పలు నాటకం వ్రాశాడు. అయితే విశ్వనాథ కవిరాజు, కామేశ్వరరావు, పానుగంటి వారు చేసినంత విస్తృతంగా సమాజాన్ని వారు అధ్యయనం చేసి సాహిత్యంలోకి తీసుకురాలేదు.

ప్ర: ఇపుడు సమాజంలో జరుగుతున్న పరిణామాలు మెదడుకు మేత కల్పించేలా హాస్య రచయితకుపయోగపడే విధంగా ఉన్నాయి. కాని అటువైపు మన రచయితలు చూపు సారించకపోవటానికి కారణం?

జ: టి.వి. లో, సినిమాలోకి వెళ్ళాలన్న ఆలోచన. తొలి తరం రచయితలు చాలా మంది నాటకాలు వ్రాసి తరువాత సినిమాల్లోకి వెళ్ళారు. అదే కోవలో మనం కూడా నడవాలి అనేటటు వంటి ఒక దృక్పథం తోటి ఈ ఆర్థిక సామాజిక పరిస్థితుల దృష్ట్యా ఈనాటి రచయిత లంతా సమాజం పట్ల తనకున్నటు వంటి బాధ్యతలు వదిలేసి నాటక రచనలు చేస్తున్నారు.


కన్యాశుల్కం నాటకంలో....

మనకి పరిషత్‌లతో, నాటకం విస్తరిస్తున్నది. నిర్వహణకు తప్ప ఎదగడానికి కాదు. ఎదగక

పోవటానికి కారణం ముఖ్యంగా బాధ్యత వహించ వల్సింది రచయితే. అయితే ఒక గొప్ప నాటకం సమాజపరంగా చేస్తే సమాజం స్వీకరించే స్థితిలో ఉన్నదా లేదా అనేది కూడా మనం ఆలోచించాలి.

ప్ర: నాటక విమర్శను భరించే స్వభావం మనకి ఉందా?

జ: తెలుగు సాహిత్యంలో విమర్శ తక్కువ. దువ్వూరి వెంకటరమణశాస్త్రి, సి.ఆర్. రెడ్డిల స్థాయిగల విమర్శ ఈ రోజుల్లో నాటక సాహిత్యం మీద జరగటం లేదు. కొంతవరకు పురాణం సూరిశాస్త్రి కృషి చేసినా ఆ కృషి పూర్తిగా కొనసాగలేదు. నాటకానికే సరైనటువంటి ఆర్థిక స్థోమత లేనపుడు విమర్శ పట్టించుకునే స్థితిలో ఉండరు. ఈనాడు మేం రాసేది రాస్తాం చూస్తే చూడండి లేకపోతే లేదన్న స్థితికి వచ్చారు తప్ప విమర్శ వల్ల తమ కృషి బాగుపడుతుంది, తమ లోపాలు తెలుస్తాయన్న అవగాహన చాలా మందికి లేదు.

ఒకప్పుడు మొక్కపాటి, సూర్యప్రకాశరావులాంటి వాళ్ళు పండితులు కూర్చుని నాటక ప్రదర్శనలు చూసి తప్పు ఒప్పులను నిర్ణయించేవారు. తెనాలిలో త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి ఉండి నాటకాన్ని చూసి మంచీ చెడ్డ చెప్పేవారు. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి ఒక నాటకానికి న్యాయనిర్ణేతగా వచ్చారు. అలాంటి మహానుభావులు కూచుంటే ఒళ్ళు దగ్గరపెట్టుకుని పద్యం, గద్యం చెప్పాలని పిశుపాటి నర్సింహమూర్తి, బందా, మాధవపెద్ది వెంకట్రామయ్య వంటి పండిత నటులు అనుకునేవారు. అలాంటి వాళ్ళు రావటానికి కారణమేమంటే అక్కడ కూచున్న విమర్శకుడి వ్యక్తిత్వం. ఈ రోజుల్లో ఎవరు పడితే వాళ్ళు నాటకాలు చూడవచ్చు. జడ్జ్ చేయవచ్చు. నాటకాలు రాయవచ్చు. వాళ్ళు రాసిందే నాటకం, వేసిందే నాటకం అన్న స్థితిలో ఉంది తప్ప విమర్శను ఎవరూ స్వీకరించటం లేదు.

ప్ర: థియేటర్ ఆర్ట్ అనే డిపార్ట్‌మెంట్ ఉంది కదా. అందులో ఈ హాస్యానికి సంబంధించినది ఒక సబ్జెక్టుగా ఏమైనా ఉంటుందా?

జ: ఏమీ లేదు. దాదాపు మనకి ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు విశ్వవిద్యాలయాలలో నట శిక్షణా సంస్థలు నడుస్తున్నాయి. అక్కడ నుంచి విద్యార్థులు బయటకి వస్తున్నారు. వాళ్ళకి బయటికి వస్తే ఉద్యోగ అవకాశాలు లేవు. ఎవరో కొంత మంది టి.వి.ల్లో సినిమాల్లో బతుకుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు అకాడమీ ద్వారా శిక్షణ గురించి 2 పుస్తకాలు కూడా వేశారు. ఒక కోర్సు కూడా పెట్టారు. అది తరువాత నడవలేదు. ఈ విశ్వవిద్యాలయంలో చెప్పే నటశిక్షణ పాశ్చాత్య సంబంధమైన శిక్షణాప్రణాళికను అనుసరిస్తున్నారు. శిక్షణ, సిలబస్‌లను బట్టి భారతీయ నాటకం భారతీయ మూలాలు జానపద సాహిత్యం ఇక్కడ సాహిత్యం ఎట్లా ఉన్నది కాళిదాసు ఏం చెప్పాడు, భాసుడు ఏం చెప్పాడు ఇవన్నీ వాళ్ళకి – ఇప్పుడున్న ప్రొఫెసర్‌లకు గాని అక్కడ విద్యార్థులకు గాని, ప్రణాళిక తయారు చేసే వాళ్ళకు గాని సరైన అవగాహన లేదు. హాస్యాన్ని గురించి అసలు వాళ్ళకి ఏవిధమైన స్పష్టమైన అవగాహన లేదు. నేర్పే స్థితిలో కూడా లేరు.

ప్ర: పాశ్చాత్య నాటకరంగంలో ఒక్కడే నిలబడి హాస్యరసాన్ని పండించేటటువంటి ప్రక్రియలు, రకరకాల హాస్యనాటకాలు ఎక్కువగానే ఉన్నాయి. అవీ మనం దిగుమతి చేసుకోలేక పోతున్నాం.

జ: చేసుకోనక్కర లేదు. తెలుగులో హాస్య నాటకాలు, నాటికలు వస్తున్నాయి. చేస్తున్నారు. అయితే ఈ హాస్య నాటకాలు కేవలం రాజకీయ విషయం వివాదం, లంచగొండితనం ఇలాంటివి. హాస్యంలో అవకతవక సంభాషణలు, అవకతవక పాత్రలు ఉండవచ్చు కాని, ఆ పాత్రలకి ఒక లక్ష్యం ఉంటే బాగుంటుంది. ఆ లక్ష్యం తెలియకుండా చాలా మంది రచనలు చేస్తున్నారు. మాటకి మాట అనుకోవటం లేకపోతే మనం పత్రికలు చూసి చిన్న చిన్న జోక్‌లు సంభాషణలు తీసుకు వచ్చి నాటకంలో సర్దడం. అది సందర్భోచితమా కాదా అనేటటువంటి వివేచన చాలా మంది రచయితలకు, దర్శకులకు లేదు. ముఖ్యంగా నాటక శిక్షణ యిచ్చే ఏ విశ్వవిద్యాలయంలో కూడా మనకి హాస్య నాటకాన్ని గురించి హాస్య నాటక లక్షణాల గురించి హాస్య నటుడి గొప్పతనాల గురించి చెప్పరు. తెలుగులో మంచి హాస్య నాటకాలు రావాలి. ముఖ్యంగా నాటకాన్ని చదివినా బావుండాలి. ప్రదర్శించినా బాగుండాలి. ఆ ప్రదర్శన లేక రచన చూసినవాళ్లు ఇంకొకళ్ళకి చెప్పి ఆనందించే స్థితిలో ఉంటే ఆ నాటకం సజీవంగా నిలబడుతుంది. మన *కంఠాభరణం* కాని *కన్యాశుల్కం* గాని ఈ నాటికీ నిలబడటానికి కారణం దానిలోని పాత్రలు, సాహిత్యం, విలక్షణ సన్నివేశాలు. ఇలాంటి నాటకాలు మళ్ళీ వస్తాయని ఆశిద్దాం.

ఇంటర్వ్యూ: ముంజులూరి కృష్ణకుమారి
అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి,
విజయవాడ. ఫోన్ : 0866–2475120

## సిల్కురూట్ యాత్ర,




# ఉగైర్ కీ షాన్ అమనిషాన్

*- పరవస్తు లోకేశ్వర్*

**నా** 55 రోజుల సిల్కురూట్ దేశాల యాత్ర, ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్‌స్తాన్, చైనాలు పర్యటిస్తూ చైనాలోని యార్ఖండ్ పట్టణానికి చేరుకుని ఒకప్పుడు ఉగైర్ రాజ్యానికి సంబంధించిన రాణి అమనిషాన్ సమాధిని సందర్శించాను.

ఉగైర్ రాజ్యానికే కాదు, ఉగైర్ సంగీతసాహిత్యాలకు కూడా అమనిషాన్ ఒక మహారాణి. ఈమె పదహారవ శతాబ్దానికి చెందిన విదుషీమణి. అతి తక్కువ కాలమే జీవించినా ఆమె కథ ఒక కమ్మని కవిత్వంలా సాగిపోయింది. కవయిత్రిగానే కాక ఉగైర్ సంగీతానికి తన సాధనతో కొత్త రాగాల రంగులను అద్ది చరిత్రలో చెదరని సంతకంలా నిలిచిపోయింది. ఉగైర్ కీ షాన్ ఔర్ నిషాన్ "అమనిషాన్"

1526 అనగా బాబర్ మన దేశంలో మొగల్ రాజ్యస్థాపన జరిపిన సంవత్సరంలోనే సాచే రాజ్యంలో (యార్ఖండ్ పాతపేరు) తీజీనపు నదీ తీరపు ఒక మారుమూల పల్లెలో ఒక ఆడపిల్ల జన్మించింది. రాబోయే కాలంలో కాబోయే 'సంగీత సరస్వతి' అని తెలియని అబ్బా అమ్మీలు ఆమెకు "ఆమ్-నిషాన్" (అమనిషాన్) అంటే "సర్వత్రా సదా ఒక సంకేతంగా నిలచిపోయే" అన్న అర్థంలో నామకరణం చేశారు. అయితే ఆమె సార్థక నామధేయురాలవుతుందన్న సంగతి ఆ పేద దంపతులు అప్పుడు ఊహించలేకపోయారు.

ఆమె జన్మించిన పల్లె ఒక పేదపల్లెనే, ప్రజలు పేద ప్రజలే కాని ఆట పాటలలో మాత్రం ఆ పల్లె అందాల పల్లె. ప్రతి "నౌరోజ్" పండుగ నాడు పచ్చని చెట్ల క్రింద గ్రామ కూడలిలో ప్రజలందరూ చేరి గానాబజానాలతో రాత్రిని రంజింపచేసే వారు. ఆమె తండ్రి మహమూద్ కూడా స్వతహాగా సంగీతపుత్రుడే. పాటే ప్రాణమై పెరిగిన పాప "అమనిషాన్".

"ప్రాణమైనా పోనీ పాట మాత్రం మానకే" అని పాడుతూ పాడుతూనే, అమ్మ, అమనిషాన్‌ను తల్లిలేని పిల్లను చేసి తిరిగిరాని లోకాలకు తరలి పోగా, పాపకు పాట ఒక వారసత్వపు ఆస్తిగా, తరిగిపోని సంపదగా సంక్రమించింది. తల్లిగానే కాక సంగీతపు గురువుగా మారిన తండ్రి చిటికెనవేలు అందుకుని 'సాహిత్య సంగీత' మేలుకలయికల దారులలో ముందుకు సాగి 'సంగీత లక్ష్మిగా' అవతరించింది. పల్లెలో కొట్టిన కట్టెలు పట్నంలో అమ్మగా వచ్చిన పైసలతో వారి జీవనం గడిచేది.

ఇస్లాంలోని సున్నీ పెద్దలకు సంగీతం పట్ల విరోధం. సరసులకు భోగలాలసులకు మాత్రమే సంగీతం తప్ప, భక్తులకు కాదని వారి వాదన. దేవుడి వద్దకు చేరుకునే స్వర్గపు ద్వారాలే సంగీతపు దారులని మహమూద్ వేదన. పామరులను చీకటి దారుల నుండి వెలుగు మార్గంలోకి నడిపేదే సంగీతస్వరాలని ఆయన (సూఫీ) విశ్వాసం. ఆగ్రహించిన మతపెద్దలు ఆంక్షలతో వెలివేసినా, ఆ తండ్రి సంగీతాన్ని మానలేదు. కట్టెలమ్మిన పైసలతో, పట్నం నుండి సంగీత వాయిద్యాలను, పుస్తకాలను తెచ్చి తన గారాల బిడ్డకు అందచేసేవాడు.

ప్రకృతి పొత్తిళ్లల్లో పసిబిడ్డలా అమనిషాన్ నీలాకాశం పందిరి క్రింద పచ్చిక బయళ్లలో, గలగలా పారే సెలయేర్ల ఒడ్డున గొర్రెపిల్లలను మేపుతూ తన సంగీత సాధనను తపస్సులా కొనసాగించేది. ఆ సంగీతానికి మైమరిచిన గొర్రెపిల్లలు మేత మానేసి ఆమె చుట్టూచేరి గంతులేసి నాట్యమాడేవి. కొమ్మమీది కోయిలలు పాఠాలు నేర్చుకునేవి.

ఒకరోజు నాన్న తెచ్చిన *నవాయీ గజల్* (ప్రేమను ప్రాతిపదికగా చేసుకుని లిఖించబడిన ఉగైర్ జానపద ద్విపద కావ్యం) ఆధారంగా రాత్రుళ్లు మేల్కొని లక్షోపలక్షల నక్షత్రాల సాక్షిగా ఉగైర్ సంగీతంలో సరికొత్త రాగాలను సృష్టించి వాటికి 'మాఖం' (మధుర స్వరాలు) అని నామకరణం చేసింది. సంగీత ప్రపంచంలో సుస్వరాలను సృష్టించి శాశ్వత చరిత్రను లిఖించింది. స్వర్గం నుండి నేరుగా జాలు వారిన రాగాలే ఆమె సృష్టించిన సంగీత సరాగాలు. కమ్మని కవిత్వం శ్రావ్యమైన సంగీతపు సమ్మేళనంలో పుట్టిన సుస్వరాలే 'మాఘం' రాగాలు.

ఆ కొంగ్రొత్త రాగాలను తొలుదొలుత తన చెలికత్తెలకు వినిపించటంతో అవి 'సంగీత కచేరీలుగా' పరిణమించాయి. అట్లా ఆ నోటా ఈ నోటా ఆ మాట యార్ఖండ్ నవాబుగారి రాజదర్బారుకు చేరగా, 'సత్యశోధన' నిమిత్తమై నవాబు గారు తన ఆస్థాన సంగీత సామ్రాట్టు 'అబ్దుల్ రహమాన్' ను ఆ పల్లెకు పంపించాడు. పండువెన్నెల పున్నమి రాత్రి పల్లెజనుల సమక్షంలో ఆ సంగీత సామ్రాట్టు ముఖ్య అతిథిగా అమనిషాన్ సంగీత కచ్చేరి ఓం ప్రథమం అధికారికంగా ప్రారంభ మయ్యింది. కోడికూసేజాము దాకా స్వరలయల ఒడిలో శ్రోతలు ఓలలాడారు. సంగీత ధారల జడివానలో జలకాలాడారు.

అమనిషాన్ ఆటపాటలకు మంత్ర ముగ్ధులైనారు. నాగస్వరం ముందు నాగుపాముల్లా అయినారు. భళ్ళున తెల్లారిందన్న స్పృహ ఎవరికీ కలుగలేదు. రసాభిమానుల హృదయాలను కొల్లగొట్టింది. అబ్దుల్ రహమాన్ ప్రశంసల జల్లులు కురిపించాడు. భవిష్యత్తులో నిరంతర 'సంగీతసాధన' కోసం సర్కారు తరపున ఖజానా నుండి ఉపకారవేతనాన్ని మంజూరు చేయించాడు. "అల్లాహ్ కె ఘర్ మే దేర్ హై మగర్ అంధేరా నహీ (హై" అని ఆ తండ్రి తబ్బిబ్బయ్యాడు.

కఠినతరమైన రియాజ్ (సాధన) షురూ అయ్యింది. పచ్చికబయళ్లే నాట్యవేదికలు. మేఘ గర్జనలే మృదంగాలు, తుమ్మెదల ఝుంకారాలే సంగీత స్వరాల సారంగీలు. తలలూపే పువ్వులు, ఎగిరే సీతాకోక చిలకలే ప్రేక్షకులుగా 'మాఘం' సాధన కొత్త పుంతలు తొక్కింది. పాట పరవళ్లు గా నాట్యం ఒళ్ళంతా తుళ్ళింతయ్యింది. ప్రకృతి పరవశించింది. ఆమని పలవరించింది. అమనిషాన్ అమనిషాన్ అని!

లోకమంతా పెనునిద్దరలో ఉన్న సమయాన గుడ్డిదీపం వెలుగుముందు తపోభంగం కాని తదేక దీక్షతో ఆమె కావ్యరచనో, కావ్యపఠనమో కొనసాగించేది. సాహిత్య సంగీతాలే ఉచ్ఛ్వాసనిశ్వాసలుగా జీవించసాగింది ఆ సరస్వతీ పుత్రిక. ఆ సంగీత లక్ష్మి.

అల్లరల్లరి పిల్లగాలులు అమనిషాన్ అందచందాలు, ఆటపాటల గురించి యువరాజు చెవిలో గుసగుసలాడాయి. రసహృదయుడైన ఆ కాబోయే రారాజు మారువేషంలో అనుంగులతో కలిసి ఒకరోజు నాటుపడవలో నదిని దాటి ఆ పల్లెలో ప్రవేశించాడు. ఎండపొడ ఎరుగని ఆ సుకుమార యువరాజు ఎండ దెబ్బకు అలసి సొలసి డస్సిపోయి దాహార్తి చింతతో ఒక పర్ణశాలలో ప్రవేశించి, తలుపుతట్టి "దాహం దాహం" అని అభ్యర్థించాడు. తలుపులు తెరుచుకోలేదు కాని సన్నని తలుపు సందుల నుండి ఒక కలకూజిత కోయిల రాగం వీనుల విందుగా సోకింది. దానితో దాహమే కాదు ఒళ్ళు కూడా మరిచి శిలవోలె స్థంభించి ఆ రాగాలాపన ఆలకించాడు. ఈసారి ఎందుకో అచేతనంగా తలుపు తట్టాడు. కాసేపటికి తెరుచుకున్నాయి. మాషా అల్లా – ఎదురుగా ఒక "దీపశిఖ".

ఆ "కర్పూర దీపకళిక." సరదాకు పేదవేషంలో ఉన్న రాజసాన్ని చూసి రెప్పలార్చని కన్నుల నుండి వెండి వెన్నెల వెలుగుల్ని కురిపించింది. చూపుల చినుకుల చిరుజల్లులో ఇద్దరూ తడిసిముద్దయినారు. ఆమె అమనిషాన్, అతను ఖాఖాన్. అతని ప్రప్రథమ దర్శనం (జల్వా) లోనే ఆమె విరిసీ విరియని గులాబీ పెదాల నుండి ఈ క్రింది చరణాలు అలవోకగా కవిత్వమై జాలువారినాయి.

**ఏ పూదోటలో విహరించు గండు తుమ్మెద యేమో**
**అమాయక అనాఘ్రాతమల్లెమొగ్గను నేను.**
**స్వర్గంలోని స్వేచ్ఛకోసం కలలు కనే ఓ వసంతమా**
**ఈతని బాహువుల్లో బంధింపబడటమే**
**వేయి స్వర్గముల స్వేచ్ఛ నాకు.**

ప్రతిగా యువరాజు కవితా హృదయం ఆమెకు మాత్రమే వినబడేలా ఇలా పలవరించింది.

**జాజిపందిరిపై ప్రాకు**
**మల్లెతీగవు నీవు**
**మధుర అధరమ్ములలోన**
**తేనె పలుకులు నీవు.**

దివి నుండి భువికి దిగి వచ్చిన దేవత, దప్పిక గొన్న బాటసారి దాహాన్ని తీర్చి ప్రేమ దాహాన్ని రగిలించింది.

ఖాఖాన్ ఆ పర్ణశాల ప్రాంగణాన్ని వదిలి వెళ్లినా, అతని హృదయం మాత్రం ఆమె చూపుల్లోనే చిక్కుకుని అక్కడే ఉండి పోయింది. అమనిషాన్ మనసు అకస్మాత్తుగా వచ్చిన ఆ అనుకోని అతిథి వెంబడి శాశ్వతంగా లేచి పోయింది. ఇద్దరూ ఒకర్నొకరు కొల్లగొట్టుకొని దోచుకుని దూరమైనారు. ఇద్దరికీ ఒంటరితనం, ఏకాకితనమే రుచించింది. వెన్నెల కాల్చేసింది. పూలపానుపు ముళ్ల పానుపుగ మారింది. మేఘసందేశాలే ప్రేమసందేశాలైనాయి. చివరికి కథ సుఖాంతమైంది. 'తోటలో పిల్ల కోటలో రాణి' అయ్యింది. వారి ప్రేమ సంగీత శిఖరాలకు దారులు వేసింది.

దర్బారులోని సంగీత విద్వాంసుడు, వస్తాద్ 'ఖధీరన్' శిష్యరికంలో సాధన చేసి మాఖం రాగాలలో పన్నెండు కొత్త రాగాలను సృష్టించింది. ఆ కొత్త రాగాలు ఉత్తర దక్షిణ తీన్‌షాన్ పర్వత పంక్తులను దాటి మధ్య ఆసియా దేశాలలో కూడా ప్రఖ్యాతి గాంచాయి. ఉగైర్ జానపద సంగీతంలో కొత్త పుంతలు ఏర్పడినాయి. అంతే గాక కవయిత్రిగా మూడు కవిత్వ పుస్తకాలను రచించింది. చివరాఖరికి 'మధురమైన జీవితాల కథ లింతేనా" అన్నట్లు తన 34వ ఏట 1560లో కొత్త ప్రాణికి జన్మనిస్తూ తన ప్రాణాన్ని ఫణంగా పెట్టింది. ఆమెను సాచే (యార్ఖండ్) లోనే సమాధిచేశారు. భర్తతో సహా ఎందరో నవాబుల మక్బరాలు అక్కడే ఉన్నా, 'కారే రాజుల్, రాజ్యముల్' అన్నట్లు ఈమె సమాధే ఉన్నతంగా, కళాత్మకంగా నిలిచిపోయింది.

ఆమె వర్ధంతి రోజు ప్రతి ఏటా ఇప్పటికీ అక్కడ సంగీత నృత్య సమ్మేళనాల ఉత్సవాలు జరుగుతాయి. ఆమె సమాధి చుట్టూ తాపడం చేసిన నీలిరంగు శిలాఫలకాలపై నల్లని ఉగైర్ అక్షరాలతో ఆమె రాసిన కవితా పంక్తుల్ని పునర్లిఖించారు. ఎప్పటికి క్షయం కానిది అక్షరమే కదా, అని ఆశ్చర్యపడ్డాను. చరిత్ర చెక్కిలిమీద చెరిగిపోని సంతకంచేసి, కాలం వంతెన మీద తన అడుగుజాడల్ని భద్రపరచి, ఆకాశానికి అవతలివైపు వెళ్లిపోయింది ఆ విదుషీమణి.

అమనిషాన్ సమాధిని చూస్తుంటే నాకు హైద్రాబాద్‌లో రెండవ నిజాం దర్బార్ ఆస్థాన నర్తకి, కవయిత్రి "మాహ్ లఖాభాయి చందా'' గుర్తొంచింది. మౌలాలిలోని ఆమె మక్బరా వద్ద ప్రతిఏటా జరిగే ఖవ్వాలీలు, గజల్స్ కార్యక్రమాలు గుర్తొచ్చాయి.

చైనా సాంస్కృతిక సంపదకు ఒక అమూల్యమైన ఖజానా "అమనిషాన్ మాఖం పన్నెండు రాగాలు." ఇప్పటికీ ఉగైర్ ప్రజల నాలుకలపై ఆ రాగాలు నాట్యమాడుతునే ఉంటాయి. అందుకే 2005 నవంబర్ 25 తారీఖునాడు యునెస్కో సంస్థ ఆ పన్నెండు మాఖం రాగాలను ''సంగీత ప్రపంచపు పెన్నిధి''గా గుర్తించింది.



అట్లా ప్రపంచ సంగీత చరిత్రలో ''అమనిషాన్'' అమరురాలుగా చెదరని 'నిషానీ'గా నిలిచిపోయింది. ఉగైర్‌కీ 'షాన్' ఔర్ 'నిషాన్' 'అమనిషాన్'.

పరవస్తు లోకేశ్వర్
ఫోన్ : 9160680847

# తంజావూరి ఆంధ్రరాజుల చరిత్ర

*- కొలకలూరి మధుజ్యోతి*

**వే**టూరి ప్రభాకర శాస్త్రి (1888-1950) బహుముఖ ప్రజ్ఞాశాలి. సృజన శీలి, ప్రసిద్ధ పరిశోధకుడు. ఉత్తమ విమర్శకుడు. నిరంతర సాహిత్యాన్వేషి. సాహిత్యాభిమాని. వేటూరి అశేష పరిశోధన కృషిలో ఓ అంశం తంజావూరి ఆంధ్రరాజుల చరిత్ర.

"ఆంధ్ర నాయక రాజ ప్రసక్తమగు పాత వ్రాతలను పరిశోధించి సంస్కరించి దానిని ప్రకటించా"నని పేర్కొన్న వేటూరి, దానికి తాను ''తంజావూరులో 1912లో సేకరించిన *ఆంధ్రనాయక రాజుల చరిత్ర*కు సంబంధించిన విషయాలన్నింటిని పీఠికగా చేసి, *ఆంధ్రనాయక చరిత్ర*ను ప్రకటించా"నని పేర్కొన్నాడు. ఇంతవరకు వారిని గూర్చి వివరాలు ఎక్కువ లేవని "నా గ్రంథమే కొత్త విషయాలు గలది" అని వినమ్రంగా, సగర్వంగా పీఠికలో పేర్కొన్నాడు.

చరిత్ర (1984) 35 పుటలు ఉంటే, పీఠిక 32 పుటలు ఉంది. ఎంత సమాచారాన్ని సేకరించాడో ఇది స్పష్టం చేస్తుంది.

పీఠికకు పేరు పెట్టడంలోనే వేటూరి హృదయం స్పష్టం అవుతుంది. 'తొడిమ' అనటంలో విశేషజ్ఞత, అనుభూతి ఉండి, అది నిమిత్త మాత్రతలు తెలుపుతూ ఉంది.

చరిత్ర అంటేనే క్లిష్టం. కొరుకుడు పడదు. అందుకే ఎవరూ ఇష్టపడరు. కాని హృద్యంగా కథనంగా సాగుతూ చారిత్రక ఆధారాలతో ముడిపెడుతూ కావ్య సాక్ష్యాలను వేటూరి గుప్పిస్తూ దీనిని ఓ కళగా చేశాడు. వేటూరికి మాత్రమే సాధ్యమయిన కళ యిది.

నాటి నాయక రాజులు నేడు లేరు గాని "... రాచనగరు ఇప్పటికీ వున్నది. ఆ కొల్వుకూటములున్నవి. ఆ రామభద్ర విగ్రహాలు ఉన్నవి. ఆలాగుల చప్పరాలున్నవి. సంగీత శాలలున్నవి. ఆయుధాగారములున్నవి. ఎన్నెన్నో వున్నవి. ఆయా భాగములన్నీ గ్రంథ దృష్టాంతముల ప్రకారం పరిశీలించి గుర్తించి కాల వైపరీత్యమునకు కట కటా! అని వగచి కన్నీరు కార్చినాను" అని వేదనను వ్యక్తపరిచాడు. ఆ సభాదిస్థానాలను పండితులకు, ప్రజలకు కూడా తెల్పానని పేర్కొన్నాడు.

రఘునాథ నాయకుడు తండ్రైన అచ్యుతప్ప నాయకుడు సజీవుడై ఉండగానే రాజ్యపట్టాభిషిక్తుడయ్యాడు. వేటూరి దానికి కారణం కథలాగా చెప్పాడు. గొబ్బూరి జగ్గరాజు కుమార్తె కర్ణాటక రాజ్యాన వీర వెంకటపతి రాయల భార్య. వీరికి సంతానం లేని కారణాన ఆమె ఒక పసివాణ్ణి పెంచింది. అది రాయలకిష్టం లేక మేనల్లుడైన చిక్కరాయలకు రాజ్యం చెందాలని ఆజ్ఞాపించాడు. ఆయన తదనంతరం చిక్కరాయలు రాజయ్యాడు. దానితో ఒళ్ళు మండిన గొబ్బూరి జగ్గరాజు పలువురు సర్దార్ల అండ పొంది, రాయల కుటుంబాన్ని చెరపట్టించి కుమార్తె బాలుణ్ణి రాజును చేశాడు.

వెలిగోటి యాచమ నాయడు, జగ్గరాజుతో చేరక, రాయల కుటుంబాన్ని రక్షించదలచాడు. చెరసాలలో ఉన్న రాయలకి ఒక చాకలి వ్యక్తితో చీటీ రాసి పంపగా, 12 ఏళ్ళ ఆ పసివాడిని చిక్కరాయలని - చాకలి గుడ్డల మూటలో దాచి కారాగారం నుంచి తప్పించాడు. ఆ పై రాయల కుటుంబాన్ని తప్పించాలనే ఆలోచనతో యాచమ సొరంగం తవ్వించాడు. కాని అది తెలిసిపోయింది. జగ్గరాజు కోపోద్రిక్తుడై ఆ కుటుంబాన్ని మొత్తంగా పసిబిడ్డలతో సహా చంపించాడు.

యాచమ నాయుడు, చిక్కరాయలను పీఠమెక్కించ టానికి తంజావూరు పాలకుడు అచ్యుతప్ప నాయణ్ణి సహాయం అర్థించటానికి బయలుదేరగా భయపడ్డ జగ్గరాజు, తంజావూరు విరోధులైన పాండ్యరాజు సహాయం పొందాడు. యాచమ నాయడు తంజావూరు చేరకమునుపే అతణ్ణి ఇబ్బంది పెట్టాలని జగ్గరాజాదులు సిద్ధమయ్యారు. ఈ విషయం మహామంత్రి గోవింద దీక్షితులు తెలుసుకొని అచ్యుతప్ప రాయలకు విషయం నివేదించి, రఘునాథ

నాయణ్ణి రాజ్యాభిషిక్తుణ్ణి చేసి యుద్ధానికి పంపాడు. రఘునాథ నాయడు గెలిచాడు.

అచ్యుతప్ప నాయడు సజీవుడై ఉండగానే గోవింద దీక్షితులు ఆయనను ఒప్పించి రఘునాథ నాయణ్ణి రాజ్యాభిషిక్తుణ్ణి చేశాడు అనే విషయాన్ని గోవింద దీక్షితులు కుమారుడైన యజ్ఞనారాయణ రాసిన *సాహిత్య రత్నాకరము* అనే సంస్కృత గ్రంథములోని చరిత్రను చెప్పాడు. దీనికి బలాన్ని చేకూర్చే *రఘునాథాభ్యుదయము* అనే విజయ రాఘవ నాయకుడి రచనోదాహరణాన్ని చూపాడు. అది వేటూరి శక్తి. విభిన్న ఆకారాలను ఒక్కచోట చేర్చి, ఓ స్వరూపాన్ని మన ముందుంచి, ఆ స్వరూపానికి ఆధారాలను చివర ఇస్తాడు.

పరిశోధనలో ఇంత లోతుగా వాస్తవాలను వెతికి వెల్లడి చేసే వేటూరి, ఆధారాలు దొరకని వాటిని ఊహకు వదిలేస్తాడు. అందులోనూ, ఆ ఊహకు బలమైన ఋజువును జత చేసి వదిలేస్తాడు. వివిధ గ్రంథాలలో రఘునాథుడు నేపాల రాజుకు అండగా ఉండి, ఫారశీక రాజును ఓడించినట్టు ఉన్న విషయాన్ని ఉటంకిస్తూ "పారశీక రాజు నేపాల రాజు అంటే యెవరో! తురక రాజులయి వుందురేమో" (తొడిమ - 13) అంటాడు.

తొడిమలో శ్రీకృష్ణదేవరాయుని క్షత్రియత్వాన్ని నిరూపించాడు. రఘునాథ నాయకుడు చేసిన దానధర్మాలు, ధర్మశాస్త్ర చర్చలు, యజ్ఞనారాయణ దీక్షితులు రఘునాథుడి శిష్యుడిగా తంజావూరులో ఉండటం పేర్కొన్నాడు. రఘునాథుని పాలన, యుద్ధ పటిమ, అతని కాలంలో సంస్కృతాంధ్ర సాహిత్యాలకు లభించిన మహర్దశలను



శ్రీరంగం శిల్పాలు

కొనియాడాడు. సంగీత సాహిత్యాలలో మహాప్రజ్ఞ గల స్త్రీలున్న ఆ కాలాన్ని ఎంతో ఇష్టపడ్డ వేటూరి "ఆ కాలాన్ని పొగడటం అటుంచి నిజమైన చెప్పేటందుకు నాకు శక్తి చాలదు" (తొడిమ - 13) అని చెప్పటంలో ఆంధ్రనాయకుల పట్ల వేటూరికి ఉన్న మక్కువ. ఆ చరిత్ర పట్ల ఉన్న నిర్మల ఆరాధన గ్రహించవచ్చునని ఆయనే అన్నాడు. "నాయక రాజుల కీర్తిని ఆరాధించవలెనను కోరికను తీర్చుకొన్నాను" (పు.32) అని.

"ఓహోహో!' 'ఆహా...' అంటూ వారి చరిత్రను చెప్తూ మైమరచి చేసిన అభివ్యక్తులలో ఆ చరిత్ర పట్ల వేటూరికి ఉన్న మోహం తెలుస్తుంది. *సాహిత్య రత్నాకరం* వంటి అద్భుత కావ్యం రాసిన యజ్ఞ నారాయణుడికి గురువు రఘునాథ రాయలు, "ఇట్టి జగజ్జెట్టి పండితుడే రఘునాథ రాయల శిష్యుడనని చెప్పుకొన్నాడే! ఆహా !" (పు.15) అంటూ వ్యక్తీకరించిన భావానికి ఇష్టానికి ఆ చరిత్రతో వేటూరికి వున్న తాదాత్మ్యానికి ఇది ఒక మచ్చుతునక. ఇది చరిత్రో, చరిత్ర పరిశోధనో మాత్రమే కాదు. ఒక కళాకారుడి పరిశోధనా తాదాత్మ్యానికి దృశ్యరూపం.

చొక్కనాథ నాయనితో పోరాడి మరణించే నాటికి విజయరాఘవ నాయడు వృద్ధుడు. స్త్రీ బాల సహితంగా నాడు అందరూ మృతులయ్యారు. మరణం తథ్యమని స్పష్టం కావటంతో రాజాజ్ఞతో స్త్రీలందరూ సంతానంతో సహా దగ్ధమయ్యారని చరిత్ర చెప్తుంటే, "ఆ నగరిలో ఇప్పటి సరస్వతి మహలులో ఒక పార్శ్వ మందు స్త్రీలందరూ దగ్ధమైనారని స్థలజ్ఞులు చెప్తుతూ వున్నారు.... అక్కడ కట్టడపు మీదితట్టు నల్లగా మాడిపోయి చెక్కలు చెక్కలు రాలిపోయిన గుర్తు యిప్పటికి ఆ వెనకటి మహాదహనమును జ్ఞాపక పరుస్తూ వున్నది" (28, 29 తొడిమ), అంటూ ఆ చరిత్రకు ఆ చరిత్ర సంచలితం చేసిన మనోవేదనకు గురుతు ఈ మాటలు. చరిత్రను మనసుతో అనుభవించే మాటలతో అందించటం తద్వారా అనుభవింప చేయటం వేటూరి విజయం.

ఆనాడు ఉన్న కవులు, కవయిత్రుల రచనలు, ఆ రాజ్య సుభిక్షిత, రాజ్యాన్ని సందర్శించిన కవి చౌడప్ప వివరాలు, సాహిత్యంలో కనిపించే (*రఘునాథ నాయకాభ్యుదయం*) రాచనగరు వివరాలు, జమా ఖర్చులెక్కలు, వేశ్యా స్త్రీల పాండిత్య ప్రకర్షలను పేర్కొన్నాడు. తంజావూరు సామ్రాజ్యం మహారాష్ట్రుల పాలయ్యే దాకా చరిత్రను పునర్నిర్మించాడు. "ఆంధ్ర నాయక రాజుల వంశ చరిత్రను, రాజకీయ కల్లోలములు, మత సాంఘిక పరిస్థితులు, తంజావూరు

రాజ్యపతనమునకు దారి తీసిన పరిస్థితులు సర్వంకషముగా నిందు వెల్లడింప బడినవి" అని డా. పోచిరాజు శేషగిరిరావు తన *వేటూరి వారి సారస్వత వరివస్య* (పు. 289) లో పేర్కొన్నాడు.

చరిత్ర సత్యాన్ని చెబుతుంది. ఆధారాలను సేకరించి అందించటంలో వేటూరి ఎంత అనుభూతి పరవశుడయ్యాడో తొడిమే సాక్ష్యం. చదువరులను కూడా భావోద్రేకాలకు గురిచేయించగల సామర్థ్యం చరిత్ర పరిశోధనలో ప్రకటించిన వేటూరి ఘనుడనే చెప్పాలి. వేటూరి నాయక రాజులను ఎంతో ఆరాధించాడు. "నాయక రాజులు పుణ్యలోపం చేత భూమిపై అవతరించిన దేవత"లని చెప్పవచ్చు (29) అని అనటంలోనే వారిపై వేటూరికి ఉన్న అభిమానం, ఆరాధన తెలుస్తాయి.

1914లో వెలువడిన ఈ రచన వేటూరి ఇరవై ఆరేళ్ళ వయసుది. భావోద్వేగాల పరాకాష్ట అయిన ఆ వయసు ఉత్సాహం, సంచలిత ఉద్వేగాల పరాకాష్ఠను ఇందులో చూడగలం. అనంతమైన ప్రీతి పరిశోధనలోని కృషి, నిబద్ధత, సాహిత్యసేవ, మొక్కవోని పట్టుదల వేటూరిలో కనిపించి విస్మయ పరుస్తూ నేటి పరిశోధకులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.


**ఆచార్య కొలకలూరి మధుజ్యోతి**
**శాఖాధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ**
**శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం,**
**తిరుపతి. ఫోన్ : 9441923172**



మిసిమి
మాసపత్రిక

చందాదారులుగా చేరండి, చేర్పించండి

**అరుదైన బహుమతి**

పొందండి!






నెల నెలా ***మిసిమి*** పత్రికను మీ ఇంటిదగ్గర అందుకొనేందుకు చందాదారులుగా చేరండి.

నాలుగు సంవత్సరాలకు వెయ్యి రూపాయలు పంపండి. (పంపే విధానం కోసం 80వ పేజి చూడండి.) మీకు ప్రతినెల ***మిసిమి*** పత్రిక మీ ఇంటికే వస్తుంది. చందా అందిన వెంటనే మీకు **అరుదైన బహుమతి *చార్లీ చాప్లిన్ (నా కథ)* ఉచితంగా పంపిస్తాము.**

*ఈ అరుదైన అవకాశాన్ని పాఠకులు*
*ఉపయోగించుకొంటారని ఆశిస్తున్నాము.*

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in e-magazine: www.kinige.com/misimi

# మధురవాణి

తంజావూరు నాయకరాజులలో ప్రసిద్ధుడు రఘునాథ నాయకరాజు. ఇతడు క్రీ.శ. 1600–1630 మధ్య కాలంలో పరిపాలించాడు. ఇతడు కేవలము దేశాన్ని ప్రజారంజకముగా పరిపాలించుటలో నిపుణుడేకాక, గొప్ప పాండిత్యము గలవాడు. సహృదయులువెచ్చే విధంగా తెలుగు, సంస్కృత భాషలలో రసభావ కవిత చెప్పగల గొప్ప విద్వాంసుడు. నూతన రాగాలను, తాళాలను కనిపెట్టి వీణ మేళవింపును సంస్కరించిన సంగీత శాస్త్ర నిపుణుడు, మేధావి. ఉభయ భాషలలో అనేక గ్రంథములు రచించారు. వానిలో ఇప్పుడు మనకు లభ్యమగు రచనలు : *వాల్మీకి చరిత్ర, రామాయణము* అనే పద్య కావ్యాలు.

ఆ రోజులలో రఘునాథ నాయకమహారాజు ఆస్థానం, పండితులు, కవీశ్వరులు, కవయిత్రులు, నటీనటులందరితో నిండియుండెడిదని, చరిత్ర వలన రూఢి అగుచున్నది. అంతేకాక, చోళ, పాండ్య, తుండీర దేశములలోని, అనేక పుణ్య స్థలములలో దేవతా విమాన మండపాలు నిర్మించి, చోళ దేశమున అనేక అగ్రహారములు తమ పెద్దల పేర స్థాపించి, పశ్చిమోత్తర దేశముల నుండి దక్షిణాభిముఖియై పారి వచ్చు సంగీత దేవతకు తంజావూరు ప్రాంతము విహారభూమిగాజేసి, అపర భోజునిగా కీర్తి గడించాడు.

తన ఆస్థానమున పెక్కు మంది స్త్రీలు సంగీత, సాహిత్య, నృత్య విద్యలలో తమ తమ ప్రతిభ చూపుచూ, పురుషులతో సమానముగా గోష్ఠి ప్రసంగములలో పాల్గొని కనక రత్నాభిషేక గౌరవములు పొంది, సంస్కృతాంధ్ర కావ్యములు రచించి ఎంతో కీర్తిని ఆర్జించారు. వారిలో ముఖ్యముగా పేర్కొనదగిన వారు, ప్రఖ్యాతులు, *రఘునాథచరిత్ర* రచించిన రామభద్రాంబ, *రామాయణ సార సంగ్రహము* రచించిన మధురవాణి, చాలా గొప్పవారుగా ప్రసిద్ధి కెక్కారు!

వీరిలో రామభద్రాంబ తాను రఘునాథుని దేవి అని చెప్పుకొనినది. కాని మధురవాణి రాజుతో తనకు గల సంబంధ బంధములను వర్ణించు కొన్నది కాదు. అందువలన ఆ రాజ పురంధరుని రహః కేళీ విలాసముల పాల్గొన లేదేమో! రూఢిగా చెప్పజాలము.

సంస్కృతమున *రామాభ్యుదయము* రచించిన అభిరామ కామాక్షియు, అలాగే *శ్రీరంగాభ్యుదయము* రచించిన త్రివేణికయూ, శ్రవ్య, దృశ్య శ్రవ్య కావ్య ప్రాకృత గ్రంథ సంధాత్రి శారదయు, ఆంధ్రమహిళలే !

**గద్య పద్య ప్రబన్ధానాం పంఞ్చాష్టా దశనాటకెః**
**సాకం ప్రాకృత కావ్యాం సాహిత్యం శారదా వ్యధాత్!**

అని డిండిమ కవి చక్రవర్తి అయినటువంటి అరుణగిరి నాథునిచే ప్రశంసింపబడినది శారద.

మధురవాణి రఘునాథుని ఆస్థానములో అనేక విద్యా ప్రసంగములలో పాల్గొని, రఘునాథుడు రచించిన *రామాయణము* పఠింపగా, విని, సంస్కృతమున రచించినదని చెప్పుకొంటారు. కాని రఘునాథుని రచన సరళ పదజాలంలో సులభశైలిలో నడచినది. కాని, మధురవాణి రచన క్లిష్ట పదజాలంతో నిండియున్నది. కొన్ని శ్లోకములకు స్వయముగా వ్యాఖ్య రచించింది. *పాణినీయము,* తను చక్కగా జదివెనని తెలియజేయుటకు తన రచనలో ప్రయోగ చాతుర్యము హెచ్చుగా చూపించింది. ఆమె తన్ను గురించి గద్యాలలో ఈ విధంగా చెప్పుకున్నది. తాను శతగ్రంథ కర్త్రి! ప్రాకృత భాషలోను, శాస్త్రములలోను, నైపుణ్యం గలదానని చెప్పుకొన్నది.

తన కాలంలో అనువాదాది యంత్రములు ఉండి ఉంటే ఇతరులు యిచ్చిన సమస్యలను పూరించి యుండెడిది. అయినను నీ చాతుర్యము ఉభయకలాధ్వంసకము అని, ఇతరులు గుసగుస లాడుకొన్నారు. నీలోని సరళత్వం మేము తెలుసుకోజాలము. నీలోని యవ్వనము కప్పిపుచ్చుచున్నది. *నైషధమునకు, వసు చరిత్ర*కు ప్రతికృతులను సృష్టిస్తావా? నీ కంతటి చాతుర్యము అలవడ్డదా? అటువంటి ప్రతికృతులను సృజించు వారు ఆంధ్రులలో పుట్టలేదా? నీ శక్తి వర్ణన జరుగనియ్యి! నీ వాణి ఆత్మ స్తుతి యందు మధురముగా ఉన్నది.

సాధ్వియగు నీ వాక్కు సాక్షాత్తుగా విన్న రఘునాథుడు సంతోషభరితుడై ఎన్నైనా బిరుదులిస్తాడు. మాకు నీ గద్యములోని యుత్తరార్థము పల్లవిగా వినివిని పరబాధిక్యముచే మా శ్రోతలు (చెవులు) జగమంతయు మధురతరముగా గ్రహించుచున్నవి. నీ పేరులోని 'మధుర' అనే పదాన్ని ఏ విధంగా విశ్లేషిస్తావో చెప్పు! ప్రతి గ్రంథనమునకు (వ్యతిరేకంగా గ్రంథనామములిడుట),

(ఉదా: రఘువంశము × యదువంశమని భారవికి బూరవి యని, మేఘసందేశమును హంస సందేశమని) ఈ విద్యలో నీకు గురువర్యులెవరు? "కనక రత్నాభిషేకముచే నీ శరీరము మందాకినీ జలావగాహనముచేత వలె పవిత్రమైనది" ఇట్టి ధన్యురాలిని కన్న తల్లిదండ్రుల పేరు తెలుపుము విని ఆనందింతము.

"ఏమి ఈ అసందర్భ ప్రశ్న? కాళిదాసాదులు తమ జననాదులు వర్ణించు కొనిరా? గ్రంథము చదువు పాఠకులు కదా తత్తద్రవభావ గుంభనములచే కవి వ్యక్తుల ననుమానమున నిర్ణయింప వలయు" అని చెప్పెదవా?

ఓ కవయిత్రీ! ఏమి ప్రతారణము సేసెదవు? కవులు చరిత్రములు వ్రాయునప్పుడు తల్లిదండ్రుల పేరులును.... కాళిదాసాదులు తమ విషయముగా సర్వత్ర మౌనమునే పూనిరి నీవు నీ పాండిత్య విశేషమును బహుభంగిగా గద్యములలో చెప్పినందున నీ జనన కథ అడిగితిమి. నీవును కాళిదాస, భాస సరణిని అవలంబించియున్నచో –

"ఏ దంపతులకు బొడమెనో, యే దేశమునందుగీర్తి కెక్కినవాడో (తుదకు) ఏ దిస వాడో యెఱుంగను" అన్న వాక్యమున లింగము మార్చి నీ కన్వయించి యుందుము. కాని, ఆత్మ ప్రఖ్యాపనశీలవగు నీకు సిగ్గేల చెప్పరాదా? "సరస్వతీ పవిత్రాణాం జాతి స్తత్త్వ నకారణం" అని యొక క్షత్రియ సార్వభౌముడు పలికెగదా ! మేము నా మతములోని వారము. నీవు నిశ్శంకముగా దెలుపుము. భోగిని వని సంకోచించెదవా? ఈ వ్యాసమున మంగళాంతము చూడుము.

*రామకథ*ను అనేక విధములుగా వినగోరి, *రామాయణ* రచనకు స్త్రీ కవులను కోరుకొన్నాడట రఘునాథనాయకుడు. ఆ తరుణంలో భగవంతుడైన శ్రీరామచంద్రమూర్తి ఆయనకు కలలో సాక్షాత్కరించి "నీ చే 'మధురవాణి' అను బిరుదము పొందిన మేధావతి, స్త్రీలలో ఎక్కువ కవిత్వ పాటవము కలది" అని చెప్పెనే కాని యామెకు తల్లిదండ్రులు పెట్టిన నామమును తెలుపడయ్యె. సర్వాంతర్యామియగు భగవంతునకు గూడ దానిపేరు తెలియదా? శ్రీరామచంద్రుడే గ్రంథకర్త (ర్త్రి) పాండిత్య శక్తులను వర్ణించె. ఆ రఘురాముడే దానికి విద్యాగురువైనచో కొఱత ఏమి?

ఇందులో ఒక చిన్న వైరుధ్యము – యజ్ఞనారాయణ దీక్షితునికి గురువు రఘునాథనాయకరాజు. కాని మధురవాణికి గురువు రఘునాథుడా? రఘునాథ నాయక రాజా? కలలో చెప్పిన తీరు గమనిస్తే – సాక్షాత్తు శ్రీరామచంద్రుడే ఆమెకు గురువుగా తోస్తుంది. స్వప్నానంతరము రాజు సభాస్తారులతో కొలువుండి మధుర వాణిని పిలిపించి *రామకథ* రచింపుమని స్నేహపూర్వక ఆజ్ఞనిస్తాడు!

పూర్వకాలమున, విద్యాసంస్కారము స్త్రీ పురుష భేదము లేక లభించు రాజపుత్రికలు, మంత్రి కుమారికలు, గణిక లాదిగా విదుషలు శాస్త్రముల నేర్చి కవిత్వం చెప్ప నేర్చిరని భావము.

పూర్వము రాజుల వద్ద భోగినులు పట్టాభిషిక్త యగు రాజ్ఞికి స్థాన విశేషమున న్యూనత వహించిననూ కలావిలాస శిల్ప చాతురుల మిన్నలై, యేక చారిణీ వ్రతము ననుష్ఠించుచూ, గౌరవము చెందుచుండిరి. అట్టి పదవిలో గంగాదేవి, రామభద్ర, తిరుమలాంబ, మధురవాణి, రంగాజి మొదలగు సంస్కృతాంధ్ర విదుషులు చేరి యుందురని కేవలమూహచే తలచుచున్నాము. అంతే కాక, వాత్స్యాయన మహర్షి గణిక విద్యా సంస్కారముననుసరించి గణికలు స్వధర్మముల బరిత్యజించి నిమ్న మార్గముల హేయజీవనము సేసినచో దూష్యలగుచుందుర గాని, నియత ధర్మానుష్ఠాతులు వినింద్యులు కారు.

**వ్యాస సారాంశము :**

మధురవాణి గొప్ప విదుషీమణి. ప్రాకృత, సంస్కృత, ఆంధ్రమొదలగు అష్టభాషలలో నిష్ణాతురాలు. సంగీత, సాహిత్య, నృత్య, వ్యాకరణ శాస్త్రాలలో ప్రజ్ఞావంతురాలు. ఆమె తంజావూరును క్రీ.శ. 1600–1630 మధ్య కాలమున పరిపాలించిన రఘునాథ నాయకరాజు ఆస్థానములో ఉండెడిదని చారిత్రక ఆధారాలు ఉన్నవి. మధురవాణి అనునది ఆవిడ అసలు పేరు కాదు. రఘునాథనాయక మహారాజు ఆమె పాండిత్య ప్రజ్ఞాపాటవాలకు, ఆమె సంగీత మాధుర్యానికి మెచ్చి కనకాభిషేకపూర్వకంగా ఇచ్చిన బిరుదు. ఆమె అసలు పేరుగాని ఏవియు నిక్కచ్చిగా తెలియరాలేదు.

ఆవిడ కవితా చాతుర్యత, కావ్యరచనా నైపుణ్యం అత్యంత ఉన్నత స్థాయికి చెందినదని విజ్ఞులైన విద్వాంసుల అభిప్రాయము. అలాగే, ఆవిడకు, రఘునాథనాయక రాజుకు ఉన్న శృంగార సంబంధ బాంధవ్యాలు రూఢిగా తెలియవు. జాతి పరంగా ఆమె భోగినుల లేక గణికుల పరంపరకు చెందినదని పండిత ప్రకాండుల ఊహ! చారిత్రక ఆధారాలు ఇప్పటివరకు లభ్యం కాలేదు.

- రావి

# దాశరథి దృక్పథం – ఒక సమాలోచన

*– గొల్లపూడి మారుతీరావు*



**నా** పదిహేడవ యేట మొదటిసారిగా దాశరథిని ఆంధ్రవిశ్వవిద్యాలయంలో చూశాను.

ఆయన కవిత విన్నాను. ఆయనకప్పుడు ముప్ఫై ఏళ్ళు. మరో మూడు దశాబ్దాలపాటు ఆయనతో – పనిచేసిన అన్ని రంగాలలో ఆయనతో సాహచర్యం సాధ్యమయింది. ఆయన్ని తలుచుకుంటేనే హృదయం ఆనందంతో, ఆత్మీయతతో ఆర్ద్రమవుతుంది. అది ఆయన వ్యక్తిత్వం. ఆయన కవిత్వాన్ని తలుచుకుంటే హృదయం ఆవేశంతో, ఆనందంతో, దేశభక్తితో, స్వాతంత్ర్యస్ఫూర్తితో ఉద్రూతలూగుతుంది. అది ఆయన సాహితీ వ్యక్తిత్వం.

జీవితాంతం నన్ను సాదరంగా తమ్ముడూ, అబ్బాయ్ అని పిలిచిన సౌజన్యమూర్తి. జీవితాంతం తను నమ్మిన నిజాలకోసం పోరాటం ఆపని యోధుడు. తనని తాను రక్షించుకోవడం తెలీని అమాయకుడు. జీవితం చక్కపెట్టుకోవడం తెలీని నిజాయితీపరుడు. బొత్తిగా లౌక్యం తెలీని మనిషి. జీవితంలో తారసపడిన మనుషుల్ని నిండైన మనస్సుతో ఆహ్వానించి, హృదయానికి హత్తుకునే అద్భుతమైన స్నేహితుడు, అన్న, ఆప్తుడు.

ఈ వాక్యాలు మరే కవికీ నేను వ్రాయను. కవుల వ్యక్తిత్వ పట్టకంలో చూస్తే – ఏ కవికీ ఇన్ని అందమయిన రంగుల పొందిక కుదరదు. నమ్మిరాశాడు. నమ్మించడానికి రాయలేదు. నమ్మకంతో రాశాడు. ఈ మాటలు 'ఇజాలు' భుజాల కెత్తుకున్న చాలామంది మహాకవుల విషయంలో నిర్భయంగా నేనను. ఇది స్వానుభవంతో చెప్తున్న మాటలు.

ఈ వ్యాసం ఒక మహాకవికి నేను సమర్పించే నివాళి కాదు. ఇచ్చే కితాబు కాదు అది ఆయనకి అవసరంలేదు. గత 56 సంవత్సరాలలో నన్ను ఆకర్షించిన మూడు గేయాలను అప్పుడప్పుడు నా డైరీలలో రాసుకున్నాను. వాటిలో ఇద్దరు కవులెవరో అప్పుడు తెలీదు. ఇప్పుడూ తెలీదు. ఒకాయన తెలుసు. ఆయన కవిత తెలుసు. అది ఇది:

**కొత్తపాటపేరుతో చెత్తపాటపాడకు**
**కొత్తదనం పేరుతో రిత్తదనం పెంచకు**
**గుడ్డ విడిచి నడ్డి విరిచి / రోడ్డు మీద నడవకు**
**ఇజాలతో భుజం కలిపి / నిజం దాచచూడకు**
**హింస నుంచి సమ సమాజ / హంస ఉద్భవించుననే**
**అసత్యాన్ని నమ్మకు / హంతకుడవు కాబోకు**

దురదృష్టం ఏమిటంటే దాశరథి బతికున్న కాలంలో ఈ గేయం నాచేతికి రాలేదు. మేమిద్దరం, రేడియోలో, సినిమాల్లో కలిసి పనిచేశాం. మిత్రులుగా కలిసి తిరిగాం. సభల్లో పాల్గొన్నాం. కాని ఈ గేయాన్ని నేనప్పుడు చదవలేదు. చదివితే ఆయన్ను దగ్గర కూర్చుని 'గుడ్డవిడిచి, నడ్డివిరిచి రోడ్డు మీద నడిచిన' కవులెవరు అన్నగారూ! అని అడిగేవాడిని. బహుశా గుడ్డవిడిచిన కవులుగా దిగంబరకవులూ, కవిత్వానికి నడ్డివిరిచానని చెప్పుకున్న కవిగా శ్రీశ్రీ ఆయన మనస్సులో ఉండి వుంటారని మనం భావించాలి. వారంతా ఇక 'ఇజా'నికి కట్టుబడ్డ కవులు కనుక, దాశరథి ఇజం మీదే ధ్వజం ఎత్తారు కనుక.

ఈ కోణంలో ఈ ఆలోచనకు case study యే ఈ ప్రయత్నం.

'ism' అంటే ఆక్స్ ఫర్డ్ డిక్షనరీ ఏం చెప్తోందంటే used to refer to a set of ideas or systems of beliefs or behaviours అంటూ బ్రాకెట్లో usually disapproving అని పేర్కొంది. ఇంకా మనం disapproving అన్న మాటని సీరియస్‌గా తీసుకోమేమోనని నిఘంటుకారుడు భయపడి

ఆ మాటని ఇటాలిక్స్ లో వేశాడు. సాధారణంగా మనం అంగీకరించని, అంగీకరించలేని. కొన్ని ఆలోచనలు – ఆ ఆలోచనలకు కట్టుబడి ఉండే ఏ ప్రక్రియ అయినా 'ఇజం' కిందకి వస్తుంది.

అంటే రచన ప్రారంభించినప్పటికే రచయిత ఆయా నమ్మకాల మీద తనదయిన విముఖతని ఏర్పరుచుకుని – ఆ దృష్టితోనే సమస్యల్ని, జీవితాన్నీ, జీవనాన్నీ, ఆలోచనల్నీ, ఆవేశాన్నీ – నిర్దేశించడాన్ని ఈ ఇజంకు కట్టుబడి ఉండడమన్న మాట. ఇక్కడో వివరణ :

కొన్ని సిద్ధాంతాలను విశ్లేషించి – ఆ నిర్ణయాలకో, ఆ అభిప్రాయాలకో చేరడం ఇజం కాదు. ఆ అభిప్రాయాల నుంచి ప్రయాణాన్ని ప్రారంభించడం ఇజం. ఆ నిజాలమీద నమ్మకం లేని లేదా మరో నిర్దిష్టమయిన నిజాలమీదే నమ్మకమున్న రచయిత ఆ దృష్టితోనే రచనని సాగించడం.

ఒక సిద్ధాంతానికి కట్టుబడి రాసేవాడు ప్రచారకర్తే కాని– రచయిత కాజాలడు. It is like wearing a coloured glass even before you judge the colour of a - say, a flower.

నిష్పాక్షికమైన దృక్పథమో, అభిప్రాయమో ఏర్పడడానికి ముందు మన మనస్సులో ఏర్పరచుకున్న pre-conceived notion ని పక్కన పెట్టాలన్నది దాశరథి ఉద్దేశ్యం.

ఎందుకంటే an ism- pre-supposes the end even before it addresses the problem.

ఇజానికి కట్టుబడ్డ రచయిత మొదటి పోరాటం తను చెప్పే నిజం కోసం కాదు. తను నమ్మే ఇజం కోసం తను ఎంచుకున్న మార్గాన్ని అంగీకరించేటట్టు చేయడం కోసం. ప్రచారం కోసం – సమాజంలో జరిగే అన్యాయం దృష్ట్యా ఈ దృక్పథం అవసరమని భావించే తన ఆలోచనకి పాఠకుడి అంగీకారాన్ని కోరుతున్నాడు. He is advocating for the process and not as much for the goal.

అయితే అన్యాయానికో, అనర్థానికో, అక్రమానికో, పీడనకో, దురదృష్టానికో, నిస్సహాయతకో రూపుదిద్దే కవి సిద్ధాంతానికి కట్టుబడనక్కరలేదు. ఆ నిజానికి బద్ధుడయితే చాలు.

ఇక్కడ ఇద్దరు కవులను సాక్ష్యం తెచ్చుకోవాలనుంది.

"తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు?" అన్నారు నూరేళ్ల కిందట పుట్టిన ఓ కవి శ్రీశ్రీ. ఈ గేయాన్ని ఎంత మంది వల్లించారో చెప్పలేం. ఈయన ఇజం కవి.

"ఒక్కొక్క రాతిలో నిమిడియున్నవి భూభుక్కునెడందలో నుడికి పోయిన రక్తపుంజుక్కలలోని చక్కదనంబు" అన్నారు మరో కవి. ఆయనే జాషువా.

ఇద్దరిదీ దృష్టి భేదం. ఒకాయన ప్రపంచ అద్భుతాలలో ఒకటయిన కట్టడం వెనుక శ్రమని చూశాడు. మరొకాయన కట్టిన వ్యక్తి అభిరుచిని చూశాడు. ఒకాయన చూసే ముందే తన దృష్టిని నిర్దేశించుకున్నాడు. మరొకాయన కనిపించింది కనిపించినట్టు చూశాడు. ఒకటి ఇజం. రెండవది కేవలం నిజం.

అలాగని జాషువాకి అన్యాయానికి స్పందించే దృష్టిలేదని కాదు.

**కొడవలి టెక్కమున్ తలను గూరిచి కార్మిక కర్షకాళితో**
**నడుము బిగించె నీ యుగమునందొక నూతన సామ్యవాద మ**
**న్గడిబిడి, దాని దెబ్బకు వికావికలైనది స్వార్థ జర్మనీ**
**జడనిధి, నేటి మార్పు లసంఖ్యము లంచితముల్ విచిత్రముల్**

కవి తన కేన్వాస్‌నీ, పరిధినీ కుంచించుకోకుండా ఉన్నా ఇజాలలో ఉన్న నిజాలను చెప్పగలడు.

ఊర్వశినీ, ప్రేయసినీ, ఆరాధించీ – ఏడుపుకి అందమయిన ఊదుపులు దొడిగిన నవ్యసాహితీ పరిషత్తు కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి. "ఆమె కన్నులలోన అనంతాంబరపు నీలినీడలు కలవు" అని మురిశాడు. కాని ఒకచోట:

**పనిచేస్తే పదిపైసలొస్తాయ్ / పగలంతా సూరీడు మేస్త్రీ**
**రేతిరి సెందరవంక దోస్తీ** – అన్నాడొకచోట.

కవిత్వం నినాదం కాదు, పాంప్లెట్ కాదు, శాసనం కాదు, శాసించే సాధనం కాదు. హృదయాన్ని మేల్కొలిపి ఆలోచనల్ని అలంకరించే మేస్త్రీ.

'ఇజం' అనే కళ్లద్దాలు అక్కరలేదన్న దాశరథి మాటకి బలం చేకూర్చడానికి నేను మొహమాటంగా చెప్తున్నాను. కాని ఆయన తన గేయంలో ఇంతకంటే గట్టిగానే చెప్పాడు.

దాశరథి నన్ను మొట్టమొదటిసారిగా తన పరిధిలోకి లాక్కున్న పాట:

**మాట్లాడని మల్లెమొగ్గ మాదిరిగా నడిచిరా**
**నిశ్శబ్దం ఎరుగనట్టి నిమ్నగవలె గడిచిపో**
**చేదగు కన్నీటి బొట్టు చిందిన చప్పుడులు విను**
**వాదింపగరాని మనసు పరివాదిని లోతుగను**

సుతారమైన ఆలోచనకీ, muse కీ తెరలేపిన ఈ కవే

**నా గీతావళి ఎంతదూరము ప్రయాణంబౌనో, అందాక ఈ**
**భూలోకమ్మున కగ్గి పెట్టెదను.....**

అని హెచ్చరించాడు. ఎందుకని? ఆయనే సమాధానం చెప్పాడు. ఎంతో గొప్పగా, ఎంతో స్పష్టంగా, కమిటెడ్ కవులకే మాత్రం తీసిపోనంత ఆవేశంతో–

**ఈ కొరగాని లోకమున కిప్పుడె నిప్పు రగిల్చి కాల్చి, నా**
**లో కదలాడు నూహలకు రూపమొసంగి పునస్సృజింతు; న**
**ర్రాకట గుందు పేదలకు బ్రహ్మ లిఖించిన కొంటె వ్రాతలో**
**వ్యాకరణమ్ములేదు.....**

కవికి అర్రాకటిగొన్న పేదల దుస్థితిమీద బాధ, అందుకు కారణమైన వారి మీద కోపం మాత్రమే కాదు. దహించిన ఈ లోకం మీద ప్రేమ వుంది. కవి వినాశకుడు కాదు పున:సృష్టి చేసే బ్రహ్మ. ఈ కోపంలో పెద్దరికం ఉంది ప్రేమించే ప్రపంచం ఉంది. న్యాయం జరగని ఆర్తుల పట్ల స్పందన ఉంది. అన్నిటి కన్నా ముఖ్యం – కవిత్వం ఉంది.

ఈ కవి దగ్గర నెత్తుటి వరదలు, విప్లవ శంఖాలు, గర్జనలు లేవు. నాశనం చేయాలనే దుందుడుకు ఆవేశం లేదు. ఆయన దృష్టిలో –

**ఏనాడెవ్వడు కత్తితో గెలువలేదీ విశ్వమున్, ప్రేమ పా**
**శానన్ కట్టుము నాలుగుంబది ప్రపంచాలన్....**

అంటాడు. కవిత్వం ఆవేశాన్ని పుక్కిలిస్తుంది. ఆలోచనని సునిశితం చేస్తుంది. "ఆహా!" అనిపిస్తుంది. "అబ్బా!" అనిపిస్తుంది. కాని నిర్దేశించే ఆవేశం "ఇజం"ది. నిజానికి శ్రమజీవుల పాటకూడా శ్రమకి ఊతమే. కవి కామన ఉదాత్తం కావాలి. కూలిపోతున్న ప్రపంచం మీద కూడా అతనికి ప్రేమ ఉండాలి. అది తల్లి బిడ్డని చేసే మందలింపు కావాలి. పక్కింటివాడు ఎత్తే పదునైన కత్తి కాకూడదు.

దాశరథి భయపెట్టడు. బాధపడతాడు. బాధ పెట్టడు. తన బాధని వ్యక్తం చేస్తాడు. ఆయన కత్తి పట్టుకున్న హంతకుడు కాదు. కత్తిపట్టుకుని అక్కరలేని భాగాలను ఉత్తరించే చికిత్సాపరుడు.

**1950 ప్రాంతాల్లో ఇలా గర్జించాడు :**

**ఎవరు కాకతి? / ఎవరు రుద్రమ?**
**ఎవరు రాయలు? / ఎవరు సింగన?**
**అన్నీ నేనే / అంత నేనే / తెలుగు నేనే / వెలుగు నేనే**

ఈయనే అతి నేలబారు మనుషుల్ని ఆనందపరిచే మాధ్యమంలో – సినిమాల్లో – తన కవితా హృదయానికి విడాకులివ్వలేదు.

**నీవురావు నిదురరాదు / నిలిచిపోయె ఈ రేయి**
**కౌగిలిలో ఒదిగిపోయి / కలలుగనే వేళాయె**
**ఎదురు చూచి ఎదురు చూచి / కన్నుదోయి అలసిపోయె**

నేను నా జీవితంలో ఒకే ఒక్క ఫాన్ మెయిల్ రాశాను– సినీ కవికి ఈ గీతం విన్నాక ఇంటికి వచ్చి దాశరథికి. నేనూ ఆ సినీమాలో పనిచేశాను.

ఇజాలతో ముడిని నిలుపుకుంటూనే రాముడిని, కృష్ణుడిని, విష్ణువునీ ఆకాశానికెత్తిన కవులున్నారు. ఒకటి వృత్తి, మరొకటి వ్యావృత్తి అని సర్ది చెప్పుకొన్న అభిమానులూ ఉన్నారు.

పరిధిని విస్తృతంగానే ఉంచుకుంటూ, తన ధోరణికి ఏ లేబుల్‌నీ అంటించుకోకుండా – అధర్మానికి స్పందిస్తూ, స్వధర్మాన్ని నిలుపుకుంటూ, కవిత్వాన్ని objective గా నిలుపుకున్న కవులు బోలెడుమంది.

**ఆకాశం రమ్మంటోంది చెట్ల సందుల్లోంచి / ఇళ్ల కప్పుల మీద నుంచి**
**కొండ శిఖరాలెక్కి మేఘాల గుంపుల్లోంచి**
**పక్షిలేని తోటనుంచి పొమ్మంటోంది / ఒక చంద్రున్నిస్తా**
**నీ ఆత్మ చప్పరించడానికి / రమ్మంటోంది.**

ఈయన కేవలం కలలు కనే మిస్టిక్ కాదు. నేలవిడిచి సాము చేసే గుడ్డివాడు కాదు. అన్యాయాల్ని ఖండించి, విప్లవకారుల్ని వెనకేసుకొచ్చిన ధైర్యశాలి, చిత్తశుద్ధికల కవి.

**చెట్లకు వ్రేలాడిన శిరస్సులు పూస్తున్నయ్ / కొమ్మల్లో పూలై**
**గోలీ దూరిన గుండెలు కదులుతున్నాయ్/ఈ దేశపు ప్రాచీ రేఖ మీద**
**సూర్యుడు ఉదయించకపోతే / మండే నా గుండె చీల్చి**
**దాని మీద పెడతా / ఎర్రటి నా కండలతో**
**ఎండలు కాయిస్తా**

అని మధన పడ్డాడు కవి. ఆయన గుంటూరు శేషేంద్ర శర్మ.

**నా అక్షరాలు కన్నీటి జడులలో దయాపారావతాలు**
**నా అక్షరాలు ప్రజాశక్తులావహించే విజయ ఐరావతాలు**
**నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు**

అంటూ ఆర్ద్రతకీ, సుతారమైన ఆలోచనకీ, పట్టం కట్టిన ఓ కవి –

**కూడు లేని లోకం ఇది / గుండె లోతు తాపం ఇది**
**సోమయాజి శాపం ఇది / భూమి అడుగు లోకం ఇది**

అని వాపోయాడు : ఆ కవిపేరు బాలగంగాధర తిలక్.

వ్యవస్థ మీద తిరగబడి నిజామాబాద్ కోటలో ఇందూర్ ఖిల్లాలో తెలంగాణా విమోచన పోరాటానికి 1946–48 మధ్య జైల్లో ఉన్నాడు దాశరథి.

**గొంతుకలెండి, డొక్కలకు కొంచెము గంజియు లేకపోయినన్**
**పంతము నెగ్గగా వలెను, ప్రాణము పోయిన గూడ సమ్మెగా**
**వింతుమటంచు ఆకట తపించెడి పేదల గూర్చి నేను మ్రో**
**గింతును రుద్రవీణ...**

అన్నాడు. అయితే కవి తన సుతారమైన స్వప్నాన్ని తాకట్టు పెట్టలేదు.

**"వలపునై నీ హృదయ సీమల నిలువవలెనని యున్నది**
**పిలుపునై నీ అధర వీధుల పలుకవలెనని యున్నది"**

అంటారు. Dasaradhi is a complete poet.

1960 ప్రాంతంలో మిసిసిపి విశ్వవిద్యాలయంలోని తొలి నీగ్రో పట్టభద్రుడు జేమ్స్ మెరిడెత్‌ని ఉద్దేశించి చెప్పిన మాటలు:

**మిత్తిని మొత్తి, గుండియల్ మెత్తని పువ్వుల గుత్తులెత్తి, గ**
**మ్మత్తొనరించినట్టి నరమానవుడా! నిను గెల్చువాడు లే**
**డిత్తరి నీకు నీవె సరివాడవు. నీ మనస్సులో**
**ఎత్తిన పూల దీపముల నెవ్వడు నార్పగలేడు సోదరా!**

అభ్యుదయాన్ని నిండైన మనస్సుతో స్వాగతించిన కవి దాశరథి.

దాశరథి కవితా వైభవాన్ని ఎత్తిచూపడం, విశ్లేషించడం నా ఉద్దేశ్యం కాదు. ఆయన కవితలో విస్తృతమైన కేన్వాస్, ఏ ఒక్క ఆలోచనకూ తనని తాను పరిమితం చేసుకోని విశాలత్వం – వెరసి – ఒక రేంజ్‌ని సాధించిన దాశరథి. అటువంటి మరికొందరు కవుల్ని సాక్ష్యం తెచ్చుకోవడమే నా ఉద్దేశ్యం.

ఆయన చల్లని స్నేహ హస్తాన్ని అందుకున్న వారికి ఆయన వ్యక్తిత్వంలోనూ ఇంతటి విశాలత్వం కనిపిస్తుంది. ఆయనప్పుడు మద్రాసు రేడియోలో పనిచేసేవారు. నేను విజయవాడలో పనిచేసేవాడిని. నేనెప్పుడు మద్రాసు వచ్చినా నన్ను తీసుకెళ్ళి నా చేత రేడియోలో రచనలు చదివించేవారు. ఒక్కసారి మీరివి చదవండి అంటే కోపం తెచ్చుకుని, "నేను నీ రచనలు చదవడం ఏమిటబ్బాయ్. నీకు నువ్వేం రాసినా బాగుంటుంది" అన్న సహృదయుడు.

మనిషి ఆవేశి. ఒక నిజాన్ని నమ్మడం, తన కవితని మనసారా చిమ్మడం తప్ప కవితను అమ్మడం తెలీని మనిషి. కనుక డబ్బునీ, బిరుదుల్నీ ఎక్కువ కూడగట్టుకోలేకపోయాడు. అవి ఆయన మనస్సుదాకా పోని విషయాలు. అయినా ఆంధ్రదేశానికి ఆస్థాన కవి అయాడు. కళాప్రపూర్ణుడయాడు. పద్మశ్రీ అయ్యాడు. 1984లో ననుకుంటాను. సినీనటులు కృష్ణంరాజు ఏర్పాటు చేసిన పాకేజ్‌లో అమెరికా వెళ్లారు. ఆ సందర్భంలో నేను మద్రాసు రేడియోలో పనిచేస్తున్నాను. అప్పటికి ఆయన రేడియోలో ఉద్యోగాన్ని విడిచిపెట్టారు. ఇద్దరం రేడియో స్టేటస్‌కి రికార్డింగుకి వెళ్తున్నాం. కారులో నా చెయ్యి మీద చెయ్యి వేసి అన్నారు. "ఆరోగ్యం బాగులేదు మారుతీరావ్! అమెరికా వెళ్తున్నానేకాని మనసు అటులేదు" అని కాస్సేపాగి "రేడియో ఉద్యోగం రాజీనామా చెయ్యడంలో నేను తొందర పడ్డాను. నువ్వా పని చెయ్యకు" అని హెచ్చరించారు.

మరి రెండేళ్ళకి– 61 సంవత్సరాల వయస్సులోనే వెళ్ళి పోయారు. ఆయన సోదరులు దాశరథి రంగాచార్యులు అన్నారు. "మృత్యువు సైతం మా అన్న మందహాసాన్ని ఆర్పలేకపోయింది. ఆయన మృత్యువుని గెలిచిన యోధుడు. తిమిరంతో సమరంలో ఉంటాడు. గాలిబ్ గీతాల్లో ఉంటాడు. మిత్రుల మనస్సుల్లో ఉంటాడు".

నిజం. ముమ్మాటికీ నిజం. ఇప్పుడు అమెరికా తెలుగు మిత్రుల సమక్షంలో ఆయన చిరంజీవి. తిమిరంతో సమరాన్ని సాగిస్తూ గాలిబ్ హృదయంలోని రసధునిని వెలికి తీసిన కవే ఇజాల గురించి నిజాలు చెప్ప గలడు.

మరొక్కసారి –

**గుడ్డ విడిచి, నడ్డి విరిచి / రోడ్డు మీద నడవకు.**
**ఇజాలతో భుజం కలిపి / నిజం దాచి చూడకు.**

ఎందుకంటే – An "ism" conditions the outlook of the writer, restricts him to stunted goals, retards his vision, discounts the function of his thoughts and most importantly, undercuts the literary stature of his work. ఆఖరుగా నాకు చాలా ఇష్టమయిన – కొన్ని దశాబ్దాలు – ఎప్పుడు చదివినా, ఎన్ని సార్లు చదివినా "ఆహా!" అనిపించే కవిత – ఆర్చ్ బాల్డ్ మెక్ లీష్ ది. అందులోంచి రెండు మూడు పంక్తులు:

A poem should be palpable and mute
As a globed fruit
A poem should be motionless in time
A poem should be equal to
Not true
A poem should not mean
But be-

అయితే ఆధునిక కవులు చాలా మంది ఆర్చ్ బాల్డ్ మెక్ లీష్ నీ, దాశరథినీ క్షమిస్తారనుకుంటాను.



# తెలుగు వాని కవితా కంఠం

– తిరుమల రామచంద్ర

తెలుగు వాని కవితా కంఠం విచ్చుకుంది రెండు సహస్రాబ్దాలకు ముందే. గద్గద నదద్గోదావరీనది, పచ్చని అరణ్యాల దుప్పట్లు కప్పుకొని నిక్కిచూస్తున్న కొండలు, కొండలు పిండులు దొర్లుతున్నట్లున్న మబ్బులను చూచి నర్తించే నెమళ్లు, శరత్కాలంలోని నీలాకాశం, నీలాకాశంలోని నిండు చందురుడు తెలుగువాని కవితకు కారణమయి ఉంటాయి. వాటినే గొంతెత్తి గాథా ముక్తకాలుగా పాడాడు. ఆ ముక్తకాలను హాలుడు తన గాథా సప్తశతిలో కూర్చాడు.

**గాథా సప్తశతి యుగం :** తెలుగువాళ్లనదగిన అలయుడు, మానుడు, అలక్కుడు, హరియాళుడు, అసులద్దీ, అణులచ్చీ మున్నగు కవులు, కవయిత్రులు చిత్రించిన దృశ్యాలు చూస్తుంటే, ఇంత అందం ఇంత సహజత వీటికి ఎలా అబ్బాయా? అని మనం విస్తుపోతాము.

**ఫాలేహి అచ్ఛభల్లం వ / ఉ అహ కుగ్గామ దేఉల ద్దారే,**
**హేమంత ఆల పథిఓ / విఝ్ఝాఅంతం పలాలగ్గిం** *(గాథా స. 2-9)*
**(పాటయ త్వచ్ఛభల్ల మివ / పశ్యత కుగ్రామదేవకుల ద్వారే,**
**హేమంతకాల పథికో / విధ్మాయమానం పలాలాగ్నిమ్)**

చలికాలం పల్లెటూరి దేవాలయం ముందు ఒక బాటసారి గడ్డి నెగడు వేశాడు. చలికి గడ్డి నెగడు ఎంతసేపు ఉంటుంది? కొంత సేపటికి ఆరిపోతుంది. పైకి ఆరిపోయినా, లోపల నిప్పు ఉంటుంది. కనుక వేడిమి కోసం బాటసారి కర్రతో కెలుకుతున్నాడు. ఆ కెలకడం ఎలుగుబంటిని చీలుస్తున్నట్లు ఉన్నదట. కాలిన గడ్డి మంట ఆరిపోగానే నల్లగా పెద్ద రాశిగా కనిపిస్తుంది. కర్రతో కెలికితే, లోపల ఎర్రగా నిప్పు కణ కణ మంటుంది. కవి ఈ బైట ఆరిన నెగడును పొట్ట చీలుస్తున్న ఎలుగు బంటితో పోల్చాడు.

దారిద్ర్యాన్ని చిత్రించడంలో గాథా సప్తశతి కవి నేటి ఆధునిక కవిని కల్పనలో ఎలా మించి పోయాడో ఒక్క గాథోదాహరణం.

**దుగ్గఆ కుటుంబఅట్టీ / కహఀణు మఏ థోఇఏణ సోఢవ్వా.**
**దసిఓసరంత సలివేణ / ఉఅహ రుణ్ణంవ పడఏణ.** *(1-18)*

**(దుర్గత కుటుంబాకృష్టిః / కథన్ను మయా ధౌతేన సోఢవ్యా,**
**దశాససరత్ సలిలేన / పశ్యత రుదిత మివ పటకేన.)**

కటిక దరిద్రం. ఉన్న ఒక్క గుడ్డనూ దినమూ ఉతికి పులిమి ఆరవేసుకుంటున్నాడు. గుడ్డ చీకిపోయి అంచుల నుంచి నీరుకారుతున్నది. ఈ దరిద్రపు సంసారం గుంజుకొని రావడం ఇక నాచేత కాదు–అన్నట్టు ఆ గుడ్డ ఏడుస్తున్నదట.

కవితావతారానికి ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసాలు కారణమని కొందరు అలంకారికులు. ప్రతిభ మాత్రమే సమవాయ కారణమని మరికొందరు చెప్పారుగాని, నిజానికి పరిసర పరిస్థితి, సాంఘిక పరిణామాలు ముఖ్యకారణమని నా తలంపు. రామాయణం వంటి కావ్యం ఆవిర్భవించ డానికి బలమైన కారణం సంఘాచారాల మార్పులేనని నా విశ్వాసం. అన్న మరణిస్తే, అన్న భార్యను తమ్ముడు పెండ్లాడి, కుటుంబార్థిక వ్యవస్థను శిథిలం కానీక చూచుకోడం ఒకప్పుడు పరివ్యాప్తంగా ఉన్న ఆచారం. దాని అవశేషాలు నేడూ ఉత్తర భారతంలో పెక్కుకులాలలో ఉన్నాయి. అది సభ్యతకాదని సంఘంలో వివేకవంతులు భావించారు. వాల్మీకి దానిని ప్రధానంగా తీసుకొని సౌభ్రాత్రం జీవగర్రగా రామాయణం గానం చేశాడు.

కాళిదాసు రఘువంశ మహాకావ్యం రచించడానికీ బలమైన కారణం ఉంది. రామకథను జైన బౌద్ధ సంప్రదాయానుయాయులు ఇటులాగి, అటులాగి చీకిరి బాకిరి చేశారు. ఈ విధంగా రెండు వేల ఏళ్ల నాడు జైన సంప్రదాయంలో *పఉమచరిఉ* అనే పేర రామాయణం విడ్డూరంగా వెలువడింది. దానిని ఎదుర్కొని వాల్మీకి సంప్రదాయ పరిరక్షణకే కాళిదాసు రఘువంశాన్నీ అతని సమకాలికుడూ, బహుశా అతని శిష్యుడూ అయిన వాకాట ప్రవరసేన మహీపాలుడు సేతు బంధమనే ప్రాకృత కావ్యాన్నీ రచించారని నా విశ్వాసం.

సంఘ పరిస్థితులు, ఆటు పోట్లు మొదలయిన వాటి పరిణామాలవల్ల నాయకులు, సంఘ సంస్కర్తలు అవతరించినట్లే, కావ్యాలు అవతరిస్తాయి. ఈ పరిస్థితే తెలుగు కవితకూ పట్టింది.

**గాథా సప్తశత్యనంతర యుగం :** సంస్కృత ప్రాకృతాల ప్రాభవంవల్లనో, మరే కారణం వల్లనో తెలుగువాడు తన మాతృభాషలో కొన్ని శతాబ్దాలపాటు నోరు విప్పలేదు. క్రీస్తుశకం ఆరవ శతాబ్దం చివరి పాదంలో రేనాటి చోళుల కాలంలో తొలి తెలుగు శాసనం పడింది. తర్వాత తన భాషా సారస్వతాలలో ఎన్నో కల్పనలు చేసి ఉంటాడు తెలుగు వాడు. ఎన్నో పాటలు, పద్యాలు చెప్పి ఉంటాడు. కొన్ని పద్యాలు శాసనాలలో లిఖిత రూపం దాల్చడం మాత్రం తొలి తెలుగు శాసనం పడిన మూడు వందలేళ్లకు గాని జరుగలేదు. తూర్పు చాళుక్యరాజయిన గుణగవిజయా దిత్యుని సేనాపతి అయిన పండరంగడు తన విజయాలను వర్ణించే పద్యాన్ని ఒక శిలా శాసనంలో చెక్కించాడు. దీనిని అద్దంకి శాసన మంటారు. (849-850). జానపద గేయాలు తరచుగా ఉండే తరువోజలో ఉంది ఈ పద్యం.

**"పట్టంబు గట్టిన ప్రథమంబు నేణ్డు / బలగర్వ మొప్పంగ బై లేచి సేన పట్టంబు గట్టించి ప్రభు పండరంగు / బంచిన సామంత పడువతోబోయి కొట్టముల్ పంద్రెండు గొని వేంగి నంటి/గొల్చి యాత్రిభువనాంకుశబాణ నిల్పి కట్టెపు దుర్గంబు కడు బయల్సేసి / కందుకూ ర్బెజవాడ గావించే మెచ్చి"**

తెలుగు దేశంలోనే ఉండి తొలి కన్నడ కావ్యం *విక్రమార్జున విజయాన్ని* రచించిన పంపమహాకవి సోదరుడు జినవల్లభుని గంగాధర కన్నడ శాసనంలో చివరన తెలుగు కంద పద్యాలు రెండు ఉండడం వల్ల రచన అప్పటికి తెలుగు నాడంతటా ప్రారంభమయిందనే అనాలి. ఈ పద్య రచన కూడ అమాంతంగా ఆకాశం పగిలి ఊడి పడిందేమీ కాదు. నన్నయ తిక్కనల మధ్య కాలం వాడయిన పాల్కురికి సోమన *పండితారాధ్య చరిత్ర*లో పేర్కొన్న తుమ్మెద పదాలు, ప్రభాత పదాలు, పర్వత పదాలు, ఆనంద పదాలు, నివాళి పదాలు, వాలేసు పదాలు, మొదలైన దేశి గీతాలను బట్టి తెలుగువాడు గాథాసప్తశతి కాలం నుంచి ఏవేవో మాటలలో, బాణీలలో కూనిరాగాలు తీస్తూనే వుంటాడు. వాటిలో యాదృచ్ఛికంగా అక్షరావృత్తి, పదావృత్తి ఉంటూనే వుంటాయి. వాటిని సమాకాలిక కవులు సంస్కరించి, తమ సిద్ధాంతాలను ప్రజాసామాన్యానికి చెప్పడానికై వినియోగించు కోవలసి వచ్చింది. దానితో నూతన చ్ఛందః పద్ధతి - సంస్కృత దేశీ పద్ధతుల మేలికలయికతో ఏర్పడింది.

**భారత యుగం :** ఇంతగా దేశి ఛ్ఛందస్సు జానపదులలో వ్యాప్తిలో ఉన్నా పెద్ద పుస్తకం, గాథ. కావ్యం తెలుగులో అవతరించక పోయిందంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. కాని, ఆశ్చర్యం నిజం. నన్నయకు పూర్వం తెలుగు దేశంలో జైన బౌద్ధాలు ప్రచారంలో ఉన్నాయి. జైనమతావలంబులు పాలకులు. ప్రజలలో వైదిక మతాల వారూ ఉండివుంటారు. తక్కిన మతాలవారూ ఉంటారు. ఆయా మతాల పెద్దలు తమ అనుయాయులకు ప్రాకృతాప భ్రంశాలతో పాటు దేశ భాషలలోను ఏవో రచనలు చేసే ఉంటారు. ప్రాకృతాపభ్రంశాలలో ఎన్నో తెలుగు కన్నడ పదాలు చేరడాన్ని బట్టి తద్ భాషా వేత్తలకు స్థానికులతో సంబంధం బాగానే ఉందని మనం గ్రహించవచ్చు.

ఈ జైన బౌద్ధాల ప్రాబల్యం వైదిక మత ప్రచారంతోనే గాక, వాటి తప్పుల వల్లను 8,9వ శతాబ్దాలలో తెలుగునాట సన్నగిల్లింది. దీనికి కారణం మహామేధావియయిన శంకరా చార్యుడు ఉపనిషదద్వైతాన్ని ఆసేతు శీతనగం ప్రచారం చేయడం. దీనికి తోడు తెలుగు దేశంలో చీటికి మాటికి అధికారాలు మారుతూ అల్లకల్లోలంగా ఉంది. కనుక ఏ మహాకావ్యమూ అవతరించడానికి అవకాశం లేకపోయి ఉంటుంది. కాని అరికేసరి పాలనలో వున్న తెలుగు దేశంలో పంపకవి కన్నడంలో కావ్యం రచించాడు. కనుక పెద్ద కావ్యం రచితం కాలేదనడానికి వీలులేదు. ఆ ప్రాంతంలో జైనుల ప్రాబల్యం వుంది. రాజాదృత భాష కన్నడం. కనుక తెలుగు కావ్యావతరణకు పశ్చిమాంధ్రంలో అవకాశం లేకపోయింది.

రాజరాజుకు యుద్ధాల నుంచి కొంచెంగా తెరపి చిక్కింది. 1022లో పట్టాభిషేకం చేసుకొన్నాడు. జనాన్ని నీతి మంతులను చేయాలనే భావం కలిగింది. దానికి భారతం తగినదని తోచింది.

**ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని / ఆధ్యాత్మవిదులు వేదాంతమనియు**
**నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని / కవి వృషభులు మహాకావ్యమనియు**
**లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహమని / ఐతిహాసికు లితిహాసమనియు**
**పరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ**
**యంబని మహి గొనియాడుచుండ** (భా.1-1-32)

విశ్వజనీనమై పరగుచుండు గ్రంథం. రాజరాజుకు తమిళకన్నడాలతో సంబంధం పూర్తిగా ఉంది. తమిళభాషలో అదివరకే, రెండు వందల సంవత్సరాలకు ముందే పెరిందేవనార్ అనే కవి వెణ్బా అనే దేశివృత్తంలో భారతం రచించాడు. జైనకవులు భారతాన్ని విక్రమార్జున విజయమని, గదాయుద్ధమని తమమతానికి, ఇష్టానికి అనుగుణంగా మార్చివ్రాసి, వ్యాసునికి అప్రతిష్ఠ తెచ్చారనుకుంటూ, తెలుగులో భారతం అవతరించాలనుకొన్నాడు. పరమ ధర్మవిదుడైన రాజరాజు. పిదప...

**"తనకుల బ్రాహ్మణు ననురక్తు నవిరళ / జపహోమ తత్పరు విపులశబ్ద**
**శాసను సంహితా భ్యాసు బ్రహ్మాండాది / నానాపురాణ విజ్ఞాన నిరతుఁబాత్రు**
**పాత్రు నాపస్తంబ సూత్రు ముద్గల గోత్ర / జాతు సద్విమలావదాత చరితు**
**లోకజ్ఞు నుభయ భాషాకావ్యరచనాభి / శోభితు సత్ప్రతిభాభి యోగ్యు**
**నిత్యసత్యవచను మత్యమరాధిపా / చార్యు సుజను నన్నపార్యుఁజూచి"**

తన మనస్సులో అనవరతం మహాభారతం వినాలనే అభిలాష పెద్దగా వుందని, కనుక –

**"జననుత కృష్ణ ద్వైపా / యనముని వృషభాభిహిత మహాభారతబ**
**ద్ధ నిరూపితార్థమేర్పడఁ / దెనుఁగున రచియింపు మధిక ధీయుక్తి**
**మెయిన్.** *(భా. 1-1-16)*

అని కోరాడు. నన్నయ ఈ పనికి అర్హుడు కావడం నిస్సందేహం కాని, ఆయన 'భారత భారతీ సముద్రముఁ దటియఁగ నీఁదను విధాతృనకైనను నేరఁబోలునే' అని జంకుతూనే, నేర్చుకొలది రచిస్తానని...

**"సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకవితార్థయుక్తి లో**
**నారసి మేలు నా నితరు లక్షరరమ్యత నాదరింప"** *(భా. 1-1-25)*

జగద్ధితంగా తెలుగులో మహాభారత సంహితా రచన బంధురుడయ్యాడు. రాజరాజు రాజ్యంలో మరల కల్లోలం చెలరేగింది. అతడు రాజ్యభ్రష్టుడో, మృతుడో అయి వుంటాడు. దానితో నన్నయకూ అశాంతి ఏర్పడింది; భారత రచన అరణ్యపర్వం మధ్యలోనే ఆగిపోయింది. ఆగిపోయిన ఘట్టంలోని చంద్రికావర్ణన పద్యం ఒక్కటే చాలు నన్నయను కవిగా ప్రపంచంలో నిలబెట్టడానికి. ఆ పద్య మిది:

**"శారద రాత్రు లుజ్జ్వల ల / సత్తర తారకహార పంక్తులం**
**జారు తరంబులయ్యె విక / సన్నవ కైరవ గంధ బంధురో**
**దార సమీర సౌరభము / దాల్చి సుధాంశు వికీర్యమాణ క**
**ర్పూర పరాగపాండు రుచి / పూరము లంబరిపూరితంబులై"**

*(భా. 3-4-142)*

వ్యాస మహాభారతం తెలుగులోకి రాగానే ఇతర శాస్త్ర గ్రంథాలు కూడ తెలుగులోకి వచ్చాయి. అలాటి వాటిలో పావులూరి మల్లన రచించిన గణితం పేర్కొనదగింది. ఇది మహావీరాచార్యుని సారసంగ్రహ గణితం అనే గ్రంథానికి అనువాదం, పావులూరి గణితమనే ప్రసిద్ధమైంది. మల్లన పూర్తిగ నన్నయ ఒరవడిలోనే నడిచాడు అనువాదంలో. ఇతని తాత నన్నయ సమకాలికుడు. మూలం జైనమత సంబంధం. కాని మల్లన తన అనువాదాన్ని శైవపరంగా చేశాడు. నన్నయలాగే ఇతడు కూడ "అభినవ సంఖ్యా మణి దీప్తి సారసంగ్రహ గణిత సముద్రంబు దరువంగ గణగితి బ్రీతిన్" అని అన్నాడు. మల్లన అనువాద పద్ధతికి ఒక్క పద్యం ఉదాహరిస్తాను. మూలశ్లోక మిది :

**"దత్తా న్యేకై కస్మై / జినభవనాంబుజాని తాన్యష్టౌ।**
**వసతీనాం చతురుత్తర / చత్వారింశచ్ఛతాని కతిః"**

దీనికి మల్లన అనువాదంలో జినభవనాలను శివాలయాలు చేశాడు.

**"మేలుగ నెనిమిది యొక్క శి / వాలయమున కంబుజంబు లర్పించినచో**
**నీ లెక్క నూటనలుబది / నాలుగు భవనముల కెన్ని నలినములయ్యెన్."**

ఈ గణితం వల్ల మనకు ఆనాటి కొలతలు, నాణేలు, పెక్కు, సాంఘిక విషయాలు తెలుస్తాయి. మల్లనగణితం పూర్తిగా ఆచ్చు పడలేదు. మిత్రులు, కీర్తిశేషులు డాక్టర్ తిమ్మావజ్ఝల కోదండరామయ్య కొంతభాగాన్ని, మేమిద్దరం సంపాదకత్వ వహించిన *పరిశోధన* పత్రికలో ప్రచురించారు. మరికొంత *భారతి*లో ప్రచురించారు. ఆయన ప్రతి లెక్కనూ మూలంతో సరిపోల్చి, వేసి సంస్కరించారు. ఈ కాలంలోనే నీతి భూషణము, ముద్రామాత్యము వంటి నీతిశాస్త్ర గ్రంథాలు వెలువడినట్టు తర్వాతి వారు ఉదాహరించారు.

నన్నయ పెట్టిన కవితా సంప్రదాయంలో పలువురు నడిచి ఉంటారు. కాని, అందరికీ దానిలో నైపుణ్యం సాధ్యమా? కనుక కవితకు కొన్ని లక్షణాలు, పద్ధతులు వుంటే మంచిదని తోచడం, అలాంటి మార్గదర్శక సూత్రాలు పలువురికి ఉపాధేయాలు కావడం సహజం. ఆ పరిస్థితులలో పుట్టింది *కవి జనాశ్రయం.*

*కవి జనాశ్రయ* రచయిత మల్లియ రేచన. ఇతడు తనకాలపు కవులకు దారిచూపడానికి కన్నడ నాగవర్మ ఛందోంబుధి ననుసరించి *కవిజనాశ్రయం* వ్రాశాడు. ఇతడు జైన మతావలంబి అయిన వైశ్యుడు. తెనుగు కన్నడ తమిళ ప్రాంతాలలోని వైశ్యులందరూ పూర్వం జైనులే. వారిని కోమట్లంటారు. కోమటి శబ్దం గోమఠ–కొమ్మట– శబ్దాల నుంచి పుట్టింది. తర్వాత వీరు శైవ వైష్ణవ మతాలు స్వీకరించినా కోమటి శబ్దం మారలేదు. మల్లియ రేచన 'శ్రీ వాదీంద్ర చూడామణి చరణ సరసీ రుహ మధుకరాయమాణుడు. కవి జనాశ్రయు శ్రావకాభరణుడు' మృగేంద్రోద్యచ్చౌర్యుడని, ప్రహరణకుశలుడని, అమిత సాహసుడని, ఆనతారి అని చెప్పు కున్నాడు. కోమట్లేమి? సాహసమేమి? అని పలువురు పూర్వం వాదించారు. సాహసం, ధైర్యం ఏ కులం వారసత్వమూ కాదు. భారత దేశాన్ని, భారతదేశంలోని కాశ్మీర్ వంటి ప్రాంతాలను పాలించిన వైశ్య వంశాల వారున్నారు. మల్లియ రేచన పద దోషాలు, సమయ దోషాలు, ఆగమ దోషాలు, దేశ కాల విరుద్ధమైనవి ఎన్నో తెలిపాడు.

**"ఘన దండ కాష్ఠ కృష్ణా / జినములు సొగియింపనొక్క జినముని చనుదెం చె ననగ సమయ విరోధం / బని కవులకు జెప్పె కవి జనాశ్రయు డౌనరన్."**

**కుమార సంభవ యుగం** : భారత రచనతో జైన మతాన్ని ఎదిరించి ప్రాచీన వైదిక సంప్రదాయానికి నన్నయ పట్టంగట్టగా, అతి ప్రాచీన మతాలలో ఒక్కటైన శైవమతాన్ని అనుసరించినవారు శివ సర్వోత్తమత్వాన్ని ప్రచారం చేయడానికి పూనుకున్నారు. ఈ ఉద్యమానికి పండిత త్రయం – శ్రీపతి పండితారాధ్యుడు, శివలెంక మంచన పండితుడు, మల్లికార్జున పండితా రాధ్యుడు నాయకత్వం వహించింది. వీరు ముగ్గురూ గొప్ప మహాత్యం చూపి శైవ మతాన్ని చిరస్థాయి చేశారు. దీనికి ఆరాధ్య శైవమని పేరు. వీరు బ్రాహ్మణత్వాన్ని వదలుకోలేదు.

కర్ణాటక దేశంలో ఈ కాలంలోనే చెలరేగిన బసవేశ్వర మతం బ్రాహ్మణత్వాన్ని వదలి, శివభక్తులలో వర్ణాలను రూపుమాపింది. కాని ఆ వర్గం వారు లింగాయతులు, లింగ బలిజలు, బలిజలు, జంగాలు అని వ్యవహృతులై విడిగా ఒక మత శాఖ అయ్యారు. "భక్తిమీద వలపు బ్రాహ్మ్యంబుతో బొత్తు బాయలేను నేను బసవలింగ'' అని మల్లికార్జునుడే అన్నాడంటారు.

ఈ పండిత త్రయంలో శ్రీపతి పండితుడు మొదటివాడు. ఇతని కాలం దాదాపు నన్నయ కాలం. రెండవ వాడయిన శివలెంక మంచన కాలం తర్వాత ఒక తరమయి వుంటుంది. మూడవ వాడయిన మల్లికార్జున పండితుడు నన్నయ తర్వాత రెండు తరాలవాడు. మొదటి ఇద్దరూ చేసిన రచనలు తెలియవుగాని, మల్లికార్జున పండితుడు రచించినవి దాదాపు యాభై వుంటాయి. వాటిలో ముఖ్యమైనది శివతత్త్వసారం. సంస్కృత రచనలూ చాల ఉన్నాయి. శివతత్త్వసారం దాదాపు వేయి పద్యాలు, పది శతకాల గుచ్ఛం. దీనినితడు కన్నడం లోను రచించాడు.

**"పతి రుద్రుడు పశువుల కని / శ్రుతి చెప్పుచు నునికి జేసి రుద్రుడు పతి త క్కితరులు పశువులు పొమ్మని / మదిలో నెరిగితి శ్రుతి ప్రమాణమున శివా"**

అని పశుపతికి వ్యుత్పత్తి చెప్పాడు. శివభక్తులు కనిపిస్తే అబ్బ బ్రతికాను–అనుకుంటూ సేవ చేయాలని అన్నాడు.

**"భక్తుల దవ్వుల గని శివ / భక్తులు వచ్చిరని పొంగి బ్రతికితినని పో భక్తుల కెదురేగి యథా / శక్తి స్థితి జేయవలయు సత్క్రియలు శివా"**

శివభక్తుని జాతి మొదలయినవి అడగరాదని, బురదలో పుట్టినా పద్మం చాల పూజ్యమయినట్టు ఎంత తక్కువ కులంలో పుట్టినా శివభక్తుడు గొప్పవాడని పండితారాధ్యుడు శివతత్త్వసారంలో చెప్పాడు. శివభక్తుడు కాని భర్తను భార్య వదలివేయాలని, దానివల్ల ఆమెకు దుర్గతి లేదనీ బోధించాడు. శివనిందచేసే పాపాత్ములను చంపివేయాలని, శివ నిందాత్మకాలయిన పుస్తకాలను కాల్చివేయాలని కూడ అతడు శాసించాడు. శివభక్తుల లోపాలను ఎన్నేవాడు ఛండాలుడు. శివభక్తుడు పాపం చేసినా పుణ్యమే – ఇలా వుంటుంది బోధ.

ఈ మల్లికార్జున పండితారాధ్యుని శిష్యుడే నన్నెచోడుడు. ఇతడు మల్లికార్జున పండితుని లాగే నన్నయకు రెండు తరాల ఈవలివాడు. ప్రాతఃస్మరణీయులు మానవల్లి రామకృష్ణ కవిగారి పుణ్యమా అని నన్నెచోడుని కుమారసంభవం 1910లో వెలుగులోకి వచ్చింది. కవిగారు కుమారసంభవ శైలీ పద ప్రయోగాదుల విశిష్టతను బట్టి అది నన్నయకు ముందుదన్నారు. దానిపై పండితులు కవిగారిపై విరుచుకుపడి ఆయనే దీనిని కల్పించి రచించా రన్నంత వరకు వెళ్లారు. దాదాపు అర్ధశతాబ్దం ఈ చర్చాయుద్ధం జరిగిన పిదప వేటూరి ప్రభాకర శాస్త్రి మున్నగు వారు ఇతని కాలం, నన్నయ తరువాత దాదాపు వంద సంవత్సరాలన్నారు. ఇదే దాదాపు అందరికీ ఆమోదయోగ్య మయింది.

నన్నె చోడుడు నిజానికి తెలుగుదేశి ప్రబంధ రచనకు ఆద్యుడు. నన్నయ వైదిక సంప్రదాయ స్థాపనకు భారతం చేపట్టగా, ఇతడు శైవమత వ్యాప్తికి పురాణాదులలోని కుమార సంభవ కథలను, జనంలో వ్యాప్తిలో వున్న కథలను సమన్వయ పరచి, ఎక్కువగా దేశిచ్ఛందస్సునే వాడి తమిళ, కన్నడ కవితా సంప్రదాయాలను ఆకళించుకొన్నవాడు గనుక, అప్పటి వస్తు కవితకు ప్రాధాన్యమిచ్చి సంస్కృత కావ్య లక్షణాలను కూడ చాల వరకు పొందుపరచి, నూతన సంప్రదాయానికి దారి తీశాడు. ఈ దారిలోనే శివకవులు, మధ్యయుగపు అన్నమాచార్యాది వైష్ణవ భక్త కవులు నడిచి దేశికవితను పరిపుష్టం చేశారు కనుకనే దీనిని కుమార సంభవ యుగమని సంభావించాను. మార్గ దేశి కవితారీతులు రెండూ అనాదిగా ఒక దాని సరసన మరొకటి మనుతూ, ఆయా అభిమానుల ఆదరం పొందుతూనే వున్నాయి. నన్నెచోడుడు తన కవితా రీతిని కావ్యాన్ని మదగజంతో పోల్చాడు. కవిత్వ లక్షణాలను కూడా చెప్పాడు.

**"చతురోక్తుల నుతపదబహు / గతుల నలంకారభావ కాంతి రసార్థో**
**న్నతగతి నతిరసికులు వర / సతిగతి నెరిగింప వలదె సౌభాగ్యమునన్**
*(1-39)*

**పదబంధముల నగ్గలించి బుధ శ / బ్ద భ్రాజియై సద్గుణా**
**స్పదమై దుష్క విహృత్సరోజవనముల్ / భంజింపుచున్ భూరి స**
**మ్మదలీలన్ విలసిల్లి సత్కృతి జగ / న్మాన్య ప్రభావంబునన్**
**మదనాగంబును బోలె గ్రాలవలదా / మారెందులేకున్నతిన్"** *(1-40)*

తెలుగులో కృతులను అంకితమిచ్చే సంప్రదాయానికి నాంది పలికినవాడూ ఇతడే. తన గురువయిన మల్లికార్జున పండితారాధ్యునికి తన కావ్యం అంకితమిస్తున్నందుకు ఇలా మురిసిపోయాడు.

**"రవికుల శేఖరుండు కవి / రాజ శిఖామణి గావ్య కర్త స**
**త్కవి భువి నన్నె చోడుడటె, / కావ్యము దివ్యకథం గుమార సం**
**భవ మటె, సత్కథాధిపతి / భవ్యుడు జంగమ మల్లికార్జునుం**
**డవి చలితార్థ యోగధరు / డట్టె వినం గొని యాడజాలదే?** *(1-57)*

ఈయన వర్ణనలు సహజాలు, విశిష్టాలూనూ. గ్రీష్మ వర్ణనలో ఒక చక్కని పద్యం.

**"తలచిన దెందము కందును / బలికిన నోరెల్లబొక్కు బ్రభసూచిన రె**
**ప్పలు కమరు ననగ బటుతర / విలయానల భాతి నెండ వేసవిగాచెన్!"**
*(6-135)*

విరూపాక్షుడు మూడవ కన్ను తెరచాడు. మన్మథుడు బుగ్గి అయ్యాడు. ఆ బుగ్గి అయిన విధం క్షణాలలో జరిగింది. దానిని నన్నెచోడుడు గొప్పగా ఊహించాడు.

**"కని కోపించెనొ కానక / మును కోపించెనో మహోగ్రముగ నుగ్రుడు చూ**
**చిన గాలెనొ చూడక యట / మును గాలెనొ నాగనిమిషమున నర గాలెన్."**
*(5-51)*

విమర్శకాగ్రేసరులు కోరాడ రామకృష్ణయ్య గారన్నట్టు "వాస్తవానికి ఆంధ్ర సాహిత్యంలో ప్రప్రథమ ప్రబంధ పరమేశ్వరుడు కవిరాజ శిఖామణి నన్నెచోడుడే యని చెప్పక తప్పదు." ప్రబంధమంటే నా దృష్టిలో దేశి సంప్రదాయ ప్రబంధం.

దేశంలో పరిస్థితి మారింది. జైనానికి బలం తగ్గుతూ శైవానికి బలం హెచ్చుతూ వచ్చింది. అది వరకు చాళుక్యులకు సామంతులుగా ఉన్న కాకతీయులు స్వతంత్ర రాజ్యం స్థాపించారు. వారు జైన మతాన్ని వదలి శైవాన్ని ఆదరించారు. కొత్త రాజ్యం గనుక, రాజులు ఏదో నీతిని అవలంభించాలి గనుక నీతి గ్రంథాలు పుట్టుకు వచ్చాయి. ఇలాటి వాటిలో పేర్కొనదగినది నీతిసారం, పంచతంత్రి, కామందకం మొదలైనవి. నీతి సారాన్ని కాకతి రుద్రదేవుడు రచించాడని ప్రతీతి. ఇతడు సంస్కృతంలో ఇదే పేరున ఒక గ్రంథం రచించాడు.

నీతిసారంలోని ఒక పద్యం.

**"జనపతి పర్జన్యగతిం / దనభూప్రజ బ్రోవ వలయుదగ బ్రోవదయే**
**దను బాసిపోవు నా ప్రజ / ఘన నీరస సరసిబాయు ఖగములభంగిన్."**

శైవబలం పుంజుకుందని ఇదివరకే అన్నాను. ఈ కాలంలోనే యథావాక్కుల అన్నమయ్య అనేకవి శివసర్వేశ్వరత్వాన్ని నిరూపిస్తూ సర్వేశ్వర శతకం వ్రాశాడు. దీనిని నిర్దిష్టమైన తొలి తెలుగు శతకమనవచ్చు. శివతత్త్వసారం పెక్కు శతకాల సముచ్చయం.

శైవాన్ని ప్రజల వద్దకు తీసుకుపోవాలి. శైవభక్తుల మాహాత్మ్యాలు ప్రజలకు తెలియాలి. కుల వర్ణాలకు అతీతమైన శైవం దేశంలో వ్యాపించాలి అనే అభినివేశం ప్రజలలో ఎక్కువైంది. దాని పరిణామం పాల్కురికి సోమనాథుని జననం. అతడొక మహాసంస్థ. తెలుగులోని ప్రతి ప్రక్రియలోను రచన సాగించడమే కాక, నూతన ఛ్చందస్సులనూ సృష్టించాడు. పండితుల ఆదరం కోసం అంగలార్చక, పామరులను ఆవర్జించుకొనడానికే ప్రయత్నించాడు.

**"ఉరుతర గద్య పద్యోక్తులకంటె / సరసమై పరగిన జాను తెనుంగు**
**చర్చింపగా సర్వసామాన్యమగుట / గూర్చెద ద్విపదలు గోర్కి దై వార**
**దెలుగుమాట లనంగ వలదు వేదముల/కొలదియ కా జూడు డిలనెట్టులనిన**
**బోటి తూమునకును బాటియౌనేని / బాటింపసోలయు బాటియకాదె**
**అల్పాక్షరముల ననల్పార్థ రచన / కల్పించుటయకాదె కవి వివేకంబు."**

*(బసవపురాణం : 1-165 - మొదలు)*

ఈ దృష్టితో పాతది, జన ప్రచారంలో బహుళంగా వుండేది అయిన తరువోజ పాదాన్ని రెండుగా విరిచి 'ద్విపద' అని పేరు పెట్టి, *బసవపురాణం, పండితారాధ్య చరిత్ర* అనే మహా పురాణాలు వ్రాశాడు.

కన్నడదేశంలో వీర శైవమత స్థాపకుడైన బసవేశ్వరుని చరిత్ర, *బసవ పురాణం* తెలుగుదేశంలో బ్రాహ్మణ శైవాన్ని ప్రతిపాదించిన *మల్లికార్జున పండితారాధ్యుని చరిత్ర.* వీరిద్దరూ సమకాలికులు.

సోమనాథుడు వీరిద్దరికీ రెండు తరాల ఈవలి వాడు గనుక వారిద్దరి జీవిత విశేషాలను శిష్య ప్రశిష్యుల నుంచి విని తన కృతులలో పొందుపరచాడు. ద్విపదను బసవన రెండు పాదాలని అన్నాడు. తరువోజను ద్విపదగా మార్చడం తొలిసారిగా నేను 1953లో 'పరిశోధన' సోమనాథ సంచికలో ప్రచురించాను. సోమనాథుడు త్రిభంగి అనే

మరొక ఛందస్సు కూడ సృష్టించాడు. సోమనాథుని భాష భావ ప్రకటన తెలుగు సాహిత్యంలో అరుదైనవి.

భవుని తన కుమారునిగా భావించిన బెజ్జమహాదేవి భావాలు చూడండి :

**"తల్లి గల్గిన నేల తపసిగా నిచ్చు / దల్లి గల్గిన నేల తల జడల్గట్టు**
**దల్లియున్న విషంబు ద్రావనేలిచ్చు / దల్లియుండిన దోళ్లు దాల్పనేలిచ్చు**
**దల్లి పాములనేల ధరియింపనిచ్చు / దల్లి బూడిదయేల దాబూయనిచ్చు"**

*(బసవ : 3-635 మొదట)*

సోమనాథుడు దాదాపు 30 రచలను చేశాడు. వీటిలో సోమనాథ భాష్యం, రుద్రభాష్యం వంటి పండిత వాదోప వాద రచనలు వున్నాయి. దేశిచ్ఛందస్సయిన సరికొత్త ద్విపద ప్రజాదరం పొందడం చూచి వైష్ణవ మతానుయాయులూ దానిని తమ మత ప్రచారానికి వినియోగించుకొన్నారు. వైష్ణవులకు రామాయణం ప్రపత్తి శాస్త్రం. అప్పుడప్పుడే వ్యాపిస్తున్న రామానుజాచార్యుల విశిష్టాద్వైత ప్రభావమూ కొంత కారణమేమో! గోన బుద్ధరాజు వాల్మీకి రామాయణాన్ని స్థానికమయిన జంబుమాలికథ, సులోచనా వృత్తాంతం, కాలనేమి కథ వంటి వాటితో సహ ద్విపదలో రచించాడు. అదివరకు రామాయణాన్ని కొందరు కావ్యంగా రచించారనే ప్రతీతి వుంది కాని, అవేవీ లభించలేదు. గోన బుద్ధరాజునకు రంగనాథుడు రచనలో తోడ్పడివుంటాడు. కనుక అతని పేరూ ఈ రామాయణంతో వ్యాప్తికి వచ్చింది. బుద్ధారెడ్డి అనువాదం విషయంలో నన్నయాది మార్గకవులనే అనుసరించాడు. ఇదొక విధంగా ఉభయరీతుల సమ్మేళనం. సీతా వియోగంతో వేగుతున్న రాముని దీనావస్థను కవి ఇలా వర్ణించాడు.

**"అలసయానముల బాగంచల కిచ్చి / లలితాంఘ్రి రుచి ప్రవాళంబుల కిచ్చి**
**వరకుచోన్నతి చక్రవాకుల కిచ్చి / కరముల కెంపు పంకజముల కిచ్చి**
**మెయిచాయ క్రొక్కారు మెరుగుల కిచ్చి / నయన వైభవము మీనములకు నిచ్చి**
**చల్లని ముఖదీప్తి చంద్రున కిచ్చి / తెల్లని నగవు చంద్రికలకు నిచ్చి**
**చెలువంపు బలుకులు చిలుకల కిచ్చి / యలకల ననుగాంతి యళులకు నిచ్చి**
**రదముల యొప్పు వజ్రంబుల కిచ్చి / పొదలు మెత్తావులు పూవుల కిచ్చి**
**సన్నపునడుమాకసంబున కిచ్చి / నిన్ను దైవము మ్రింగెనే నేడు సీత !"**

ఇలా శైవ వైష్ణవాలు, ఒక ప్రక్క జైనమూ జనాన్ని ముఠాలుగా చేశాయి. మా మతం గొప్పదని విర్ర వీగడమే తప్ప, ప్రతి మతమూ మనః పరిపాకానికేననే భావం పోసాగింది. భాషా సారస్వత విషయాలలోను మార్గదేశీ సంప్రదాయాల మధ్య పోటీ ఎక్కువైంది. ఈ పరిస్థితి వివేకవంతులకు నచ్చలేదు. సామరస్యం వారి ఆశయం. హరిహరాభేదం సాధించి, భారతీయ ప్రాచీన సంప్రదాయం స్థాపించడం అవసరమనే నమ్మకం కలిగింది. దానికి భారతానువాద పునరారంభం ఆవశ్యకమనిపించింది. దానికి పూనుకున్నాడు వేదాని సమస్త విద్యాభ్యాస విభాస, బహు కళాసంపన్నుడు, సకల విద్యాకళాచణుడు, తెనుగు సంస్కృతాలలో చతురుడు, విద్యా వై శారద; సముద్యోతతి మతి; సకలాగమార్థ తత్త్వవిచారోదారుడు, సారకవితా నిర్మాణ చాతుర్యుడు మయకార సన్నిభ మహాకవి, భార వికల్పుడు, దీన జనతా భద్రానము, సతత దాన వినోది అయిన తిక్కనామాత్యుడు. ఆయన అది వరకే ఉత్తర రామాయణం మరికొన్ని కావ్యాలు రచించాడు. పిదప నన్నయ అరణ్యపర్వంలో వదలి పెట్టిన మహాభారతాన్ని పూర్తి చేశాడు. ఇదొక అపూర్వ సృష్టి, కవితాకళ పరాకాష్ట పొందింది. తిక్కన రచనలో నాటకీయతకు ఆటపట్లు పలు పర్వాలు, ముఖ్యంగా విరాటోద్యోగ పర్వాలు. ప్రతి పర్వరసోదయమంటే చాలవు. వ్యాస భారతం నుంచి తెలుగు వారికి అవసరమైన మాత్రం గ్రహించాడు తిక్కన. సైరంధ్రిపై వలపుగొన్న కీచకుని వారిస్తున్న సుధేష్ణమాటలివి.

**"లలితంబులగు మట్టియల చప్పుడింపార / నంచకైవడి నడ నల్లవచ్చి**
**యెడమేని నెత్తావి సుడియంగ బయ్యెద / సగము దూలించు పైమగుడ దిగిచి**
**సోలెడు నెలదీఁగెలీల గ్రాలుచు వింత / చెలువంబు దలకొనజేరి నిలిచి**
**తెలిగన్ను గవకు నెచ్చెలియైన లేతన / వ్వొలయంగ సరసంపు బలుకు పలికి**
**మెరయు చెయ్వుల రాగంబు మెయికొనఁగ**
**నెడద సొగయించు మాటల నెలమి మిగుల**
**నిన్ను ననురక్తి గొలుచు నన్నెలతలుండ / నీరసాకార సైరంధ్రి గోరదగునె?**

*(విరాట. 2-64)*

నీరసాకార అనే విశేషణ మొక్కటి పై పాదాల బరువుకు సమానం. యుద్ధంలో మరణించిన తమ ఆప్తులను వెదుకడానికి అంతఃపురకాంతలు తమ నగరుల నుంచి వెలువడిన తీరును తిక్కన ఎంత హృదయ విద్రావణంగా వర్ణించాడో !

**"చేతులు నడుదల సేర్చు చుత్కట శోక / మాకారములు దాల్చినట్టు లుండ,**
**విరిసిన వేనలుల్ వెన్నుల బ్రక్కల / నెరసి చూపర దృష్టి నీరుసేయ**
**నందంద దొరగెడు నశ్రు జలంబుల / పెంపున మోములు ముంప బడగ**
**నేమియు దొడవులు లేమి బాదరియున్న / యంగంబులందు దైన్యంబు నెరయ**
**బతుల నన్నల దమ్ముల సుతుల హితుల / బేరుగొని వాతలెందంగ బ్రేముడించి**
**పనవు పలుకులు వినువారి వనటదేల్ప / గురుకుమార నారీజన కోటి వచ్చె"**

*(స్త్రీ 1-98)*

వాల్మీకి ఆది కావ్యాన్నీ, వ్యాసుని భారతేతిహాసాన్ని స్వాయత్తం చేసుకొన్న తిక్కన ఆంధ్రావళి మోదముం బొరయ

రచన చేశాడు, ఆనంద ముద్రతో తానూ ఆనందించి ఆంధ్రావళినీ ఆనందింప జేశాడు.

తిక్కన కాలానికి కవులు చాలినంత మంది పుట్టారు. తమ తమ పద్ధతిలో రచనలు సాగించారు. వారి భాషను, భావాలను అదుపు చేయడం అవసరమైంది. అలాగే లోకంలోని మోసాలు, దాయభాగాదులు, నేరాలు, శిక్షలు తెలియడం అవసరమైంది పాలకులకు, ప్రజలకు ఏవో *నీతిసారం* వంటి గ్రంథాలున్నాయిగా; సర్వజనాదృతమైన ధర్మశాస్త్ర గ్రంథమేదీ లేదు. కనుక వాటి అవసరాన్ని పూరించాడు తిక్కనకు సమకాలికుడు, ఆయనకన్నా వయసులో పెద్ద అయినా, ఆయనను ఆదరించి *దశకుమార చరిత్ర*ను అంకిత మిచ్చిన వాడూను అయిన కేతన.

*దశకుమార చరిత్ర* దండి రచన. సమకాలిక జన జీవిత దర్పణం. దానిని అనువదించాడు కేతన. ఇదే తెలుగులో తొలి కథా కావ్యం. కేతన దండి చెప్పిన కావ్య లక్షణాలను గూడ దీనిలో చొప్పించాడు. *కవి జనాశ్రయం* కేవలం ఛందస్సుకే సంబంధించినది. కనుక భాషా శాసనం కోసం కేతన *ఆంధ్ర భాషా భూషణ*మనే చిన్న వ్యాకరణ లక్షణ గ్రంథమూ వ్రాశాడు. ఇతనికి కన్నడాది భాషలు తెలుసు గనుక తనకన్నా వంద సంవత్సరాలకు ముందున్న కర్ణాటక భాషా భూషణాన్ని అనుసరించాడు. సంఘ శాసనం కోసం *విజ్ఞానేశ్వరీయ*మనే ధర్మశాస్త్రం రచించాడు. యాజ్ఞవల్క్యుడు రచించిన స్మృతికి విజ్ఞానేశ్వరుడు మితాక్షరి అనే పేరుతో వ్యాఖ్య వ్రాశాడు. దానిని కేతన...

**"మును సకల ధర్మ శాస్త్రము / విని విజ్ఞానేశ్వరుండు వివిధ ప్రౌఢిన్**
**జనులకు దెలిపిన దానిన్ / దెనుగున జెప్పెద సమస్త దేశీయులకున్"**

*(1-5)*

అని తెలుగు చేశాడు. కుల మతాలను తిట్టడం, దుకాణాలలో మోసపు కొలతలు, తూనికలు వాడడం, సరుకులను కల్తీ చేయడం వంటి నేరాలకు శిక్షలు విధించాడు కేతన.

**"మురికి నాటి వారు మొరకులు, పెనపరు / లరవ వారు, ద్విజులు కాన పెద్ద**
**యనుచు దేశభాషలను కులంబును దిట్టు**
**నతడు దండు విచ్చు శతపణములు.** *(2-56)*

ఈ కాలంలోనే బద్దెన నీతిశాస్త్ర ముక్తావళి అనే గ్రంథాన్ని, తిక్కన శిష్యుడైన మారన *మార్కండేయ పురాణా*న్ని మంచన *కేయూరబాహు చరిత్ర*ను రచించారు. *భారతాన్ని*, వ్యాకరణాన్ని రచించినట్టు చెప్పే అథర్వనుని రచనలు, కమలనాభామాత్యుడు మున్నగు వారి; రచనలూ లభించలేదు. ఈ కాలంలో తెలుగు సాహిత్యం మరొక కొత్త రెమ్మ వేసింది. అది వచన కవిత, నేటి బ్లాంక్ వర్స్ వంటిది. కన్నడంలో బసవేశ్వరుడు, ఆయన ధర్మపత్ని నీలాదేవి భక్తురాలు. *అక్క మహాదేవి వచనాలు* రచించారు. ఇవి మధుర భక్తి భావంతో నిండిన ముద్ద కట్టిన కవితలు. వాటి ప్రేరణతోనే కృష్ణమాచార్యుడనే భక్తుడు సింహగిరి వచనాలు, శతగోప విన్నపాలు అనే రెండు వచన కవితలు వెలయించాడు. తెలుగులో తొలి వచన కవిత ఇదే గనుక ఒకటి ఉదాహరిస్తాను.

**"దేవా! / పదికోట్ల యజ్ఞాది క్రతువులు నడపంగా నేమి?**
**తొమ్మిది కోట్ల తులాభారంబులు తూగంగానేమి?**
**.... .... .... .... .... .... ....**
**దేవా! / మీనామోచ్చారణంబుచేయకపది కోట్లయజ్ఞాది క్రతు**
**వులు నడపిన దేవేంద్రుడు నిలువెల్లయోనులయ్యెను**
**.... .... .... .... .... .... ....**
**దేవా! / మీనామోచ్చారణచేసిన ప్రహ్లాద ...**
**విదురాదులగు పరమ భాగవతోత్తములు గృతార్థులైరి గావున యతి**
**రామానుజుని పరందాతారు అనాథపతియైన సింహగిరి నరహరి నమో**
**నమో దయానిధీ"**

ఇంతలో కాకతీయ సామ్రాజ్యం తురుష్కుల దండ యాత్రతో విచ్ఛిన్న మయింది. వారికి దండ నాయకులుగా ఉన్న పద్మనాయకులు, రెడ్లు, ఇతరులు చిన్న చిన్న రాజ్యాలు స్థాపించారు. హరి హర, బుక్క రాయలు తుంగభద్రా తీరంలో ఒక రాజ్యం స్థాపించారు. అది తర్వాత, విజయనగర సామ్రాజ్యమయింది. ఈ రాజ్యాల కాలంలో ముస్లింలకు ప్రతిఘటనగా అన్ని విధాల ప్రయత్నాలు జరిగాయి. పద్మ నాయకుల రాజ్యంలో మరల *రామాయణం* రచితమైంది. *రంగనాథ రామాయణం* కేవలం వాల్మీకిని అనుసరించక పోవడం వల్ల ద్విపద కావడం వల్ల ఈ ప్రయత్నం మరల జరిగి వుంటుంది.

**రెడ్డి రాజుల యుగం :** రెడ్డి రాజుల కాలంలో ఎర్రా ప్రెగ్గడ, *నరసింహ పురాణం* రచించాడు. *హరివంశం* తెలుగు చేశాడు. నన్నయ వదలి పెట్టిన *అరణ్య పర్వశేషం* పూరించాడు. నాచన సోముడు కూడ *హరివంశం* తెలుగు చేశాడు. తెలుగు కవితను నవీన గుణ సనాథను చేశాడు. ఇతడు విజయనగరాస్థాన కవి. ఈ మూడు రాజ్యాల రాజులను మెప్పించి బహుమానాలు పొందుదామనే బుద్ధి కవి పండితులకు కలిగింది. ఆ బుద్ధి పరాకాష్ఠే శ్రీనాథ

కవి ఆవిర్భావం. శ్రీనాథుడు చివరి రోజులలో రెడ్డి రాజుల ఆస్థానంలో విద్యాధికారి అయినా, చిన్న నాటి నుంచి ప్రతి ఆస్థానానికీ తిరిగి రాజులను మెప్పించి సన్మానాలు పొందడంలో నిమగ్నుడయ్యాడు.

వెళ్ళిన చోటెల్లా ఆశువుగా చాటువులు చెప్పడం, ఇతరులను ప్రసన్నులను చేయడం కూడా ఇతని అలవాటు. అనువాదమో, నాలుగైదు కథలతో ఒక కావ్యాన్ని గ్రంథించడమో తొందరగా చేసి, ఏ ధనవంతుడైన వ్యాపారికో, రాజుకో, అతని మంత్రి, సామంతులకో ఇచ్చి సంతృప్తి పడేవాడు. కనుక మహా ప్రతిభావంతుడైనా మౌలికమైన గొప్ప కావ్యమేమీ రచింపలేక పోయాడని పండితుల బాధ. కాని, చేసిన రచనలన్నీ గొప్పవే. అతడే చెప్పుకొన్నట్లు అతని అనువాదాలన్నీ శబ్దం అనుసరించి, అభిప్రాయం అనుసరించి, భావం ఉపలక్షించి, రసపోషణతో, అలంకారాలతో, అనౌచిత్యం పరిహరించి, ఔచిత్యం ఆదరించి, మాతృకానుసారంగా ఉన్నాయి.

ఇతడు *హర్షుని నైషధం, గాథా సప్తశతి, కాశీ ఖండం, భీమేశ్వర పురాణం, హర విలాసం* మున్నగు రచనలు చేశాడు. ఇతని రచనలన్నీ ఒక ఎత్తూ, చాటువులు ఒక ఎత్తు అని నా అభిప్రాయం. ఈ చాటువులు ఆనాటి సాంఘిక స్థితికి అద్దం పడుతాయి. దేశి కవిత అయిన బసవ పురాణం వంటి వాటిలోని కథలు, వర్ణనలు గ్రహించి తన రచనలలో పొందు పరిచాడు. చాటువులలో మచ్చుకు ఒకటి.

**"చిన్న చిన్న రాళ్లు చిల్లర దేవుళ్ళు / నాగులేటి నీళ్లు నాపరాళ్లు**
**సజ్జ జొన్న కూళ్లు సర్పంబును దేళ్ళు / పల్లెనాటి సీమ పల్లెటూళ్ళు."**

శ్రీనాథుడు వృద్ధాప్యంలో చాల బాధ పడ్డాడు. భూమిశిస్తు చెల్లించలేక రాజ శిక్ష పొందాడు. బాల్యం నుంచి వైభవం పొందిన శ్రీనాథుడు సహస్రమాసజీవి అయిన పిదప ఇక్కట్ల పాలుగావడం ఎవరికైనా బాధ కలిగిస్తుంది. చివరన...

**"కాశికా విశ్వేశు గలసె వీరా రెడ్డి / రత్నాంబరమ్ము లేరాయడిచ్చు?**
**కైలాసగిరి బంటమైలార విభుడుండె / దిన వెచ్చ మేరాజు దీర్పగలడు?**
**రంభగూడెదెలుంగు రాయ రాహుత్తుండు / కస్తూరికే రాజు బ్రస్తుతింతు**
**స్వర్గస్థుడయ్యె విస్సన మంత్రి మరి హేమ / పాత్రాన్న మెవ్వని పంక్తి గలదు?**
**భాస్కరుడు మున్నె దేవుని పాలి కరిగె / కలియుగంబున నిక నుండ గష్టమనుచు**
**దివిజ కవివరు గుండియల్ దిగ్గురనగ / నరుగు చున్నాడు శ్రీనాథు డమరపురికి**

అంటూ మరణించాడు. రెడ్డి రాజుల ప్రాముఖ్యం పోయి కోస్తా జిల్లాలలో గజపతుల బలం పాదుకొని వుంటుంది. ఇతనిని ఆదరించే వారు ఎవరు. ఈ కాలంలో తెలుగు సారస్వతానికొక గొప్ప ఉపకారం కలిగింది. అది వల్లభరాయుని *క్రీడాభిరామం.* ఇది త్రిపురాంతకుని *ప్రేమాభిరామా*నికి అనువాదమైన వీధి రూపకం. ఇదే తెలుగులో తొలి రూపకం. ఇది వ్యంగ్య కావ్యమని నా అభిప్రాయం. వినుకొండ వల్లభ రాయడు విజయనగర రాజుల మిత్రుడు. రెడ్డి రాజులకు అమిత్రుడు. శ్రీనాథుని ద్వారా రెడ్డి రాజులు తమ రాజకీయ ప్రయోజనాలు సాధించడాన్ని అవహేళన చేస్తూ శ్రీనాథుని శైలిని అనుకరిస్తూ వ్రాసిన సెటైర్ ఇది. కవి అవచి తిప్పయ్యను, శ్రీనాథుని, టిట్టిభ శెట్టి, మంచనలుగా చిత్రించాడు దీనిలో.

ఈ కాలంలోను దేశ సారస్వతం మార్గ సారస్వతంతో పోటీ పడుతూనే ఉంది. గౌరన అనే కవి ద్విపదలో *హరిశ్చంద్రోపాఖ్యానం, నవనాథ చరిత్ర* రచించాడు. ఈతని రచన పాల్కురికి సోమనాథుని శైలిలో నడుస్తుంది. హరిశ్చంద్రుడు కాల కౌశికుని ఇలా నిందిస్తాడు.

**"పొద్దున లేచి నీ మొగము కన్గొనిన / నద్దినమున వచ్చు నా పదలెల్ల**
**నిన్నొక విప్రుని నిందింప నేల? / మిన్నక తలపోయమే ది నిలోన**
**కూడు వడ్డికి నిచ్చి కూర్చెడి వారి / జాడ లిట్టివియ యాశ్చర్యమేమిటికి?**
**కులము ప్రధానమే గుణములేకున్న? / కలశాబ్ధి బుట్టదే కాలకూటంబు?"**

జానపద సాహిత్య ప్రభావంతోనే కథాకావ్యాలు కూడ ఈ సమయంలోనే వచ్చాయి. జక్కన *విక్రమార్క చరిత్ర,* వెన్నెలకంటి అన్నయ్య *షోడశకుమార చరిత్ర,* అనంతామాత్యుని *భోజ రాజీయం* ఇలాంటివి. దేశి ప్రభావంతోనే అయ్యలరాజు, తిప్పయ ఒంటిమిట్ట *రఘువీర శతకమూ* చెప్పాడు. దేశంలో శైవ భక్తితోపాటు, వైష్ణవ భక్తి కూడ ప్రబలింది. దాని పరాకాష్టే *పోతన భాగవత* రచన. పోతన మొదట్లో *భోగినీ దండకం, వీరభద్ర విజయం* రచించినా, పిదప రామభక్తి పొంగగా అద్వైత దృష్టితో భాగవతాన్ని రచించాడు. ఇది అనువాదమైనా, మౌలిక మనిపించుకొని తెలుగు వారి నాలుకపై తాండవ మాడింది. దీనిలోని *ప్రహ్లాద చరిత్ర, రుక్మిణీ కల్యాణం, గజేంద్రమోక్షం* వంటి ఘట్టాలు రాని తెలుగువాడుండడు. దీనిని ఇతడు హరికి అంకితం చేశాడు? ఏ రాజు దర్బారుకు తిరుగు లేదు.

**"ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి పురంబులు వాహనంబులు**
**సొమ్ములు గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము బాసి కాలుచే**
**సమ్మెట వ్రేటులంబడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పెనీ**
**బమ్మెర పోతరాజొకడు భాగవతంబు జగద్ధితంబుగాన్"** *(భా: 1-11)*

అని తన రచనను నరాంకితం చేయలేదు. పోతన భక్తుడు గనుక దేశి రచనలను కూలంకషంగా చదివి వాటిని తన రచనలో జోడించాడు తాను మార్గ పద్ధతిలో వ్రాసినా.

**పదకవితా యుగం :** భక్తి ప్రచారానికి వివిధ రూపకాలు ఆడేవారని పాల్కురికి సోమనాథుడు చెప్పినా, మనకు తొలి నాటక మనదగిన *సౌభా చరిత* మనే జక్కుల కథ (యక్షగానం) వెలువడింది. 15వ శతాబ్దం చివర తుంగభద్రా తీరంలో సాళ్వ నరసింహరాయల దండ నాయకుడైన ప్రోలుగంటి చెన్నయ దీని రచయిత. *క్రీడాభిరామం* తొలి రూపకం, ఇది తొలి నాటకం. దీనితో సంగీతం భక్తి ప్రచారానికి అవసరమని గ్రహించారు. దేశి రచనలకు సంగీతం మేళవించారు భక్తులు. ఆ భక్తుల అగ్రేసరుడు అన్నమాచార్యులు.

ఇతడు కడపజిల్లా తాళ్లపాక గ్రామంలో జన్మించాడు. చిన్ననాటనే సంగీతం, భక్తి అలవడినది. తిరుపతి వేంకటపతి మీద వేల కీర్తనలు చెప్పి, సంకీర్తనాచార్యుడు పద కవితా పితామహుడు అయ్యాడు. చిరుత ప్రాయంలోనే "వేంకటేశ్వ'రా' మకుటంతో శతకం ఆశువుగా చెప్పాడు. హరిదాసుని లక్షణాలను అన్నమయ్యే ఇలా చెప్పాడు :

**"అటువంటి వాడువో హరిదాసుడు / అటమటాలు విడిచినాతడే సుఖి**
**తిట్టేటి మాటలను దీవించేటి మాటలను / అట్టే సరేని తలచినాతడే సుఖి**
. . . . . . . . . . . . . . . .
**పొంది పుణ్యము వచ్చినా పోరిపాపము వచ్చినా**
**అందలి ఫలమొల్లనియాతడే సుఖి**
**విందుగా శ్రీ వేంకటాద్రి విభుని దాసుల జేరి**
**అందరాని పద మందినాతడే సుఖి"** *(ఉత్సవ సంపుటి, సంకీర్తన్ 90)*

అన్నమయ్య కీర్తన సంప్రదాయాన్ని ఆయన భార్య తిమ్మక్క, కుమారులు నరసింగన్న, పెద తిరుమలాచార్యులు, మనుమడు చిన తిరుమలాచార్యులు కొనసాగించారు. పిదప భద్రాద్రి రామదాసు, క్షేత్రయ్య త్యాగరాజు మున్నగు వారు ఈ సంప్రదాయాన్ని పెంపొందించారు. అన్నమయ్య "జోఅచ్యుతానంద పాటతోను, చందమామ రావే జాబిల్లి రావే" పాటతోను తెలుగు తల్లీ పిల్లలకు నిరంతరం జ్ఞాపకముంటాడు.

**మనుచరిత్ర యుగం :** రాజులను, రాజోద్యోగులను మెప్పించే ప్రవృత్తి, మెప్పు పొందాలనే ప్రవృత్తి రచయితలలో తీవ్రమైంది. పెద్ద పెద్ద కావ్యాలు, పురాణాలు రచించే, అనువదించే బాధకంటే పురాణాలలోనివో, జనపదాల లోనివో ఉపకథలను తీసుకొని పెంచి చిన్న కావ్యంగా అల్లి మెప్పు పొందడం సులభం కదా! శ్రీనాథుని కాలం నుంచి ఈ ప్రవృత్తి ప్రబలింది. పిల్లలమర్రి పిన వీరభద్రుడు వ్యాస కాళిదాసుల శకుంతలా వృత్తాంతాలను గుదిగుచ్చి, తన ఊహాపోహలను కూడా చేర్చిన *శృంగార శాకుంతలం,* కొరవి గోపరాజు సింహాసన *ద్వాత్రింశిక* మున్నగువాటిని రచించడం ఉదాహరణంగా పేర్కొనవచ్చు. ఇలా చిన్న కథను గ్రహించి కావ్యంగా మలచడం పూర్వులు చెప్పిన కావ్య లక్షణాలను దృష్టిలో పెట్టుకుని సొబగులు తేవడం *మనుచరిత్ర*గా పరిణమించింది. అది తర్వాతి కావ్యాలకు మార్గదర్శకమే కాక నికషోపలమూ అయింది. కవులు హాయిగా కూర్చుని తమ రచనలకు నగిషీలు చెక్కడానికి కావలసిన తీరికా ఏర్పడింది.

వీటికి కారణం విజయనగర రాజ్య సుఖసంపద, వినోదాలు. ముస్లింలు విదేశీయులైనా, భారతీయులను కూడ తమ మతంలో చేర్చుకుని రాజ్యాలు స్థాపించు కొన్నారు. ఉత్తరభారతాన దక్షిణాపథాన బహమనీ సుల్తానుల రాజ్యాలు ఏర్పడ్డాయి. వాటి తాకిడి తక్కిన దక్షిణా పథానికి తగులకుండా విజయనగర సార్వభౌములు, ముఖ్యంగా కృష్ణదేవరాయలు తన బల పరాక్రమ రాజనీతిజ్ఞతలతో అరికట్టాడు. హరి హర బుక్కరాయల కాలం నుంచి కూడ తుంగభద్రకు దక్షిణంగా ఉన్న దక్షిణ భారతం ఒక విధంగా శాంతి భద్రతలతో అలరారుతున్నదనే చెప్పాలి. దానికి మరింత సుస్థిరత ఏర్పడింది. తుళువ వంశీయ సార్వభౌముల వల్ల కృష్ణదేవరాయలు సాహితీ సమరాంగణ సార్వభౌముడు కావడం వల్ల, స్వయంగా రచయిత అయి ఆముక్తమాల్యద వంటి కావ్యం రచించిన వాడు కావడం పల్ల స్వతంత్ర కావ్యాలకు చాలా ప్రోత్సాహం కలిగింది. దీనికి చాల విధాలుగా అల్లసాని పెద్దన మనుచరిత్ర నాందివంటిది గనుక తర్వాతిదంతా మనుచరిత్ర యుగమనడం సముచితం. ఈ యుగ లక్షణాలు కావ్యానికి ఒకే నాయకు డుండడం, వస్త్వైక్యం, అష్టాదశ వర్ణనలు, శృంగారం అంగిరసంగా నవరసాలు, అనువాదం కాక స్వతంత్ర రచనగా వుండడం, దీనిని ప్రబంధమన్నారు.

ఈ ప్రబంధానికి సమకాలంగా దేశి సాహిత్యం – యక్షగానాదులు విజయనగర సామ్రాజ్య పతనానంతరమూ, తమిళనాడులో అభివృద్ధి చెందుతూనే వుంది. మి

# సల్లేఖన

(జైన సంప్రదాయంలోని ఆమరణ నిరాహార దీక్ష)

*హిందీ మూలం : రమేష్ చంద్ర శ్రీవాత్సవ* — *అనువాదం : జె.లక్ష్మిరెడ్డి*

**జీ**వితం చరమ దశకు చేరుకుందని తెలుసుకున్న సాధకుడు మృత్యువుకు సిద్ధమయ్యే ఉద్దేశ్యంతో అన్ని విధాల ఆహారాలను త్యజించి ప్రసన్నచిత్తంతో మృత్యువును ఆహ్వానించే పద్ధతిని జైన ధర్మంలో సంథారా లేక సల్లేఖన అని అంటారు. కోరి సంతోష పూర్వకంగా ప్రాణాలు విడవడం అనేది దీనికి చెప్పే మామూలు అర్థం. "జీవితం చాలించ దలచుకున్నప్పుడు ధర్మాన్ని పాటిస్తూ ఆహారం తీసుకోవడం మానడం ద్వారా శరీర త్యాగం చేసే ముని అన్ని దుఃఖాల నుంచి విముక్తుడై ప్రభువు అయిపోతాడు", అని జైనుల ధర్మ గ్రంథమైన 'ఉత్తరాధ్యయన సూత్రం' చెబుతుంది. ఈ గ్రంథంలో ఇలాంటి సాధకుల కోసం 'ప్రభువు' అనే పదాన్ని ప్రయోగించడం జైన – బ్రాహ్మణ సంప్రదాయాల మధ్య జరిగిన పరస్పర చర్యను, ఒకదాని పైన మరొకటి కలిగించిన ప్రభావాన్ని చెప్పడమే కాక జైన సంప్రదాయంలో బ్రాహ్మణ ధర్మ ప్రభావ రూపంలో ఈ పదజాలం ప్రవేశించిన వైనాన్ని కూడా తెలుపుతుంది.

**మృత్యువు రెండు రకాలు:** ఒకటి సకామ మరణం (కోరిన మరణం లేక కోరగా వచ్చిన మరణం), రెండోది అకామ మరణం (కోరని మరణం లేక కోరుకోకుండా వచ్చిన మరణం) అజ్ఞానులైన జీవుల మరణం అకామ మరణం. హింసకులు, అబద్ధాలాడేవారు, కపటులు, ధూర్తులు, మద్యమాంసాలను సేవించేవారు, ధనంపట్ల, స్త్రీల పట్ల ఆసక్తులైన వారు, జీవితమంతా కర్మ–మలాలను ప్రోగు చేసుకుంటూ ఉంటారు. ధర్మాన్ని ఉల్లంఘించి అధర్మాన్ని అనుసరించినవాడు శోకం పాలై అకామ మరణం పొందుతాడు. ప్రసన్న చిత్తంతో మృత్యువును ఆహ్వానించడం, దాన్ని వరించడం సకామ మరణం. ఇదే సల్లేఖన, లేక 'సంథారా'. మరణ ప్రక్రియలో శరీరాన్ని, కషాయాలను (క్రోధం, లోభం, మోహం, అహంకారం, వీటిని జైన ధర్మంలో కషాయాలని అంటారు) కృశింపజేయడమనే అర్థంలో ఈ పదాన్ని వాడడం సమంజసమే. అజ్ఞానుల అకామ మరణం ఎన్నో సార్లు జరుగుతుంది. కానీ పరమజ్ఞానం పొందిన తర్వాత జరిగే పండితుల సకామ మరణం జరిగేది మాత్రం ఒక సారే. జైన ధర్మంలో సల్లేఖన సాధనాపథంలోని శీర్ష బిందువుగా భావించబడుతుంది. ఎందుచేతనంటే, దీని ద్వారా సాధకునికి సాధన యొక్క అభీష్టం నెరవేరి, అతడు ప్రపంచం నుంచి విముక్తుడై పోతాడు కాబట్టి. సల్లేఖనను సంథారా అనేకాక, 'సంస్తారకం' అని కూడా అంటారు. ఎందుచేతనంటే, ఇందులో ఏకాంతంలో తృణశయ్య (సంస్తారం) పరుచుకొని, ఆహారాన్ని త్యజించి, ధ్యానం చేయడం జరుగుతుంది కాబట్టి. సకామ మరణం స్వయంగా కోరుకొని స్వీకరించే మరణం. సంయములు, జితేంద్రియులు, పుణ్యాత్ములు అయిన వారి మరణం సుఖకరంగా, బాధారహితంగా ఉంటుంది.



జైనాలయం

'ఉత్తరాధ్యయన సూత్రం' లో మూడు రకాలైన సకామ మరణం గురించిన వివరణ ఉంది. వీటిలో ఏ ఒక దాని ద్వారానైనా ఆహారం మాని శరీరత్యాగం చేయవచ్చు.

**ఆ మూడు సల్లేఖనా భేదాలు ఇవి:**

1. **భక్త ప్రత్యాఖ్యానం:** (ప్రత్యాఖ్యానం అంటే నిరాకరణ) తను నివసించే ప్రాంతములో రాకపోకలు సాగించడానికి సంబంధించి ఏ నియమమూ లేకుండా ఆహారం మానుకొని శరీర త్యాగం చేయడాన్ని 'భక్త ప్రత్యాఖ్యాన సల్లేఖన' అని అంటారు. దీని ద్వారా జీవుడు వందల సంఖ్యలోని పలు విధాలైన భవాలను, జన్మ మరణాలను నిరోధించి ముక్తి పొందుతాడు.
2. **ఇంగినీ:** ఈ సందర్భంలో తను సంచరించదగిన భూమి హద్దును ఏర్పరచుకొని ఆహారాన్ని త్యజించి శరీర త్యాగం చేయడం ఇంగినీ సల్లేఖన.

**3. పాదోపగమనం:** ఆహారాన్ని త్యజించి నిర్ధారించుకొన్న ఒక చోట విరిగి పడిన చెట్టు కొమ్మ లాగా నిశ్చలంగా శరీర త్యాగం చేయడం పాదోపగమన సల్లేఖన.

పైన చెప్పిన మూడు పద్ధతుల్లో ఏ పద్ధతిలోనైనా శరీర త్యాగం చేయవచ్చు. ఈ సమాధి మరణ ప్రక్రియ కోసం నిర్ధారించిన అధికతమ కాలావధి పండ్రెండు సంవత్సరాలైతే, మధ్యావధి ఒక సంవత్సరం, కనీసావధి ఆరు మాసాలు. 'ఉత్తరాధ్యయన సూత్రం' లో సమాధి మరణం యొక్క అధికతమ కాలావధిని దృష్టిలో ఉంచుకొని మరణ విధానాన్ని వర్ణించడం జరిగింది.

ఈ సల్లేఖనలోని మొదటి నాలుగు సంవత్సరాల్లో పాలు, నెయ్యి మొదలైన వికృతులను (వికృతి చెందే, లేదా వికృతి కలిగించే పదార్థాలు) త్యజించి తర్వాతి నాలుగు సంవత్సరాలల్లో వివిధ రీతుల తపశ్చర్య చేయాలి.

ఆ తర్వాత రెండు సంవత్సరాలదాకా ఏకాంతర తపస్సు (ఒక రోజు ఉపవాసం, ఒక రోజు భోజనం చేస్తూ ఉండడం) చేయాలి. భోజనం చేసిన దినం రసహీనమైన అల్పాహారం తీసుకోవాలి. ఆ తర్వాత పదకొండవ సంవత్సరంలోని మొదటి ఆరు నెలల్లో తేలా, చీలా లాంటి కఠోరమైన తపస్సు చేయకూడదు. తేలా అంటే వరుసగా మూడు రోజులు ఉపవాసం ఉండడం, చీలా అంటే వరుసగా నాలుగు రోజులు ఉపవాసం ఉండడం. ఆ తర్వాత ఆరు నెలలు సాధారణమైన తపస్సు చేయాలి. మొత్తం ఈ సంవత్సరంలో పారణ (ఉపవాసముండి మరునాడు చేసే భోజనం) చేసే రోజు రసహీనమైన ఆహారమే తీసుకోవాలి. పండ్రెండవ సంవత్సరంలో నిరంతరం తపస్సు చేస్తూ, పారణ కోసం రసహీనమైన ఆహారం తీసుకుంటూ చివరన ఒక నెల లేదా ఒక పక్షం రోజులు మిగిలినప్పుడు అన్ని విధాలైన ఆహారం వదలిపెట్టాలి. ఇదే సల్లేఖన యొక్క పూర్ణకాలిక పద్ధతి. ఈ పద్ధతి వివరణ తర్వాత 'ఉత్తరాధ్యయన సూత్రం' లో మరణ సమయంలో సంయమనానికి భంగం కలిగించే ఐదు రకాలైన అశుభ భావనలు పేర్కొన బడ్డాయి.

**ఈ అశుభ భావనలు ఇవి:**

**కదార్పీ** : కామ చేష్ట

**అభియోగీ**: విషయ సుఖాల కోరికతో వశీకరణ మంత్రం, మొదలైన వాటిని ప్రయోగించడం

**కిల్విషికీ** : పరమ జ్ఞానులను, ధర్మాచార్యులను, సంఘాన్ని నిందించడం.

**మోహీ** : నిషిద్ధ వస్తువులను సేవించడం.

**ఆసురం** : అసుర భావన కలిగి ఉండడం, క్రోధాది వికారాలకు లోను కావడం.

ఈ ఐదు అశుభ భావనలను త్యజించడం సమాధి మరణానికి చాలా అవసరం.

పై వివరణల ద్వారా ధర్మాన్ని విధిగా పాటిస్తూ ప్రసన్న చిత్తంతో శరీర త్యాగం చేయడమే సల్లేఖన అని స్పష్ట మవుతుంది. మృత్యువు గానీ లేదా తప్పించుకోలేని మరే సంకట స్థితి గానీ ఎదురైనప్పుడు కూడా సమాధి మరణాన్ని స్వీకరించవచ్చు.

అయితే దీన్ని ఆత్మహత్య అని అనడానికి వీల్లేదు. ఎందుచేతనంటే సల్లేఖన సమయంలో సాధకుని మనసులో జీవితం పట్ల కాంక్ష ఉండనట్లే, మృత్యువు పట్ల కూడా కాంక్ష ఉండదు. ఆ సమయంలో ప్రపంచంలోని అన్ని వస్తువుల పట్ల సంపూర్ణమైన విరక్తి ఉండడం అవసరం. మృత్యువు సమీపిస్తున్న సమయంలో ఆధ్యాత్మికత పైన మనసు కేంద్రీకృతమై ఉండడం కోసం ఆహారం, నీళ్ళూ త్యజించడం మాత్రమే కాక సాధకుడు అన్ని ఇష్టాలను, అయిష్టాలను త్యజిస్తాడు, ప్రసన్నచిత్తంతో శరీరత్యాగం చేస్తాడు. ఈ విధంగా స్వేచ్ఛగా, అమలిన చిత్తంతో మృత్యువును ఆహ్వానించడం ఆత్మహత్య కాదు. ఆత్మహత్య తీవ్ర రాగద్వేషాలతో కూడిన మనఃస్థితి పరిణామం. సల్లేఖనలో అలాంటి మనఃస్థితికి ఎంతమాత్రం చోటు ఉండదు. ఆధ్యాత్మిక సాధనకు సాధనంగా శరీరం దాని యజమానికి ఉపయోగపడనప్పుడే, ఇక మృత్యువు సమీపిస్తోందని నిర్ధారించుకున్నప్పుడే సాధకుడు ఈ పద్ధతిని అవలంబిస్తాడు. దీని ఉద్దేశ్యం శరీరాన్ని శుద్ధి చేయడం, భౌతిక పదార్థాల ఆలోచనలను తొలగించడం.

సల్లేఖనకు ఉపక్రమించే వారిని సాటి జైనులు పూజిస్తారు. వారి మృత్యువును బహిరంగంగా ఉత్సవ రూపంలో జరుపుకుంటారు. స్థానిక వార్తాపత్రికలు వారిని ప్రశంసిస్తాయి. వారి కుటుంబాలు తరచుగా ఈ సంఘటనకు ప్రచారం కల్పిస్తూ పూర్తి పేజీ ప్రకటనలు ప్రచురిస్తాయి. సల్లేఖన అంతిమంగా అన్ని పాపాలకు, కర్మ ఫలానికి ప్రక్షాళనగా, జన్మ, మృత్యువు, పునర్జన్మ, వీటినుంచి ఆత్మకు ముక్తి కలిగించేదిగా భావించబడుతుంది.

**మానవాధికారాలకు సంబంధించిన వాదోపవాదాలు:** ఆధునిక సమాజంలో సల్లేఖనకు ఏమైనా స్థానం ఉందా? అనే విషయంలో భారతదేశంలో వాదోపవాదాలు జరుగుతున్నాయి. సెప్టెంబరు 2006లో 93 సంవత్సరాల వయసుగల కైలా దేవీ హిరావత్ అనే మహిళ కొనసాగించిన సల్లేఖనకు సంబంధించిన కేసు ప్రపంచ ప్రసార మాధ్యమాల దృష్టిని ఈ వివాదం వైపు ఆకర్షించింది. ఆమె చర్యను ఆమె

కుటుంబమేకాక జైన సమాజమంతా కూడా సమర్థించింది.

సెప్టెంబరు 2006లో సల్లేఖనను చేపట్టి ఐదుగురు ప్రాణత్యాగం చేశారు. మొత్తం భారత దేశంలో ప్రతి సంవత్సరం 200కు పైగా వ్యక్తులు ఇలాంటి ఉపవాసాలు చేసి ప్రాణత్యాగం చేస్తున్నారని నిపుణుల అంచనా. మానవ హక్కుల సంఘాలవారు ఈ సల్లేఖన ఆత్మహత్యకు, సుఖమృత్యువు (euthanasia) కు సమానమైందేనని. దీన్ని కొనసాగించడం నేరమని వాదిస్తున్నారు.

భారతదేశంలో సుఖమృత్యువు నిషేధించబడింది, ఆత్మహత్య ఒక నేరంగా పరిగణించబడుతూంది. తమ్ము చంపుకోడానికి ప్రయత్నించిన వారిని జైల్లో పెడుతున్నారు, అందుకు వారికి సహాయపడినవారి పైన కూడా ఆత్మహత్యకు సహకరించారనే నేరం మోపడం జరుగుతూంది. ఎవరైనా ప్రాణాపాయ స్థితికి చేరుకునే దాకా నిరాహార దీక్ష చేస్తే, బలవంతంగా వారికి ఆహారం తినిపించడానికి, నేరస్తులుగా వారి పైన కేసు పెట్టడానికి పోలీసులకు అనుమతి ఉంది.

సల్లేఖనను వ్యతిరేకించేవారు మాత్రం సల్లేఖనను పాటించడం జీవించే హక్కుకు గ్యారంటీ ఇస్తూ కూడా మరణించే హక్కును నిరాకరించే మన రాజ్యాంగం లోని 21వ పరిచ్ఛేదాన్నిపూర్తిగా ఉల్లంఘించడమే అవుతుందని భావిస్తున్నారు. మానవాధికారాల ఉద్యమ కార్యకర్తలు రాజస్థాన్ ఉన్నత న్యాయాలయంలో సల్లేఖనను వ్యతిరేకిస్తూ పిటీషను దాఖలు చేసిన తర్వాత ఈ నేరారోపణకు సంజాయిషీ చెప్పవలసిందిగా ఉన్నత న్యాయాలయం జైన సమాజానికి నోటీసు పంపింది. ఈ వివాదంలో జరిగిన వాదోపవాదాల సారాంశం ఇది:

న్యాయమూర్తి పనా చంద్ జైన్ ఇలా అన్నారు : "ఆత్మహత్య, సుఖమృత్యువు సందర్భాల్లోలాగా కాకుండా, సంథారాను ఎంచుకొనేవారికి తమ నిర్ణయాన్ని గురించి పునరాలోచన చేసుకోడానికి చాలా అవకాశం ఉంటుంది, మధ్యలో వారు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆహారం తీసుకోవచ్చు." కానీ ఆయనతో విభేదించేవారు మాత్రం, ఒకసారి ఉపవాసం ప్రకటించబడిన తర్వాత కుటుంబ ఒత్తిడి వల్ల, అప్రతిష్ఠపాలు కావలసి వస్తుందనే భయం వల్ల మనసు మార్చుకోడం ఎవరికైనా ఆసాధ్యమై పోతుందని, అంటున్నారు. "నాకు చాలా సంతోషంగా ఉంది. నిజానికి మా కుటుంబంలో అందరూ సంతోషంగా ఉన్నారు. 'సంథారా' ఒక దైవీయమైన కృత్యం,కర్తవ్యం. అందరి అదృష్టంలో ఉండే విషయం కాదు. గొప్ప ధర్మాత్ములకు కూడా ఇటువంటి అవకాశం లభించదు. సంథారాను పాటించ సంకల్పించుకున్న ఆమె చాలా భాగ్యశాలి. ఆమె మా కుటుంబానికి పేరు-ప్రఖ్యాతులు తెచ్చి పెట్టింది."

**నిర్మలా హిరావత్, కైలాదేవి కోడలు :** "మొత్తం మా సమాజం పండుగ చేసుకుంటూంది. మా నాయనమ్మ గతించిన తర్వాత ధార్మిక గీతాలు పాడుకొని వేడుకలు చేసుకుంటాం. దాన్ని దుఃఖదాయకమైన క్షణంగా ఎవరూ భావించరు. ఒక అద్భుతమైన తరుణంగానే దాన్ని మేమందరమూ భావిస్తాం."

**సుధీర్ హిరావత్, కైలాదేవి మనవడు :** 'సంథారా'ను ఆత్మహత్య అనడానికి వీల్లేదు. అన్నిటి గురించీ సవ్యంగా ఆలోచించగలిగిన మెదడుతోనే, జాగృత చైతన్యంతోనే వ్యక్తి సంథారాకు ఉపక్రమిస్తాడు. ప్రజలకు దీన్ని గురించి అంతా తెలుసు. పరిశుద్ధాత్ములైన వారే దీనికి పూనుకుంటారు. ఇది మా మతపరమైన విశ్వాసం తప్ప మరేమీ కాదు. మతాచారాల్లో, సంప్రదాయాల్లో, ఆచార వ్యవహారాల్లో భాగంగా ఉన్నవాటికన్నింటికీ రాజ్యాంగం ఇచ్చిన హామీల సంరక్షణ ఉంది.

**జస్టిస్ పానా చంద్ జైన్ :** రాజస్థాన్‌లోని జైన సమాజానికి అధివక్త. "ఇది ఆత్మహత్య కాదు. ఇది హేతుబద్ధ ఆలోచనకు. సాహసానికి సంబంధించిన చర్య."

**సాధ్వి శుభంకర, జైన పూజారిణి :** "సాధారణంగా వృద్ధులే సంథారా చేయడానికి సంకల్పించుకుంటారు. ఈ దశలోనే వారికి ప్రేమ, ఆదరణ ఎక్కువగా కావలసి ఉంటుంది. ఒక వ్యక్తి ఇష్టపూర్వకంగా సంథారా చేయదలచుకున్నా కూడా, వారిని ఆపడం కుటుంబ సభ్యుల బాధ్యత. వైద్య సహాయం, నొప్పి తగ్గించే మందులు, ఏమీ అందజేయకుండా కష్టాలు అనుభవిస్తున్న ఒక వ్యక్తిని అలాగే చనిపోనివ్వడం అనుచితమైన పని. అలాంటి వ్యక్తికి నీళ్ళు గానీ, ఏ ఆహారం గానీ ఇవ్వరు. దీన్ని మేము అమానుషంగా భావిస్తాము"

**మాధవ మిత్ర, సంథారా వ్యతిరేక పిటిషన్ న్యాయవాది:** "భారత దేశంలో నివసించే ప్రతి వ్యక్తికీ జీవించే హక్కు ఉందని మన రాజ్యాంగం చెబుతుంది. నాకు జీవించే హక్కు ఉన్నప్పుడు జీవించకుండా ఉండే, అంటే మరణించే తత్సమానమైన హక్కు కూడా ఉంది. గౌరవపూర్వకంగా జీవించడమే మానవుని ఉద్దేశ్యం. అది నా హక్కు. ఈ శరీరం నాది. ఇది రాజ్య సంపత్తి కాదు."

**జస్టిస్ పన్నాచంద్ జైన్ :** "ఆమరణ ఉపవాసం చేయడం ఆత్మహత్య కాదు. మృత్యువుకు అభిముఖంగా నడిచే పండుగ. కైలాదేవి తన్ను చంపుకోడానికి ప్రయత్నించడంలేదు. ఎందుచేతనంటే, తన్ను చంపుకోడం మా మతంలో పాపకార్యం కాబట్టి. ఆమె కేవలం తన ఆత్మను శుద్ధి పరచుకుంటూంది. ఇది మాకు పండుగ."

# అమృతం కురిసిన రాత్రి

*- రావినూతల సత్యనారాయణ*

(కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కారం పొందిన పుస్తకాలు : 4)

***(గతసంచిక తరువాయి....2)***

**తపాలా బంట్రోతు :**

1959లో తంగిరాల వెంకట సుబ్బారావు అనే మిత్రుడు జిల్లా తపాలా శాఖ జరుపుకొనే వార్షికోత్సవానికి పోస్టు మాన్ మీద ఏదైన కవిత వ్రాయమని కోరినప్పుడు తిలక్ రచించిన గేయం ఈ కవితా ఖండిక. పోస్టుమాన్ అంటే తిలక్ హృదయంలో ఏర్పడిన - లేక మెలిగే భావ తరంగాలకు అక్షర రూపకల్పన. మరో మాధ్యమం లేకుండా పఠితల హృదయాల్లోనికి సూటిగా చొచ్చుకు పోతుంది!

మై డియర్ సుబ్బారావ్ కనిపించడం మానేశావ్
ఏవిటీ - పోస్ట్ మాన్ మీద గేయం వ్రాయాలా!
...
ఈ నీ ప్రార్థన కడుంగడు అసభ్యం సుబ్బారావ్
ఉత్త పోస్ట్ మాన్ మీద ఊహలు రా నే రావు
ఎండలో వానలో ఎండిన చితికిన / ఒకచిన్న సైజు జీతగాడు
చేతిలో సంచి కాకీ దుస్తులు అరిగిన చెప్పులు
ఒక సాదా పేదవాడు ఇంటింటికి వీధి వీధికి
ప్రతి రోజూ తిరిగే వాడు - ప్రై మినిస్టరా ఏం?
అయితే చూడు :
ఆ కిటికిలో రెండు విచ్చిన కలువల్లాంటి కళ్ళు
ఆ వీధి మొగవైపే ప్రసరిస్తున్న చూపుల ముళ్ళు
ఆ కళ్ళలో ఆతృత ఆ గుండెల్లో గడచిన
దేశాంతర గతుడైన ప్రియుడి వార్త కోసం
అమ్మాయీ!
పద్దెనిమిదేళ్ళ పడుచు దనాన్ని భద్రంగా దాచి
పళ్ళెంలో పెట్టి ప్రాణ నాథుడి కందించాలనే
నీ ఆశ నాకు అర్థమయింది
అందుకే, . . .
వీధి వీధి నంతా మేల్కొలుపు తున్నాయి
వీధి వీధి నంతా కలయ చూస్తున్నాయి
అదుగో పోస్ట్ మాన్! ...
గుడిసె ముందు కూర్చున్న పండు ముసలి అవ్వ
గడచిన బ్రతుకంతా కష్టపు నెత్తుటి కాలువ
కనబడీ కనబడని కళ్ళల్లో / కొడిగట్టిన ప్రాణపు దీపంలో
తాను కనిన తన ప్రాణం, తనకు మిగిలిన ఒకే ఒక స్వప్నం
తన బాబు తన ఊపిరి / అస్సాం రైఫిల్సులో సోల్జర్ సిమ్మాచలం
కోసం నిరీక్ష క్షణ క్షణ ప్రతీక్ష / ఒక్క కార్డు ముక్క వ్రాశాడా
బంట్రోతు వెళ్ళు వెళ్ళు త్వరగా / ముసలి దానికి మంచి వార్త నందించు
ముడతలు పడిన మోహం మీద ఆనందాన్ని పరికించు
దూర భారాన ఉన్న కుమారుని కోసం / వగచే తల్లికి
చేరువౌతున్న నువ్వొక ఊరట ... ...
నువ్వు దూరాల దారాల్ని విచిత్రంగా / ఒకే నిముషము
అనే కండె చుట్టూ త్రిప్పగల నేర్పరివి - కూర్పరివి
నీ మేజిక్ సంచిలో / ఏ క్షణంలో ఏది పైకి తీస్తావో
ఆ క్షణాన నువ్వు రాజుతో సమానం! ...
అందరికీ నువ్వు ఆత్మ బంధువువి / అందరికి నువ్వు వార్త నందిస్తావు
కాని నీ కథనం మాత్రం నీటిలోనే మథనం / అవుతూంటుంది.
ఇన్ని ఇళ్ళు తిరిగినా / నీగుండె బరువు దింపుకోవడానికి ఒక్క గడప లేదు
ఇన్ని కళ్ళు పిలిచినా / ఒక్క నయనం నీ కోటు దాటి లోపలకు చూడదు
ఉత్తరం ఇచ్చి నిర్లిప్తుడిలాగా వెళ్ళిపోయే నిన్ను చూచినపుడు
తీరం వదలి సముద్రం లోకి పోతున్న ఏకాకి నౌక చప్పుడు.

"ఉత్తరం ఇచ్చి నిర్లిప్తుడిగా వెళ్ళి పోయే నిన్ను చూచి నపుడు తీరం వదలి సముద్రం లోకి పోతున్న ఏకాకి నౌక చప్పుడు". ఎంతటి రమ్యమైన ఊహ! ఇటువంటి కవిత తిలక్ ముద్రతోనే సాధ్యం! ఇంతటి మహత్తర కవిత తిలక్ మాత్రమే సృష్టించగలడు!

అధునాతన భావుకులను గురించి లోతుగా ఆలోచిస్తాడు తిలక్. *కఠనోపనిషత్* అనే గేయంలో ఒక అధునాతన భావుకుని లక్షణాన్ని చిత్రించిన తీరును గమనించండి.

వెలుగును వెనక్కి నెట్టుతూ రేపటి రోజుకి
పది వేల సంవత్సరాల నాటి పాత ముఖాన్ని అతికించేందుకు
కాలాన్ని సాగదీసి సాగరాన్ని మథించి ఖగోళాల నావర్తించి
అధునాతన భావుకులు స్వప్న భుక్కులు
వర్తమాన శిరస్సున వధించ బోయే సమయాన
గత భూత కాల ప్రసక్తి లేక గగన పాతాళాల మధ్య
ఏటవాలుగా జారే విలాసులు తత్ క్షణ ప్రయోజన సాధకులు
చిరు నవ్వులు చిందే విషమ సంధ్య వేళ
అత గాడు మూడవ పరిమాణంలోని ఊహలకి
ఆకారం కల్పించ లేక తికమక పడుతున్నాడు ...
ఏడు రంగుల ఇంద్ర ధనుస్సు నెక్కుపెట్టి కోట్ల కొలది జనులు
ఎండ మావుల పండుగలు చేసుకొనే సమయాన
అతగాడు తెగిన ఫిడేలు తీగల్నీ
కదలని గడియారపు గుండెల్నీ చినిగిన స్వప్నపు సంచుల్నీ
రిపేయిర్ చేసే ప్రయత్నంలో నిమగ్నుడయాడు.

"కోట్ల కొలది జనులు ఎండమావుల పండగలు చేసు కుంటున్నారని" ఎంతటి కఠిన సత్యం తెలిపాడు తిలక్! ఇప్పటికి పరిస్థితి మారలేదు?! ఎంతటి నిరాశ? *కఠనోపనిషత్* ముగిపు గమనించండి!

అద్భుత చారిత్రక ఘట్టాల లోన / ఆస్తికులు నాస్తికులు మతాలు సిద్ధాంతాలు
మనుష్యుల్ని మరచి పరమ సత్యాలను తరచి పైకి తీసే
ఆవేశపు మధ్యాన్నపు ఎండలలోన / నాలుగు రోడ్ల కూడలిలో నిలబడి
సౌఖ్య నగరానికి దారి తెలియక / సైను పోస్టు మీద మిథ్యాలిపి డిసైఫర్ చెయ్యలేక
జిగీషువుల జిజ్ఞాసవుల ముఖాలు వెల వెల బోతున్న సమయాన
అతగాడు ఒక్కడూ ఊపిరాడని గదిలో ఉరి పోసుకుని చని పోయాడు

1963వ సంవత్సరంలో తిలక్ తన "మైనస్ ఇంటు ప్లస్" అనే కవితను ప్రకటించాడు. ఆనాటి పరిస్థితులు తిలక్ హృదయంలో నిస్పృహను కల్గించాయి, ఆయనలోని (Transparent) సన్నగిల్ల జొచ్చింది. "మానవుడు మానవుడిగా దేవుడుగా రూపొందే ఈ ప్రయాణం అనంత దీర్ఘం పునః పునర్వ్యర్థం బహుయుగ విస్తీర్ణం" అంటాడు. అయితే, అనంత దీర్ఘం, బహుయుగ విస్తీర్ణమైన మానవతా సంఘర్షణ, కృషి, ఎన్నటికైనా ప్రతి ఫలిస్తుందనే ఆశకు బదులు తిలక్‌లో నిరాశ కల్గించిపెస్సిమిస్టుగా మారుస్తుంది. ఈ కవితా ఖండికలో తిలక్ ఆత్మ అంగీకరించలేని సత్య మేదో దాగి ఉన్నట్లనిపిస్తుంది. ఆ కారణం చేత 'ఉన్నశాంతి' జడంగా కనిపిస్తుంది. నిష్క్రియత్వాన్ని శాంతిగా భ్రమిస్తున్న మానవుని సంఘర్షించమని ప్రబోధిస్తాడు. అందుకే–

**జడంగా వున్న శాంతి నుండి / ఎడంగా తప్పు కుంటాడు మానవుడు**
**సంచలనం కలిగించే / సమరాంగణాన్ని కోరు కుంటాడు**
**అందుకే మానవ చరిత్ర అంతా యుద్ధ మయం**
**యుద్ధాలు లేని చరిత్ర చదివితే అర్థ హీనం. . . . . . . .**
**అందుకే మానవుడు మానవుడిగా దేవుడిగా రూపొందే ఈ ప్రయాణం**
**అనంత దీర్ఘం పునః పునర్వ్యర్థం బహుయుగ విస్తీర్ణం**

అంటారాయన. ఈ కవితలోని గూఢార్థం: అసలైన మనిషి, కాస్త అలజడిలో, బయటపడతాడు. వయసెల్లా జనన మరణాలకు లోనవుతుందో కృషి కూడా అలాగే ఆశ నిరాశలకు లోనౌతుంది. దాని అంతిమ జయం మరీ మరీ ప్రయత్నించడమే! నిరంతర సంఘర్షణ మాత్రమే! దీనినే తాత్త్వికుడైన కవి (తిలక్) పాఠకులకు సూచిస్తారు.

*అమృతం కురిసిన రాత్రి* గేయం 1962వ సంవత్సరంలో రచించినది. ఒక విధంగా పరిశీలిస్తే ఇది ఆత్మాశ్రయమైన కవిత. కవి ఊహాలోకంలో విహరిస్తూ గడించిన అనుభూతి పరంపర. అత్యంత ఆహ్లాదకరంగా తనను తాను వ్యక్తీకరించుకొనిన వివరణ.

అది రమణీయమైన రాత్రి. వాతావరణమంతా తియ్యదనముతో నిండి అమృతాన్ని వెదజల్లు తున్నది. జనమంతా నిద్రా వశులై పవ్వళిస్తారు. అప్పుడు కవి పయనం సాగుతుంది, ఎక్కడికో దూరంగా కొండదాటి, కోన దాటి వెన్నెల మైదానంలోకి. ఆ కవితా సమయ వర్ణనలు...

**ఆకాశం మీద అప్సరసలు / ఒయ్యారంగా పరుగు లెత్తుతున్నారు**
**వారి పాదాల తారా మంజీరాలు / ఘల్లు ఘల్లని మ్రోగుతున్నాయి**
**.........**
**నన్ను చూసి చూసి కిల కిల నవ్వి ఇలా అన్నారు**
**చూడు వీడు అందమైన వాడు / ఆనందం మనిషైన వాడు**
**కలల పట్టు కుచ్చు లూగుతున్న కిరీటం ధరించాడు .....**
**ఎవరికీ దొరకని రహస్యాలని వశ పరుచు కున్నాడు**
**జీవితాన్ని ప్రేమించిన వాడు జీవించడం తెలిసిన వాడు**
**నవ నవా లైన ఊహా వర్ణార్ణవాల మీద ఉదయించిన సూర్యుడు**
**ఇతడే సుమీ మన ప్రియుడు, నరుడు, మనకి వరుడు**
**జల జల మని కురిసింది వాన జాల్వారింది అమృతపు సోన**
**దోసిళ్ళతో తాగి తిరిగి వచ్చాను / దుఃఖాన్ని చావుని వెళ్ళి పొమ్మన్నాను**
**.....**
**అమృతం కురిసిన రాత్రి అందరూ నిద్ర పోతున్నారు**
**అలసి నిత్య జీవితంలో సొలసి సుషుప్తి చెందారు**
**అలవాటునీ అస్వతంత్రతనీ కావలించుకున్నారు**
**ఆ ధైర్యంలో తమలో తాము ముడుచుకు పోయి పడుకున్నారు**
**అనంత చైతన్యోత్సవాన్ని వినిపించుకోలేకపోయారు**
**అందుకే పాపం ఈ నాటికీ ఎవరికీ తెలియదు / నేను అమరుడనని!**

స్వగతంగా గడచిన ఈ కవితలో ఆత్మఘోషను రంగరించి ఆధ్యాత్మికను చొప్పించాడు కవి తిలక్. అద్భుత మైన అనుభూతిని పాఠకులతో పంచుకున్నాడు. అందుకే కాబోలు ఈ కవితనే సంకలనానికి శీర్షికగా ఎంచు కొనుట!

*ప్రార్థన* అనే మరో కవితలో అవాంఛనీయ శక్తుల నుండి తన దేశాన్ని కాపాడమని దేవునికి మొరపెట్టు కుంటాడు కవి. దేవుని ఉద్దేశించిన ఆ "మొర" లో పేర్కొన్న సంఘ వ్యతిరేక శక్తుల వర్ణన పాఠకుని హృదయాన్ని కదుపు తుంది. చదవండి:

**దేవుడా రక్షించు నా దేశాన్ని / పవిత్రుల నుండి పతివ్రతల నుండి / ...**
**శ్రీ మన్మద్గురు పరంపర నుండి / ...**
**నలభై కోట్ల మనుష్యుల నిజమైన ప్రాణం వున్న**
**మనుష్యులతో నిండిన దేశం నాది.../ బ్రతుకు పొడవునా స్వతంత్రం**
**కొంచెం పుణ్యం కించిత్ పాపం**
**కాస్త కన్నీరు మరి కాస్త సంతోషపు తేనీరు**
**చాలు మాకు తండ్రీ ... / మమ్మల్ని కనికరించు**
**చావు పుట్టుకల సందేహం లాంటి / జీవితంలో నలు వైపులా అంధకారం**
**...**
**ఆశల వెచ్చని పాన్పు మీద స్వప్నాల పుష్పాలు జల్లుకొని**
**ఆద మరచి కాసేపు విశ్రమించటాని కనుమతించు తండ్రీ.**

సంప్రదాయ భీరువుల్ని (ఘాటుగా) విమర్శించాడు ఈ గేయంలో తిలక్. లక్షలాది దేవుళ్ళ నుండి, వారి వారి నిరంకుశ ప్రతినిధుల నుండి ఈ సామాన్యుణ్ణి రక్షింపమని వినమ్రతతో విన్నపం జేస్తాడు దేవునికి!

*నీడలు* అనే కవితా ఖండిక ఆరు గేయాల్లో ముగుస్తుంది. చిన్నమ్మా! అనే సంబోధనతో ప్రారంభించిన ఈ కవిత విశాలమైన పరివ్యాప్తి కలిగినది. స్థూలంగా చూస్తే,

అదేదో ప్రత్యేకమైన సంఘటనకు చెందిన దాని వలే కని పిస్తుంది. కాని లోతుగా పరిశిలిస్తే, దాని విశాల పరివ్యాప్తి అర్థమౌతుంది. చిన్నమ్మా! వీళ్ళమీద కోపగించకు, వీళ్ళ నసహ్యించుకోకు, వీళ్ళందరూ చిన్న వాళ్ళు, ఆలోచనలు చిన్నవి, మనస్సులు చిన్నవి. ఆదరణలు చిన్నవి, అవకాశాలు అందుకోలేని వాళ్ళు. అనుభవాల్నుంచి పారి పోయే వాండ్లు!

ఇలా వాండ్లను గూర్చి వివరిస్తూ, అయినా వాండ్లను విడిచి వెళ్ళి పోకు, వీళ్ళందరూ నీ బిడ్డలు"! అంటాడు. "వీళ్ళ మధ్య డైనమైట్ పేలాలనీ, డైనమోలు తిరగాలని ఆకాంక్షిస్తాడు. ఈ ఖండికలోని ఏ కవితను తీసుకొన్నా, ఎంత ఊహకీ, ఎంత ఆలోచనకీ, ప్రేరణ, తావు, ఇవ్వాలో అంతా ఇస్తుంది. అది పాఠకుని పరిశీలనా శక్తి మీద ఆధార పడి వుంటుంది. అసలు *నీడలు* అనే పేరు లోనే "ధ్వని" వుంది.

ఆత్మాశ్రయపరంగా సాగినట్లు కనిపించే తిలక్ రచించిన *అదృష్టాధ్వగమనం* 1964వ సంవత్సరంలో రచించినది. *శిఖరారోహణ* 1966వ సంవత్సరంలో ప్రచురితమైనది. మొదటి కవితలో రచయిత (కవి తిలక్) చాలా కాలం తర్వాత తన మిత్రుడిని కలుసుకొంటాడు. ఆ బాల్య సహపాఠి అతనిని గుర్తించడు! కవి తన బాల సహాధ్యాయి (మిత్రుని) తో సంబోధనా పూర్వకంగా మాట్లాడిన సంఘటన ఈ కవితలో వివరిస్తాడు. కవితలో పేర్కొనిన వ్యక్తిని అదృష్టం వరిస్తుంది. జీవితంలో ఉన్నత స్థానాన్ని అందుకొంటాడు. ఇద్దరి మధ్య అసమానత ఏర్పడు తుంది. స్వగతంగా సాగిన కవితా విశేషాన్ని గమనించండి!

**అన్నా**
**నన్నానవాలు పట్టా గలవా? ఆనాటి వాణ్ణి నీ చెలికాణ్ణి / ...**
**స్థూల మైన ఆకృతిని అస్తిత్వాన్ని పొందని పొంద లేని / ఊహామరుత్తుని.**
**ఏకాకిని....**

"తనది అదృష్టాధ్వ గమనం! ఎవరూ వినని పాటను, ఒకే తీగ మాత్రం మిగిలిన సితార మీద (ఆ ఒక్క తీగ కూడా తెగిన నాడు ఆయన అన్వేషణ మౌనంలోకి ఇంకి పోతుంది) పాడుతూ, ఎవరూ నడవని బాటలో నడుస్తున్నాడు." కొమ్మ మీద ఆహారం దొరకని కృకలాసం (ఊసరవెల్లి) కంగారు చూపులో, ఊరవతల సందులలో దుమ్ము కొట్టుకు పోయిన పిల్లల కళ్ళల్లో ఆరిపోతున్న వెలుగులో కాలవ ఒడ్డున, వంకర తిరిగిన తుమ్మచెట్టు కొమ్మల్లోంచి కాలి మసై పోతున్న పశ్చిమ దిశ గగనంలో ఒక భయంకరమైన సృష్టి క్రమాన్ని, మానవ యత్న వైఫల్యాన్ని ఊహించుకుంటున్నాడు రచయిత. మాములు దారుల్నీ, మర్యాదల్నీ, మంచి చెడ్డల్నీ, విడిచి రాత్రిందివాల మధ్య రహఃకిర్మీరరథ్య (బంగారు బాటల కూడలి) ఆశతో, విశ్వాసంతో, ఆత్మ బలంతో సాగిపోయా డాయన. ఆయన లోపల ఆయన బాధలు, వెలుపల క్షత జగత్తు ఆక్రోశించిన కరుణా భీభత్స రవాలు.

నిరంతర పరిణామ జగత్కటాహంలో సల సల కాగే మానవాశ్రు జలాలు. ఐనప్పటికీ అంతర్గత సంగీతం అనుపమ సుందర గీతం ఆయనలో వినబడటం మాన లేదు. సృష్టి లోని అర్థం కోసం, జన్మ లోని సాఫల్యం కోసం... ప్రతి తెరనీ తొలగిస్తూ, ప్రతి అరని తెరుస్తూ నడిచాడాయన. "ఆకాశమంత నా ఏకాంతము లో అనంత మానవ హృదయ స్పందన వినడం మాన లేదు. అలసిన ప్రవాసంలో అద్భుత సౌధాల మణి కవాటాలూ తెరుచు కోవడం మాన లేదు" (వరవరరావు).

*శిఖరారోహణ* మరో అద్భుతమైన రచన. ఈ గేయంలో కవి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నాడు. ఆ సందర్భాన్ని వాడుకొని, నవీన కాలపు అవ లక్షణాన్ని, నవ యుగానికి కావలసిన శక్తి వికాసాన్నీ సూచన మాత్రంగా స్పృశిస్తాడు. ఆధునిక కాలంలో ప్రాప్తించిన దుర్దశను గేయం మొదటి మూడు భాగాల్లో చమత్కార పూరితంగా "తీక్షణ ధ్వని రచన"తో నిరూపిస్తాడు. నాలుగో భాగంలో కాలపు మూలాల్లోకి, అనుభూతి లోతుల్లోకి కూరుకొని పోతాడు! ఈ నాల్గవ భాగమంతా సనాతనత్వ భావపూర్వకమైన వేదనా వర్ణితం.

విప్లవకవి (వరవరరావు) మాటల్లో *శిఖరారోహణ* అద్భుతమైన రచన. "పాత మాటల మూటలో కవులూ, వట్టి మాటల సంచులతో రాజకీయ వేత్తలూ, మొహమాటం లేకుండా ముందెక్కి కూర్చున్నారు రైల్లో." అట్లా "పాత మాటల మూటల కవుల" మీద ఒక విసురు విసరనే విసిరాడు. ఇంకా ఆ కవితా ముగింపులో కొరడా దెబ్బల వంటి తీర్పు ఇచ్చాడు. "కొత్త దారి తొక్క లేని, కొత్త మలుపు తిరగ లేని కుంటి గుడ్డి వాళ్ళ ప్రయాణ కోలాహలం, మురికి కాల్వ మీద, ముసలి తనం మీద, మృషా (అసత్య) జగతి మీద, మహోదయం వికసించదు. సంప్రదాయ భీరువుకీ,

అస్వతంత్ర వితంతువుకీ వసంతం లేదు! సాహసి కానివాడు జీవన సమరానికీ, స్వర్గానికీ పనికి రాడు. అయితే, ఆయన (తిలక్ లో) ఎంత సత్సంప్రదాయం జీర్ణించి పలికిందో కూడా చెప్పుకొంటాడు. మన సంస్కృతిని గురించి కూడా తిలక్‌కు విశాల మైన దృక్పథం వుంది. ఆయన షేక్స్పియర్, డాంటే, కాళిదాసూ, శంకరుడూ మార్క్స్, మహాత్ముడూ, పికాసో, సార్ర్తే లకు వారసుడి ననుకున్నాడు. కాని కేవలం కాళిదాసు, శంకరుడూ, మహాత్ములకే వారసుణ్ణను కోలేదు. "మనగలిగినదీ, కాలానికి నిలబడ కలిగినదీ వద్దన్నా పోదు. మనదైనా మరొకరిదైనా మంచికి జాతీ కులమూ సరిహద్దులు లేవు'' అన్న వసుధైక దృక్పథం తిలక్ మహాశయునిది. కాళిదాసు కవిత్వం లోని మాధుర్యం, సౌందర్యం, ఉపనిషద్ధర్మ మహోదధి ఎవడు పోగొట్టు కుంటాడు?

**ఏ దేశ సంస్కృతి అయినా ఏనాడూ కాదొక స్థిర బిందువు**
**నైక నదీ నదాలు అదృశ్యంగా కలసిన అంతస్సింధువు**
**అంటారు తిలక్ మహాశయులు.**

తిలక్ కవితల్లో ఏది చదివినా కవితా రచన పారవశ్య లక్షణాన్ని పసిగట్టవచ్చు. ఆయన శిల్పం ఆయనదే! బియ్యంలో నువ్వుల వలే ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. "నేను కాని నేను" అనే కవితా ఖండికలో ఈ విషయం మనకు విశద మౌతుంది.

**"ఒక నిశార్థ భాగంలో నివహ గగనం**
**ఓరగా భూమ్మీదకు ఒంగి ఏదో రహస్యం చెబుతున్న వేళ"**

అంటారు కవి. ''నక్షత్రాలతో కలసిన ఆకాశం భూమ్మీదకు వంగి రహస్యం చెప్పటం" ఎంతటి గొప్ప ఊహ! ఆ పదాల పొందికలోనే ఉన్నది రచయిత విశిష్ఠత.

'రహస్యం' చెప్పటం అనే పదం చాలా మహత్వమైనది. ఆ వాడుకలోనే కవి మనస్సులోని నిశ్శబ్ద స్థితి వ్యంజన (సూచన) ఉన్నది. ఈ విధంగా "బయటి ప్రకృతి గతమైన వస్తువుల్ని వర్ణిస్తూ, ఆ వర్ణనతోనే అనుభూతిని, సంకేత రూపాన జోడించి, ఆ అనుభూతి, మనోంతర్గత రహస్య వ్యక్తీకరణ రూపంగా ఉండేటట్లు మలచబడిన ఈ గేయం, ప్రకృతికీ, కవితా పరవశితమైన మనస్సుకీ కవి రహస్యాలతో నిర్మించుకొన్న వంతెన లాంటిది".

బయటి వస్తువుని వర్ణించుటలోనే కవిలోని ఆవేశం వ్యంగ్యంగా స్ఫురిస్తుంది. ఉదాహరణకి ఈ క్రింది పంక్తులను పరిశీలించండి:

**"ఎదురుగా గోడమీద బల్లి ఏకాగ్రంగా నాకేసి చూస్తూ ఉంటుంది".**
**"కిటికీ అవతల ఫెరన్ మొక్క క్రీకంట కనిపెడుతూ ఉంటుంది"**
**"కీచురాళ్ళ చప్పుడు అప్పుడు వినిపిస్తూ ఉంటుంది"**

తర్వాత కూడా మరి కొన్ని చిత్రమైన సంకేత భావాలచేత కవి తన అనుభూతిని వ్యక్త పరుస్తాడు. అలాగే "మంచూ మసక వెన్నెల కలసిన శీతాకాలపు రాత్రీ కవి మనసు యొక్క వ్యక్తావ్యక్త స్థితికి సంకేతం! అటువంటి రాత్రిగుండెల మీద కవి నిట్టూర్పు వాలుతుంది. ఆ నిట్టూర్పు కవితావేశ పరాకాష్టతో కూడిన నిట్టూర్పు. అది కవి ఏకాంతం మీద ఒక రకమైన తీర్పు. విపులంగా చెప్పాలంటే కవి ఏకాంత స్థితిని చిత్రించే వ్యాఖ్యానం. కవి తనలో తాను ఏకమైన అద్వైత స్థితికి సూచన. సూక్ష్మంగా పరిశీలిస్తే తిలక్ తన చుట్టూ వున్న ప్రకృతిలోనే, తన ఆవేశాన్ని సూచన ప్రాయంగా వర్ణిస్తూ, సంకేతాల ద్వారా తన పారవశ్యాన్ని నిరూపిస్తాడు. అందుకే తిలక్ ప్రధానంగా తాను అనుభూతి వాది"నని చెప్పుకొన్నాడు.

*కిటికీ* అనే మరో గేయం లో మనస్సు యొక్క దైర్ఘ్యాన్ని మూర్తీభవించే విధంగా మన ముందు ఉంచుతాడు చూడండి!

**కిటికీ తెరిస్తే  గాలీ వెలుతురుతో పాటు**
**జాలి జీవితపు ధూళీ జ్ఞానమధూళీ కూడా వస్తాయి**
**తెరిచే కిటికీని బట్టి  పరతెంచే పుష్పరాగం వుంటుంది.**
**గదికీ మదికీ కూడ గవాక్షా లుంటాయి**
**అంతరిక్షం లోకి జీవిత రహస్యం లోకి సృష్టి సమక్షంలోకి**
**విచ్చు కొనే విచిత్రాక్షి సమూహాలు**
**ఆనంద శోకానుభూత్య విరళ తటిచ్ఛకిత వార్షుక వలాహకాలు.**

అనుభూతిని అమోఘంగా చిత్రించి కవితా రూపంలో వ్యక్తపరచారు తిలక్. *నువ్వు లేవు నీ పాట వుంది* అనే కవితలో – ఇంటిముందు ఉద్యాన వనంలో చిన్ననాడు తాననుభవించిన ప్రేయసి సమాగమానుభూతి యొక్క స్మృతి వేదన ఈ కవితా ఖండిక లోని వస్తువు. కవితను ప్రారంభించిన తీరును గమనించండి:

**నువ్వు లేవు నీ పాట ఉంది / ఇంటి ముందు జూకా మల్లె తీగల్లో అల్లు కొని**
**లాంతరు సన్నని వెలుతురులో క్రమ్ముకుని నా గుండెల్లో చుట్టు కుని**
**గాలిలో ఆకాశంలో నక్షత్రం చివరి మెరుపులో దాక్కుని**
**నీరవంగా నిజంగా వుంది / జాలిగా హాయిగా వినబడుతూ వుంది**
**శిశిర వసంతాల మధ్య వచ్చే మార్పుని గుర్తుకి తెస్తోంది"**

యౌవనంలో తన కౌగిలిలో పాడిన ప్రేయసి యొక్క అనుభూతి కవి హృదయంలో ఎలా స్పందించిందో పైన ఉదహరించిన పంక్తులు వ్యక్త పరుస్తాయి. వారు సంగమించే

సమయాన ఇంటిముందు ఉన్నటువంటి జూకామల్లె తీగలో, లాంతరు సన్నని వెలుగులో ఆ పాట కవి హృదయాన్ని నింపుతుంది. మరో విధంగా చెప్పాలంటే ఆ తరుణం ఆ పాట, వాతావరణం కవి (తిలక్) గుండెలలోకి చొచ్చుకుని ఆయనను ప్రకృతిలో ఐక్యం జేస్తుంది. ఆ తరుణంలో అద్వైతానంద స్థితి. అయితే, ఈనాటి ఆ స్మృతి అనిర్వచనీయ వేదనా సహిత మైనది. ఆ వేదనలో తీయదనం కరిగిపోయి ఉన్నది. ఆ వేదనను తిలక్ అతి సమర్థవంతంగా ప్రకృతితో ధ్వనింప జేస్తాడు. కవి అనుభూతి గాలిలో నిండింది; ఆకాశాన్ని పలకరించింది. ఉదాహరణకు “నక్షత్రపు చివరి మెరుపులో'' అన్నది విషాదపు జీరకు సంకేతంగా వాడబడింది. “ఆ పాట ఈనాటికీ ‘జాలిగా’ వినబడుతోంది. పైగా అది శిశిర వసంతాల మధ్య మార్పువలె ఉన్నది” అంటాడు తిలక్. మనకందరికి తెలిసిన విషయ మేమిటంటే శిశిరం విషాదం. వసంతం ఆనందం. ఈరెంటికీ మధ్య, విషాదానందాల మధ్య – మార్పు; అంటే వేదనని పిలిచే ఆనందం, ఆనందానికి చేతులు చాచే వేదన, రెండూ కలసిన రేఖ ప్రస్తుత కవి యొక్క స్మృతి! ఈ కవితా ఖండిక మొత్తం చిత్ర విచిత్రాను భూతులతో నిండి ఉంది. తిలక్ తన అనుభూతికి మరికొన్ని పోకడలు చెప్పి తర్వాత గేయాన్ని ముగించే విధానంలో సమగ్ర శిల్పత్వాన్ని వ్యక్తీకరిస్తాడు. గేయారంభంలో వర్ణించిన వాతావరణాన్నే పునరావృతం కావించి అవే పంక్తులతో కవితను ముగిస్తాడు. పరిశీలించండి:

**“ఇంటిముందు జూకామల్లె తీగల్లో అల్లుకొని / శిశిర వసంతాల మధ్య వచ్చే విచిత్ర మధురమై మార్పుని గుర్తుకి తెస్తోంది / ఇన్నేళ్ళ తరువాత” అంటూ –**

మహాకవులైన విశ్వనాథ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ లు అంటే అవ్యాజమైన గౌరవాదరాలు తిలక్ మహాశయునికి. వారిని త్రిమూర్తులుగా చిత్రీకరిస్తాడు. అల్లాగని వారిని గుడ్డిగా అభిమానించడు. చురక చురకగా వ్యంగ్య రీతిలో వారిని గూర్చి ఏమంటారో గమనించండి:

**ఒకడు:**

**మావాడే – మహాగట్టివాడు – మకుటం లేని మహారాజయ్యేవాడు**
**కాని ముసలిదాన్ని, మసక మసక కన్నులదాన్ని**
**మూలమూల ముడుచుకు కూర్చున్నదాన్ని**
**మనువు చేసుకోవాలన్న ఉబలాటంతో / మంచి చెడ్డా మరచి పోయాడు**
**మర్యాదల్ని అతిక్రమించాడు / మరి పనికిరాడు.**

**మరొకడు:**

**మల్లెపూల మీద పరుంటాడు, మంచి గంధం రాసుకుంటాడు**
**మరి ఎందుకేడుస్తాడు? / మంచి పనివాడు, మాకు నచ్చిన వాడు**
**మాతో నడుస్తా నంటాడు / మరి నిజంగా వస్తాడా?**

**మూడోవాడు:**

**అరే! వీడు చిచ్చుర పిడుగు, / ఎండలో నడిచే మనుష్యులకు గొడుగు**
**ముందుకు వేసిన అడుగు / మాకు చిన్నన్న కానీ అన్నన్న!**
**ఈ మధ్య విదేశాల చవకబారు / పానీయాలు సేవించి**
**మత్తుగా పడుకున్నాడు / మరి యిప్పట్లో లేవడు.**

ఎంతో నిజాయితీగా, నిర్భయంగా, చమత్కార యుతంగా చిత్రించారు త్రిమూర్తులను! అదే తిలక్‌లో దాగి యున్న మహనీయత. అందుకే, ఆయనను అనుభూతి వాదిగా పేర్కొనుట.

**ముగింపు:** మరో మహత్తరమైన సత్యమేమిటంటే, ఆధునిక కవితా యుగంలో కావ్య వస్తువు పరిధిని విస్తృత పరచి సర్వ జీవిత తరంగాలకూ వ్యాపింప జేయడానికి ఆయన పడిన శ్రమ. సంకుచితమైన జాతి మతాల సరిహద్దులను చెరపి వేసి అకుంఠిత మానవీయ పతాకాన్ని ఎగుర వేసిన అభ్యుదయ కవి తిలక్. ఉత్తర ధృవాన ఒక పాదం, దక్షిణ ధృవాన మరోపాదం ఉంచి త్రివిక్రముని వలే పెరిగి కవితా రాజ్యమును పరిపాలించిన వాడు తిలక్. “ఎవరెస్టు కన్నా ఎత్తైన ఆయన ఊహా శిఖరాన్ని” చేరుకోవడం సాధ్యం కాని పని. ఆయన హృదయాన్ని చదవడం కూడా కష్టతరమే! “అమృతం కురిసిన రాత్రి” అనే కవితా సంకలనంలో పొందు పరచిన కొన్ని కవితా ఖండికలలో మరుగు పడిన మాణిక్యాలు, కవితా శిల్పాలలోని సౌందర్యాలు పాఠకుల ముందుంచే సాహస ప్రయత్నం చేశాడు ప్రస్తుత వ్యాస కర్త. అది ఎంత వరకు ఫలించిందో విజ్ఞులే నిర్ణయించాలి.

ఈ వ్యాస రచనా ప్రక్రియలో భాగంగా, తిలక్ కవితా విశేషాలను తెలుసుకొనేటందుకు వ్యాస కర్త అనేక రచయితల రచనలను పరిశీలించడం ఆవశ్యకమైనది. ఆయా రచనలలోని భావజాలం అత్యంత ఉపయోగమైనది. ఆయా రచయితలందరికీ – ముఖ్యంగా, కుందుర్తి గారికీ, వరవరరావు గారికీ, రామమోహనరావు గారికీ, మల్లవరపు విశ్వేశ్వరరావు గారికీ వ్యాసకర్త ఋణపడి యున్నాడు. వారికి కృతజ్ఞతా పూర్వక నమోవాకములు. చివరగా కాళోజి మాటలతో ఈ వ్యాసం ముగిద్దాం:

**కవితిలకుడు లేదు / కవితా క్షేత్రం పడ్డది బీడు**
**శారద నుదుటి తిలకం / కవితకు రాణింపు, ధ్వనికి గుబాళింపు**
**“ట్రాన్ స్పరెంట్ చీకటి / వానికి వాడే సాటి”**

మి

*అయిపోయింది.*

# చదవండి...

- ఎన్నార్కె




✦ **ఒక వేకువ కోసం :** కవితా సంకలనం. బెల్లంకొండ సంపత్ కుమార్ మొదట సామాజిక కవి, అటుపైన విప్లవ కవి. నేడు తెలంగాణా ఉద్యమ కవి. "జనం నా నిజాయితీ అయినపుడు, నిజాయితీ నా జనం అయినపుడు నిజం చెప్పడానికి భయం లేదంటూ" నిర్భయంగా వ్రాసిన కవితా సంపుటి ఇది.

*పేజీలు 120, వెల : ₹ 60/-, ప్రతులకు - విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి, సహచర, దిశ పుస్తక కేంద్రాలు.*




✦ **భారతీయ చిత్రకళ :** తెలుగులో మొట్టమొదటి కార్టూనిస్టుగా గణుతికెక్కిన తలిశెట్టి రామారావు దీని రచయిత. రామారావు చిత్రకారునిగానే కాక చిత్రకళా విశ్లేషకునిగా, విమర్శకునిగా వ్రాసిన వ్యాసాల సంపుటి. ఇందులో నున్న 13 వ్యాసాలలోనూ ఆయన నిశిత పరిజ్ఞానం కానవస్తుంది. ముఖ్యంగా అజంతా, భగ్, మొఘల్ చిత్రకళపై ఆయన చేసిన వ్యాఖ్యానాలు వాస్తవికంగా, వివేకాత్మకంగా, నిష్పక్షపాతంగా ఉన్నాయి. చిత్రకళపై ఆసక్తి, అభిరుచి ఉన్నవారు తప్పక కొని, చదవ దగ్గపుస్తకం.

*పేజీలు 116, వెల : ₹ 80/-, ప్రతులకు - ఫోన్ : 0891-2722189*



✦ **విషపు దాడుల వికృత చరిత్ర :** కూర్పు తెలకపల్లి రవి. కమ్యూనిస్టులపై పాలక వర్గాలు వారి పత్రికల ప్రచార కాండను ఖండిస్తూ తెలకపల్లి రవి సంపుటీకరించిన సుమారు 90 వ్యాసాలు ఇందులో ఉన్నాయి. 1955 సం॥ తరువాత ఆంధ్రదేశంలో ఏర్పడ్డ రాజకీయ పరిణామాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నా, కమ్యూనిస్టుల పాయింట్ ఆఫ్ వ్యూ తెలుసుకోవాలన్నా తప్పక చదవ వలసిన పుస్తకం.

*పేజీలు : 330, వెల : ₹ 150/-, ప్రతులకు - ఫోన్ : 040-27608107, ప్రజాశక్తి బుక్‌హౌస్.*




✦ **మహాశూన్యం :** నాటక రంగంలో అనుభవజ్ఞులైన డా॥ దీర్ఘాశి విజయభాస్కర్‌ల రచన. నైరూప్యమైన శూన్యం నుండి చైతన్యాన్ని వెలికి తెచ్చి కవితా పట్టాభిషేకం చేశారు. ఈ పుస్తకంలో 50 కవితా ఖండికలున్నాయి.

*పేజీలు : 105, వెల : ₹ 70/-, ప్రతులకు - పాలపిట్ట బుక్స్.*




✦ **సత్యనారాయణ శతకం :** రచయితలు యల్లాప్రగడ ప్రభాకరరావు, పంగులూరి హనుమంతరావు. ఇందులోని ప్రతి పద్యానికి భావార్థాన్ని ఇచ్చారు.

*పేజీలు : 50, వెల : ₹ 50/-, ప్రతులకు : 040-24141560.*




✦ **స్ఫూర్తి సౌరభం :** డాక్టర్ డి. గాయత్రి కవితా రచనలు. పత్రికలలో వెలువడిన కొన్ని కథనాలు ఆధారంగా, తన ఆత్మీయతకు ఆనవాళ్ళుగా చేసిన రచనలు. ఇందులో రచయిత్రి మానవ సంబంధాలకు పెద్ద పీట వేశారు.

*పేజీలు 110, వెల : ₹ 80/-, ప్రతులకు - గాయత్రి, పబ్లికేషన్స్, యల్.ఐ.జి - 1, 170. న్యూ ఎ.పి. హెచ్.బి. కాలనీ, బి.క్యాంప్, కర్నూలు-518002.*

✦ **బాంధవ్యాలు :** రచయిత అంపశయ్య నవీన్. ఇది రెండవ ముద్రణ. అతిక్లిష్టమైన చైతన్య స్రవంతి తెలుగు వారికి పరిచయం చేసిన నవీన్ వ్రాసిన మరొక క్లాసిక్ ఇది. 1970 నుంచి 90 వరకూ దేశంలో, రాష్ట్రంలో వచ్చిన రాజకీయ, సామాజిక, సాంఘిక సంఘటనలు, వాటితో ముడిపడి వున్న మధ్యతరగతి ప్రజల జీవితంపై ఇదొక వాస్తవిక పత్రం.

*పేజీలు 450, వెల : ₹ 200/-, ప్రతులకు - ఫోన్ : విశాలాంధ్ర, నవోదయ.*




✦ **మృత్యు మోహనం :** విలక్షణ రచయిత్రిగా పేరుగాంచిన డా॥ మోడేపల్లి శ్రీలతా కోటపాటి గారి దీర్ఘ కవిత ఇది. ఇదొక మృత్యుకాంక్ష. మృత్యు కౌగిలిలో అమృతత్వాన్ని ఆస్వాదించటం దీనిలోని విషయం. ఇందులో 'కన్నీళ్ళతో తడిసి పాకుడు బండలయ్యాయి' లాంటి సరికొత్త ప్రయోగాలు ఎన్నో కనిపిస్తాయి. రచయిత్రిలో మంచి భావుకత ఉంది. కథా వస్తువు, నెగిటివ్ అయినా దానిని పాజిటివ్‌గా చెప్పడంలో ఆమె శ్రమ సఫలీకృతమైంది. మృత్యోర్మా అమృతంగమయ' అన్న ఉపనిషద్ వ్యాఖ్యానికి ఇదొక తిరుగు లేని వ్యాఖ్యానం.

*పేజీలు :100, వెల : ₹ 50/-, ప్రతులకు - పాలపిట్ట బుక్స్, ఫోన్ : 040-27678430*




✦ **ఊరి దారి గ్రామాభ్యుదయ పరిచయం :** అధ్యయన కర్త ఎన్. వేణుగోపాల్. భారత దేశానికి అనాది నుండి ఈ నాటి వరకూ గ్రామమే శ్వాస, ధ్యాస, ఆశ. దేశపు పేదరికపు మూలాలు గ్రామాలలోనే ఉన్నాయని, దేశాభ్యుదయాన్ని కోరే వారందరూ రూరల్ సోషియాలజీ పై దృష్టి నిలపాలని, సోదాహరణలిస్తూ పిలుపునిచ్చారు రచయిత. అభివృద్ధి అంటే పెట్టుబడి దారీ వ్యవస్థే అనే వక్రనిర్వచనాలతో తలలు పండించుకుంటున్న రాజకీయ నాయకులకు ఈ పుస్తకం ఒక కనువిప్పు.

*పేజీలు : 164, వెల : ₹ 60/-, ప్రతులకు* - వీక్షణం పబ్లికేషన్స్, *ఫోన్ :* 040-66843495




✦ **సర్దేశాయి తిరుమలరావు :** అధ్యయనం, విభిన్న వాదమే ధ్యేయంగా రచనలు చేసిన జ్ఞాన సింధు తిరుమలరావు. నిజం తెలుసుకోవడం పట్ల ఆయన కున్న జిజ్ఞాస, దానిని పదిమందికి తెలియజెప్పడంలో ఆయన పాటించిన నిబద్ధత, నిజాయితీ, నిర్దుష్టత మనందరికీ తెలిసినదే. విలువలు కాలానుగుణంగా మారుతుంటాయి. జీవితాన్నైనా, కవిత్వాన్నైనా శాశ్వత విలువలతో కొలవడం అశాస్త్రీయమన్న వైజ్ఞానిక దృష్టి ఆయనది. ఆయన మూర్తిమత్వం, నిశిత దృష్టి, సృజన వీచికలను సేకరించి మన ముందుంచారు సంపాదకులయిన డా॥ నాగసూరి వేణుగోపాల్, కోడిహళ్ళి మురళీమోహన్. పుస్తకం చదివిన తరువాత తిరుమలరావు వ్రాసిన మొత్తం వ్యాసాలను చదవాలనే కోరిక పాఠకునిలో రేకెత్తుతుంది.

*పేజీలు : 270 పేజీలు, వెల : ₹ 150/-, ప్రతులకు - ఫోన్ :* 9701371256



✦ **ముస్లిం త్యాగ ధనులు :** కూర్పు. సయ్యద్ అమీర్. మనకు సరైన హేతుబద్ధమైన చారిత్రిక స్పృహ లేక పోవటంతో దేశీయోద్యమంలో ముస్లిం దేశభక్తుల పాత్రను సరిగా గుర్తించ లేకపోతున్నాము. చరిత్రలో జరగవలసినంత న్యాయం వారికి జరగలేదు. సయ్యద్ అమీర్ ఆ లోటును పూర్తిచేశారు. ఇది చదివిన తరువాత విశాల సామాజిక దృక్పథంతో మనం చరిత్రలో చదవవలసినది, తెలుసుకోవలసినది ఎంతైనా ఉంది అని గ్రహించ గలుగుతాము. ముఖచిత్రంపై పదిమంది చిత్రాలు వేశారు. వారు ఎవరో? వివరణలు ఇవ్వలేదు.

*పేజీలు 80, వెల : అమూల్యం, ప్రతులకు - ఫోన్ :9908048898.*



# ఊరి చివరి ఇల్లు

అగ్ని కిరీటపు ధగధగలతో, కత్తుల వంతెనల్ని దాటి, జగన్నాథ రథ చక్రాలు, మరో ప్రపంచపు పిలుపుతో ఆకాశపు దారులంట, ప్రచండ వేగంతో పయనిస్తూ ఆంధ్రదేశమంతటా, శ్రీశ్రీ అక్షరాగ్నులు కురిపిస్తున్న రోజులవి. అప్పటికింకా చీకటి వాకిట అమృతధారలు కురవటం ప్రారంభం కాలేదు. కవితా సుధను నింపుకొన్న "మాడంత మబ్బులే" అమృతాన్ని వర్షించబోతున్నాయి.

1961 సంవత్సరం, నేను తణుకులో కస్టమ్స్ ఆఫీసరుగా పనిచేస్తున్నా. ఓనాడు మా గురువుగారు (జానకిజాని) శ్రీ సామవేదం జానకిరామశాస్త్రిగారు (Head of the English Department, Medical College, Kakinada) మా ఇంటికి వచ్చి "మనం ఓ మహా మహుణ్ణి కలవాలి. ఆయన అంత త్వరగా సమయం కేటాయించరు. ఎలా చేస్తావో చెయ్యి, అన్నారాయన. గురువాజ్ఞ! మా సిపాయి (కానిస్టేబుల్) కి విషయం చెప్పి పంపించాను. సాయంకాలం 4 గం॥లకి టైము తీసుకొని వచ్చాడు సిపాయి. మమ్మల్ని తీసుకొని తణుకు టౌన్‌హాల్ ప్రక్కనున్న ఓ ఇంటికి తీసుకు వెళ్ళాడు. లోపలికి వెళ్ళి మా సార్లు వచ్చారని చెప్పాడు. తలుపులు తెరుచుకొని ఓ వ్యక్తి! స్ఫురద్రూపి, తెల్లని మేనిఛాయ, చిరునవ్వుతో లోనికి సాదరంగా ఆహ్వానించారు. ఆయనే మందపాక జమీందారీ వారసులు, "దేవరకొండ బాలగంగాధర తిలక్" తెలుగు కవితకు 'మిడాస్' టచ్ ఇచ్చిన అక్షరాధిపతి. పరిచయం అఖ్ఖరలేని మహాకవి. కుశలమడిగిన తర్వాత, ఆశీనులమయ్యాం. మూడు గంటలు, చీకటి పడేవరకు సాహిత్య సౌరభాలు వెల్లి విరిశాయి వారి మధ్య. నాది ప్రేక్షకపాత్ర. ట్రైన్ టైమయిందని మా గురువుగారు సెలవు తీసుకోవటానికి లేచారు. తిలక్‌గారు మాకు "శ్రీశ్రీ యుగం" అనే కవితా సంచికను జ్ఞాపికగా ఇచ్చారు. నాతో "ఇక్కడే ఉంటానన్నావుగా, కలుస్తూ ఉందాం" అంటూ సాగనంపారు.



దేవరకొండ బాలగంగాధర

ఆ తరువాత ఆంధ్రాబ్యాంకులోగాని, ఆయన రిక్షాలో వెళుతూన్నప్పుడు కలిసేవాళ్ళం. ఎక్కడ కలిసినా యోగక్షేమాలు అడుగుతూ ఎంతో ప్రేమగా మాట్లాడేవారు.

ఓ నాడు కలిసినపుడు "ప్రమోద్, సాయంకాలం మీనా బిస్కెటు కంపెనీ దగ్గరకు (తణుకు పాత బస్టాండ్ ఎదురుగా) రా మంచి కథ వినిపిస్తా" నన్నారు- అలానే వెళ్ళాను. షాపు యజమాని చల్లా నరసింహారావుగారని జ్ఞాపకం. అప్పుడే తిలక్‌గారు తన వ్రాతపతిని "ఊరి చివరి ఇల్లు" స్వయంగా చదివి వినిపించారు. "పర్సులో డబ్బంతా ఎలా పెట్టింది అలానే ఉంది. కాని ఫొటో మాత్రం లేదు" అని ముగించారు. అద్భుతమైన కథ- 5 నిముషాలు పాటు మౌనం – ఆ ప్రభావం నుండి తేరుకోవటానికి సమయం పట్టింది. ఆయన ఎంత అద్భుతంగా వ్రాస్తారో, అంత స్పష్టంగా చదువుతారు. ఇహ అక్షరాలా! ఆయనే అన్నట్లు "వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు".

ఇది నా జీవితంలో అద్భుతమైన ఘడియ. పుట్టెడు పుణ్యం చేసుకొంటే గాని ఇంత అదృష్టం కలుగదు. 'అమృతం కురిసిన రాత్రి' తెలుగునాట కవితా ప్రియులపై కవితా సుధనే కురిపించింది... 1969లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ పురస్కారం, 1971లో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారాన్ని పొందింది. "తెలుగు కవితా సతి నొసటి రస గంగాధర తిలకం" అంటూ శ్రీశ్రీ అశ్రుతర్పణం చేశారు, తిలక్ "ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయాక".

- ప్రమోద్

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

## I. మిసిమి ప్రచురణలు

| | | ₹ |
|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు – *ఎ.వి.రెడ్డి* | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–1 ” | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–2 ” | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–3 ” | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | 150.00 |
| 8. | దూర తీరాలలో... – *వి. అశ్వినీకుమార్* | 60.00 |
| 9. | అమాహ ” | 60.00 |
| 10. | అంతర్వీక్షణం ” | 50.00 |
| 11. | సిద్ధార్థ ” | 50.00 |
| 12. | నాలో నేను ” | 30.00 |
| 13. | అగాధం ” | 75.00 |
| 14. | కథాంజలి–1 **– ఎస్సారె** | 80.00 |
| 15. | కథాంజలి–2 ” | 110.00 |
| 16. | THE THUNDERCLOUD ” | 120.00 |
| 17. | మిసిమి వ్యాసాలు – *నరిసెట్టి ఇన్నయ్య* | 125.00 |
| | **ఇతరములు** | |
| 18. | భట్టిప్రోలు కథలు | 150.00 |
| 19. | రెండు దశాబ్దాలు – కథ 1990–2009 | 150.00 |

## II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన – *ఎమ్. కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన – *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన – *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం: జె.లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన – *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం –*ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

## III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు

| | | ₹ |
|---|---|---|
| 1. | మహాపరిత్తం – *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందపన్హ : ఉపమలు – *బోధ చైతన్య* | 75.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు – *అన్నపరెడ్డి బుద్ధఘోషుడు* | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం:జె.లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం – బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు – *డాక్టరు ఈమని శివనాగిరెడ్డి* | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |
| 11. | విపశ్యనా ధ్యానమార్గదర్శిని *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 50.00 |
| 12. | మిళింద ప్రశ్నలు – *బోధచైతన్య* | 150.00 |
| 13. | బౌద్ధ ధర్మదర్శిని *(భదంత ఆనంద కౌసల్యాయన్ – అనువాదం జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 14. | ప్రజ్ఞాదీపిక *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 60.00 |
| 15. | శీలం–ధ్యానం – *బోధ చైతన్య* | 150.00 |
| 16. | లోకక్షేమ గాథలు – *బోధ చైతన్య* | 75.00 |
| 17. | జాతకమాల – *బోధ చైతన్య* | 150.00 |
| 18. | సంఘమిత్ర కథలు – బొర్రా గోవర్ధన్ | 75.00 |
| 19. | తథాగత – *(భదంత ఆనంద కౌసల్యాయన్ – అనువాదం జె. లక్ష్మిరెడ్డి)* | 50.00 |
| 20. | నిత్యజీవితంలో అభిధర్మం – ఆంగ్లమూలం: ఉకోలే, తెలుగు: వోలేటి | 150.00 |

## IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 2. | యతిగీతం– స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జల మల్లారెడ్డి) | 50.00 |
| 3. | చార్లీ చాప్లిన్ (నా కథ) – *వి. అశ్వినీకుమార్* | 299.00 |
| 4. | తిరుపతి తిమ్మప్ప – *గుత్తి చంద్రశేఖర రెడ్డి* | 250.00 |
| 5. | రైతు రాయలు – *గుత్తి చంద్రశేఖర రెడ్డి* | 50.00 |
| 6. | తెలుగులో పాళీ పదాలు – *చీమకుర్తి శేషగిరిరావు* | 50.00 |
| 7. | ఆంధ్రనగరి – *సాయి పాపినేని* | 290.00 |

**మిసిమి** మాసపత్రిక

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹240/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ..............................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ..............................................

వీధి ..............................................

పేట ..............................................

ఊరు ..............................................

పిన్ ..............................................

సెల్ ..............................................

**3. సంతకం :** ..............................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

*చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.*

★ **మిసిమి** లో నూతన చందా దారులుగా చేరండి : **'సిద్ధార్థ' పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

★ రెండు సంవత్సరాల చందా దారులకు **'బాపు బొమ్మల' పుస్తకం పంపిస్తాము.**

★ నాలుగు సంవత్సరాల చందా దారులకు **'చార్లీ చాప్లిన్' నా కథ గ్రంథాన్ని బహుమతి.**

★ ఐదు సంవత్సరాల చందా దారులు '2011 **మిసిమి సంచికల బౌండు' అందుకోవచ్చు.**

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi



విరహిణి

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



సాంకి